

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం fb.com/vaartha
PUBLISHED FROM VISAKHAPATNAM, VIJAYAWADA, HYDERABAD, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
2-6-2023 శుక్రవారం సంపుటి : 29 సంచిక : 122, పేజీలు : 10+6 వెల : 6.50



కేరళకు 4న రుతుపవనాల రాక 2వ
అమెరికా అధ్యక్ష రేస్‌లోకి మైక్ పెన్స్ 13వ


# రైతు బాగుంటేనే..రాజ్యం సుభిక్షం!



గురువారం పత్తికొండలో నిర్వహించిన బహిరంగ సభలో రైతుభరోసా చెక్కును అందజేస్తున్న సిఎం జగన్

## వరుసగా 5వ యేడాది వైఎస్సార్ రైతు భరోసా, పిఎం కిసాన్ పెట్టుబడి సాయం అన్నదాతలకు పంపిణీ

## రాష్ట్రవ్యాప్తంగా 52.31లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.3923.22 కోట్లు విడుదల

## పంటనష్టపోయిన 51వేల మంది రైతన్నలకు రూ.53.62 కోట్ల ఇన్‌పుట్ సబ్సీడి సాయం

**పత్తికొండ,జూన్ 1,ప్రభాతవార్త:** రాజ్యం సుభిక్షంగా ఉంటుందని నమ్మిన రైతు పక్షపాత ప్రభుత్వం మనదని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పత్తికొండలో సెయింట్ జోసఫ్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్రవ్యాప్తంగా వరుసగా ఐదవ ఏడాది మొదటి విడత వైఎస్సార్ రైతు భరోసా-పిఎం కిసాన్ పెట్టుబడి సాయంతో పాటు మార్చి,ఏప్రిల్,మే మాసాల్లో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన పంటలకు సంబంధించి రైతులకు ఇన్‌పుట్ సబ్సీడీ మొత్తాన్ని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ల్యాప్‌టాప్ బటన్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి,జిల్లా ఇంచార్జ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి,రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, కర్నూలు ఎంపి సంజీవ్ కుమార్,కర్నూలు మేయర్ బివై రామయ్య,జడ్‌పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి,ఎమ్మెల్సీలు మధుసూదన్,పోతుల సునీత,పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే బిజేంద్రనాథ్‌రెడ్డి,ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర వ్యవ ≫2



# పోలవరం 2025కు సాకారం

## కీలక సమీక్షాసమావేశంలో గడువుపాడిగింపు

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మరింత ఆలస్యం అయ్యేటట్లుగా ఉంది.ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికి తాజా గడువును 2025 జూన్ వరకు పొడిగించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ఢిల్లీలో కీలక సమీక్షా సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి పూర్తి స్థాయి వ్యయం అంచనాలపై ప్రస్తావనకు వచ్చినా,ఆ దిశలో చర్చలు జరుగలేదని సమాచారం. అయితే తొలి దశలో నిర్దేశిత ఎత్తును అనుసరించి అడహాక్ నిధుల కింద రూ.17,414 కోట్లు ఇవ్వాలని సమావేశంలో ప్రభుత్వం కోరింది. ఎపి ప్రభుత్వ అభ్యర్థనను పరిశీలిస్తామని కేంద్రం సమావేశంలో స్పష్టం చేసింది.

2025 జూన్ నాటికి పోలవరం పూర్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఏడాది ముందే పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నామన్నారు. 41.15 మీటర్లు ఎత్తువరకు ఆర్‌అండ్‌ఆర్ నిధులు ఇవ్వాలని కోరామని ఏపీ సర్కారు సమావేశంలో కోరింది. పోలవరం తొలి దశ పనులు పూర్తికి సంబంధించిన అంచనావ్యయం రూ.16,952.07కోట్లుకు సంబంధించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు. ≫2



గురువారం న్యఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన నేపాల్ ప్రధాని ప్రచండ

## భారత్, నేపాల్ మైత్రీ బంధం

# దశాబ్దాలుగా పటిష్టం

## ప్రధాని మోడీతో నేపాల్ ప్రధాని ప్రచండ ద్వైపాక్షిక భేటీ

**న్యూఢిల్లీ, జూన్ 1:** భారత్‌నేపాల్‌ల మధ్య అనేక రంగాల్లో కొనసాగుతున్న పరస్పరసహకారం మరింత ధృఢంగా మారుతున్నదని, విద్యుత్, కనెక్టివిటీ, వాణిజ్యరంగాలపరంగా ఇరుదేశాలమధ్య సత్సంబందాలు మరింత మెరుగయ్యాయని ఇరువురుప్రధానులు సంయుక్తప్రకటన చేసారు. నేపాల్‌ప్రధానమంత్రి పుష్కకమాల్‌దహాలనప్రచండ గురువారం ప్రధినిమోడీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. నాలుగు రోజుల పర్యటననిమిత్తం భారత్‌లో ఉన్న నేపాల్‌ప్రధాని బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా భారత్‌లో పర్యటించారు.సంస్కృతీ సాంప్రదాయాల ≫2



# సిఎం జగన్‌తో బాలినేని భేటీ

**విజయవాడ,జూన్1, ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం జగన్‌తో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి బేటీ అయ్యారు,ప్రకాశంలో జిల్లాలో వైకాంగ్రెస్ పార్టీ నేతల నడుమ విభేదాలు కొనసాగుతున్నాయి.ఈ వివాదాల నడుమ కొన్ని వర్గాలతో జిల్లాకు చెందిన నేతలతో బాలినేని శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు.వారి విషయంలో అదిష్టానం సరిగ్గా స్నందించడం లేదనే దిశలో బాలినేని వైఖరి ఉంది.గతంలో జిల్లాలోని పార్టీలో తనకు ఎదురవుతున్న పరిస్థితులపై బాలినేని మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి.పార్టీలో ఉన్న పరిస్థితులకు మనస్తాపం చెందిన బాలినేని పార్టీపరంగా జోనల్ కోఆర్డినేటర్ పదవికి సతం రాజీనామా చేసారు. కొన్ని కీలక వ్యాఖ్యలు ఆ సందర్భంలో చేసారు. దాంతో నెల ≫2

# చిరుధాన్యాల సాగుకు మరింత ప్రోత్సాహం

## మిల్లెట్స్ కోసం ప్రత్యేక బోర్డు, కొనుగోళ్లకు సదుపాయం

## 10750 కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు, తొలి విడుతలో3250 కేంద్రాలు ఏర్పాటు: సిఎం జగన్



**విజయవాడ,జూన్1ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వ్యవసాయరంగంలో ప్రత్యామ్నయ పంటల సాగుకు అత్యంత ప్రాధ్యానతను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కల్పిస్తోంది.వరి,వాణిజ్య పంటల సాగుతో పాటుగా చిరు ధాన్యాల ఉత్పత్తికి ఊతంగా నిలస్తోంది. ప్రత్యేక చిరు ధాన్యాల(మిల్లెట్స్)బోర్డు ద్వారా కొనుగోళ్ళను వేగవంతం చేస్తోంది.ఇందుకు సంబంధించి సీఎం జగన్మోహనరెడ్డి పూర్తి స్థాయిలో చర్యలను చేపట్టాలని అధికారులకు కీలకాదేశాలు జారీ చేస్తున్నారు.వ్యవసాయశాఖ ఉన్నత అధికార యంత్రాంగం, సమాచార శాఖ ద్వారా లభించిన సమాచారాన్ని అనుసరించి రైతుల అభ్యున్నతికి రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి తెలిపారు.రైతులకు పంట పెట్టుబడి సాయంతో పాటు,వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ,మార్కెటింగ్ సదుపాయాలను కల్పిస్తోందన్నారు. సన్న, చిన్నకారు రైతులకు,కౌలుదారులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. చిరుధాన్యాలను ప్రోత్సహించే దిశలో సీడ్ కమ్ మిలెట్ ప్రోసెసింగ్ యూనిట్లు అందుబాటులోకి వస్తాయన్నారు. నియోజకవర్గాల వారిగా తొలివిడుతలో 3250 కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు,మలి విడుతలో అదే సంఖ్యలో ఏర్పాటు చేస్తా‌మన్నారు. వీటిలో హార్వేస్టర్లు,85హబ్స్ ఏర్పాటు చేస్తారు తరువాతదశలో 4250 సెంటర్లు.535 హార్వెస్టర్లు, 85 హబ్స్ ఏర్పాటు చేస్తారు.మొత్తంగా 10750 కమ్యూనిటి కేం ద్రాలు అందుబాటులోకి వస్తాయన్నారు. మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్లల్లో సదుపాయాల కోసం రూ.14,562 కోట్లు వ్యయం చేస్తున్నట్లు వివరించారు. అరటి,చీనీ, టమోటా, ఉల్లి, నిమ్మ, పసుపు, మిర్చి తదితర పంటలకు మార్కెట్ లేక,కనీస గిట్టుబాటు ధరలు లభించక ఆందోళన చెందుతున్నారన్నారు.పంటలు అమ్ముకునేందుకు ఏ రైతు ఇబ్బంది పడకూడదన్నారు.ఆయా పంటల విషయంలో ఫుడ్ ప్రాసెసింగ్‌ను ప్రోత్సహించాలన్నారు. పంటల అమ్మకాల కోసం రైతులు రోడ్డు ఎక్కే పరిస్థితి రావొద్దన్నారు.మళ్లీ అలాంటి పరిస్థితులు ఎక్కడా కన్పించలేదన్నారు.రైతుల ప్రయోజనాలు కాపాడాలంటే ఏ పంట,ఎంత వరకు కొనుగోలు చేయాలి,ఎంత ఫుడ్ ప్రాసె సింగ్‌కు తరలించాలన్న దానిపై అధికా ≫2

# తెల్లవారు జాము నుంచే పెన్షన్ కానుక పంపిణీ

## ఉపముఖ్యమంత్రి ముత్యాలనాయుడు

**విజయవాడ, జూన్1 ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్రంలో వైఎస్సాఆర్ పెన్షన్ కానుకలను తెల్లవారు జాము నుంచే పంపిణీ చేసినట్లు ఉపముఖ్యమంత్రి. (పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి) బూడి ముత్యాలనాయుడు గురువారం తెలిపారు. సిఎం జగన్ ఇచ్చిన ఎన్నికల వాగ్దానానికి అనుగుణంగా వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి లబ్దిదారులకు నెలకు రూ.3000ల పెన్షన్ అందిస్తామన్నారు సీఎం జగన్ అవ్వతాతలకు పష్టతారీఖున పెన్షన్ అందిస్తున్నామన్నారు. పెన్షన్ కానుకల పంపిణీకి శెలవుదినాలతో పనిలేదన్నారు.

ఈ నెల మొదటి రోజు నాటికి 90శాతం మందికి పెన్షనులు అందించామన్నారు.63,14,192లక్షల మంది పెన్షనర్లుకు 1739.75 కోట్లు విడుదల చేసామన్నారు. ఈ నిధులుపంపిణీ కార్యక్రమం తెల్లవారు జామున ఆరంభమైందన్నారు.ఏపి వ్యాప్తంగా వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీలో భాగంగా. మధ్యాహ్నం 1.30 గంటల వరకు 67.25 శాతం పెన్షన్ల పంపిణీ జరిగింది. 42 లక్షల మందికి రూ.1174.80కోట్లు పంపిణీ చేశారు.

తెల్లవారుజాము నుంచే వాలంటీర్లు ఇంటింటికి వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేస్తున్నారు. మే కూడా పెన్షన్లు అందించారని మంత్రి బూడి ముత్యాల నాయుడు తెలిపారు. ≫2

# రైతులకు అండగా సర్కార్



గురువారం బొబ్బిలిలో రైతు భరోసా చెక్కును అందజేస్తున్న మంత్రి బొత్స

## పంటలకు మద్దతు ధర ప్రకటించాం..

## ఆధరకు కొనుగోలు చేస్తున్నాం: మంత్రి బొత్స

**బొబ్బిలి, జూన్ 1 (ప్రభాత వార్త) :** రైతులు పండించే పంటలకు మద్దతు ధర ప్రకటించడమే కాకుండా మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ రైతులకు ప్రభుత్వం అండగా నిలవడంతో రాష్ట్రంలోని రైతుల్లో ధైర్యం ఏర్పడిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. రాష్ట్రంలో రైతులకు ఏ ఇబ్బంది వచ్చినా అది ప్రభుత్వ బాధ్యతగా భావించి వాటిని పరిష్కరిస్తుందన్నారు. రైతులతో మమేకమై వారి సమస్యలను పరిష్కరిస్తున్నది తమ ప్రభుత్వ హయాంలోనే అన్న విషయాన్ని గుర్తించాలన్నారు.

వైఎస్సార్ రైతుభరోసా పి.ఎం.కిసాన్ కింద వరుసగా ఐదో ఏడాది తొలివిడతగా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని బ్యాంకు ఖాతాల్లో జమచేసే జిల్లాస్థాయి కార్యక్రమం గురువారం బొబ్బిలి మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లాలోని 2.58 లక్షల మంది రైతులకు రూ.193.47 కోట్ల సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయిన రైతుకు వెన్నుదన్నుగా నిలవాలనే ఉద్దేశ్యంతో మన ముఖ్యమంత్రి రైతుభరోసా కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. బొబ్బిలి ప్రాంతంలో చెరకు రైతుల సమస్యలను పరిష్కరించి వారికి చక్కెర కర్మాగారం ద్వారా రావలసిన బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకున్న ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. చెరకు రైతుల సమస్యలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను కూడా త్వరగా చెల్లిస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు.

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజనులో రైతులకు అవసరమైన పెట్టుబడి సహాయం అందించే లక్ష్యంతో ప్రభుత్వం రైతుభరోసా సహాయం అందిస్తున్నదని చెప్పారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనిలో భాగంగానే డైరీ వంటి రంగాల్లో రైతులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ఇటీవల మొక్కజొన్న మద్ధతుధర పొందడంలో సమస్యలు వస్తే ప్రభుత్వం వెంటనే మార్క్‌ఫెడ్ ద్వారా 5 వేల టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసి ఆదుకొందని చెప్పారు.

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టు చివరిలో వున్న ఎకరానికి కూడా సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జిల్లాలో 6.50 లక్షల టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేశామని చెప్పారు.

శాసనసభ్యులు ఎస్.వి.చినప్పల నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అర్హతే ప్రాతిపదికగా సంక్షేమ పథకాలను మంజూరు చేస్తోందని, అవినీతి లేని పరిపాలనకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోని ఇతర రాష్ట్రాలకు మన రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందన్నారు.

ఈ సందర్భంగా జిల్లాలో రైతులకు ఖరీఫ్ సీజనుకు విత్తనాల పంపిణీని మంత్రి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న రైతులకు విడుదల చేసిన ఇన్‌పుట్ సబ్సిడీని కూడా మంత్రి చెక్కు రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, మునిసిపల్ చైర్మన్ ఇంటి గోపాలరావు, వ్యవసాయ శాఖ జె.డి. వి.టి.రామారావు, ఆర్.డి.ఓ. శేషశైలజ, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, ఇంటి గోపాలరావు పాల్గొన్నారు.

# కొత్త మెడికల్ కాలేజీల్లో సెప్టెంబర్ నుంచి క్లాసులు

## విజయనగరం, నంద్యాల, ఏలూరు, మచిలీపట్నం, రాజమహేంద్రవరం కాలేజీలో సీట్లు భర్తీ చేస్తున్నాం. మంత్రి రజని



**విజయవాడ,జూన్1, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన ఐదు వైద్యకళాశాలలు ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం కానున్నట్లు వైద్యఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని వెల్లడించారు.సెప్టెంబరు1 నుంచి ఈ కళాశాలల్లో తరగతులు ప్రారంభమగుతాయన్నారు. విజయనగరం, నంద్యాల, ఏలూరు, మచిలీపట్టణం,రాజమండ్రి మెడికల్ కాలేజీల్లో ఆగస్టులో సీట్లు భర్తీ ప్రక్రియను చేస్తామన్నారు.కొత్తగా ప్రారంభమయ్యే ఈ అయిదు కాలేజీల నుంచి 750 సీట్లు అందుబాటులోకి రానున్నాయని మంత్రి రజని మీడియాకు తెలిపారు.ప్రతి జిల్లాకు ఒక్కటి చొప్పున వైద్యకళాశాల ఉండాలన్నది సిఎం జగన్ లక్ష్యమన్నారు.రాష్ట్రంలో త్వరలో మరో 12కళాశాలలు అందుబాటులోకి రానునా న్నయన్నారు.సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత వైద్యవిద్యలో పీజీ సీట్లును 462కి పెంచినట్లు తెలిపారు.రాష్ట్రంలో వంద ఏళ్ళకు పూర్వం విశాఖలో తొలి వైద్యకళాశాల ప్రారంభమైందన్నారు.అనంతర కాలంలో 11 మెడికల్ కాలేజీలు మాత్రమే అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ నాలుగేళ్ళల్లో 17 వైద్యకళాశాలలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఒక్కొక్క వైద్యకళాశాల ఏర్పాటుకు రూ.500కోట్లు ఖర్చు పెడుతున్నామన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యయనం అన్నారు. ప్రజలందరికి మెరుగైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు వైద్యసేవలు ఇంకా మెరుగ్గా చేయడానికి ఈ ట్రైనింగ్‌ను ఏర్పాటు చేసామన్నారు.కోవిడ్ కాలంలో అద్భుతమైన వైద్యసేవలు అందించారన్నారు.రోగికి సంతృప్తి చెందితే మన జగనన్న ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు.ప్రజలకు ప్రభుత్వాస్పత్రులలో సేవలు పెరిగాయన్నారు.ఫ్యామిలీ డాక్టర్ విధానంప్రజలకు చాలా ఉపయోగకరంగా చేస్తున్నామని వెల్లడించారు. వైద్య,ఆరోగ్యరంగం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్వ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. వైద్యశాలల్లో మెరుగైన సౌకర్యాలు ,వైద్య సేవలు కల్పించేందుకు నిత్యం తపిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు గొప్పసేవలు అందిస్తున్నారని తెలిపారు. ≫2


గురువారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయిన నేపాల్ ప్రధాని ప్రచండ

# మరింత ప్రోత్సాహం

రులు దృష్టిపెట్టాలన్నారు. రైతుల కష్టాలను తీర్చడానికి వ్యవస్థీకృతంగా సిద్ధం కావాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్‌తో పాటుగా, మిల్లెట్ ప్రాసెసింగ్‌పైన దృష్టి పెట్టాలన్నారు. ఉద్యాన పంటలను సాగు చేసే రైతులను దృష్టిలో ఉంచుకుని వారికి ప్రయోజనం కలిగించేందుకు రాష్ట్రంలో పార్లమెంటు నియోజకవర్గానికి ఒక్కటి తగ్గకుండా 25 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాట్లు చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. సరిగ్గా మార్కెటింగ్ జరుగక, గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు కలిగిస్తున్న ఏడు, ఎనిమిది రకాల పంటను గుర్తించి, వాటి ప్రాసెసింగ్‌తో పాటు, వాల్యు ఎడిషన్ ఏం చేయగలమో ఆలోచించాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్‌పై ప్రఖ్యాత కంపెనీలతో ఒప్పందం చేపుకోవాలన్నారు. పంటలు అమ్ముడు పోవడం లేదని, రైతులు ఆందోళన పడకూడదన్నారు. వీటన్నింటికి సంబంధించి ఎక్కడెక్కడ ఏమీ చేస్తున్నారో దానిపై నెల రోజుల్లో నివేదిక సిద్ధం చేయాలన్నారు.

అదే విధంగా రైతు భరోసా కేంద్రాల స్థాయి నుంచి ఎక్కడెక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ చేయగలమనే ఆలోచన చేయాలన్నారు. ఎప్పటిలోగా వాటిని ఏర్పాటు చేయగలం, ఇందుకు ఎంత ఖర్చు అవుతుందనే వాటిపై సమగ్ర నివేదికను రూపొందించాలన్నారు. తదనుగుణంగా ఒక కార్యచరణ ప్రణాళికతో ముందుకు వెళ్దామన్నారు. ప్రాథమిక స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్, మండల, నియోజకవర్గాల స్థాయిల్లో తదుపరి ప్రాసెసింగ్‌కు సంబంధించి అంచనాలు తయారు చేయాలన్నారు. టమోటో ఉత్పత్తులు మన రాష్ట్రంలో అత్యధిక స్థాయిలో ఉంటాయన్నారు. టమోటోను నిత్యావసర వినియోగంతో పాటుగా, ప్రాసెసింగ్ వీలుగా కుడా వినియోగంలోకి తీసుకునే విధంగా వంగడాలను ఎంపిక చేసి సాగు చేయాలన్నారు. పంటల ఉత్పత్తులకు ఖచ్చితంగా డిమాండ్ ఉంటుందని, మార్కెటింగ్‌లో దళారుల ధరలను మందగింప చేయడం వలన ఇబ్బందులు తలెత్తున్నా యన్నారు. ఈ పరిస్థితిని నియంత్రించడానికే మనం రైతులకు మార్కెటింగ్ కల్పిస్తున్నామన్నారు. అరటి, చీనీ., టమోటా, బత్తాయి, నిమ్మ ఇతర పంటల సాగుదారులు లాభాల్లో ఉండాలన్నారు. రాయల సీమ, ప్రకాశం వంటి ప్రాంతాల్లో 10 ఎకరాల్లోపు, మిగిలిన చోట్ల అయిదు ఎకరాల్లోపు రైతులకు డ్రిప్, స్ప్రింక్లరు సదుపా యాల్లో ప్రాముఖ్యతను ఇవ్వాలన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో ఆలోచనలు చేసి, ఒక కచ్చితమై కార్యచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. రైతు భరోసా కింద ప్రభుత్వం వీరికి మూడు పరా య్యాలుగా ప్రతి ఏడాది పంటల సీజనుల్లో పెట్టుబడి సాయాన్ని అందిస్తుందన్నారు.

అయినప్పటికి సాగు పద్ధతుల్లోను, విత్తనాలు, ఇతరత్రా వారికి అండగా నిలిచివుండాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేన్నారు. ఆ దిశలోనే వారికి రైతు భరోసా కేంద్రాల ద్వారా పరిపూర్ణ సహకారాన్ని అందిస్తోందన్నారు. వ్యవసాయశాఖలో ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తున్నందున వ్యవ సాయాధికారుల నివేదికలను అనుసరించి పంటల సాగుకు ప్రోత్సాహం ఉంటుంది. వ్యవసాయంలో వరి సాగుకు సహకారం అందిస్తునే మార్కెట్ అవసరాలకు వీలుగా చిరుధాన్యాలను ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు.


గురువారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి స్మృతి ఇరానీతో భేటీ అయిన ఉత్తరప్రదేశ్ సిఎం ఆదిత్య నాథ్

## దశాబ్దాలుగా పటిష్టం

పరంగానే కాకుండా ఆర్థికవ్యవస్థపరంగాను, ఇందన, మౌలికవనరుల రంగాల్లో భారత్‌తో కలిసి పనిచేస్తామని ప్రచండ అన్నారు. ఈ ప్రాంతంలో వ్యూహాత్మక కార్యాచరణపరంగా నేపాల్‌భారత్‌కు అత్యంత ముఖ్యమైన దేశం. ఇరుదేశాలమధ్య దశాబ్దాలనుంచి రోటీబేటీ సంబంధాలు కొనసాగుతున్నాయి. రెండుదేశాలమధ్య ప్రజల్లో వివాహాలు కూడా జరుగుతున్నాయి. భారత్‌లోని ఐదు రాష్ట్రాలతో నేపాల్ 1850 కిలోమీటర్ల వెంబడి సరిహద్దును పంచుకుంటున్నది. సిక్కిం, పశ్చిమబెంగాల్, నేపాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలసరిహద్దులతో నేపాల్ కొనసాగుతోంది. వస్తుసేవల రవాణా, సహకారం కోసం నేపాల్ ఎక్కువగా భారత్‌పైనే ఆధారపడు తోంది. భారత్‌మీదుగానే నేపాల్‌కు నదీజలాలు వెళుతుంటాయి.

1950లో భారత్‌నేపాల్‌లమధ్య శాంతి మైత్రీ ఒప్పందం ఇప్పటికీ కొనసాగుతోంది. ఈఒప్పందం కారణంగానే రెండుదేశాలమధ్య సంబంధాలు మరింత మెరుగుపడినట్లు తెలు స్తోంది. నేపాల్ విదేశాంగమంత్రి ఎన్‌పి సౌద్‌కూడా ప్రధానివెంట వచ్చిన ప్రతినిధి బృందంలో ఉన్నారు.

# రైతు బాగుంటేనే..రాజ్యం సుభిక్షం!

సాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాల కృష్ణ ద్వివేది, హార్టికల్చర్ కమీషనర్ శ్రీధర్, ఏపి సీడ్ ఎండి శేఖర్‌బాబు, జిల్లా కలెక్టర్ జి సృజన, జెసి నారపురెడ్డి మౌర్య, ఏపి అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, కూడా చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ శిరోమణి, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యాన సలహాదారు పి శివప్రసాద్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని భావించి అన్నదాతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం మనదేనని అన్నారు. ఐదవ ఏడాది మొదటి విడత వైఎస్సార్ రైతు భరోసా సాయాన్ని అందించడం ద్వారా వ్యవసాయంపై రైతుల్లో మరింత మక్కువ పెరిగిందన్నారు. దీంతో గ్రామ సీమలో సాగుబడిని పండుగ వాతావరణంలో చేపడుతున్నారన్నారు. వాస్తవ సాగుదార్లందరికి సాయం అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ దిశగా ఈ ఖరీఫ్ సీజన్‌కు లబ్దిదారుల సంఖ్య కూడా భారీగా పెరిగిందన్నారు. రైతుభరోసాతో పాటు ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతన్నలకు సీజన్ ముగియక ముందే పంట నష్ట పరిహారం పంపిణీకి చేయడం గర్వంగా ఉందన్నారు. 2023-24సీజన్‌కు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా రైతు కుటుంబాలకు రూ.7500లు చొప్పున తొలివిడతగా 52.31లక్షల రైతులకు రూ.3,923.22కోట్ల పెట్టుబడి సాయంతో పాటు ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో కురిసిన అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన 51వేల మంది రైతులకు రూ.53.62కోట్ల మేర ఇన్‌పుట్ సబ్సీడీని అందివ్వగలిగామన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నాలుగేళ్ల వ్యవధిలో మీ బిడ్డ ప్రభుత్వం రైతన్నలకు వివిధ పథకాల ద్వారా రూ.1,61,236.72కోట్ల మేర నేరుగా సాయాన్ని అందించడం జరిగిందని గర్వంగా చెబుతున్నారన్నారు. రైతుభరోసా కింద ప్రతి ఏడాది మూడు విడతల్లో మొత్తం రూ.13500లు చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నామన్నారు. అలాగే ఇన్‌పుట్ సబ్సీడీని అందించడంలో రాష్ట్ర చరిత్రలోనే ఏ ప్రభుత్వం చేయలేని విధంగా చరిత్రనే తిరగరాసిన ఘనత మన వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. గత ప్రభుత్వ హయాంలో కరువు తాండవించేదన్నారు. ఈక్రాప్ అనే మాటే లేదన్నారు. ధాన్యం సేకరణ లేదు, సబ్సీడీ లేదు, సబ్సీడీ విత్తనాలు, ఎరువులు లేవన్నారు. రైతన్నలకు వ్యవసాయ సలహాదారులు లేరన్నారు. ప్రస్తుతం మన ప్రభుత్వ హయాంలో ఆ పరిస్థితులు లేవన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ సృజన మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెన, జగనన్న విద్యాకానుక, వైఎస్సార్ ఆసరా, పెన్షన్ కానుక, ఇంటి పట్టాల పంపిణీ, జగనన్న గోరుముద్ద, వసతి దీవెన, అమ్మఒడి, జగనన్న తోడు, ఈబిసి నేస్తం, నేతన్న నేస్తం, కాపు నేస్తం వంటి అనేక సంక్షేమ పథకాల ద్వారా జిల్లాలో 2,06,96,000 లబ్దిదారులకు రూ.5,380కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం జమచేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ వ్యవసాయం దండగా అన్న గత ప్రభుత్వ తీరును మార్చేసి వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ముఖ్యమంత్రి దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. మొట్టమొదటిసారిగా పత్తికొండ నియోజకవర్గంలో రైతు శ్రేయస్సు కోసం చేపట్టే బృహత్తర కార్యక్రమానికి వేదికగా మా జగనన్న అడుగులు ఇక్కడ పడటం నియోజకవర్గ ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది నుంచే రైతుభరోసా సాయం పథకాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చారంటే సిఎం జగన్‌కి రైతులపై ఉన్న అభిమానం, శ్రద్ధ ఎంతటిదో అర్థమవుతుందన్నారు. అన్నదాతకు వెన్నుగా నిలిచిన ప్రభుత్వంగా దేశంలోనే గుర్తింపు తెచ్చిన మన ముఖ్యమంత్రికి అందరి తరుపున ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామన్నారు.

**జిల్లాకు సిఎం వరాల జల్లు**

ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విజ్ఞప్తి మేరకు నియోజకవర్గంలో పలు కార్యక్రమాల కోసం నిధులను మంజూరు చేస్తున్నట్లు గురువారం పర్యటన సందర్భంగా సిఎం జగన్ ప్రకటించారు. పత్తికొండ నియోజకవర్గానికి హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ నుండి రూ.300కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 68చెరువులకు నీరందించే ఇరిగేషన్ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. ఇందులో 38చెరువులు పత్తికొండ నియోజకవర్గంలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టును 1,2 నెలల్లో తానే వచ్చి జాతికి అంకితం చేస్తానన్నారు. గాజులదిన్నె రిజర్వాయర్‌కు హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ నుండి స్యూయిస్ ద్వారా 1టిఎంసి అదనపు సామర్థ్యం పెంపుతో 4టిఎంసిల నీటిని అందించేందుకు రూ.50కోట్లతో పనులు పూర్తి చేయడం ఈ ప్రాజెక్టు ద్వారా గోనెగండ్ల, కోడుమూరు మండలాలకు సాగునీరు, ఎమ్మిగనూరు, డోన్ పట్టణాలకు తాగునీటి భద్రత అందనుందన్నారు. రూ.160కోట్లతో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేసి నిర్వహణలో తీసుకొచ్చామన్నారు. కర్నూలు నగరంలో సుప్రసిద్ధ సిల్వర్ జూబ్లీ కాలేజీని రూ.140కోట్లతో అభివృద్ధి చేపట్టి అందుకు సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

# కేరళకు 4న రుతుపవనాల రాక

## భారత వాతావరణ శాఖ తాజా అంచనాలు

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** ఇప్పటికే అండమాన్ వ్యాప్తంగా విస్తరిస్తున్న నైరుతి రుతుపవనాలు ఈ నెల 4వ తేదీ నాటికి కేరళను తాకనున్నట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు నైరుతి రుతుపవనాల రాకపై గురువారం మధ్యాహ్నం వాతావరణ శాఖ తాజా అంచనాలను విడుదల చేసింది. గురువారం నాటికి కేరళలోకి నైరుతి రుతుపవనాలు రావాల్సి ఉందని, అయితే సముద్రంలో ఏర్పడిన తుపాన్లు, వాతావరణం అనుకూలంగా లేకపోవడం వల్ల నాలుగు రోజులు ఆలస్యంగా ఈ నెల 4వ తేదీన దేశంలోకి నైరుతి వస్తుందని వెల్లడించింది. కేరళ నుండి తెలంగాణ రాష్ట్రంలోకి రావడానికి దాదాపు 2 వారాల సమయం పడుతుందని తెలిపింది. కేరళ నుండి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోకి రావటానికి సమయం పడుతుందని స్పష్టం చేసింది. నైరుతి రుతుపవనాలు ఈ నెల 8వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తాయని, ఆ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించడానికి నాలుగు రోజుల సమయం పడుతుందని వివరించింది. జూన్ 12వ తేదీ నాటికి ఆంధ్రప్రదేశ్ అంతటా రుతుపవనాలు విస్తరిస్తాయని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. ఇక నైరుతి రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రంలోకి జూన్ 10 నుండి 12వ తేదీ మధ్యలో ప్రవేశిస్తాయని వెల్లడించింది. వాతావరణం అనుకూలిస్తే ఈ నెల 16వ తేదీ నాటికి తెలంగాణ వ్యాప్తంగా రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉందని తెలియచేసింది.

# పెన్షన్ కానుక పంపిణీ

ఈ రోజు 60 లక్షల 80 వేల మందికి పెన్షన్ల పంపిణీ జరిగిందన్నారు. ఈ రాత్రి తొమ్మిది, పదిగంటలైన వాలంటీర్లు పెన్షన్లు ఇస్తానికి సైతం వాలంటీరు సిద్ధంగా ఉంటుందన్నారు.

ప్రభుత్వం ఒక కచ్చితమైన ప్రణాళికతో పెన్షన్ పథకాన్ని అందిస్తుంది. నెలలో మొదటి రోజు వచ్చిందంటే ఆ రోజు తమకు గ్యారెంటీగా ఫించను అందుతుందన్న నమ్మకం పెన్షన్‌దారుల్లో ఉందన్నారు. సిఎం జగన్ అవ్వతాతలతో పాటు దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతులు, దీర్ఘకాలిక అనారోగ్యవంతులకు పెన్షన్ సదుపాయాన్ని కల్పించారన్నారు.. కొన్ని దూర ప్రాంతాల్లో నగదు తీసుకెళ్లటానికి వీలుగా లేని ప్రాంతాల్లో స్వల్పంగా అందకపోవచ్చునన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో రెండు సూపర్ ఫాస్ట్ రైల్వే లైన్లు

## విశాఖపట్టణం- విజయవాడ-శంషాబాద్, విశాఖపట్టణం-విజయవాడ-కర్నూల్ మార్గంలో సర్వే

**హైదరాబాద్, జూన్ 1 ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో మరో కీలక ప్రాజెక్టుకు బీజం పడింది. రెండు రాష్ట్రాల అనుసంధానతను మరింత బలోపేతం చేసేందుకు రెండు కొత్త సూపర్ ఫాస్ట్ రైల్వే లైన్లకు అవసరమైన సర్వేకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం - విజయవాడ- తెలంగాణలోని శంషాబాద్ మధ్యలో మొదటిది. విశాఖపట్టణం-విజయవాడ- కర్నూల్ మార్గంలో రెండో రైల్వే లైన్ కోసం సర్వేకు రైల్వే బోర్డు అంగీకారం తెలుపుతూ దక్షిణ మధ్య రైల్వేకు లేఖ్రాసింది. ఈ మార్గంలో సూపర్‌ఫాస్ట్ రైల్వే ప్రాజెక్టు చేపట్టేందుకు అవసరమైన టెక్నికల్ ఫిజిబిలిటినీ ఈ సర్వే ద్వారా నిర్ణయిస్తారు. సర్వే అయిన తరువాత ప్రాజెక్టు ముందుకు సాగనుంది. ఈ రైల్వే లైన్లకు సంబంధించి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పలుసార్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి లేఖలు రాసారు. తెలుగు రాష్ట్రాలకు చేకూరే లబ్ది గురించి వివరించారు. ఈ నేపథ్యంలో రైల్వే బోర్డు తాజాగా ఈ రెండు రూట్లలో సూపర్ ఫాస్ట్ రైల్వే లైన్ల సర్వేకు నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కేంద్రం నిర్ణయాన్ని వెల్లడించింది. ఈ రెండు రైల్వే లైన్లు కలిసి 942 కిలోమీటర్ల మార్గంలో గరిష్టంగా 220 కెఎంపిహెచ్ వేగంతో ప్రయాణించేలా రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమయ్యే సర్వేను నిర్వహించనున్నారు.

## వారం - వర్జ్యం

**2-6-2023 శుక్రవారం**

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయనం,
జ్యేష్ఠ మాసం, శుక్ల పక్షం, కార్తె రోహిణి
త్రయోదశి ఉ.10-47; విశాఖ తె.05-30
వర్జ్యం ఉ.10-58 ల 12-34
రా.కా.ఉ.10-30-12.00
యమగండం మ.3-00 ల 4-30 వ
దుర్ముహూర్తం ఉ.8-24 ల 9-12 వ
మ.12-24 ల 1-12 వ

# 2025కు సాకారం

తొలుత 123 గ్రామాలు ముంపుకు గురవుతాయని గుర్తించామని, వాటిలోని 20,946 కుటుంబాలకుగాను ఇప్పటికే 12,060 కుటుంబాలకు పునరావాసం కల్పించామని రాష్ట్ర అధికారులు వివరించారు. లైడార్ సర్వేలో వాటితో పాటు 36 గ్రామాలు 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోకి వస్తాయని తెలిందని వివరించారు. ఆ గ్రామాల్లోని 16,642 కుటుంబాలకు తొలి దశలోనే పునరావాసం కల్పించాల్సి ఉంటుందన్నారు. వేరసి మొత్తం 25,528 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఇందుకు రూ..7,304 కోట్లు అవసరమని, కేంద్ర జల్‌శక్తి శాఖకు అధికారులు నివేదించారు. వాటిని ఆమోదించి నిధులిస్తే పునరావాసాన్ని త్వరితగతిన కల్పిస్తామని తెలిపారు. దీనికి స్పందించిన కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ తొలిదశ సవరించిన అంచనా వ్యయాన్ని ఖరారు చేసే ప్రక్రియ తుది దశలో ఉందని. ఆ మేరకు నిధులు ఇస్తామని చెప్పారు. పోలవంం ప్రాజెక్టుకు సవరించిన అంచనాలను అనుసరించి నిధులు కేటాయించాలని సిఎం జగన్ ఇటీవల కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షేకావత్‌ను స్వయంగా కలుసుకుని విజ్ఞప్తి చేసారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి పెండింగ్ నిధులు మంజూరు చేయాలని కోరారు. పోలవరం నిర్మాణంపై జరిగిన కీలక సమీక్షలోను ఏపీ జలవనరుల శాఖా అధికారులు ఇదే విషయాన్ని ప్రస్తావించారు.

# సిఎం జగన్‌తో బాలినేని భేటీ

క్రితం ఆయనను పిలిపించి సీఎం జగన్ మాట్లాడారు. పలు అంశాలను బాలినేని సిఎం జగన్ దృష్టికి తీసుకుని వెళ్ళారు. అయితే ఆ సమావేశం అనంతరం బాలినేని కొంత వరకు మౌనంగానే ఉంటూ వచ్చారు. ఈ పరిస్థితుల నడుమ ఆయన ఇంకా అసంతృప్తితో ఉండటంతో పాటుగా జిల్లాలో తనకు, సీఎం జగన్‌కు సమీప బంధువుగా ఉన్న టిటిడి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో ఆయన విబేధాల విషయంలో వెనక్కు తగ్గడం లేదనే కథనాలు విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి, ఈ నేపథ్యంలో గురువారం సీఎం జగన్ పిలుపు మేరకు బాలినేని ఆయనతో బేటీ అయా్యరు. ఈ సమావేశంలో బాలినేని మనస్సు విప్పి సీఎం జగన్‌తో మాట్లాడినట్లు సమాచారం. అంతే కాకుండా సుబ్బారెడ్డి విషయంలో తన అసహనాన్ని వెళ్ళగక్కారంటున్నారు. మొత్తమ్మీద బాలినేని ఈ పర్యాయం సీఎం జగన్ ఇచ్చిన హామీలతో మొత్తపడినట్లు సమాచారం. సీఎం జగన్‌తో బేటీ అనంతరం బాలినేని మీడియాతో మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో వైకాంగ్రెస్‌లో ఎలాంటి విభేదాలు లేవన్నారు. కొన్ని అపార్థాలున్నాయన్నారు. తనకు కొన్ని పరిస్థితులు ఇబ్బంది కలిగించిన విషయం వాస్తవమేనన్నారు. ఈ అంశాలను సీఎం జగన్ దృష్టిలో పెట్టానన్నారు. తనకు ఇబ్బందులు కలిగిస్తున్న కొన్ని అంశాలను. ఇద్దరు గురించి సీఎం జగన్‌కు వివరించానన్నారు. సీఎం అన్ని పరిస్థితులను చక్కదిద్దుతానని గట్టి వాగ్దానం చేసారన్నారు. పార్టీ పదవికి సంబంధించిన విషయంతో సహా పలు అంశాలు క్రమంగా కొలిక్కి వస్తాయని బాలినేని వ్యాఖ్యానించారు.

## వార్తాఫలం

**మేషం:** వృత్తి రంగాల్లో వున్నవారికి ధన లాభం. ఆరోగ్య సమస్యలు తీరుతాయి.

**వృషభం:** ఉద్యోగులకు బాగుంటుంది. కోర్టు సమస్యలు పరిష్కారం.

**మిథునం:** శత్రుబాధలు తీరిపోతాయి. చోర భయం పొంచి వుంది.

**కర్కాటకం:** గృహ సౌఖ్యం. ఆరోగ్యం కుదుట పడుతుంది.

**సింహం:** ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది. అన్ని వ్యవహారాల్లో విజయం.

**కన్య:** మొండి బకాయిలు వసూలు. విద్యార్థులకు పోటీ పరీక్షల్లో విజయం.

**తుల:** ధర్మ రక్షణకై పాటుపడతారు. ఉద్యోగులకు ఉన్నత పదవి లభిస్తుంది.

**వృశ్చికం:** అకారణంగా ఆందోళనకు లోనవుతారు. ఆర్థికంగా బాగుంటుంది.

**ధనుస్సు:** భాగస్వామ్య వ్యాపారులకు బాగుంటుంది. చర్చలు ఫలిస్తాయి.

**మకరం:** ఆరోగ్య సమస్యలుంటాయి. గృహ యోగం. విద్యార్థులకు శుభ యోగం.

**కుంభం:** అన్ని వ్యవహారాల్లో విజయం. ఆరోగ్య సమస్యలు తీరుతాయి.

**మీనం:** ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆర్థికంగా బాగుంటుంది.

- పాలకుర్తి సంతోష శర్మ, విజయపురి కాలనీ, హైదరాబాద్

# తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో కూలిన భారీ వృక్షం

## చెట్టుపడటంతో కడపవాసి మృతి
## రూ.5లక్షలు టిటిడి ఆర్థికసాయం
## మరో నలుగురికి గాయాలు

**తిరుపతి, జూన్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో గోవిందరాజస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న వేళ గురువారం సాయంత్రం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సాయంత్రం ఉన్నఫళంగా ఉరుములతో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ఆలయం ఆవరణలో ఉన్న భారీ రాగిచెట్టు కూలిపోయింది. ఆ సమయంలో చెట్టుక్రింద కూర్చున్న పదిమంది భక్తుల్లో ఒకరి తలపై పడటంతో తలపగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. చెట్టుకొమ్మలు పడటంతో మరో నలుగురు భక్తులకు చేతులు, నడుం, కాళ్ల ఎముకలకు బలమైన గాయాలు తగిలాయి. బ్రహ్మోత్సవాలు ముగింపుకు చేరుకునే సమయంలో జరిగిన ఈ విషాదకరసంఘటనతో ఆలయంలో ఉన్న భక్తులందరూ హాహాకారాలతో వెలుపలకు పరుగులుతీశారు. టిటిడి అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ దారుణం జరిగిందని భక్తులు ఆరోపించారు. స్మార్టుసిటీ...యాత్రాస్థలం తిరుపతినగరంలో టిటిడి ఆధ్వర్యంలోని గోవిందరాజస్వామి ఆలయం నగర నడిబొడ్డున ఉంది. ఈ ఆలయంలో ప్రస్తుతం బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. వేసవిసెలవుల కారణంగా అనేక ప్రాంతాల నుంచి భక్తులు భారీగా ఆలయంకు వస్తున్నారు. గురువారం సాయంత్రం స్వామివారి దర్శనం చేసుకుని ఆలయం ప్రాంగణంలోపల కూర్చున్నారు. అదే సమయంలో బలమైన గాలులతో వర్షం కురవడంతో భారీ వందేళ్ల రావిచెట్టుకూలిపోయింది. ఈ సంఘటనలో చెట్టు క్రింద కూర్చున్న భక్తుల్లో కడపజిల్లాకు చెందిన డాక్టర్ గుర్రప్ప(50) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురికి తీవ్రంగాయాలయ్యాయి. ఈ ప్రమాదం జరిగిన వెంటనే టిటిడి చైర్మన్ సుబ్బారెడ్డి, జెఇఒ వీరబ్రహ్మం ఆలయానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ఆలయానికి వచ్చి ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని, ఆ కుటుంబంలో నెలకొన్న విషాదం భర్తీచేయలేమన్నారు. మృతుని కుటుంబానికి టిటిడి నుంచి 5లక్షలు రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించారు. మృతుని కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. వందేళ్లనాటి రావిచెట్టు ఆలయంలోపల ప్రమాదకరంగా ఉన్నా టిటిడి అధికారులు పట్టించుకోలేదు. దీంతో రాత్రి వాహనసేవ ఆలయంలో పుణ్యాహావచనం, శుద్ధి చేసిన తరువాత మొదలైంది.

# సెప్టెంబర్ నుంచి క్లాసులు

రాష్ట్రంలోని పేద ప్రజలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం అపర సంజీవనిలా మారిందన్నారు. ఆరోగ్యశ్రీ, 104, 108 వాహనాలు తదితరంశాలపై ప్రభుత్వం నిరంతరం దృష్టి పెట్టి పనిచేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.3,336 కోట్లు కేటాయించిందదన్నారు. గత ప్రభుత ్వం కేవలం 1,059 ప్రోసీజర్లుకు మాత్రమే ఈ పథకం వర్తింపచేసిందన్నారు. అయినప్పటికి సేవలు అందించే విషయంలో పూర్తిగా విఫలమైందన్నారు. తమ ప్రభుత్వం కొత్తగా మరో 2,446 ప్రోసీజర్‌లను చేర్చిందన్నారు. దీంతో ఏకంగా 3,225 ప్రోసిజర్లుకు వైద్యం ఉచితంగా ప్రజలకు అందుతోందన్నారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం ఏడాదికి రూ.1000 కోట్లు వరకు మాత్రమే ఖర్చు చేసేదన్నారు. తమ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం రూ.3వేల కోట్లుకుపైగా ఖర్చు చేస్తోందన్నారు. అదే విధంగా ఆరోగ్య ఆసరా కోసం రూ.445 కోట్లు, 108 వాహనాల నిర్వహణకు రూ.187 కోట్లు, 104 వాహనాల నిర్వహణకు రూ.164 కోట్లు, ఈహెచ్ఎస్ కోసం రూ.140 కోట్లు చొప్పున ఖర్చు చేస్తోందన్నారు. ఏపీలో 2,061 ఆస్పత్రుల్లో, తెలంగాణాలో 132, కర్ణాటకలో 49, తమిళనాడులో 22 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం దేశంలో ఎక్కడా లేదన్నారు. గతంలో ఎన్నడు జరుగునంతగా వైద్యశాఖలో ఉద్యోగాల భర్తీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే 49వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేసామని తెలిపారు. వైద్యానికి కావాల్సిన బడ్జెట్ పెంచామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అందుబాటులోకి తీసుకుని వచ్చామన్నారు. రాష్ట్రంలో ఎక్కడ వైద్యసిబ్బంది కొరత ఉందని సమాచారం వచ్చినా అక్కడ ఆ ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. విలేజీ క్లినిక్ వ్యవస్థ ఎంతగానో ప్రయోజనకర వైద్యసేవలను ప్రజలకు అత్యంత అందుబాటులో ఉంటూ సేవలను అందిస్తోందన్నారు.

# అంచనాలకు తగ్గని గోవిందుడి హుండీ ఆదాయం!

## మేనెల కానుకల రాబడి రూ.110.02కోట్లు



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకునేందుకు తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య అనూహ్యంగానే రెట్టింపయినా హుండీ ఆదాయం కూడా అంచనాలకు తగ్గడం లేదు. 2023 నూతన సంవత్సరం ఆరంభంనుంచి 110కోట్ల రూపాయలకు తగ్గకుండా కానుకల ద్వారా హుండీ ఆదాయం చేకూరుతోంది. తాజాగా మేనెలకు సంబంధించి వడ్డీకాసులవాడి హుండీ ఆదాయం 110.02కోట్లు రూపాయలు గడించింది. సరాసరి రోజువారీగా 3కోట్ల రూపాయలకు తగ్గకుండా హుండీ కానుకల ఆదాయం లభించిందనేది టిటిడి అంచనా. మే నెల 22వ తేదీ 4.56కోట్లు రూపాయలు, 2వతేదీ 4.35కోట్లు, 15వతేదీ 4.32కోట్లు, ఆతరువాత వరుసగా 3.50కోట్ల రూపాయలు పైగానే ఆదాయం వచ్చింది. మేనెలలో 5వతేదీ హుండీ ఆదాయం 2.72కోట్లు రూపాయలు చేకూరగా 3వతేదీ 2.92కోట్లు లభించింది. ఇలా మిగిలిన రోజుల్లో 3.50కోట్లరూపాయలకు పైగానే ఆదాయం వచ్చింది. ఇక ఏడుకొండలవాడి దర్శనాలకు సంబంధించి మేనెలలో సరాసరి 23.38లక్షల మందికి పైగా భక్తులకు దర్శనం చేయించారు. సాధారణ సర్వదర్శనంతో బాటు సర్వదర్శనం టైమ్‌స్లాట్, ఆఫ్‌లైన్‌లో దివ్యదర్శనం టోకెన్లతో బాటు ఆన్‌లైన్ దర్శనాలు ఇలా ప్రత్యేక దర్శనాలలోనూ దేశవిదేశాలనుంచి వచ్చిన భక్తులను అనుమతించి టిటిడి ఆలయ అధికారులు ప్రశాంతంగా, సాఫీగా ప్రతి భక్తునికి దర్శనం చేయించారు. వేసవిసెలవులు రద్దీ కొనసాగుతూ సర్వదర్శనానికి సరాసరి 35గంటలపైగానే సమయం పట్టినా భక్తులు ఏ మాత్రం దేవదేవుని దర్శనం చేసుకునేందుకు వెనుకడుగువేయలేదు. ఈ నేపధ్యంలో మేనెలలో తిరుమలేశుని దర్శనం చేసుకున్న భక్తుల సంఖ్య అనూహ్యంగానే పెరిగింది. గత ఏడాది మేనెలలో ఒక్క హుండీ ద్వారానే తిరుమల తిరుపతి దేవస్థానానికి 130.5కోట్లు రూపాయలు ఆదాయం చేకూరింది.

ఈ ఏడాది వరుసగా 2023 జనవరిలో 123.07కోట్లు రూపాయు హుండీ ద్వారా ఆదాయం గడించగా, ఫిబ్రవరిలో 114.29 కోట్లు రూపాయలు, మార్చినెలలో 120.29కోట్లు, ఏప్రిల్‌లో 114.12కోట్లు రూపాయల మేరకు ఆదాయం వచ్చింది. గత ఏడాది మార్చినెల నుండి తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య కూడా రెట్టింపవుతోంది. ఇదే సమయంలో ఇష్టదైవం శ్రీవేంకటేశ్వర స్వామిని సంతృప్తికరంగా దర్శించుకుంటున్న భక్తుల సంఖ్యతోబాటు స్వామివారికి కానుకలు రూపంలో హుండీ ఆదాయం అంతకంతకూ రికార్డుసృష్టిస్తోంది. నూతన ఏడాదిలో గత ఐదు నెలలుగా వరుసగా 110కోట్లు రూపాయలు పైగానే హుండీ ఆదాయం అధిగమిస్తోంది. నెలవారీగా ఏడుకొండలకు చేరుకుంటున్న భక్తుల సంఖ్య సరాసరి 20లక్షలమంది నుంచి 25లక్షలమంది వరకు ఉంటుంది.

**నెలనెలా రెట్టింపవుతున్న భక్తులు :**

శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు సరాసరి ప్రతినెలా 25లక్షలమంది వరకు భక్తులు వస్తున్నారు. రోజురోజుకూ భక్తుల సంఖ్య రెట్టింపవుతూ దాని ప్రభావం హుండీపై కూడా గణనీయంగా చూపుతోంది. సాధారణరోజులు, వారాంతపు తేడా లేకుండా సరాసరి 85వేలమందిపైగా భక్తులకు దేవదేవుని దర్శనం చేయిస్తున్నారు. మేనెలలో రోజువారీగా భక్తుల సంఖ్యను గమనిస్తే 14వతేదీ 87,022మంది భక్తులు, 20న 85,297మంది, 21న 84,539మంది భక్తులు, 23న 88,604మంది, 26వతేదీ 79,486 మందికి భక్తులకు వెంకన్న దర్శనం చేయించారు. మిగిలిన రోజుల్లో 75వేలమందివరకు భక్తులు వడ్డీకాసులవాడిని దర్శనం చేసుకున్నారు.



## సూర్యప్రభ వాహనంపై గోవిందుడు

**తిరుపతి, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుపతినగరంలో కొలువైన గోవింద రాజస్వామివార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం స్వామివారు సూర్యప్రభవాహనంపై అధిరోహించి భక్తులను కటాక్షించాడు. సూర్యప్రభా మధ్యస్తుడై దివ్యకిరణకాంతుల్లో ప్రకాశిస్తూ భక్తులను ఆరోగ్యవంతుల్నిచేస్తూ దర్శనమిచ్చాడు. స్వర్ణసప్త అశ్వవాహనంతో రూపొందించిన సూర్య ప్రభ వాహనంపై కన్నులవిందుగా భక్తులకు అభయమిచ్చాడు. వాహనమండపం వద్ద ఆలయ అర్చకులు కర్పూర హారతులిచ్చి ఆలయమాడ వీధుల్లో ప్రదక్షణగా వాహనం బయలుదేరింది. స్వామివారి వాహనం ముందు భక్తులు గోవిందా... అంటూ నామ స్మరణలతో తన్మయత్వం పొందారు. సూర్యప్రభ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, కంకణభట్టార్ ఏపి శ్రీనివాస దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ రవికుమార్, సూపరింటెండెంట్ నారాయణ, ఆలయ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

### ప్రేమించిన యువతి తిరస్కరించడంతో యువకుడి ఆత్మహత్య

**విజయవాడ,జూన్1, ప్రభాతవార్తప్రతినిధి:** హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్ధి కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.గుంటూరు జిల్లా తాడేపల్లి వద్ద ఈ విద్యార్ధి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.తెలంగాణాలోని సూర్యాపేట జిల్లా మోతే మండలం మాజీ ఎంపీపీ కుమారుడు లోకేశ్ ఈ నెల 29న తాను ఇక కనిపించనని తల్లి దండ్రులకు సమాచారమిచ్చాడు.ఆ తరువాత ఇంట్లోంచి వెళ్లిపోయినట్లు ఇంట్లో వారు గుర్తించారు.లోకేష్ ఇంటి నుంచి వచ్చేసిన తరువాత విజయవాడ వచ్చి కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు,లోకేష్ హైదరాబాద్ సమీపంలోని ఒక ఇంజినీరిర్ కళాశాలల్లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు.అయితే ఈ వ్యవహారంలో ఆ యువతి లోకేష్ ప్రేమను తిరస్కరించడంతో అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లోంచి నుంచి వచ్చిన లోకేష్ చివరిసారిగా తన ప్రేమించిన యువతిని ప్రాదేయపడ్డాడని బంధువులు చెబుతున్నారు. ఆత్మహత్య చేసుకుంటానని చెప్పినా ఆమె తిరస్కరించడంతో విజయవాడ వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులంటున్నారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎల్‌పిజి కమర్షియల్ గ్యాస్ ధర తగ్గింపు..



**ముంబై, జూన్ 1:** ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల ధరలు వినియోగదారులకు భారీ ఊరటను కలిగించనున్నాయి. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధర జూన్ 1, గురువారం రూ.83 తగ్గించింది. ప్రస్తుతం తగ్గిన గ్యాస్ సిలిండర్ల ధరలు కేవలం కమర్షియల్ గ్యాస్‌కి మాత్రమే వర్తిసాయి. కాగా డొమెస్టిక్ గ్యాస్ ధరలలో ఎటువంటి మార్పులేదు. 14.2 కేజీల గ్యాస్ ధరల్లో ఎటువంటి మార్పులేదు. కావున దీని ధర రూ.1,133 వద్ద స్థిరంగా ఉంది. అదే సమయంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర 1,856.50 వద్ద నుంచి రూ.1,773కి తగ్గింది. 2023 మే 1న కూడా కమర్షియల్ గ్యాస్ ధరలు ఏకంగా రూ.171.50 తగ్గాయి. అప్పుడు కూడా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల ధరలలో ఎలాంటి మార్పులేదు. ప్రస్తుతం కమర్షియల్ గ్యాస్ ధరలు తగ్గి, డొమెస్టిక్ గ్యాస్ ధరల్లో మార్పు లేకపోవడం వల్ల సామాన్య ప్రజలు కొంత నిరాశ చెందుతున్నారు.

తాజాగా ధరలు తగ్గిన తర్వాత దేశంలోని వివిధ నగరాల్లో 19 కేజీల సిలిండర్ల ధరలను గమనిస్తే, ముంబైలో ధర రూ.1,725, కోల్‌కతాలో రూ.1,875.50కి దిగొచ్చింది. అలాగే దేశ రాజధానిలో కొత్త ధర రూ.1,773గా ఉంది. మార్చి నెలలో దేశంలోని చమురు కంపెనీలు కమర్షియల్ సిలిండర్లపై ఏకంగారూ.350.50నుపెంచి తర్వాత, ఏప్రిల్ నుంచి ఇలా వరుసగా మూడు నెలల నుంచి ధరలు తగ్గిస్తూ ప్రజలకు ఊరటను అందిస్తున్నాయి. ఈ క్రమంలో గృహ వినియోగదారులకు మాత్రం మొండి చేయి చూపించాయి కంపెనీలు. అనేక నెలలుగా డొమెస్టిక్ సిలిండర్ల ధరల తగ్గింపు కోసం దేశంలోని సామాన్య ప్రజలు ఎదురు చూస్తున్నప్పటికీ, ధరలు పెరగడమే తప్ప తగ్గింది లేదని చెప్పుకోవాలి. ఈ క్రమంలో చివరగా మార్చిలో గృహ వినియోగదారులు వాడే సిలిండర్లపై రూ.50 మేర ధరలను పెంచడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న 75 కీలక పదవులకు ఎన్నికలు 8న

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న 75 ఉన్న కీలక పదవులకు ఎన్నికలు జరుగనున్నాయి. జిల్లా పరిషత్, పురపాలక చైర్మన్లు, వైఎస్‌చైర్మన్లు, డిప్యూటీ మేయర్, మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ,ఉపసర్పంచుల స్థానాల్లో చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయి.ఇందుకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌ను జారీచేసింది.ఈ ఎన్నికల కోసం జూన్4 లోగా జడ్పీటీసీ. ఎంపీటీసీల సభ్యులకు, కార్పొరేటర్లు,కౌన్సిలర్లుకు సమాచారం అందిస్తారు. జూన్8న చేతులేత్తే విధానంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయనున్నారు. విజయనగరం నగరపాలక సంస్థలో ఉపమేయర్, ధర్మవరంపురపాలకసంఘం చైర్‌పర్సన్, తెనాలి,నర్సీపట్టణం, నూజివీడు పురపాలక సంఘాల్లో వైఎస్ చైర్‌పర్సన్, చిత్తూరు జిల్లా రామకుప్పం, సత్యసాయి జిల్లా బట్టలపల్లి, నెల్లూరు జిల్లా రావూరు, అన్నమయ్య జిల్లా గలివేడు మండల పరిషత్ అధ్యక్షుల స్థానాలతో పాటు మరో తొమ్మిది మండలాల్లో మండల పరిషత్ ఉపాధ్యక్షులు, మరో రెండు జిల్లాల్లో, రెండు కోఆప్షన్ సభ్యులకు స్థానాలకు,ఇంకో 18 జిల్లాల్లో 53 ఉప సర్పంచుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు,

## అది కులాలమధ్య పోరుకాదు.. వర్గపోరాటమే

### రాజ్యసభ సభ్యుడు విజయ సాయి రెడ్డి



**విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇప్పుడు జరుగుతున్నది కులాల మధ్య పోరు కాదు, ఇది ధనిక, పేద వర్గాల మధ్య పోరాటం అనే వాస్తవాన్ని సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పడం కొందరికి విస్మయం కలిగించింది. చాలా మందికి మింగుడు పడడం లేదు. గడచిన నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలోని పేదలు, దిగువ మధ్య తరగతి, ఇంకా ప్రభుత్వ సాయం, ఆసరా అవసరమైన అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోంది జగన్ గారి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం. అన్ని ఆర్థిక ఇబ్బందులనూ అధిగమించి, ఎంతో శ్రమకోర్చి సకల జనుల కల్యాణమే పరమార్థంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఐదున్నర కోట్ల జనసంఖ్య ఉన్న రాష్ట్రంలో ఏ కుటుంబమూ ఆర్థిక లేదా ఆరోగ్య సమస్యతో బాధపడకుండా చూడడానికి ప్రభుత్వమూ, పాలకపక్షమూ శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. అవసరమైతే కేంద్ర ప్రభుత్వానికి నచ్చ చెప్పి మరీ వేలాది కోట్ల రూపాయలు ఎపికి మంజూరు చెయించి, బడుగు బలహీనవార్గాల ఆయురారోగ్యాల కోసం ఆధనాన్ని రాష్ట్ర సర్కారు ఖర్చుచేస్తోంది. నవ్యాంధ్రప్రదేశ్‌లో ఇంత మంచి శుభకార్యాలు జరుగుతుంటే కులాల మధ్య కుమ్ములాటలు ఉన్నట్టు కొందరు చాలా చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారు. దాదాపు మూడున్నర సంవత్సరాలు ఓపిక పట్టిన ముఖ్యమంత్రి కిందటేడాది డిసెంబర్ నెలలోనే ఈ విషయంపై సూటిగా అర్థమయ్యే మాటలతో స్పష్టత ఇచ్చారు. 2023 డిసెంబర్ 16న 'గడప గడపకూ మన ప్రభుత్వం' అనే ప్రజా సంపర్క కార్యక్రమం తీరుతెన్నులను సమీక్షించడానికి ఏర్పాటు చేసిన మంత్రులు, పార్టీ శాసనసభ్యుల సమావేశంలో ముఖ్య మంత్రి ఈ విషయం గురించి మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్నది కుల పోరాటంలో పేదల పక్షానే నిలబడాలి, అని జగన్ గారు చాలా సూటిగా స్పష్టంగా చెప్పారు. ఇక్కడ ధనికులుకు, పేదలకు మధ్య పోరు అంటే ఈ రెండు వర్గాల మధ్య హింసాత్మక భౌతిక పోరాటంకాదు. తమ సంపద మరింత పెంచుకోవడానికి సంపన్నులు అక్రమమార్గంలో పేదలకు మధ్య పోరు అంటే ఈ రెండు వర్గాల మధ్య హింసాత్మక భౌతిక పోరాటంకాదు. తమ సంపద మరింత పెంచుకోవడానికి సంపనున్నలు అక్రమమార్గంలో పేదలను దోపిడీ చేయడానికి ప్రయత్నించినప్పుడు, బడుగులు వారిని ప్రతిఘటించడం అని గ్రహించాలి. ఈ ప్రతిఘటనలో పేదల పక్షాన పలకపక్షమైన వైఎస్సార్సీ ప్రభుత్వం, నాయకులు, కార్యకర్తలు ఉండాలనేది ముఖ్యమంత్రి ఉద్దేశం. జనవరిలో కూడా సీఎం ఇదే విషయం చెప్పారు కదా.. ఈఏడాది జనవరి మొదటి వారం రాజమహేంద్రవరంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, రాష్ట్రంలో నేడు జరుగుతున్నది పేదలకూ, పెట్టుబడిదారులకు మధ్య వర్గపోరాటం. అంతేగాని కులాల కుమ్ములాట కాదు. పేద ప్రజలను దోచుకోవడానికి సిద్ధమైన వారితో నేను పోరాడుతున్నా. ఈ పోరాటంలో నాకు బలహీనవర్గాలు, దేవుడి తోడ్పాటు అవసరం, అని స్పష్టంచేశారు.

### తిరుమలలో అద్భుతమైన పాలన

#### సినీనటుడు మోహన్‌బాబు

**తిరుమల,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో ఇదివరకు ఎన్నడూ లేని విధంగా అద్భుతమైన పరిపాలన సాగుతోందని, భక్తులకు మరింత మంచి సౌకర్యాలు ఏర్పాటుచేయడంలో టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి కృషి అభినందనీయమని సినీనటుడు మంచు మోహన్‌బాబు అన్నారు.

త్వరలో 100 కోట్ల రూపాయలతో చిత్రం నిర్మిస్తున్నానని, మంచు విష్ణు వివరాలు వెల్లడిస్తాడని తెలిపారు. రజనీకాంత్ వ్యవహారంపై మాట్లాడటానికి సాయంత్రం వరకు సమయం సరిపోదని, వివాదాల జోలికి ఇప్పుడువెళ్ల దలచుకోలేదన్నారు. తిరుమలలో భక్తులకు మంచి దర్శనం చేయించేలా ఇఒ ధర్మారెడ్డి పాలన అద్భుతంగా ఉందని కొనియాడారు. కుటుంబసభ్యులతో కలసి గురువారం ఉదయం తిరుమలకు వచ్చిన నటుడు మోహన్ బాబు ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. వెంకన్నను దర్శించుకుని కానుకలు సమర్పించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## దక్షిణ కైలాసంలో దక్షిణామూర్తికి విశేషాభిషేకాలు

### భక్తుల పారవశ్యం:చక్కటి ఏర్పాట్లు



**శ్రీకాళహస్తి,జూన్ 1 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన దేవతల పూజలు,అభిషేకాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపధ్యంలో ఆలయంలో వెలసిన గురుదక్షిణా మూర్తికి గురువారం విశేషాభిషేకాలు, అలంకారాలు నిర్వహిస్తున్నారు. వేసవి సెలవులు కావటంతో ఆలయానికి భక్తులు అత్యధిక సంఖ్యలో హాజరౌతున్నారు.ఈ నేపధ్యంలోనే హుండీల ఆదాయాలు గణనీయంగా పెరుగుతుంది. వారంలో ప్రతి రోజూ ఒక ప్రత్యేకత సంతరించుకుంటుంది. ఈ నేపధ్యంలో ఆలయంలోని కంచుగడప వద్దకు చేరగానే భక్తులకు దర్శనమిచ్చే స్వామి గురుదక్షిణామూర్తి ఆ ఆలయం వద్ద గురువారం విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు.

**గురువుకు హోమాలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన క్షేత్ర పాలకుడు గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు, హోమాలు, అభిషేకాలు ఆలయ ప్రదానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఆలయంలో ప్రవేశించిన వెంటనే బాహ్య ప్రపంచాన్నిమరచిపోతారు. శివయ్య సేవలో తరిస్తారు. అంతటి మహిమాన్విత దివ్యక్షేత్రంలో వెలసిన గురువు దక్షిణామూర్తికి గురువారం పండగలా పూజలు నిర్వహించటం ఈ దివ్యక్షేత్రంలో ఆచారంగా వస్తుంది.

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చిన భక్తులు స్వామి అమ్మవార్ల ప్రధాన ఆలయం కంచుగడప నుంచి ప్రవేశిస్తే మొదట దర్శనమిచ్చేది గురుదక్షిణామూర్తి. ఇక్కడి క్షేత్రపాలకుడు గురుదక్షిణామూర్తియే అంటారు.ఈ నేపధ్యంలో ఇక్కడ గురుసంక్రమణ సందర్భంగా ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. అలాగే ప్రతిగురువారం స్వామి వారికి షోడషాభిషేకాలు నిర్వహించటం నిత్య పూజలుగా ఏర్పాటు చేసారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కంచుగడప నుంచి ప్రవేశి స్తూనే మొట్టమొదట దర్శనమిచ్చేది. గురు దక్షిణామూర్తి. ఈ ఆలయం వద్ద ప్రతి గురువారం విశేష పూజలు అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి.

ఇక్కడ గురుసంక్రమణ సందర్భంగా నిర్వహించే పూజలకు ఎంతో ఆదరణ ఉంది. ఉదయం నుంచి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద భక్తులు వరుస కట్టారు.ఉదయం ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో గురు దక్షిణామూర్తి ఆలయం ఎదుట కలశస్థాపన గావించారు. తరువాత స్వామికి హోమాలు నిర్వహించారు.

### నెలాఖరుకు శ్రీనివాససేతు పనులు పూర్తికావాలి: టిటిడి ఇఒ ధర్మారెడ్డి

**తిరుమల,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** దేశవిదేశాల నుండి తిరుమలకు వస్తున్న భక్తులకు సౌకర్యవంతంగా,తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా సాఫీగా వాహనాలు తిరుమలకు చేరుకునేందుకు వీలుగా నిర్మితమవుతున్న శ్రీనివాససేతు వారధి పనులను జూన్‌నెలాఖరుకు పూర్తిచేసి జులై మొదటి నుండి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా పనులు వేగవంతం చేయాలని టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి ఆదేశించారు.తిరుపతి నగరంలో శ్రీనివాససేతు 92శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 8శాతం పనులను జూన్ 30కి పూర్తిచేయాలన్నారు. గురువారం టిటిడి పరిపాలన భవనంలో శ్రీనివాససేతు పనులపై టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, జెఇఒ వీరబ్రహ్మం, తిరుపతి నగరపాలకసంస్థ కమిషనర్ హరిత, టిటిడి సిఇ నాగేశ్వరరావు, నగరపాలకసంస్థ ఎంఇ మోహన్, స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చంద్రమౌళితో కలసి సమీక్షించారు. మీడియన్, మొక్కల పెంపకం, డ్రైనేజీ, వీధుల ఆధునీకరణ, అవసరమైన చోట్ల రంగులు వేయడం, లైటింగ్ ఏర్పాటు తదితర పనులు వేగంగా చేయాలన్నారు. నగరంలోని రామానుజసర్కిల్ నుండి సుబ్బలక్ష్మిసర్కిల్ వరకు పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులు మరింత త్వరగా పూర్తిచేయాలన్నారు. ఇతర ప్రాంతాలలో బేరింగ్‌లు, వాషర్లను తెప్పించి నిర్మించాలన్నారు. శ్రీనివాససేతు పూర్తిభాగం జులైమొదటికి అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలన్నారు.

### భక్తుల సౌలభ్యం కోసం అందుబాటులోకి మరో అతిధిగృహం

#### 12 గదులతో ఎస్వీ అతిధిగృహం

**తిరుమల,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చే భక్తులకు వసతి సౌకర్యం కల్పించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు మరింతగా ప్రత్యామ్నాయం చేస్తున్నారు. ఇప్పటికే పురాతన అతిధిగృహాలు, కాటేజీలనుదాతల సహకారంతో ఆధునీకరించి అందుబాటులోకి తీసుకువస్తున్నారు. తాజాగా గురువారం ఉదయం తిరుమలలోని సన్నిధానం అతిధిగృహం సమీపంలో తెలంగాణారాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన ఫోనిక్స్‌పవర్ ఇన్ఫ్రాసంస్థ నిర్మించిన వేంకటేశ్వర అతిధిగృహాన్ని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి , వసతి కల్పనవిభాగం డిప్యూటీ ఇఒ (ఆర్ 1)పి.హరీంద్రనాథ్, ఓఎస్‌డి రామకృష్ణతో కలసి ప్రారంభించారు. ఈ అతిధిగృహం తాళాలను దాత సురేష్ చుక్కపల్లి కుటుంబసభ్యులు రమేష్ చుక్కపల్లి, అవినాష్ చుక్కపల్లి, గోపీకృష్ణ అందజేశారు. రెండు రోజుల్లో ఈ అతిధిగృహం గదులను భక్తులకు కేటాయిస్తారు. విశాలమైన ,ఆధునీకరించిన గదులు భక్తులకు వసతి బావుంటుందని తెలిపారు.

## దక్షిణ మధ్య రైల్వేలో మే నెలలో రూ.500 కోట్లకు పైగా ఆదాయం

**గుంతకల్లు రైల్వే, జూన్ 1 ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే జోన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మే మాసంలో 26.11 మిలియన్‌ల ప్రయాణికులను వారివారి గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా రూ.513.41 కోట్ల రూపాయల ప్రయాణికుల ఆదాయాన్ని ఆర్జించడంతోపాటు, సరుకు రవాణాలో అత్యాధికంగా మరో 12.517 మిలియన్ టన్నుల సరుకును వివిధ ప్రాంతాలకు రవాణా చేసింది. దక్షిణ మధ్య రైల్వే 2023మే నెలలో ప్రయాణికుల, సరుకు రవాణా విభాగంలో అత్యుత్తమ నెలవారీ పనితీరును నమోదు చేసింది. జోన్ మొదటి సారిగా నెలవారి ప్రయాణికుల ఆదాయంలో రూ.500 కోట్ల మార్కును అధిగమించింది. దాని ద్వారా ప్రయాణికుల ఆదాయాన్ని మే 2023లో, రూ.513.41 కోట్లు ఆర్జించింది. ఏప్రిల్, 2023లో ఆర్జించిన అత్యుత్తమైన రూ.467.82 కోట్లు కంటే అధికము. అదే విధంగా జోన్ మే 2023 నెలలో 12.517 మిలియన్ టన్నుల సరుకు రవాణా మునుపెన్నడూ లేని విధంగా చేసింది. ఇది మార్చి 2023లోని అత్యుత్తమ 12.370 మిలియన్ టన్నులు కంటే అత్యధికం. జోన్ 2023 మే నెలలో 26.11 మిలియన్ల మంది ప్రయాణికులను చేరవేసింది. గత 2023 మే నెలలో 21.12 మిలియన్ల ప్రయాణికులతో పోలిస్తే 24శాతం వృద్ధిని సాధించింది. సాధారణ రైళ్ల కాకుండా వేసవి కాలంలో అదనపు రద్దీ అవసరాలను తీర్చడానికి మే నెలలో జోన్ 538 ట్రిప్పుల ప్రత్యేక రైళ్లను నడిపించి. ఇది అదనంగా 4.65 లక్షల మంది ప్రయాణికులను రవాణా చేయడం ద్వారా రూ.36.52 కోట్ల ఆదాయం సంపాదించింది. సరుకు రవాణా విభాగంలో, జోన్ మే 2023లో 12.517 ఎమ్ టిలుల సరుకును రవాణా చేసింది. ఇది ఏ ఆర్థిక సంవత్సరంలోనైనా ఒక నెలలో సాధించిన అత్యుత్తమ

### 12.517 మిలియన్ టన్నుల సరుకు రవాణా

సరుకు రవాణా లోడింగ్, గత సంవత్సరం నమోదైన సంబంధిత లోడింగ్ కంటే ఇది దాదాపు 7 శాతం ఎక్కువ. అదే సమయంలో సరుకు రవాణా ఆదాయం ఈ ఏడాదిలో 14 శాతం వృద్ధి చెందిరు. మే 2023లో రూ.1213.36 కోట్లు నమోదు చేసింది. గత ఏడాది మే, 2022లో 1065.15 కోట్లు నమోదు చేసింది. జోన్ యొక్క మొత్తం సరుకు రవాణా లోడింగ్‌లో బొగ్గు 7శాతం వృద్ధిని నమోదు చేస్తూ 6.484 ఎంటిల లోడింగ్‌ను అందించడం ద్వారా వృద్ధిని కొనసాగించింది. దక్షిణ మధ్య రైల్వే మొత్తం సరుకు రవాణాలో దోహదపడిన ఇతర ముఖ్యమైన వస్తువులు : సిమెంట్ 3.106 ఎంటిలు, ఆహార ధాన్యాలు 0.44 ఎమ్ టీలు, ఎరువులు 0.740 ఎమ్ టిలు, ఇనుప ఖనిజం 0.363 ఎంటిలు, కంటనర్లు 0.211ఎమ్‌టిలు, జోన్ అనేక రకాల కార్యక్రమాలు, ప్రత్యేకచర్యలను అమలు చేయడం ద్వారా దాని సరుకు రవాణాను బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టిని సారిస్తుంది. కొత్త ట్రాఫిక్‌ను ఆకర్షించడానికి, ఇప్పటికే ఉన్న ట్రాఫిక్‌ను నిలుపుకోవడానికి జోన్ చురకైన పద్ధతిలో కదులుతోంది. సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్ ఈ అత్యుత్తమ విజయానికి ఆపరేటింగ్, కమర్షియల్ టీఎంలను అభినందించారు. జోన్లలో ప్రతి నెల ఉత్తమ పనితీరు నమోదవుతున్న తీరుపట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. జోన్ యొక్క మొత్తం పనితీరును మెరుగుపర్చడానికి దారితీసిన అన్ని విభాగాల సిబ్బంది యొక్క అద్భుతమైన సమన్వయాన్ని జనరల్ మేనేజర్ అభినందించారు.

## శ్రీకాళహస్తి సమీపంలో రోడ్డు ప్రమాదం

### ముగ్గురు మహబూబాబాద్ వాసులు మృతి



**శ్రీకాళహస్తిరూరల్,జూన్ 1 ప్రభాతవార్త:** గురువారం వేకువ జామున ఆ కుటుంబం ముల్లోకాల్ని ఏలే కలియుగ దైవం నిజరూపదర్శనం చేసుకున్నారు. భక్తి భావంతో తిరుమలేశుని దర్శించుకొని తలనీలాలు సమర్పించుకున్న ఆ కుటుంబం తమ స్వస్థలం అయిన మహబూబాబాద్‌లో దంతాలవారి పల్లికి బయలుదేరారు. తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వచ్చే ఏర్పేడు సమీపంలోని మేర్లపాక మలుపు వద్ద తాము పయనిస్తున్న కారు ఎదురుగా వస్తున్న పల్లెవెలుగు బస్సును ఢీకొంది.ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మరో ముగ్గురు గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. సంఘటన జరిగినవెంటనే ఏర్పేడు సిఐ శ్రీహరి,వారి సిబ్బంది శ్రీకాళహస్తి, తిరుపతి 108 వాహనం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు.గాయాల్లో బాధపడుతున్న వారిని మొదట శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాధమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు.

శ్రీకాళహస్తికి సుమారు 15కిలోమీటర్ల దూరంలోని శ్రీకాళహస్తి తిరుపతి రహదారి మేర్లపాక మలుపు వద్ద తమ కారు టిఎస్ 26 ఇ 7432 నెంబర్ కారులో వెంకటమ్మ, అశోక్,స్థానికాక్షరిలు ఉండగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాంబాబు డ్రైవింగ్ చేస్తున్నట్లు పోలీసుల ప్రాధమిక విచారణలో తెలిసింది. ఒకే కుటుంబానికి చెందిన వారు తమ కుటుంబసభ్యుల్లో చిన్నారి జన్మదిన సందర్భంగా తిరుమలేశుని దర్శించుకొనుటకు బయలుదేరారు.స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్న వారు తమ కారులో తిరుగుపయనమయ్యారు. ఏర్పేడు దాటిన తరువాత మేర్లపాక మలుపు వద్ద తమ ముందు వెళుతున్న వాహనాన్ని దాటుతూ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న పల్లె వెలుగు బస్సును ఢీకొంది. దాంతో కారు వెనక్కు వెళ్ళి ముళ్ళచెట్లలో పడింది. ఈప్రమాదంలో అశోక్ (37) వారితల్లి వెంకటమ్మ(65) బంధువు స్థానికాక్షరి (4) అక్కడికక్కడే మృతి చెందారు.కారులో పయనిస్తున్న భాను, చరిత, కారు నడుపుతున్న రాంబాబులు తీవ్రంగా గాయపడ్డారు.

ఈ సంఘటనతో ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం కల్గింది. ఉదయం సుమారు 7గంటల ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది.వారి వద్ద ఉన్న ఆధారాలతో మహబూబాబాద్‌లోని దంతాల వారి పల్లెలో బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాలను ఏరియా ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసి సిఐ శ్రీహరి దర్యాప్తు చేస్తున్నారు.

వార్త


కవి బాధ్యత జాతిని గురించి పరిశీలించడమే కాని, వ్యక్తిని గురించి ఆలోచించడం కాదు.

–శామ్యూల్ జాన్సన్

# ఫీజుల తగ్గింపు 'మాట'ల్లోనేనా?

ఆశ అత్యాశగా మారితే అక్రమాలకు, అవకతవకలకు, అవినీతికి అడ్డూఅదుపు ఉండదంటారు. అత్యాశకాస్త దురాశగారూపాంతరం చెందితే ఎలాంటి ప్రమాదకర దుష్పరిణామాలు దాపురిస్తాయో వేరే చెప్పక్కర్లేదు. దురదృష్టం కొద్దీ ఆ పరిస్థితి విద్యావిధానంలో చోటుచేసుకుంటుంది. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ఈ విద్యా వ్యాపారం విస్తరించిపోతున్నది. ముఖ్యంగా రాత్రికిరాత్రే కోట్లు సంపాదించి తెల్లవారే సరికి కుబేరులు అవుతారనే ఆరాటపడే కొందరు దురాశపరులు మొత్తం విద్యావ్యవస్థ ప్రమాణాలను అడుగంటిస్తున్నారేమోననిపిస్తున్నది. అధ్యయనంతో విజ్ఞానాన్ని ఆర్జించి పరిశోధనతో మేధాసంపత్తిని పెంచి సమాజ అభ్యున్నతికి ఉపయోగపడేలా విద్యార్థినీ విద్యార్థులను తీర్చిదిద్దే విధంగా ఉండాల్సిన విద్యావిధానాన్ని వ్యాపార వస్తువుగా మార్చేశారు. ప్రభుత్వరంగంలో పడిపోతున్న విద్యాప్రమాణాలను ఆసరాగా తీసుకొని కొన్ని ప్రైవేట్ సంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుకుంటున్నారు. ఈ విద్యాసంవత్సరం ఆరంభం కానునండడంతో తల్లిదండ్రులు విధిలేని పరిస్థితుల్లో ప్రైవేట్ సంస్థలు అడిగిన ఫీజులు చెల్లించాల్సి వస్తున్నది. అవునన్నా, కాదన్నా ఏ అవకాశం లేక ఆర్థిక స్తోమత లేనివారే మరో గత్యంతరం లేక సర్కారు బడులకు పంపుతున్నారు. ప్రభుత్వంలో ఉండేకొందరు పెద్దలు, మరికొందరు అధికారులు ఒక వ్యూహం ప్రకారం ప్రభుత్వరంగంలో విద్యాప్రమాణాలను దిగజార్చుతున్నారేమోననిపిస్తున్నది. దీనిని అవకాశంగా తీసుకొని కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తున్నాయి. ఇక ఇంటర్మీడియేట్ విద్యపరిస్థితి అయోమయంగా ఉంది. ఇంటర్మీడియేట్ కోర్సు అనేది ఎంతో కీలకమైంది. ఉన్నత విద్యకు పునాది వంటిది. విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు పడే కీలక దశ ఇదే. అందుకే ఆ స్థాయిలో అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు ఎంతో జాగ్రత్తలు తీసుకుంటారు. పిల్లలకు నాణ్యమైన చదువులు చెప్పించేందుకు తలతాకట్టుపెట్టి వేలాది రూపాయల డబ్బు వెచ్చిస్తుంటారు. విద్యార్థులు కూడా ఇల్లు,ఒల్లు పట్టించుకోకుండా తపస్సు మాదిరి ఆ రెండేళ్లు అహర్నిశలు కష్టపడి శక్తికి మించిన శ్రమ చేస్తారు. ఈ చదువుల కోసం ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్న విద్యార్థులు ఎందరో ఉన్నారు. ఇంటర్మీడియేట్ బోర్డు ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఇంటర్మీడియేట్ మొదటిసంవత్సరం అడ్మిషన్లకోసం ఈ నెల 12న ఇంటర్‌బోర్డు షెడ్యూల్డ్ జారీ చేసింది. పదిహేను నుంచి అడ్మిషన్లు ప్రారంభించుకోవడానికి అనుమతించింది. జూన్ 30వరకు అడ్మిషన్లు కొనసాగుతాయని షెడ్యూల్డ్‌లో ఇంటర్‌బోర్డు స్పష్టం చేసింది. కానీ మే నెలాఖరువరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వేసవి సెలవులు కొనసాగుతాయి. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు జరగడం లేదు. కానీ ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో గత పదిహేనో తేదీ నుండే అడ్మిషన్ల జోరు అందుకున్నది. ఇలాంటి చర్యలు ప్రైవేట్ విద్యను ప్రోత్సహించే విధంగా ఉన్నాయనే విమర్శలను తోసిపుచ్చలేం. ఇక ఫీజుల విషయంలో నియంత్రణే లేదని చెప్పొచ్చు. చట్టాలు లేవనికాదు. ఉన్న చట్టాలను అమలు చేయకపోవడం దురదృష్టకరం. అధిక ఫీజుల విషయంలో 1983లోనే చర్యలు తీసుకోవాలని పావులు కదపడం ఆరంభించారు. అప్పట్లోనే కొన్ని నిబంధనలను విధించారు. క్యాపిటేషన్ పేరుతో వసూలు చేస్తున్న కొన్ని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడం ఆరంభించారు. ఆ కార్యక్రమం త్రికరణశుద్ధిగా జరగలేదు. ఆ తర్వాత 1994లో ఏకంగా ఒక జీవో జారీ చేసింది. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే ప్రైవేట్ యాజమాన్యాలపై ఉక్కుపాదం తప్పదన్నట్లుగా హెచ్చరికలు జారీచేశారు. అవన్నీ ఉత్తరకుమార ప్రగల్భాలని తేలిపోయింది. ఆ తర్వాత రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎనిమిది మంది సభ్యులతో కమిటీ వేశారు. ఆ కమిటీ సమగ్ర అధ్యయనం తర్వాత ఒక నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఆయా స్కూళ్లు కల్పిస్తున్న సౌకర్యాల ప్రకారం ఎ,బి,సి, అంటూ మూడు కేటగిరిలుగా పాఠశాలలను విభజించారు. దీని ప్రకారం ఏయే స్కూళ్లు ఎంతెంత ఫీజు వసూలు చేయాలో సూచిస్తూ నివేదికలో పేర్కొన్నారు. కానీ అవి కూడా అమలుకు నోచుకోలేదు. ఆ తర్వాత కూడా ఎన్నో మార్పులు చేర్పులు చేస్తున్నా అవేమీ పట్టించుకున్న దాఖలాలు కన్పించలేదు. మంత్రులు మాట్లాడు తూనే ఉన్నారు. హెచ్చరికలు చేస్తూనేఉన్నారు. అధిక ఫీజుల వసూళ్లు ఏ మాత్రం ఆగడంలేదు. వారు ఎందుకు అలా మాట్లాడుతున్నారో తమకు తెలుసు, వారికీ తెలుసు అన్నట్లుగా కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. అందుకు తగ్గట్టుగానే ఏ ఒక సంస్థ నిర్దిష్టమైన, పటిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కొత్త చట్టాలు తీసుకువస్తాం, కఠిన చర్యలు తీసుకుంటాం అనే హెచ్చరికలు భయపడే రోజులుపోయాయి. ఒకవేళ కొత్త చట్టాలు తెచ్చినా,వాటి నుంచి ఎలా తప్పించుకోవాలో తెలుసుకోలేని అమాయ కులుకారు. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు చట్టంలోని లొసుగులను వాడుకునేందుకు మార్గాలను అన్వేషించక మానరు. వారికి మార్గాలు చూపించేవారు కొందరు ప్రభుత్వంలోనే ఉంటారు. ఇప్పుడు కావాల్సింది కమిటీలు, చట్టాలు, హెచ్చరికలు, ప్రకటనలు కాదు. నిబంధనలకు వ్యతిరేకంగా ఫీజులు ఏయే ప్రైవేట్ యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయో తెలియంది కాదు. తెలుసుకోవడం కూడా పెద్దకష్టం కాదు. అలాంటి వారిపై త్రికరణశుద్ధిగా చర్యలు తీసుకోగలిగితే ఈ విద్యావ్యాపారానికి కొంతవరకైనా ఫుల్‌స్టాఫ్ పెట్టించగలరు.

యుద్ధకాలంలోనైనా, శాంతి సమయంలోనైనా ప్రభుత్వ ఆశయం ఒక్కటే కావాలి.



విలియం హెన్రీ హ్యారిసన్

మారణాయుధాలు మనల్ని నాశనం చేయకముందే మనం వాటిని నాశనం చేయడం మంచిది.



జాన్ కెనడీ

## ప్రజావాక్కు



### చర్చల సంస్కృతిని పునఃప్రతిష్ఠించాలి

పలు వివాదాల నడుమ ఒక చారిత్రక ఘట్టం పూర్తయింది. పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రధాని ఉత్సవ వాతావరణంలోఆవిష్కరించారు. రానురానూ పార్లమెంట్‌లో ఆరోగ్యకరమైన చర్చల మాట అటుంచి అసలు చర్చలే తగ్గిపోతున్నాయి. తొలి సభకు నేడు నడుస్తున్న 17వలోక్‌సభకు చర్చాకాలం సగానికి కన్నా తక్కువ రోజులకు పడిపోయింది. బహుశా ప్రస్తుత సభ కనిష్టకాలం చర్చలుజరిగిన సభగా గుర్తింపునకు నోచుకోవచ్చు. ముఖ్య మైన ఆర్థిక బిల్లులు, ప్రాముఖ్యత కలిగినవి కూడా నిమిషాల్లో పాస్‌అవుతున్నాయి. అధికార ప్రతిపక్షాలు తమ మాటే నెగ్గాలన్నధోరణికి కట్టుబడి, పట్టువిడుపులు ప్రదర్శించడంలేదు. సెషన్స్ తుడిచిపెట్టుకుపోవడం మామూలైంది. లోతుగా పరిశీలించాల్సిన బిల్లుల్ని స్టాండింగ్ కమిటీలకు పంపే ఆచారం దూరమవుతుంది. వైరిపక్షాలు భిన్నకోణంలో ఒక సమస్యను పరిష్కారాన్ని చూసి చివరకు ఒక ఉత్తమమైన నిర్ణయానికి రావడం చర్చల ముఖ్య ఉద్దేశ్యం.

–డా.డి.వి.జి.శంకరావు, పార్వతీపురం

### సమస్యను పరిష్కరించండి

రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కుర్చీ వివాదం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశం రోజురోజుకు ముదిరి కొలిక్కి రాకపోవడం గమనార్హం. వీసీ నియమించిన వ్యక్తిని ఈసీ ఒప్పుకోకపోవడం, ఈసీ నియమించిన రిజిస్ట్రార్‌ను వీసీ సమ్మతించకపోవడం అధికార పెత్తనం తలపిస్తోంది. రెండేళ్లుగా ఇలా జరుగుతూ రెండు సంవత్సరాల్లో తొమ్మిది సార్లురిజిస్ట్రార్లు మారడమే దీనికి నిదర్శనం. ఆర్డర్ కాపి చూపించాలని దళితుడికి అవమానం జరిగిందని, విధులకు ఆటంకం కలిగిందని విమర్శలు చేసుకోవడం శోచనీయం. అదేవిధంగా ప్రభుత్వ హెచ్చరికలు బేఖాతరు చేసి రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం వేయడం రాజకీయమైంది.

–తలారి గణేష్, వెల్లంకి యాదాద్రిజిల్లా

### పార్లమెంటు భవనం ఎందుకు?

పార్లమెంటు భవనం అంటే ప్రజాసమస్యలు చర్చించి వాటికి పరిష్కార మార్గాలు వెతికే వేదిక. అయితే పాత పార్లమెంటు భవనంలో అలా ఎప్పుడు జరగలేదు. పార్లమెంటు సమావేశాలు జరిగినప్పుడల్లా అధికారప్రతిపక్ష పార్టీలకు చెందిన సభ్యులు అడ్డుకుంటూ, కొట్టుకుంటూ దాన్నో రణరంగంగా మారుస్తుంటే వారిసమావేశాల ఉద్దేశ్యం ఏ ఒక్కసారి నెరవేరేదికాదు. ముందుముందు సమావేశాలు ఎలా జరుగుతాయో .

–మిథునం, హైదరాబాద్

### పునర్విభజన చట్టంలో లొసుగులు

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఉన్న లొసుగుల కారణంగా సమస్యలునానాటికీ జఠిలమవుతూనే ఉన్నాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 371ప్రకారం పార్లమెంట్ ఆమోదించిన ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం ఈ యేడాది జూన్2తో తొమ్మిదేళ్లుపూర్తయి, పదోసంవత్సరంలోకి అడుగు పెడుతోంది. విభజన ప్రక్రియపూర్తయి పదేళ్లు కావస్తున్నా,ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు హక్కుల భంగం, ఆర్థిక నష్టమే మిగిలింది. గతంలో కొన్ని సందర్భాల్లో రెండు రాష్ట్రాలు సఖ్యతతో ముందడుగు వేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం సహకరించని కారణంగా చట్టంలోని అనేక అంశాలు అపరిష్కృతంగానే మిగిలాయి. ఈ చట్టంలో అత్యంత కీలకమైన 9వ,10వ షెడ్యూల్డ్‌లో పేర్కొన్న సంస్థలు ఇంకా యుద్ధవాతావరణంలోనే కొనసాగుతున్నాయి. కొన్ని సంస్థల్లో ఉద్యోగులు, చరాస్తుల విభజన జరిగినప్పటికీ ఆర్థిక లావాదేవీల లెక్క తేలలేదు.

–సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### బెట్టింగ్ మత్తులో యువత

క్రికెట్ క్రీడలో అసామాన్యమయిన క్రీడాకారులను గుర్తించి దేశానికి అందించడమే కాకుండా వారిలోని నైపుణ్యానికి పదును పెట్టి వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచిందని చెప్పడంలో అతిశయోక్తిలేదు. అయితే ఇది నాణానికి ఒకవైపు మాత్రమే. ఫ్రాంచైజ్‌ల తరపున ఆడుతున్న కొంతమంది ఆటగాళ్లు కొన్ని సందర్భాల్లో గెలుపుకోసం ఆరాటంలో ఒకరిపై ఒకరు రాగద్వేషాలను ప్రదర్శిస్తూ తమమధ్య దూరాన్ని పెంచుకుంటున్నారు. దేశం కోసం కలసికట్టుగా ఆడే అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఈ పరిస్థితి కొనసాగితే చాలా ప్రమాదం. అంతేకాకుండా మితిమీరిన క్రికెట్ ఆడడం వలన క్రీడాకారులు ఫిట్నెస్ కోల్పోయే ప్రమాదం లేకపోలేదు. బెట్టింగ్ మత్తులో పడుతున్న యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.

–రత్నాల ప్రకాశరావు, విశాఖపట్నం

### ప్రభుత్వం ఆదుకోవాలి

దేశంలో సినిమా వ్యాపార వాణిజ్య సముదాయాలు మూతపడకుండా ప్రభుత్వం ఆదుకోవాలి. గత మూడు సంవత్సరాలుగా సినిమా పరిశ్రమ నష్టాలకు గురవుతుంది. సినిమా థియేటర్లకు ప్రేక్షకుల కరవుకావడం వల్ల థియేటర్‌లు మూతపడుతున్నాయి. ఈ మధ్య హైదరాబాద్‌లో పివిఆర్ సినిమా వాణిజ్య సముదాయం మూతపడింది. అలాగే మరికొన్ని మూతపడే అవకాశం ఉంది. టిక్కెట్ రేట్‌లు పెరగడం, ఒటిటిలలో త్వరగా రిలీజ్ కావడం కరోనా కారణంగా ఈ పరిస్థితి వస్తుంది.

–డి.చాంద్‌బాషా, కర్నూలు

# మారుతున్న రాజకీయ సమీకరణాలు

తెలంగాణ శాసనసభ ఎన్నికలు దేశ రాజకీయాలను ప్రభావితం చేసే అవకాశం కూడా ఉంది. తెలంగాణ రాష్ట్రంలో మరొకసారి గెలిచి దేశ రాజకీయాలలో ప్రభావవంతమైన పార్టీగా ఎదగాలని బిఆర్ఎస్ భావిస్తుంది. దక్షిణాదిలో అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం కర్ణాటకను కోల్పోయిన బిజెపి తెలంగాణలో గెలిచి దక్షిణాదిలో విస్తరించాలని భావిస్తుంటే తెలంగాణలో రాష్ట్ర శాసనసభ ఎన్నికలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో గెలిచిన పార్టీకి దేశంలో రాజకీయంగా సానుకూలత ఏర్పడుతుందనటంలో సందేహం లేదు.



డాక్టర్ తిరునావారి శేషు

మరొక ఐదు నెలల్లో తెలంగాణ రాష్ట్ర శాసనసభకు మూడోసారి జరగబోతున్న ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. గత రెండు ఎన్నికల్లో కాంగ్రెస్‌పై సునాయాసంగా విజయం సాధించి అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ఈసారి జరగబోయే ఎన్నికలలో కాంగ్రెస్ బిజెపి నుండి బలమైన రాజకీయ సవాల్‌నీ ఎదుర్కొనే వాతావరణం కనిపిస్తుంది. 2018 ముందస్తు శాసనసభ ఎన్నికలలో 88 శాసనసభ స్థానాలలో గెలిచి తిరుగులేని విజయాన్ని సాధించిన బి.ఆర్.ఎస్‌కి ఈసారి జరగబోయే శాసనసభ ఎన్నికలలో ఆస్థాయి విజయం దక్కే అవకాశాలు లేవనే మాట ఆ పార్టీ నాయకుల నుండే వెలువడడం విశేషం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయి 9 వసంతాలు పూర్తి చేసుకొని 10 వసంతంలోకి అడుగుపెడుతున్న వేళ ఈ తొమ్మిది సంవత్సరాలలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని బిఆర్ఎస్ నమ్మకంతో ఉంటే ప్రభుత్వ ప్రజావ్యతిరేకత విధానాలే బిఆర్ఎస్‌ని ఓడించి అధికారాన్ని కట్టబెడతాయని కాంగ్రెస్, బిజెపిలు భావిస్తున్నాయి. కర్ణాటక శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం తెలంగాణ రాష్ట్రంలోని రాజకీయాన్ని ఒక్కసారిగా మార్చివేసిందనే చెప్పాలి. గత రెండు శాసనసభ ఎన్నికలలో అధికారం కోసం ముఖాముఖి తలపడిన బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలు 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో బిజెపి నాలుగు లోక్‌సభస్థానాలు గెలవడం తన ఓటు బ్యాంకుని గణనీయంగా పెంచుకోవడం, జిహెచ్‌ఎంసి కార్పొరేషన్ ఎన్నికలలో అనుకూల ఫలితాలు దుబ్బాక హుజురాబాద్ శాసనసభ ఉప ఎన్నికలలో గెలుపుతో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి కూడా మూడోపక్షంగా తెరమీదకు వచ్చి బిఆర్ఎస్‌ని బలంగా ఢీకొడుతున్న తరుణంలో కర్ణాటక ఎన్నికల ఫలితాలు నిస్తేజంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఊపిరి పోయటమే కాదు క్షేత్రస్థాయిలో బిఆర్ఎస్‌ని ఎదుర్కోవడానికి సానుకూలమైన వాతావరణాన్ని సృష్టించింది. అంతేకాకుండా వివిధ జిల్లాల్లో వ్యక్తిగత ప్రతిష్ట కలిగి గెలుపోటములను ప్రభావితం చేసే నాయకులు ముఖ్యంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జుపల్లి కృష్ణారావు లాంటి ముఖ్యమైన నేతలు బిజెపిని కాదని కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకోవడం కాంగ్రెస్ అధిష్టానం ముఖ్యంగా రాహుల్‌గాంధీ ప్రియాంక గాంధీ తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను స్వయంగా పర్యవేక్షించడం కాంగ్రెస్‌కి రోజురోజుకి బలం పెరగడమేకాదు ప్రజలలో కూడా తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌పై అనుకూలత పెరిగింది. కర్ణాటక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయ సానుకూలత కాంగ్రెస్ వైపుకి మళ్లుతున్న ఛాయలు కనపడుతున్నాయి. కాంగ్రెస్ ఓటు బ్యాంకు దరిదాపు 35 శాతానికి పెరిగినట్టుగా కనపడుతుంది. కాంగ్రెస్ మరొక మూడు నాలుగు శాతం ఓటు బ్యాంకుని పెంచుకోగలిగితే గెలుపుపై కాంగ్రెస్‌కి ఆశలు చిగురిస్తాయి. తెలంగాణలో బలమైన పార్టీగా ఎదిగి 2023 శాసనసభ ఎన్నికలలో గెలవాలనే బిజెపి ఆశలను కాంగ్రెస్ దెబ్బతీయబోతుందనే చెప్పాలి. బెంగాల్ తరహాలోనే ఇతరపార్టీలలోని బలమైన నాయకులను పార్టీలోకి చేర్చుకొని





బలపడాలనే వ్యూహాన్ని బిజెపి సమర్థవంతంగా అమలు చేయలేకపోగా కొత్తగా పార్టీలోకి చేరిన వాళ్లని ఎలా కాపాడుకోవాలనే ఆత్మరక్షణలో భారతీయ జనతాపార్టీ పడిపోయింది. ఇక్కడేకాంగ్రెస్ తన రాజకీయ వ్యూహానికి పదునుపెట్టింది. గతంలో కాంగ్రెస్ నుండి బిజెపిలో చేరిన బలమైన నాయకులను కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలని విజ్ఞప్తి చేయడమే కాదు వారు రావడానికి సిద్ధంగా ఉన్నారనే సంకేతాలు పంపడం ద్వారా ఒక విధంగా కాంగ్రెస్, బిజెపిపై పైచేయి సాధించిందనే చెప్పాలి. బిజెపి, బిఆర్ఎస్‌లోని అసంతృప్త నేతలు తమ పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ పన్నిన రాజకీయ వ్యూహం కాంగ్రెస్‌కి కలిసి వచ్చే అవకాశం లేకపోలేదు. కర్ణాటక శాసనసభ ఎన్నికలలో లింగాయత్ ఒక్కలింగలు ఓబిసిలు దళితులు మైనార్టీలు కాంగ్రెస్‌వైపు మొగ్గు చూపడం వలన కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించగలిగింది. కానీ తెలంగాణలో సామాజిక సమీకరణాలు ఏ ఒక్క రాజకీయ పార్టీకి అనుకూలంగా లేవు. గతంలో అధికార పక్షానికి అనుకూలంగా ఉన్నా ప్రస్తుతం రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు. కొన్ని సామాజిక వర్గాల ఓట్లలో చీలికవచ్చే అవకాశం ఉండటం ముఖ్యంగా మైనార్టీల ఓట్లు ఈసారి జాతీయ ప్రయోజనాల దృష్ట్యాఎక్కువగాకాంగ్రెస్ వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. బిసిల ఓట్లను ప్రసన్నం చేసుకునే పార్టీకి విజయ అవకాశాలు మెరుగుపడే అవకాశం లేకపోలేదు. అందుకే రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు బీసీల ఓట్లపై కన్నేసి బిసి డిక్లరేషన్లను ప్రకటిస్తున్నాయి. రెడ్డి దళిత మైనార్టీ ఓట్లతోపాటు మెజారిటీ బిసి కులాల ఓట్లను పొందగలిగితే కాంగ్రెస్ తన విజయ అవకాశాలను మెరుగుపరుచుకోగలుగుతుంది. రెండు పర్యాయాలు ఒకే ప్రభుత్వం అధికారంలో ఉండటం వలన సహజంగా ప్రభుత్వంపై ఏర్పడే ప్రభుత్వ ప్రజావ్యతిరేకతను ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎదుర్కోవాల్సి రావటమే కాదు గతంతో పోలిస్తే ప్రతిపక్షాలు బలం కూడా పెరిగింది. కాబట్టి మూడోసారి గెలిచి అధికారంలోకి రావడం అధికార పక్షానికి అంత తేలికైన విషయం కాదు. ధరలు పెరగడం నిరుద్యోగం, దళిత బంధు లాంటి పథకంలో అవినీతి డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు, నిరుద్యోగ భృతి విషయంలో ప్రభుత్వం మాట తప్పటం రైతులకు గిట్టుబాటు ధర దొరకకపోవడం కల్లాల్లో పండిన వడ్లను సకాలంలో కొనే నాథుడు లేకపోవడం పరీక్షా పత్రాల లీకు అవినీతి లిక్కర్ కుంభకోణంలో ఆరోపణలు, ధరణి సమస్యలు ఎమ్మెల్యేలపై వస్తున్న అవినీతి ఆరోపణలు ప్రభుత్వ విజయవకాశాలను దెబ్బతీసే అవకాశం లేకపోలేదు. ప్రజలలో అసంతృప్తిని కనిపెట్టిన ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు మొదలుపెట్టింది. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం గ్రామపంచాయతీలకు పెండింగ్ నిధులను విడుదల చేయడం కులవృత్తిదారులకు లక్ష రూపాయలు లాంటి పథకాలు తీసుకొచ్చి వివిధ వర్గాలను సంతృప్తిపరచాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంది.కానీ ఈ ప్రయత్నాలు ఎంతవరకు సఫలీకృతం అవుతాయి అనేది ఎన్నికల వరకు వేచి చూడాల్సిందే. తెలంగాణ శాసనసభ ఎన్నికలు దేశ రాజకీయాలను ప్రభావితం చేసే అవకాశం కూడా ఉంది. తెలంగాణ రాష్ట్రంలో మరొకసారి గెలిచి దేశ రాజకీయాలలో ప్రభావవంతమైన పార్టీగా ఎదగాలని బిఆర్ఎస్ భావిస్తుంది. దక్షిణాదిలో అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం కర్ణాటకను కోల్పోయిన బిజెపి తెలంగాణలో గెలిచి దక్షిణాదిలో విస్తరించాలని భావిస్తుంటే తెలంగాణలో రాష్ట్ర శాసనసభ ఎన్నికలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో గెలిచిన పార్టీకి దేశంలో రాజకీయంగా సానుకూలత ఏర్పడుతుందనటంలో సందేహం లేదు. ●

# ఎన్నికలంటే ఉచితాలు ప్రకటించడమేనా?

రావుశ్రీ

గత దశాబ్దకాలంగా పార్లమెంటు, శాసనసభల ఎన్నికలంటే జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు కేవలం ఉచితాలు, సంక్షేమ పథకాలతోనే ఎన్నికల్లో నిలబడటం, అధికారాన్ని కైవసం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇదేనా స్వాతంత్ర్య సమర యోధులు, రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన స్వయం ప్రతిపత్తి కలిగిన దేశంగా, ప్రతీ ఒక్కరూ ఆత్మాభిమానంతో తలెత్తుకుని నిలబడే భారతదేశమా అని మేధోమథనం చేసే పరిస్థితి నెలకొంది. దేశంలో పేదరికం నిర్మూలనకు, మహిళా అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేయడం మంచిదే కానీ కేవలం అధికారం చేపట్టడానికి అపరిమితమైన ఉచితాలు సంక్షేమ పథకాల పేరుతో కేంద్రంతోపాటు దాదాపు అన్ని రాష్ట్రాలు పీకల్లోతు అప్పులో కూరుకుపోతున్నాయి.ఒక పార్టీకి మించి మరొకటి ఇబ్బడిముబ్బడిగా ఉచితాలు తమ తమ రాజకీయ మేనిఫెస్టోలో పొందుపరుస్తూ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తూ గద్దెనెక్కుతున్నారు. ఈ రకమైన పాలన ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతం ఇస్తుందా అనే ఆలోచన చేయాలి. దేశ ప్రజలు తమ కాళ్లపై తాము స్వతంత్రంగా బతికే పరిస్థితి కల్పించడానికి ముఖ్యంగా విద్య,వైద్యం అదించేందుకు పార్టీలు తమ మేనిఫెస్టోను సిద్ధం చేసుకోవాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలి. కనీస అవసరాలైన కూడు, గూడు, నివాసం అందించే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. అధిక ధరలకు కళ్లెం వేయాలి. అధిక ధరల కారణంగా సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన ఉపాధి లేక పెరిగిన ధరలకు కొనుగోలు చేయలేక సామాన్య, బడుగు వర్గాల ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీదాబిక్కి జనం పెరిగిన తట్టుకోలేక కొన్నిసార్లు పస్తులుండాల్సి వస్తుంది. పర్యావరణ పరిరక్షణకై పాటుపడాలి. పెరుగుతున్న కాలుష్యాలను అరికట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. కాలుష్యాల వల్ల నగరాలను వదిలేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కనుక ముందుగా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే విధంగా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలి. అవినీతిరహిత దేశంగా భారత్‌ను నిర్మించాలి. అవినీతి అధికారులపై చర్యలు చేపట్టాలి. అవినీతిని దేశం నుంచి పారద్రోలేందుకు అవసరమైన అన్ని



చట్టాలు చేయాలి. కేవలం చట్టాలు చేసి చేతులు దులుపుకుంటే సరిపోదు అవి అమలు అయ్యేవిధంగా చర్యలుచేపట్టాలి. రైతులకు వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు కృషి చేయాలి. ముఖ్యంగా పారిశ్రామిక రంగాలు అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలి. ఉత్పత్తి పెంచుట ద్వారానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని గ్రహించాలి. ఎగుమతులు పెరగడం ద్వారా విదేశీ మారకద్రవ్యనిల్వలు పెరుగుతాయి అనిగ్రహించాలి. రెన్యువబుల్ ఎనర్జీవాడకం పెంచాలి. తద్వారా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ జరుగుతుందని, వాటికి ప్రాధాన్యత ఇవ్వాలి. ముఖ్యంగా 2024లో త్వరలో జరిగే వివిధ రాష్ట్రాల శాసనసభల ఎన్నికల సందర్భంగా దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ నిర్మూలనకు, అధిక ధరలు తగ్గించే మార్గాలు ప్రధాన అజెండాగా వివిధ రాజకీయ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించుకోవాలి. భవిష్యత్తులో 500 ట్రిలియన్ డాలర్ల అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, అభివృద్ధి చెందిన దేశంగా భారత్ నిలబడాలంటే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి కృషి చేయాలి. కుల,మత ప్రాంతీయ భాషా లింగ ఆధారంగా ప్రజల మధ్యచిచ్చుపెట్టే సంస్కృతికి స్వస్తిపలకాలి. దేశవ్యాప్తంగా ప్రజల వాస్తవపరిస్థితిని మార్చేవిధంగా ప్రణాళికలు ప్రకటించాలి. పేదరికం, అవిద్య, అనారోగ్యం, అవినీతి వంటి రుగ్మతలపై ఎన్నికల సమర శంఖారావం పూరించాలి. చరిత్ర పాఠాలను తొలగించుట ద్వారా, పేర్లుమార్పు చేయడం ద్వారా దేశ భవిష్యత్తు మారదు అని గ్రహించాలి. ప్రభుత్వరంగ సంస్థలను పరిశ్రమలను కార్పొరేట్లకు ధారాదత్తం చేయడం మానుకోవాలి. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం మానుకోవాలి. ఈ 21వ శతాబ్దంలో ఆధునీకరణ సమాజంలో మనదేశ ప్రజలు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే వారిగా తీర్చిదిద్దాలి. మూఢనమ్మకాలు, అశాస్త్రీయ ఆలోచనలవైపు పయనించేటట్లు చేయరాదు. ముఖ్యంగా యువత, ఓటర్ల విజ్ఞతతో రాబోయే ఎన్నికల్లో తమ భవిష్యత్‌కు భరోసా కల్పించే పార్టీలకు అండగా నిలవాలి. తాత్కాలిక ఉపశమనాలు, ఉద్రేకాలకు లోనుకాకుండా, తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దే వారిని అక్కున చేర్చుకోవాలి. దేశ సంపద కొంతమంది పెట్టుబడిదారుల చేతిలో పెట్టే సంస్కృతికి స్వస్తి చెప్పే పార్టీలవైపు చూడాలి. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక కర్షక లోకానికి యువత, మహిళల అభ్యున్నతికి పాటుపడే రాజకీయ పార్టీలవైపు ఓటర్ల దృష్టి సారించి వారి భవిష్యత్తు కోసం పయనించాలి. ●

# దశాబ్ది తెలంగాణ సంబురాలు

మిద్దె సురేష్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిది వసంతాలు పూర్తి చేసుకుని జూన్ 2న దశాబ్దిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అవతరణ దినోత్సవం సంబురాలు 21 రోజుల పాటు రోజుకు ఒక ప్రత్యేకతతో కార్యక్రమాలు చేయనుంది రాష్ట్ర ప్రభుత్వం. దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు 105 కోట్లు కేటాయించి ఆ ఉత్సవ వేడుకలలో అందరిని భాగస్వామ్యం చేయాలని నిర్ణయించింది. తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయం ఉట్టిపడేలా సంబురాలు ఘనంగా నిర్వహించాలని ప్రణాళిక తయారు చేసింది. ఆనాడు తెలంగాణ ప్రాంతం ఆంధ్ర పాలనలో రాజకీయ, ఆర్థిక, సామాజికంగా వెనుకబడింది. ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి ప్రత్యేక రాష్ట్రం ద్వారానే సాధ్యం అవుతుందని భావించి తెలంగాణ ఉద్యమంలో నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో ముందుకు వెళ్లి, పోరాట అమరులత్యాగ ఫలితంగా రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యమ ఆశయాలను అమలు చేస్తూ వ్యవసాయానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, అతి తక్కువ కాలంలో నిర్మించిన భారీ ప్రాజెక్టు కాళేశ్వరం ద్వారా ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తున్న ఘనత కెసిఆర్‌ది. మిషన్ కాకతీయతో ప్రతిచెరువు, కుంట పునర్నిర్మాణం చేసి నిండు జలకళల కనబడుతూ ఒకప్పుడు నెర్రలు వారిన భూమిని నేడు కృష్ణా,గోదావరి జలాలతో తడుపుతున్నారు. రైతులు యేడాదికి రెండు పంటలు పండిస్తూ రాజులా జీవిస్తున్నారు. రైతులకు ఉచిత 24 గంటల కరెంట్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రతి గింజ రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. రైతులకు ఉచిత ఎరువులు వ్యవసాయ సామాగ్రిలకు రాయితీలు కల్పిస్తుంది. రైతులు పండించిన పంట దాచుకోవడానికి గోదాములు, గిడ్డంగులు, రైతులు సమావేశాలు నిర్వహించుకోవడానికి రైతు వేదికలు ఏర్పాటు చేసింది. రైతుబంధు, రైతు బీమాతో రైతుకు అండగా నిలబడుతుంది తెలంగాణ సర్కారు. రైతును రాజు చేయాలనే లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు క్షేమం గురించి ఆలోచిస్తూ రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను తీసుకువచ్చినప్పుడు రైతులకు మద్దతుగా నిలబడి కేంద్రంతో పోరాడాడు కెసిఆర్. గత పాలనలో రైతుల ఆత్మహత్యలు ఎటు చూసినా బీటలు వారిన నేలతో ఎడారిలా కనబడేది. అప్పటి గొర్లకాపరులు మేపు కోసం పక్క రాష్ట్రాలకు తీసుకువెళ్లిన చరిత్ర ఉంది. అటువంటి పరిస్థితుల నుండి తెలంగాణ సరిహద్దు ప్రాంతాలలో ఇతర రాష్ట్రాల కూలీలు తెలంగాణకు ఉపాధికై వలస వస్తున్నారు. ఒకప్పటి కరవుజిల్లా పాలమూరు నేడు పచ్చని మాగనితో కళకళలాడుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఇంటికి చుట్టాలు వస్తున్నారు అంటే భయమేసేది.




ఎందుకంటే తాగడానికి నీరు కరవు మైళ్లదూరం నడుచుకుంటు మహిళలు తెచ్చుకునేవారు. ఆ రోజులుపోయి నేడు ఇంటింటికి మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిది. మన పరిపాలన మనకే అని మన ప్రాంత నిధులు సంక్షేమ పథకాల రూపంలో ప్రతిఒక్కరికి చేరాలని భావించి కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నేడు అన్ని కులాల వారికి చేయూత అందిస్తూ కుల వృత్తులను ప్రోత్సహిస్తూ ఛైర్మన్‌లను నియమించి, వివిధ కులాల వారికి కార్పొరేషన్, ఫెడరేషన్‌ల ద్వారా రుణాలు మంజూరు చేస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నారు కెసిఆర్. వివిధ మతాల వారిని ఆదరిస్తూ క్రిస్మస్, రంజాన్, బతుకమ్మలకు దుస్తులు పంపిణీ చేస్తూ బోనాలకు నిధులు మంజూరు చేస్తూ అన్ని మతాలను భిన్నత్వంలో ఏకత్వంగా సర్వమతాలను సమానంగా పరిపాలిస్తున్నారు. అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి సోదరభావంతో తెలంగాణలో జీవిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రమైన పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారు. అంటే పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ ముఖ్యచొరవ అని చెప్పవచ్చు. పరిశ్రమల స్థాపన ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక లాభం చేకూరుతుంది. స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. తెలంగాణ ప్రాంతంలో వాతావరణ, విస్తీర్ణపరంగా అనుకూలంగా శాంతియుత వాతావరణం ఉంది. కంపెనీ ఏర్పాటుకు కావాల్సిన పూర్తి అనుమతులను నిర్ణీత సమయంలో ఇస్తుంది తెలంగాణ ప్రభుత్వం. నియామకాల విషయంలో ప్రభుత్వం యుత ఆదర్శంగా జీవించాలంటే చిన్ననాటి నుండే విద్యాబుద్ధులు తప్పనిసరి అనిభావించి గురుకులాలు, మండల్ పాఠశాలలు, ప్రభుత్వబడులలో సకలవసతులు కల్పించి వారికి కార్పొరేట్ బడులకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తుంది తెలంగాణ సర్కార్. శిథిల వ్యవస్థలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, డిగ్రీలను పునర్‌నిర్మాణం చేసింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఉన్నత చదువును అందిస్తుంది. ఆంధ్రపాలనలో అభివృద్ధికి నోచుకోని యూనివర్సిటీలను బలోపేతం చేసి నూతన హంగులతో తీర్చిదిద్దింది రాష్ట్ర ప్రభుత్వం. ఇతర చదువుల కోసం బయటి దేశాలకు వెళ్లే వారికి ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తుంది. తెలంగాణ ప్రాంత ఇంజినీరింగ్ విద్యార్థులకు టీహబ్ ద్వారా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం కూడా యువత ఆర్థికంగా ఎదిగినప్పుడే వారి కుటుంబాలు బాగుంటాయనిభావించి ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీచేస్తుంది. కెసిఆర్ పాలనలో సకల జీవరాసులు మనుగడ సాగిస్తున్నాయి. ముఖ్యమంత్రి కెసిఆర్ తీసుకున్న ప్రతిష్టాత్మక నిర్ణయం హరితహారం దీంతో అటవీ ఉత్పత్తులు పెరగడంతోపాటు వాతావరణ సమతుల్యత ఏర్పడింది. సరైన సమయంలో వర్షాలు రావడంతో భూగర్భజలాలు కూడా పెరిగాయి. నేడు గ్రామాలన్నీ సర్వసుందరంగా తీర్చిదిద్దీ తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత కెసిఆర్‌ది. మహిళలు రాజకీయ, ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి చెందాలని వారికి అనేక సంక్షేమపథకాలు అమలు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్స్ కల్పిస్తుంది. స్థానికసంస్థల ఎన్నికలలో యాభైశాతం రిజర్వేషన్ అమలు చేస్తుంది. మహిళల రక్షణ కోసం షీటీమ్స్‌ను ఏర్పాటు చేసింది. తెలంగాణ ప్రభుత్వం పుట్టిన బిడ్డదగ్గర నుండి వృద్ధులవరకు ఏదోఒకసంక్షేమ పథకం అందుతుంది. బిఆర్ఎస్ సంక్షేమం అందని ఇల్లు లేదు, అభివృద్ధిఫలాలు పొందని ఊరులేదంటే అతిశయోక్తికాదు. తెలంగాణ అమరులఆశయాలకై కెసిఆర్ ముందుకు అడుగులువేస్తున్నారు. ●

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త
శుక్రవారం, 2 జూన్, 2023
5



### ఎండాడలో గడపగడపకు
# మన ప్రభుత్వం కార్యక్రమంలో ముత్తంశెట్టి

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం విశాఖపట్నం, జిల్లా భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావుని సన్మానించి అనంతరం ఎమ్మెల్యేతో కలసి 8వ వార్డు పరిధి ఎండాడలో లబ్ధిదారులకు వారికి లభించిన వివిధ పధకాల పత్రాలను అందజేసి కళింగ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వైఎస్ఆర్సిపీ మహిళా జోనల్ ఇంచార్జి బెందాళం పద్మావతి ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి, వైఎస్ఆర్సిపీ నాయకులు గోపి, ఉమా జోనల్ మున్సిపల్ కమిషనర్ సచివాలయం సిబ్బంది స్థానిక వైసీపీ శ్రేణులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్నది..
# కులాల మధ్య పోరు కాదు, వర్గ పోరాటమే
### ట్విట్టర్ వేదికగా రాజ్యసభ సభ్యులు విజయ సాయిరెడ్డి



విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రా ష్ట్రంలో ఇప్పుడు జరుగుతున్నది కులాల మధ్య పోరు కాదు, ఇది ధనిక, పేద వర్గాల మధ్య పోరాటం అనే వాస్తవాన్ని రాష్ట్ర ముఖ్య మంత్రి, వైఎస్సార్ కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పడం కొందరికి విస్మయం కలిగించింది. చాలా మందికి మింగుడు పడడం లేదు. గడచిన నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలోని పేదలు, దిగువ మధ్య తరగతి, ఇంకా ప్రభుత్వ సాయం, ఆసరా అవసరమైన అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోంది జగన్ గారి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం. అన్ని ఆర్థిక ఇబ్బందులనూ అధిగమించి, ఎంతో మిగతా 11లో

# జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే జనక్షేమం...
### అనకాపల్లి గడపగడపలో మంత్రి అమర్నాథ్ వెల్లడి





7లో

### సరస్వతి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన
# నగర మేయర్ దంపతులు





7లో

### డయల్ యువర్
# పోలీస్ కమిషనర్‌కు 8 ఫిర్యాదులు



7లో

# వైసీపీ మేనిఫెస్టో ఏమైంది.....
### తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత



7లో



### తుపాకీతో
# హల్‌చల్.....!

లాడ్జ్ తనిఖీల్లో గన్‌తో పట్టుబడిన నేరస్తుడు -తుపాకీని మహారాష్ట్ర నుంచి పూరికి చేర్చడానికి ఒప్పందం -మహారాష్ట్రకు చెందిన నిందితుడు అరెస్ట్ -మిగిలిన నేరస్తుల వేటకై పూరీ, జాల్నాలకు ప్రత్యేక బృందాలు



7లో

### జీవీఎంసీ కమిషనర్
# సాయికాంత్ వర్మని కలిసిన ఎమ్మెల్యే వాసుపల్లి




7లో

# ఎన్డీపీఎస్ నేరాలపై ప్రత్యేక నిఘా
### దువ్వాడ, పెందుర్తి పీఎస్‌ల పరిధిలో నలుగురు అరెస్ట్ -21.50కేజీల గంజాయి స్వాధీనం -అసాంఘిక కార్యకలాపాలపై కొరడా -40మందిపై టౌన్ న్యూసెన్స్ కేసులు -సమర్థవంతంగా విజువల్ పోలీసింగ్



7లో

# భూమి కాలువగట్టుపై నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు
### ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటాం : ఇరిగేషన్ ఏఈ లోకేష్



7లో

# వైసీపీకి అంకుశం సినిమా చూపిస్తాం
### తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

వైసీపీకి అంకుశం సినిమా చూపిస్తాం అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన క్యారదర్శి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జ్ బుద్దా వెంకన్న అన్నారు. బయ్యావరంలో మంత్రి అమర్నాథ్ ఎస్సిల భూములు దోచుకున్నారు అని అన్నారు. బయ్యావరం 600ఎకరాల్లో లే అవుట్ వేశారు. 600ఎకరాల లే అవుట్ పై చంద్రబాబు అన్నమాట కు కుట్టుబడి ఉన్నామని చెప్పారు. మంత్రి అమర్నాథ్ నోటి మాట కాదు మేము దస్తాలతో వచ్చి రుజువు చేస్తాం మీరు సిద్ధమేనా అని సవాల్ చేశారు. బయ్యావరంలో స్థలాలను కొని ప్రజలు మోసపోవద్దు మేం అధికారంలోకి వచ్చాక వాటిని రద్దు చేస్తాం మేం అధికారంలోకి వచ్చాక వాటిని రద్దు చేస్తాం. అమరావతి లో చేసినట్టే పేదలకు పంపిణీ చేస్తే స్వాగతిస్తాం దసపల్ల రేడియంట్ హాయగ్రీవ్, యన్‌సిసి భూములు జగన్ పేదలకు ఇస్తే ఉత్తారాంధ్ర ఇన్చార్జిగా నేను వస్తా కృష్ణా జిల్లాలో వైసీపీ కుక్కలకే మేం సమాధానం చెపుతాం అలాంటిది పందిలా బలిసిన తమ్మినేని సీతరాంని వదిలస్తేమా అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూనా రవికుమార్ చేతిలో ఒడిపోతావు అని హెచ్చరించారు. మేం అధికారంలోకి వచ్చాక అంకుశం సినిమాలో మాదిరగా సీతారాంని రౌడీలా కూనా రవికుమార్ రాజశేఖర్ పాత్రలా నడిపిస్తాం టీడీపీ నుంచి వైసీపీ వెళ్లిన వాళ్లే ఆక్రోశంతో చంద్రబాబుపై మాట్లాడుతూన్నారు. అవినాస్ రెడ్డి విషయంలో న్యాయ వ్యస్థల్ని జగన్ ని మేనేజ్ చేశారా. సునీతా రెడ్డి వెల్లపోయినా నేను సుప్రీంకోర్టు కు వెళ్తా వైస్ వివేకానందరెడ్డి మర్డర్ ని అడ్డుపెట్టుకుని 2019ఎన్నికల్లో టీడీపీ పై బురద చల్లారు. టీడీపీ పై అభియోగం మెసి జగన్ అధికారంలోకి వచ్చాడు జగన్ ముందస్తుకు వెళ్తారా వెనకస్తుకి వెళ్తారా అనేది ఆయన ఇష్టం అని వ్యంగంగా అన్నారు. ఎన్నికలు ఎప్పుడు పెట్టిన టీడీపీ సూపర్ మోజారిటీ గెలవడం ఖాయం అని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పులివెందలతో సహా 175 స్థనంలో గెలుస్తాం లోకేష్‌బాబు పాదయాత్రతో వైసీపీ కి వణుకు పుడుతుంది పాదయాత్ర లో లోకేష్ ఇమేజ్ వంద రేట్లు పెరిగింది అని అన్నారు. జగన్ పరిస్థితి దేరా బాబాలా తయారుకానుంది. నేను చంద్రబాబు కు విధేయుడిని నేను విజయవాడ వెస్ట్ లోనే పోటీ చేస్తా అని విలేఖరి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. లేదా మా నాయకుడు ఎక్కడ చెపితేలక్కడ పోటీ చేస్తా అని అన్నారు.

# విశాఖ పోర్టు రెండు సరికొత్త రికార్డులు



7లో

# జీవీఎంసీ సీసీపీగా సునీత
### సీఆర్‌డీఏకు సురేష్ బదిలీ -వుడా సీసీపీగా సంజయ్

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

మహావిశాఖ నగర పాలన సంస్థ సీసీపీ (చీఫ్ సిటీ ప్లానర్) గా వి సునీత రానున్నారు. ఈ మేరకు మున్సిపల్, పట్టాణా భివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న బి సురేష్‌కుమార్ సీఆర్‌డిపీ అదనపు కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్నారు. సునీత విశాఖలో గతంలో డిసీసీగా కూడా పనిచేశారు. సీసీపీ సురేష్ నెలరోజుల పాటు సెలవుపై వెళ్లినప్పుడు కూడా సునీత ఇన్‌చార్జిగా ఉన్నారు. అదే విధంగా టౌన్‌ప్లానింగ్ అదనపు డైరెక్టర్ వీఎంఆర్‌డిఏ కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో టౌన్‌ప్లానింగ్ డీడీ, జీవీఎంసీ డిసిపీ కె సంజయ్ రత్నకుమార్‌ను వేశారు. ఈ మేరకు అధికారులు తక్షణమే ఆయ విభాగాల్లో చేరాలన శ్రీ లక్ష్మి తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# విశాఖలో రౌడీషీటర్ దారుణ హత్య
### కత్తులతో తెగ నరికిన దుండగులు -ఉషోదయ జంక్షన్ వద్ద ఘటన -మృతుడు క్రాంతిపై ఎంవీపీ పీఎస్‌లో పలు కేసులు -రంగంలోకి దిగిన పోలీసులు ... కేసు దర్యాప్తు



7లో

## ఆగమోక్తంగా స్వాతి నక్షత్రం హోమం



పెందుర్తి జూన్ 1, ప్రభాతవార్త

సింహాద్రినాథుని ఆవిర్భావ నక్షత్రమైన స్వాతి నక్షత్రం పర్వదినం సందర్భంగా గురువారం నృసింహహోమం ఆగమోక్తంగా జరిగింది. సింహచలేశుని ప్రతినిధిగా యజ్ఞమూర్తి చక్రానారాయణులను యాగశాలలో అధిష్టింపజేసి అర్చకులు విశేష హోమం, పూర్ణాహుతి జరిపించారు. ఆర్జిత సేవగా నిర్వహించిన స్వాతిహోమం లో భాగస్వాములైన భక్తులకు హోమ ప్రసాదం ,శేషవస్త్రాలు అందజేసి అర్చకులు ఆశీర్వదించారు. అనంతరం వీరందరికి అంతరాలయ దర్శనభాగ్యము కల్పించారు.

## సింహాద్రినాథుని దర్శించుకున్న హైకోర్టు ఛీఫ్‌జస్టిస్



పెందుర్తి జూన్ 1, ప్రభాతవార్త

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఏవీ.శేషసాయి గురువారం శ్రీవరహలక్ష్మినృసింహస్వామివారిని దర్శించుకున్నారు.ఇవో త్రినాధ్‌రావు అర్చక పెద్దలతో కలిసి చీఫ్ జస్టిస్ కి పూర్ణకుంభంతో సంప్రదాయంగా స్వాగతం పలికారు. కప్పస్థంబం ఆలింగనం చేసుకున్నారు.కుటుంబ సభ్యులకు వేద పండితులు ఆశీర్వదం చేశారు. ఈవో స్వామివారి శేషవస్త్రం ,ప్రసాదాలను అందించారు.

## అడవివరం గ్రామదేవతల పండుగ తేదీలు ఖరారు

### 6న ముత్యాలమ్మ పండుగ ,13న పైడితల్లిమ్మ పండుగ



పెందుర్తి జూన్ 1 ప్రభాతవార్త

అడవివరం గ్రామదేవత వార్షిక పండుగ తేదీలను దేవస్థానం, అమ్మవార్ల పూజారుల వంశీయులు ప్రకటించారు. సింహచలేశుని సోదరిగా ఏడు గ్రామల ప్రజల ఆరాధ్య దేవత పైడితల్లిమ్మవారి పండుగ జూన్ 13,ముత్యాలమ్మ వారి పండుగ జూన్ 6న నిర్వహించనున్నట్లు గురువారం జరిగిన గ్రామ సభలో దేవస్థానం ఏఈవో నక్కాన ఆనందకుమార్, పూజార్లు వంశీయుడు లండ. వెంకటరమణ ప్రకటించారు. నాలుగో తేదీ ఆదివారం పైడితల్లిమ్మవారి పండుగ చాటింపు వేయడం జరుగుతుందన్నారు. 5వ తేదీన అమ్మవార్ల దేవేరులను తీసుకురావడం జరుగుతుందన్నారు. 6, నముత్యాలమ్మ వారి అనుపు, 12న పైడితల్లిమ్మవారి తోలేళ్ల వేడుక, 13 అనుపు మహోత్సవం నిర్వహించనున్నట్లు ప్రకటన చేశారు. పండుగ ఏర్పాట్లులో దేవస్థానం పూర్తి సహకారం అందించాలని గ్రామస్థులు కోరారు. పైడితల్లిమ్మ, బంగారమ్మవార్ల వార్షిక ఆదాయాన్ని పండగ ఖర్చులను దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ ప్రకటించారు. గ్రామం ప్రధాన వీదుల్లో విద్యుత్తు దీపాలంకరణ విస్తృతంగా చేయాలని గ్రామస్థులు కోరారు. సాయంత్రం వరకు భక్తులకు ఉచిత ప్రసాదం అందించాలని కోరారు. ఈ మేరకు స్పందించిన ఏఈవో ఈ ప్రతిపాదనలు ఈవోతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. పండుగ ఖర్చును 10 లక్షలకు పెంచాలని గ్రామస్థులు కోరారు. సత్తెమ్మ తల్లి ఆలయం అలంకరణ కూడా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 98వార్డు కార్పోరేటర్ పిసిని.వరహనరసింహం తో పాటు పాశర్ల. ప్రసాద్, కోలుసు. ఈశ్వరరావు, యర్ర.వరహనరసింహం, దేవస్థానం అధికారలు పాల్గొన్నారు.

## బీసీ నాయకుడు సర్పంచ్ వెంకటరమణను

### కలిసిన మాజీఎమ్మెల్యే వంగలపూడిఅనిత



పాయకరావుపేట, జూన్ 1 ప్రభాతవార్త

మండలంలోని వెంకటనగరం గ్రామానికి చెందిన బీసీనాయకుడు ఆగ్రామసర్పంచ్ వంకావెంకటరమణను మాజీఎమ్మెల్యే వంగలపూడిఅనిత ఆగ్రామానికి వెళ్ళికలిసారు. బీసీనేతలను గుర్తించని అనితపై బీసీనాయకుల గుర్రు అనే శీర్షికతో ప్రభాతవార్తలో ప్రచురితమైన విషయం తెలిసిందే. ప్రభాతవార్తలో వచ్చిన వార్తపై స్పందించిన అనిత సర్పంచ్ వంకారమణను కలిసి బీసీలకు తెలుగుదేశంపార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎలాంటి అపోహలు వద్దని తనతో అనిత చెప్పినట్లు వంకారమణ ప్రభాతవార్తకు తెలిపారు. పాయకరావుపేటలో బీసీలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బీసీలను అన్నిపార్టీపదవుల్లోనూ అర్హులను చేస్తూ గుర్తించాలని కోరినట్లు రమణ చెప్పారు. మాజీఎమ్మెల్యే అనితకు తమ మద్దత్తు ఎప్పుడూ ఉంటుందని అన్నారు. బీసీలను తెలుగుదేశంపార్టీ ఓటుబ్యాంకుగా మలచుకోవాలని బీసీలకు తమపార్టీపై నమ్మం ఏర్పడాలని అందుకు మాజీఎమ్మెల్యే అనిత కృషిచేయాలని కోరినట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ పుట్టినప్పటినుంచి ఆపార్టీ గెలుపుకోసం తమకుటుంభం ఎంతో కృషిచేస్తుందని బీసీలు టిడిపి వైపు ఉన్నందునే టిడిపి ఎప్పుడూ ఈప్రాంతంలో గెలుస్తూ వచ్చేదని రమణ అన్నారు. ఈసారి ఎన్నికల్లో కూడా బీసీలంతా టిడిపి వైపే ఉండేందుకు మాజీ ఎమ్మెల్యే అనిత సహకారంతో కృషిచేస్థానని అన్నారు. ఒకసారి టిడిపిలో ఉన్న గ్రూపుతగాదాల వల్ల మాజీ ఎమ్మెల్యే అనితకు ఈనియోజకవర్గంలో నష్టంవాటిల్లిందని మళ్ళీ ఆమెకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు నియోజకవర్గంలో ఉన్న కొన్నిలోపాలను అనిత దృష్టికి తీసుకువెళ్ళామే తప్ప ఆమె గెలుపుకు తాము ఎప్పుడూ వెన్నంటే ఉంటామని రమణ అన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల, పట్టణపార్టీల అధ్యక్షులు పెదిరెడ్డిచిట్టిబాబు, పెదిరెడ్డిశ్రీను, కంకిపాటి వెంకటేశ్వరరావు, రమాకుమారి, జూరెడ్డిప్రసాద్, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## హైమా నేత్రాలయంలో గ్లకోమా పేషెంట్‌లకు అవసరమయ్యే

### ఏకలేజర్ ప్రారంభించిన ఎమ్మెల్యే గొల్లబాబూరావు



పాయకరావుపేట, జూన్ 1 ప్రభాతవార్త

పాయకరావుపేట హైమానేత్రాలయం సూఫర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో రూ10లక్షలతో ఏర్పాటుచేసిన ఏకలేజర్ మిషన్‌ను గురువారం పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్లబాబూరావు చేతులమీదుగా ప్రారంభించారు. నీటికాసులు (గ్లోకోమా) వ్యాదులున్న వారికి ఆఫరేషన్ అయినతరువాత లెన్సు శుభ్రంచేసేందుకు ఏకలేజర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్న విషయాన్ని హైమానేత్రాలయం వైద్యాధికారి శివరాజప్రసాద్ ద్వారా ఎమ్మెల్యే తెలుసుకున్నారు. అనంతరం తుని డిగ్రీ సిక్సుసిమ్ 11మంది విద్యార్ధినులు హైమానేత్రాలయంలో నిర్వహించే కంటిపరీక్షలు అలాగే లేబ్‌లో పరికరాల వినియోగంపట్ల విషయంపరిజ్నానం అవగాహన పెంపొందించేందుకు వీరు వస్తున్నట్లు డాక్టర్ శివరాజప్రసాద్ తెలియచెయ్యడంతో ఎమ్మెల్యే గొల్లబాబూరావు వీరందరినీ అభినందించారు. వైకాపా శ్రేణులు ఆధ్వర్యంలో డాక్టర్ శివరాజప్రసాద్ ఎమ్మెల్యే గొల్లబాబూరావుకు మెమెంటో ఇచ్చి శాలువాతో సత్కరించారు. అనంతరం డాక్టర్ శివరాజప్రసాద్ ఎమ్మెల్యే గొల్లబాబూరావుకు కంటిపరీక్షలు చేసారు. నేత్రాలయంలో ఆరోగ్యశ్రీద్వారా నిరుపేదలకు అందుతున్న సేవలను క్లుప్తంగా తెలియచేసారు. నిస్వార్ధంగా చేస్తున్న ఉచితకంటిఆఫరేషన్‌ల సేవలపట్ల డాక్టర్‌శివరాజప్రసాద్‌ను ఎమ్మెల్యే గొల్లబాబూరావు ప్రశంసించారు. ఈకార్యక్రమంలో వైకాపామండలపార్టీఅధ్యక్షులు ధనిశెట్టిబాబూరావు, జెడ్పీటిసి లంకసూరిబాబు, జిల్లాపబ్లిక్‌వింగ్‌అధ్యక్షులు దగ్గుపల్లిసాయిబాబా, వైకాపానాయకులు గారాప్రసాద్, జగతాశ్రీను, కేశనకుర్తిసత్తిబాబు, జెశ్రీను, విశ్రాంతి ఉపాధ్యాయులు పసగడుగులఅప్పన్న, ఆరోగ్యమిత్ర కమల, అడపాసూర్యప్రకాష్ హైమానేత్రాలయం వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.



## ఎంఎస్ఎన్ ల్యాబ్‌కు ఎంపికైన శ్రీప్రకాష్ విద్యార్థులు



పాయకరావుపేటరూరల్, జూన్ 1 ప్రభాతవార్త

పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యాసంస్థల అనుభందసంస్థ స్పెసెస్ డిగ్రీకళాశాలనందు గతనెల 31వతేదీన హైదరాబాద్ ఎంఎస్ఎన్ ల్యాబ్ వారిచే క్యాంఫస్ ప్లేస్మెంట్ డ్రేవ్ నిర్వహించారు. సుమారు100మంది విద్యార్థులు పాల్గొన్న ఈప్లేస్మెంట్ డ్రైవ్‌లో 29మంది విద్యార్థులను ఎంఎస్ఎన్ లేబ్సు ప్రతినిది కిరణ్‌కుమార్ ఎంపికచేసారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా విదులు నిర్వహిస్థారని కళాశాలప్రిన్సిఫాల్ డాక్టర్ కెవీరాజు తెలియచేసారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం సిహెచ్‌వికె నరసింహారావు, సంయుక్తకార్యదర్శి విజయప్రకాష్ అభినందనలు తెలియచేసారు. ఈకార్యక్రమంలో కెమిస్ట్రీహెచ్‌ఓడి శివగంగాధర్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయునిపై దాడి-ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

పాయకరావుపేట, జూన్ 1 ప్రభాఇతవార్త

బృందావనంనకు చెందిన పల్లాశ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడిపై ఇద్దరువ్యక్తులు దాడిచేసిన సంఘటనలో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కధనం ప్రకారం మెయిన్‌రోడ్‌పై దాసరిబాబ్జి షాపువద్ద సైకిల్‌పై శ్రీనివాస్ రోడ్ క్రాస్ చేస్తుండగా కారుడ్రెవింగ్ చేస్తూ సైకిల్‌ను ఢీకొట్టారు. దీంతో శ్రీనివాస్ క్రిందపడిపోయాడు. క్రిందపడిపోయిన శ్రీనివాస్‌ను కొసిరెడ్డిరాకేష్, అనిల్ అనే ఇద్దరు వ్యక్తులు కారుదిగివచ్చి దాడిచేసి ముఖంమీద తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన ఉపాధ్యాయుడు ఆర్‌ఎస్‌ఎస్‌లో సభ్యుడు. శ్రీనివాస్ ఇచ్చిన పిర్యాదుమేరకు రాకేష్, అనిల్‌పై ఎస్‌ఐరమేష్ కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళా శక్తి పథకంపై టిడిపి మహిళలు హర్షం



పాయకరావుపేట, జూన్ 1 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదలచేసిన మేనిఫెస్టోలో మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యతపై నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు రమాకుమారి హర్షం వ్యక్తంచేసారు. గురువారం విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళాశక్తి పేరుతో మహిళలకు కురిపించిన వరాలు మహిళలు మర్చిపోలేనివని అన్నారు. ఆడబిడ్డ నిధిక్రింద 18ఏళ్లుదాటిన ప్రతిమహిళకు నెలకు రూ1500 నగదు ఇవ్వడమే కాకుండా జిల్లావ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు మహిళలకు ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించడం మహిళలు మర్చిపోలేమన్నారు. అలాగే ఏడాదికి మూడుసిలిండర్లు ఉచితంగా ఇవ్వడం చంద్రబాబునాయుడికి మహిళలపట్ల ఉన్న అభిమానానికి నిదర్శనంగా చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసి వేములపూడి సూర్యావతి, వార్డుమెంబర్ పెదిరెడ్డిపద్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు సంఘం ఆర్థికసహాయం



పాయకరావుపేటరూరల్, జూన్ 1 ప్రభాతవార్త

బాదితుల కుటుంబాలకు శ్రీశాయిశ్యామలా పాయకరావుపేట, తుని మేషనరీపనివారల సంఘం ఆధ్వర్యంలో సహాయం అందచేసినట్లు ఆసంఘం అధ్యక్షులు మజ్జూరినారాయణరావు గురువారం తెలియచేసారు. సంఘంనకు సంభందించి మృతిచెందిన మేస్త్రికుటుంబానికి అలాగే గాయపడిన మరో మేస్త్రి కుటుంబాలకు రూ10వేలు అలాగే రూ5వేలవంతున వారి కుటుంబాలకు సంఘం తరుపున సహాయం అందచేసినట్లు మజ్జూరినారాయణరావు ఈసంధర్భంగా తెలియచేసారు. ఈకార్యక్రమంలో కూంద్రపుచంటి, చంద్రాశ్రీనివాసరావు, గంటావెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## అర్హత ఉన్న రైతులందరికీ రైతు భరోసా లబ్ధి

నక్కపల్లి, జూన్ 1 ప్రభాతవార్త

అర్హత ఉన్న రైతులు అందరికీ వ్యవసాయానికి పెట్టుబడి నిమిత్తం వరుసగా 5వ. సంవత్సరం మొదటి విడతగా మండలంలో 12 వేల 298మంది రైతులకు గాను 9 కోట్ల 22 లక్షలు రైతుభరోసా లబ్ధి చేకూరనుంది. రైతులు అందరికీ రెండు మూడు రోజులలో లబ్ధి ఆధార్‌కి అనుసంధానంతో ఉన్న బ్యాంకు ఖాతాలో జమఅవుతాయి. అలాగే పచ్చిరొట్ట అలాగే వరివిత్తనాలు కావాల్సిన రైతులు దగ్గరలో ఉన్న రైతుభరోసా కేంద్రానికి వెళ్ళి రిజిష్టర్ చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారి ఉమాప్రసాద్ తెలియచేసారు.

## ఉపాధి కూలీల సమస్యలు నెరవేర్చాలి



నక్కపల్లి, జూన్ 1 ప్రభాతవార్త

జాతీయ ఉపాధి హామీకూలీలకు కేంద్రప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచాలని సంవత్సరానికి 200రోజులు పనికల్పించాలని కోరుతూ గురువారం నక్కపల్లి మండలంలో చందనాడగ్రామంలో ఉపాధి కూలీలతో ఎపి రైతుసంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పల రాజు ప్రజానాట్యమండలి జిల్లాఅధ్యక్షులు ఎంరాజేష్‌లు సమావేశం నిర్వహించారు. ఈసంధర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జాతీయగ్రామీణ ఉపాధి హామీపధకాన్ని నిర్వీర్యంచేసే విధంగా చట్టంలో ఉన్న సదుపాయాలను తగ్గించేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. గత బడ్జెట్‌లో 1లక్షకోట్లు కేటాయించారని ప్రస్తుతం కూలీలసంఖ్య పెరిగిందన్నారు. కూలీలు పనులులేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కూలీల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని సంవత్సరానికి 200రోజులపని కల్పించాలన్నారు. రోజువేతనం 600రుపాయలు చేయాలన్నారు. ఈడిమాండ్లు నెరవేర్చేవిధంగా ప్రభుత్వంపై పోరాటానికి సిద్దంకావాలని అప్పలరాజు పిలుపుఇచ్చారు.

## 75వ వార్డులో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



గాజువాక, జూన్1, ప్రభాతవార్త

జీవీఎంసీ 75వ వార్డు చిన కోరాడ గ్రామ పెద్ద, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు టేకేటి అప్పారావు ప్రజలకు చల్లని మజ్జిగ అందించాలని చిన కోరాడ గ్రామంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్య అతిధిగా మాజీ ఎమ్మెల్యే, విశాఖ పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, 75వ వార్డు కార్పొరేటర్ శ్రీమతి పులి లక్ష్మీభాయి వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ ఎండాకాలంలో ప్రజలకు చల్లని మజ్జిగ అందించాలనే ఉద్దేశ్యంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన అప్పారావుని మిగతా వారిని అభినందించారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకటరమణారెడ్డి, టేకేటి పెంటయ్య, పెద్దాడ సోమునాయుడు, పెద్దాడ అప్పలస్వామి, ములకలపల్లి పెంటయ్య, దొమ్మేటి పెరుమాళ్, అప్పారావు, బస అప్పలరెడ్డి, రమణ, మూర్తి, రాజు, పెంటయ్య, అప్పారావు పాల్గొన్నారు.

## 87వ వార్డులో అభివృద్ధి పనులకు మేయర్ చేతుల మీదుగా శంకుస్థాపన

గాజువాక, జూన్1, ప్రభాతవార్త



జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వార్డు కార్పొరేటర్ బొండా జగన్ పాల్గొని వారి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. వార్డులో శ్మశానవాటిక, సీసీరోడ్లు, ప్రహరీగోడ నిర్మాణం పనులకు శంకుస్థాపన జరిగింది. అనంతరం వార్డులో సమస్యలను మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించి వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజన్‌రాజు, డీవీ అప్పారావు, కె.శ్రీనివాసవర్మ, కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, దుగ్గపు దానప్పలు, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, జెడ్సీ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## పెదగదిలిలో మేయర్ పర్యటన

### అర్బన్ హెల్త్ సెంటర్లు వినియోగించుకోండి - వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శనీయం, అర్హులకు పెన్షన్లు అందజేసిన మేయర్



ఆరిలోవ, జూన్ 1, ప్రభాతవార్త

మీ అందరికీ పెన్షన్లు అందుతున్నాయా.. సుదూరాలకు వెళ్లకుండానే మీ ప్రాంతంలోనే అర్బన్ హెల్త్ సెంటర్లున్నాయి. మీకు గాని మీ బంధువులకు గాని ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే దగ్గరలో ఉన్న హెల్త్ సెంటర్లుకు వెళ్ళి మీ ఆరోగా య్నని పరీక్షించుకొని హెల్త్ సెంటర్లు ఉపయెగించుకోవాలని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. తన స్వగ్రామంలో గురువారం పర్యటించి అర్హులకు ఆమె చేతుల మీదుగా పెన్షన్లు అందజేశారు. వేకువజామునే పెన్షన్లు అందుతున్న తీరును తెలుసుకున్నారు. అనంతరం పెదగదిలి చెందిన రాజులమ్మ అనే వృద్ధురాలికి వృద్ధాప్య పెన్షన్, తవుడమ్మ అనే మహిళకు వితంతు పెన్షన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటవ తేదీనే ఠంచన్‌గా తెల్లవారి ఆరింటికే పెన్షన్ అందిస్తుండడంలో సీఎం జగర్ తీరు అద్భుతమన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందజేస్తున్న వాలంటీర్ల పనితనాన్ని ఆమె మెచ్చుకున్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌కు మనమంతా కృతజ్ఞతలు చెప్పకోవాలని కోరారు.

## దోమ తెరలు వాడకంతో మలేరియా నివారించవచ్చును...



ముంచంగిపుట్టు, జూన్ 1, ప్రభాతవార్త

మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని కిలగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.రమేష్ అన్నారు. మండలంలో గల కిలగాడ పీహెచ్‌సీలో గురువారం వైద్య సిబ్బంది మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మలేరియా వ్యాధిపై మలేరియా నివారణ కోసం గ్రామాల్లో గిరిజనులు వైద్య సిబ్బంది సూచనలు తప్పకుండా పాటించాలని, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు బారిన పడకుండా ఉండాలని నిత్యం గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని రానున్న ఎపిడమిక్ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి శిరీష, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్లు వేదవతి, కృష్ణవేణి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నాయకులు తిల్లి సోర్రు భౌతికకాయానికి మాజీ మంత్రి కిడారి ఘన నివాళి



ముంచంగిపుట్టు, జూన్ 1, ప్రభాతవార్త

అరకు నియోజకవర్గం ముంచంగిపుట్టు మండలం పెద గూడ పంచాయితీ గతుంమాల్డా గ్రామంలో టీడీపీ నాయకులు తిల్లి సోర్రు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ గతుంమాల గ్రామంలో చేరుకుని తిల్లి సోర్రు భౌతికకాయాని పూలమాల వేసి ఘన నివాళి అర్పించిన అనంతరం తిల్లి సోర్రు కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని నింపి ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని ధైర్యంగా ఉండాలని మాజీ మంత్రి భరోసా ఇచ్చారు. మాజీ మంత్రి వెంట అరకు పార్లమెంట్ ఆర్గనైజర్ సెక్రటరీ పాంగి శాస్త్రిబాబు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజర్ సెక్రటరీ సాగర సుబ్బారావు, దారేల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, టీడీపీ సీనియర్ నాయకులు నీలకంఠ పాత్రో, మండి కిషోర్ కుమార్, కిల్లో లైకోన్, పెల్లమల చిరంజీవి, సదానందం, చిన్ని, ఐటీడీపి కో-కన్వీనర్ ఉబ్బటి శివ సాగర్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్బీకెలో సబ్సిడీపై విత్తనాలను పంపిణి చేసిన ఎంపీపీ

### ప్రభుత్వ అందిస్తున్న రాయితీ విత్తనాలను అందరూ సద్వినియోగం చేసుకోండి : ఎంపీపీ బోయిన కుమారి



గూడెంకొత్తవీధి, జూన్ 1, ప్రభాతవార్త

మండలంలో జీకేవీధి పరిధిలోగల ఆర్బికే కేంద్రంలో ఎంపీపీ బోయిన కుమారి ఆధ్వర్యంలో సబ్సిడీ ద్వారా రైతులకు విత్తనాలు పంపిణీ చేయడం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ బోయిన కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న 90% రాయితీ విత్తనాలను మండలంలో ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులకు అవసరమాయ్యే విత్తనాలు అందుబాటులో ఉన్నాయని త్వరలో వేరుశనగ రైతులకు అవసరమైన పలురకాల అందుబాటులోకి రానున్నాయని ఎంపీపీ అన్నారు. రైతులకు పంటలకు అవసరమైన సలహాలు సూచనలు ఆర్బికే కేంద్రానికి సంప్రదించి తెలుసుకోవాలని సూచించారు. జగనన్న ప్రభుత్వం అధికారంలో రైతులకు రైతు భరోసా ఇవ్వటంతో పాటు రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తూ సబ్సిడీ రుణాలతో పాటు ఆర్బికే కేంద్రాల ద్వారా పంటలకు అవసరమైన సలహాలు సూచనలు. పంట నష్టపోకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవడం కోసం అగ్రికల్చర్ అసిస్టెంట్ కూడా నియమించడం జరిగింది. కాబట్టి మన ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సేవలను కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు అరుణ్ కుమార్, ఏఎంసీ డైరెక్టర్ ఇర్మియా, రైతు భరోసా కేంద్ర ఇన్‌చార్జి బాలకృష్ణ, అగ్రికల్చర్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

## యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌కు బదిలీ...!

యలమంచిలి, జూన్ 1 ప్రభాతవార్త

యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేయుచున్న తోట కృష్ణవేణి పిఠాపురం బదిలీ అయినట్లు సమాచారం. గురువారం రాష్ట్రంలో పలు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీనిలో యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న తోట కృష్ణవేణి పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.

## ఆక్రమణలు తొలగించేందుకు అధికారుల చర్యలు



యలమంచిలి, జూన్ 1, ప్రభాతవార్త

యలమంచిలి పట్టణంలో మెయిన్ రోడ్డు నుండి గర్ల్స్ స్కూల్ మీదుగా భూలోకమాంబ గుడి సమీపం వరకు 30 అడుగుల రోడ్డును ఆక్రమణలకు గురవడంతో వాటిని తొలగించేందుకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా రోడ్డు పక్కన పెట్టిన బడ్డీలను తొలగించేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం నుండి చర్యలు చేపట్టారు. ముందుగా ఆ క్రమంలో పెట్టిన వారికి హెచ్చరికగా రెండు రోజుల్లో ఖాళీ చేయాలని తెలియజేశారు. లేని పక్షంలో మున్సిపాలిటీ వారు ఆ క్రమంలోనూ తొలిగిస్తారని హెచ్చరికలు జారీ చేశారు.

## పోలవరం నిర్వాసితుల డిమాండ్ల సాధనకై జరిగే పాదయాత్రకు సన్నద్ధం కండి



వి.ఆర్.పురం, జూన్ 1, ప్రభాతవార్త

పోలవరం ప్రాజక్ట్ నిర్వాసితుల న్యాయమైన డిమాండ్ల సాధన కొరకు ఈ నెల 20వ తేదీ నుండి జరిగే పాదయాత్రకు సిద్ధం కావాలని, సిపిఎం మండల కార్యాదర్శి సోయం చిన్న బాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని అడవివెంకన్న గూడెం గ్రామంలో, సిపిఎం సీనియర్ నాయకులు కుంజా నాగిరెడ్డి అధ్యక్షతన, పోలవరం నిర్వాసితుల పాదయాత్ర సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో పాదయాత్ర విధివిధానాలను చర్చించారు. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడారు. గత ఏడాది సంభవించిన గోదావరి వరదలకు వరద బాధితులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సమస్యల పట్ల పోరాడితే తప్ప ఈ పాలక ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకునే పరిస్తితి లేదన్నారు. 20వ తేదీ పాదయాత్ర ప్రారంభమై ముంపు గ్రామాల మీదుగా 20 రోజులపాటు కొనసాగి విజయవాడకు చేరుతుందన్నారు. పాదయాత్రలో నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల నాయకులు వడ్లాది రమేష్, కుంజా సుధీర్, కారం బుచ్చమ్మ, కారం వెంకటయ్య, దేశయ్య, కారం వీరయ్య, జానకిరామ్, కారం సత్యం పాల్గొన్నారు.

## ఏడుగురాళ్లపల్లిలో అగ్ని ప్రమాదం



మోతుగూడెం, జూన్ 1, ప్రభాతవార్త

ఏడుగురులపల్లిలో చర్చికి సంబంధించిన తాటాకు ఇల్లు పూర్తిగా కాలిపోయింది బట్టలు గిన్నెలు మంచాలు, బీరువా, కిరాణా సామాన్లు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. ఆ ఇంట్లో ఉన్న వాళ్ళు మొత్తం మూడు రోజుల క్రితం ఊరికి వెళ్లడం జరిగింది. ఆ తాటాకు ఇల్లు వెనక తాడిచెట్లకి ఎవరో గుర్తుతెలియని వ్యక్తి నిప్పు పెట్టడంతో చెట్లతోపాటు ఇల్లు కూడా అగ్ని ప్రమాదానికి గురైనది. సుమారు లక్ష రూపాయలు ఆస్తినష్టం జరిగి ఉంటుందని సమాచారం.

## విశాఖ పోర్టు రెండు సరికొత్త రికార్డులు

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

గత రికార్డులను తిరగరాస్తు విశాఖపట్నం పోర్టు అధారిటీ మే 2023లో రెండు సరికొత్త రికార్డులను నెలకొల్పింది. కంటైనర్ టెర్మినల్‌లో ఒకే నెలలో అత్యధిక కంటైనర్లను హ్యాండిల్ చేసిన ఘనతను సాధించింది. విశాఖపట్నం పోర్టు అధారిటీ పరిధిలో బీవోటి/ పిపిపి ఆపరేటర్‌గా ఉన్న విశాఖ కంటైనర్ టెర్మినల్‌లో మే నెలలో అత్యధికంగా 61468 టియుఈ (టియుఈఎస్)ల కంటైనర్లను హ్యాండిల్ చేసింది. మార్చి 2023లో హ్యాండిల్ చేసిన 56578 టియూఈల కంటైనర్ల హ్యాండ్లింగ్ మాత్రమే ఇప్పటివరకు రికార్డుగా ఉంది. విశాఖ కంటైనర్ టెర్మినల్ పొడవు 390మీ, వెడల్పు 42మీ. గా 16మీ డ్రాఫ్ట్‌ను కలిగి ఉంది. మే 2023లో 49 కంటైనర్ నౌకలను హ్యాండిల్ చేయడం ద్వారా విశాఖ కంటైనర్ టెర్మినల్ మరో మైలురాయిని అధిగమించింది. ఒకే నెలలో అత్యధిక కంటైనర్ నౌకలను హ్యాండిల్ చేసిన రికార్డును తిరగరాసింది. ఏప్రిల్ 2023లో విశాఖ కంటైనర్ టెర్మినల్‌లో 42 కంటైనర్ షిప్పులను హ్యాండిల్ చేసింది. ఇప్పటివరకు ఇదే ఒక నెలలో అత్యధిక కంటైనర్ నౌకలను హ్యాండిల్ చేసిన రికార్డుగా ఉంది. విశాఖపట్నం పోర్టు నూతన రికార్డులను సాధించటం పట్ల పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు పోర్టు సిబ్బందిని, టెర్మినల్ ఆపరేటర్‌ను ప్రశంసించారు. పోర్టు సిబ్బంది కలిసికట్టుగా పనిచేయటం ద్వారా మరిన్ని కొత్త రికార్డులను తిరగ రాయవచ్చని పోర్టుచైర్మన్ ఈ సందర్భంగా ఉద్యోగులకు సూచించారు.

# జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే జనక్షేమం... అనకాపల్లి గడపగడపలో మంత్రి అమర్నాథ్ వెల్లడి

విశాఖపట్నం జూన్ 1, ప్రభాతవార్త

జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం లోనే జనం క్షేమంగా మనగలుగుతున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. స్థానిక 83వార్డులోని లక్ష్మీదేవి పేటలో కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మీ రమేష్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ పాల్గొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను లబ్ధిదారులకు అందజేసి వారి బాగోగులను తెలుసుకున్నారు. 83వ వార్డులోని అన్నపూర్ణ బ్యాంక్ రోడ్డు మిరియాల కాలనీ కాలనీ మూడో వీధిలోని 76లక్షల రూపాయలతో నిర్మించి తలపెట్టిన ఆర్సీసీ కల్వర్ట్స్ నిర్మాణానికి మంత్రి అమర్నాథ్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాల వారిని ఏ లోటు రాకుండా చూసుకుంటున్నారని గతంలో ఏ ప్రభుత్వం కూడా ప్రజలను ఇంత చక్కగా చూసుకోలేదని అన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు జగన్మోహన్‌రెడ్డి పాలనను ఆదర్శంగా తీసుకుంటున్నాయని మంత్రి అమర్నాథ్ చెప్పారు.ఎన్ని అడ్డంకులు ఎదురైనా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్న ఘనత ఆయనకే దక్కిందని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులు పేదవారు సుదూర ప్రాంతాల్లోని ఆసుపత్రికి వెళ్ళక్కర్లేకుండా ఇంటికి వైద్యులను పంపించే కార్యక్రమాన్ని జగన్మోహన్‌రెడ్డి ప్రోత్సహమే కారణమని అమర్నాథ్ అన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని అమర్నాథ్ స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా సంక్షేమ పథకాలను నిరాటంకంగా అందిస్తున్న నేటి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నారని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రజలు తిప్పి కొట్టాలని అమర్నాథ్ పిలుపునిచ్చారు.

# సరస్వతి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన నగర మేయర్ దంపతులు

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

ప్రజాపిత బ్రహ్మకుమారి సేవలు అమోఘమని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి దంపతులు పేర్కొన్నారు. గురువారం ఆమె మూడవ జోన్ పరిధిలోని ఎంవిపి కాలనీ సెక్టర్-11లో ప్రజాపిత బ్రహ్మకుమారి ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన సరస్వతి భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా మేయర్ దంపతులు మాట్లాడుతూ ప్రజాపిత బ్రహ్మకుమారి తన ట్రస్ట్ ద్వారా ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నారని అలాగే రూ. 1.60కోట్లతో సరస్వతి భవనం నిర్ణయించేందుకు చర్యలు తీసుకున్నారని తద్వారా ఎంవిపి పరిసర ప్రాంత ప్రజలకు ఈ సరస్వతి భవనం ఎంతో ఉపయోగపడుతుందని ముఖ్యంగా జ్ఞానం యోగ లాంటివి ఈ సరస్వతి భవనంలో చేసుకోవచ్చని తెలియజేశారు. ఈ ట్రస్ట్ కు విరాళాలు ఇచ్చినట్లయితే వారికి ఇన్కమ్ టాక్స్ 80సి ద్వారా రాయితీ పొందవచ్చని తెలిపారు ఇటువంటి మహోత్తర కార్యక్రమంలో భాగస్వామిని చేసినందుకు ప్రజాపిత బ్రహ్మకుమారి ఆమె సోదరి శాంతి మరియు ట్రస్ట్ సభ్యులకు మేయర్ కృతజ్ఞతలు తెలిపారు.

# భూమికాలువగట్టుపై నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు

**ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటాం -ఇరిగేషన్ ఏఈ లోకేష్**

పాయకరావుపేట, జూన్ 1 ప్రభాతవార్త

స్థానిక చెక్కాసూర్యనారాయణనగర్ ఎంట్రన్సులో భూమికాలువకు ఆనుకుని సుమారు అర ఎకరం స్థలం లేఅవుట్ చేయబడిఉంది. ఈస్థలంనకు ఇరువైపులా భూమికాలువ ఉంది. ఈభూమికాలువ గట్టు ఆక్రమించి రోడ్డువేసినట్లు ఇరిగేషన్ ఏఈకి పిర్యాదులు అందాయి. ఈమేరకు ఇరిగేషన్ ఏఈ లోకేష్ లేఅవుట్‌ను పరిశీలించి భూమికాలువ గట్టు ఆక్రమించుకుని రోడ్డువేసినట్లు భావిస్తున్నారు. ఈవిషయం ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్ళి ఈలేఅవుట్‌దారులతో కూడా మాట్లాడి భూమికాలువ ఆక్రమణకు గురైనట్లు తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# వైసీపీ మేనిఫెస్టో ఏమైంది.....

**- తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత**

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

వైసీపీ మేనిఫెస్టో ఏమైంది అని తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు ప్రశ్నించారు. గురువారం జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలు రాజమండ్రి మహనాడు కి ముందు ఆ తరువాత గా ఉందని అన్నారు. మొదటి మేనిఫెస్టో అమలుచేసాతం అని చెప్పుకుంటున్నారు. నవరత్నాలు అని చెప్పారు. దశలు వారిగా మధ్యపాన నిషేధం అన్నారు. ఏక్కడ అమలయింది. మధ్యపానం ఏ దశలో ఉంది ఇప్పుడు జాబ్ కా ్యలెండర్ అన్నారు. ఎక్కడ విడుదల చేసారు. 45ఏళ్లకి పెన్షన్ అన్నారు. ఎన్ని గృహాలకి కుళాయిలు వేశారు. సీపీఎస్ రద్దు అన్నారు. ఎక్కడ చేశారు. అని వైసీపీ ప్రభుత్వానికి ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్ర విభజన సమయంలో లోటె బడ్జెట్ లో పథకాలు అమలుచేశారు. రోజా డప్పు కనిపించిన ఆగదు స్టేజి కనిపించిన ఆగదు గంజాయి డ్రగ్స్ లో మొదటి స్థానంలో ఏపీ నిలిచి చేసింది. సంపాదించేవారికి అప్పు చేసే హక్కు ఉంటుంది. అని అన్నారు. చంద్రబాబు నాయుడు 18నుంచి 50ఏళ్లలోపు వారికి మహిళలకు మూడు వేల రూపాయలు అందిస్తాను అన్నారు. మూడు సిలెండర్ ఉచితం అందిస్తాను అని చెప్పారు. జగన్మోహన్‌రెడ్డి కి మహిళలు కోసం మాట్లాడే నైతిక హక్కులేదు మీ అభివృద్ధి మీద మా మేనిఫెస్ట మీద చర్చకు సిద్ధంగా ఉన్నాను. మీరు సిద్దమైతే రండి ని సవాల్ విసిరారు. వైసీపీ ప్రభుత్వం లో 54వేల పూర్తిగా పడిన రైతు ఒక్కరిని చూపగలరా ఒక్క సంతకం తో 1.50లక్షల రూపాయలు చంద్రబాబు రుణమాఫీ చేశారు. రోజుకు 5వేల రూపాయలు సంపాదించేలా యువతను తర్ఫీదిద్దాలని చంద్రబాబు ఆలోచిస్తున్నారు అని చెప్పారు. తమ్మినేని సీతారాం స్పీకర్ అని మర్చిపోయి మాట్లాడుతున్నారని అన్నారు. జగన్‌కి తొత్తుగా మారిపోయారు. బ్లాక్ కమాండ్ లేకపోతే చంద్రబాబు పోతారని మతిస్థిమితం తప్పిన వాడిలాగా మాట్లాడుతున్నాడని అన్నారు. చంద్రబాబు దగ్గర బ్లాక్ కమాండ్ కాదు 70లక్షల ఎల్లో కమాండ్స్ ఉన్నారు. వైసీపీ నేతలు గడప గడపకు వెళ్తుంటే హారతలు పడుతున్నారు. అని వ్యంగ్యంగా అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఏపీ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. టిడిపి కూడా సిద్ధంగానే ఉందని అన్నారు. సమావేశంలో తెలుగు మహిళ నాయకురాలు ఈతలపాక సుజాత పాల్గొన్నారు.

# జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మని కలిసిన ఎమ్మెల్యే వాసుపల్లి

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

విశాఖ దక్షిణ నియోజకవర్గం లో జరుగుతున్న జరగబోయే అభివృద్ధి పనులపై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ని మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక దృష్టి సారించి త్వరిత గతిన పూర్తిచేయడానికి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరిన విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్. ఇందులో భాగంగా 41వ వార్డు మరియదాసు కళ్యాణమండపం టెండర్ దశలో నిలిచిపోయిందని మరల రాబోయే టెండర్ ఆమోధించి తర్వగా పూర్తి చేయాలని 35వ వార్డు జనతా బజార్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు చేపట్టేముందు అక్కడ వ్యాపారం చేసేవారికి ఆల్టర్నేటివ్ స్థలం కేటాయించి వారి జీవనోపాధి కోలో ్పకుండా సహకరించాలని 36వ వార్డు శ్రీ సత్యనారాయణస్వామి ఆలయం అసంపూర్ణంగా నిలిచిపోయిన ఘాట్‌రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని మరి ముఖ్యంగా జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్ట్‌ఆఫీస్ వరకు 60అడుగుల రోడ్ విస్తరణ పనులు వేగవంతం చేయాలని కోరారు. 41వ వార్డు జన్నురమ్ కోలనీ నివసించే విస్సరావు నాగమణి నారాయణ మూర్తి దంపతల ఏకైక కుమార్డు చైతన్య 12సంవత్సరాల వయస్సు గల వ్యక్తి గత సంవత్సరంలో ఏపిఈపీడిపిసిఎల్ ట్రాన్సకో లైన్‌కి ప్రమాదవశాత్తు గొలుసు తగిలిన కారణంగా చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ట్రాన్స్‌కోడిపార్ట్మెంట్ వారి ద్వారా 5లక్షల రూపాయలు నష్టపరిహారం ఇవ్వటం జరిగింది. వారి కుటుంబ సభ్యులలో ఒకరికి జీవీఎంసీ లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో జాబ్ కల్పించాలని కోరారు. ఆర్కెబీచ్ వైఎమ్ స్ఏ దగ్గరలో షాప్స్ పై వ్యాపారం చేసుకొనే సునీల్‌జోషి కుమార్‌జోషి వారి షాప్ స బీచ్ అభివృద్ధి పనులలో భాగంగా 2018 లో తొలగించడం జరిగింది. దీనివలన వారి జీవనోపాధి కోల్పోయి ఇబ్బందిలో ఉన్నామని ఎమ్మెల్యే కి విన్నవించగా వారికి ఆల్టర్నేటివ్ షాప్స్ ఏర్పాటు చేసుకోటానికి బీచ్ ఏరియాలో స్థలం కేటాయించాలని కోరారు.

# 1నుంచి 7జూన్ వరకు అమేజాన్ ఫ్రెష్ సూపర్‌వేల్యూడేస్ వేసవి సుగుణాలను ఆనందించండి

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

ఆరోగ్య వంతమైన స్నాక్స్, ఇతర అవసరాలతో స్కూల్ సంవత్సరం ఆరంభించండి మీరు అభిమానించే వాటిని ఆమేజాన్ ఫ్రెష్ ఆ్యక్ టు స్కూలు స్టోర్ పై సాఫింగ్ చేయండి. మొదటి ఫ్రెష్ ఆర్డర్ పై రూ 200వరకు క్యాష్ బ్యాక్‌ను ఆనందించవచ్చు. అదనపు క్యాస్ బ్యాక్ బహుమతలను పొందవచ్చు. వేసవి సీజన్ ను ఆహ్వానించండి, రుచికరమైన పండ్ల రకాలను ఆస్వాదిస్తూ వేడి చెమటలు నుంచి ఉపశమనం. చల్లగా ఉంచే పండ్లు కూరగాయాలు, వేసవి విందులు కూర్చిన వంటాకాలను నిల్వ చేసుకోండి. స్నాక్స్, డ్రింక్స్ బ్రేక్ ఫాష్ట ఆప్షన్‌తో స్కూల్ సంవత్సరం ఆరంభించడానికి ప్రత్యేకంగా రూపొందించిది. కిరాణా సరుకులను బ్రౌజ్ చేసి ఎంచుకోవచ్చు, స్ట్రీమ్ స్టోర్ ద్వారా ఫ్రైమ్ వీడియోపై ముఖ్యమైన మూవీస్, షోలు గేమ్స్‌ను కూడా స్ట్రీమ్ చేయవచ్చు.

# మింత ఎండ్ ఆఫ్ రీజన్ సేల్ 18, ఆరువేల బ్రాండ్లలో లక్షల స్టైల్స్‌తో అందుబాటులోకి

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

ప్రముఖ ఫ్యాషన్, అందం, జీవనశైలి గమ్యస్థానాలలో ఒకటైన మింత్ర ద్వివార్షిక ఎండ్ ఆఫ్ రీజన్ సేల్ 18ఎడిషన్‌గా యాప్‌లో నాన్ మెట్రోస్ నుంచి 15మిలియన్ల కొత్త వినియోగదారులను స్వాగతించేందుకు ట్రాక్‌లో ఉందని సోమవారం ప్రకటించింది. ఈ సారి 6వేల ప్రముఖ అంతర్జాతీయ దేశీయ డి2సి బ్రాండ్‌ల నుంచి 20లక్షలకు పైగా ఫ్యాషన్, సౌందర్యం జీవనశెలి ఉత్పత్తులతో జూన్ 1 నుంచిదేశంలో లోలాది మంది వినియోగదారులను ఆకర్షించేందుకు సిద్ధమైంది. జెన్‌జీ లేదా మిలీ నియల్స్ కావచ్చు లేదా టి2 అండ్ 3 నగరాలకు చెందిన మా వినియోగదారులు కావచ్చు లేదా సౌందర్య ప్రియులకు సాటిలేని ఆఫర్స్ చక్కని షాపింగ్ అనుభవాన్ని అందించేందుకు మేము నిరంతరం ప్రయత్నిస్తున్నాము. ఎండ్ ఆఫ్ రీజన్ సేల్స్ ప్రపంచ దేశీయ, ఫాష్యన్ బ్రాండ్‌ల నుంచి గడియారాలు వేరబుల్స్ విభాగంలో 20వేలు ఉత్పత్తులను కలిగి ఉంది సీకే హూగో బాస్ లాకోస్టే టైటాన్ గడియారాల విభాగంలో ఉండగా ఒన్‌ప్లస్ నథింగ్ బోట్ వంటి వేరబుల్ బ్రాండ్‌లు ఈవెంట్ సమయంలో ఈ విభాగానికి డిమాండ్లను పెంచుతాయని అంచనాదారులకు తెలిపారు.

# నక్కపల్లిలో ఇసుక నిల్

**-కాలనీ లబ్ధిదారులకు ఇక్కట్లు -నిలిచిపోతున్న నిర్మాణాలు**



నక్కపల్లి, జూన్ 1, ప్రభాతవార్త

ఇసుక..మూడక్షరాలే. కానీ ఇసుకపై ఆధార పడి అనేక కుటుంబాల వారు జీవనం సాగిస్తుంటారు. నక్కపల్లి కేంద్రంగా ప్రభుత్వం నిర్వహించే ఇసుక డిపో వద్ద గత ఐదు రోజుల నుంచి ఇసుక లేకపోవడంతో చాలా మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక కొరత కారణంగా పలు భవనాలు, జగనన్న కాలనీ గృహాల నిర్మాణాలు నిలిచి పోయాయి. దీంతో భవన నిర్మాణ పనులు చేపట్టే కార్మికులు, కూలీలు పనుల్లేక ఖాళీగా వుంటున్నారు. డిపో నుంచి ఇసుకను ఆయా గ్రామాలకు తరలించే ట్రాక్టర్ యజమానులు, ట్రాక్టర్లపై పనిచేసే కూలీలు పనిలేక గోళ్లు గిల్లుకుంటున్నారు. గత రెండేళ్ల నుంచి సుమారు 8వేల టన్నుల ఇసుక నిల్వలు నక్కపల్లి డిపో వద్ద వుండేవి. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల ప్రజలకు ఇసుక కావాలంటే నక్కపల్లి డిపో నుంచే ఇసుక కొనుగోలు చేయాల్సివుంది. ఈ డిపోకు రాజమహేంద్ర వరం నుంచి సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ వందలాది లారీల్లో ఇసుకను తీసుకువచ్చి నిల్వ చేసేది. గత ఐదు రోజుల నుంచి ఇసుక లేకపోవడంతో జగనన్న కాలనీ లబ్దిదారులు సహా పలు ప్రైవేట్ భవనాలు నిర్మించుకునే వారంతా నక్కపల్లి డిపోకు వచ్చి, ఇసుక లేకపోవడంతో వెనుదిరుగుతున్నారు. ఇసుక నిల్వలతో కన్పించే నక్కపల్లి ఇసుక డిపో ఐదు రోజుల నుంచి ఖాళీగా కన్పిస్తోంది. ఇక్కడ స్టోర్ వద్ద కూడా సిబ్బందెవరూ కన్పిం చలేదు. ప్రభుత్వం స్పందించి నక్కపల్లి ఇసుక డిపోకు ఇసుకు సరఫరా చేయాలని కోరుతున్నారు.

# ఆదర్శప్రాయుడు ఈ సర్పంచ్..



ఎస్.రాయవరం, జూన్ 1, ప్రభాతవార్త

ఎస్.రాయవరం మండలం తిమ్మాపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ కర్రి సత్యనారాయణ.. చుట్టుపక్కల గ్రామాల్లో ఈయన పేరు తెలియని వారుండరు. ఈయన సర్పంచుగా ఎన్నికైన నాటినుండి అనేక అభివృద్ధి పనులు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. తిమ్మాపురం గ్రామంలో గాని అటు కోనవానిపాలెం గ్రామంలో గాని పలు అభివృద్ధి పనులు చేపడుతూ, ఎన్నికల్లో గెలిచాక



పదవులను అనుభవిస్తూ పబ్బం గడపడం కాదని అభివృద్ధి చేసి చూపిస్తున్న వ్యక్తి. మండలంలోని ముఖ్య వ్యాపార కేంద్రమైన తిమ్మాపురం అడ్డు రోడ్డులో పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించడమే కాకుండా ఎక్కడికక్కడ డస్బిన్లు ఏర్పాటు చేసి పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చేయడం, కాలువలు పూడిక తీయించడం, గ్రామంలో ఎటు వంటి వైరల్ ఫీవర్లు రాకుండా ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లించడం, గ్రామానికి నిరంతరం మంచి నీరు అందేలా చేయడం, విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా చూడటం, మిషన్ లైఫ్ క్యాంపెయిన్‌లో భాగంగా గ్రామంలోని చెరువు వద్ద ప్లాస్టిక్ వేస్ట్ క్లీన్ అప్ డ్రైవ్ ద్వారా కూలిలతో కలిసి పరిసరాలను శుభ్రం చేసి తన నిరాడంబరతను చాటుకుంటున్నారు. మృధుస్వభావి ఐన సత్యనారాయణ స్థానికులు, అధికారుల మన్ననలు పొందుతున్నారు.

# ఘనంగా బంగారమ్మ పండుగ



నక్కపల్లి, జూన్ 1 ప్రభాతవార్త

మండలంలోని బంగారమ్మ పేటలో ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బంగారమ్మ తల్లి పండగను గురువారం నిర్వహించారు. ఈ పండుగ సందర్భంగా సప్తగిరి హేచరీ యజమాని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనతోపాటు ఎంపిటిసి రాజ గురువులు, టిడిపి నాయకులు గోసల శ్రీకాంత్, సొసైటీ సభ్యులు సత్యనారాయణ, గోసల అశోక్ తదితరులున్నారు.

# బొడ్డ దంపతులను సత్కరించిన శ్రీవారి సేవకులు



నక్కపల్లి, జూన్ 1, ప్రభాతవార్త

తిరుమల తిరుపతి దేవస్థానంలో సేవలందించేందుకు పది రోజులు పాటు నక్కపల్లి పట్టణం నుంచి వెళ్లిన 32 మంది వారి టీం లీడర్ అయిన బొడ్డ రంగబాబు లక్ష్మీ దంపతులను ఘనంగా సత్కరిం చారు. చివరి రోజైనా గురువారం సేవా కార్యక్రమాలు ముగించడంతో ఆ దంపతులను అల్లాడ కొండబాబు, కొప్పిశెట్టి హేమలత, వీరబాబు అల్లాడ కుటుంబాలకు చెందిన వారు అభినందించిన వారిలో ఉన్నారు. ఇటువంటి సేవ చేయడం ఆ వెంకటేశ్వర స్వామి కల్పించిన మహా భాగ్యంగా భావిస్తున్నామని, ఇటువంటి ధన్యత మా కుటుంబాలకు దక్కడం, టిటిడి అటువంటి అవకాశం కల్పించడం ఎంతో భాగ్యమని అల్లాడ కొండబాబు అన్నారు.

# ఈవో పిఓపిఆర్డి ఆకస్మిక తనిఖీ






నక్కపల్లి, జూన్ 1, ప్రభాతవార్త

మండలంలోని ఉద్దండపురం సచివాలయం పరిధిలో నిర్మించిన చెత్త నుండి సంపద కేంద్రాన్ని గురువారం ఈవోపీఆర్డి వెంకట్ నారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కేంద్రం విషయంలో గ్రామస్తులకు అవగాహ న కల్పించాలని సూచించారు. అనంతరం బ్యూటిఫికేషన్‌లో భాగంగా ఉద్దండపురం చెరు వును పరిశీలించారు. ఈ చెరువు అభి వృద్ధిపై సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎంపిటిసి ఐచ్చల రాజులతో చర్చించారు పంచాయితీ కార్యదర్శి ఉన్నారు.

# విశాఖలో తుపాకీ హల్చల్..!

(విశాఖ క్రైమ్ -ప్రభాతవార్త)

రాష్ట్రంలో క్రమేణా తుపాకీ సంస్కృతి పెరుగుతోంది. అనేక దందాల లావాదేవీలు, కార్యకలాపాల్లో తలెత్తే వివాదాల దాడుల్లో తుపాకీ ప్రధానంగా మారింది. విశాఖ నగరంలో కూడా అప్పుడప్పుడు గన్ కల్చర్ ఘటనలు వెలుగుచూడడం ఆందోళన కలిగిస్తోంది. విశాఖ నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ ఆదేశాల మేరకు అసాంఘిక, సంఘ విద్రోహ శక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ప్రతీ రోజు నగరంలో హెూటల్స్, లాడ్జిలను పోలీసులు నిశితంగా తనికీలు చేస్తున్నారు. తాజాగా గురువారం విశాఖ నగరంలో ఓ లాడ్జ్‌లో తనిఖీలు చేయగా మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి తుపాకీతో పోలీసులకు చిక్కాడు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం రాత్రి పోలీస్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో క్రైమ్స్ డీసీపీ నాగన్న తెలియజేశారు. మహారాష్ట్రకు చెందిన హరికృష్ణ పతంగ్ తన మిత్రులతో కలిసి ఒరిస్సాలోని పూరీకి రైలులో బయలుదేరాడు. గురువారం ట్రాన్సిట్ హాల్‌గా విశా ఖలో దిగారు. ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మి రాయల్ లాడ్జ్‌లో దిగారు. ఇదిలా ఉండగా విశాఖ పోలీసులు రాత్రి గస్తీలో భాగంగా లాడ్జిలు, హెూటల్స్‌ను తనిఖీలు చేస్తున్నారు. లక్ష్మి రాయల్ లాడ్జ్‌కి వెళ్లి రూమ్ నెంబర్ 105 తనిఖీలు చేయగా మహారాష్ట్రకు చెందిన హరికృష్ణ పతంగ్ దగ్గర దేశ వాళి తుపాకి లభ్యమైంది. వెంటనే పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా మహా రాష్ట్రకు చెందిన దత్తా పవర్ అనే వ్యక్తి తుపాకిని ఒరిస్సాలోని పూరీ నందు ఒక గుర్తు తెలియని వ్యక్తికి అప్పగిస్తే రూ.30 వేలు ఇస్తానని చెప్పడంతో ఆ పనికి పూనుకొన్నట్టు తెలిపాడు. తన మిత్రులకు తనతో వస్తే పూరీలో దర్శనం చేయిస్తానని చెప్పి గత నెల 29న ఇంటి నుండి బయలు దేరి 30న విశాఖ చేరు కొని ట్రాన్సిల్ట్ హాల్ట్ కావడంతో లాడ్జ్‌లో దిగినట్టు పోలీసులకు తెలిపాడు. దీంతో నిందితుడ్ని అదుపులోకి తీసు కొని సెక్షన్ 25 ఆఫ్ ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అనంతరం సీపీ త్రివిక్రమ వర్మ ఆదే శాల మేరకు మిగిలిన నిందితులను పట్టుకోవడానికి ఒక బృందాన్ని పూరీకి, మరో బృందాన్ని జాల్నా వైపు పంపారు.

# డయల్ యువర్ పోలీస్ కమిషనర్‌కు 8 ఫిర్యాదులు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

నగరంలో ప్రజలకు ఎవరికైనా అన్యాయం జరిగితే నేరుగా విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌తో ముఖాముఖి మాట్లాడే అవకాశం కల్పించారు. పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ సోమవారం కమిషనరేట్‌లో ఉదయం 11గం.ల నుండి 12గం.ల వరకూ నిర్వహించిన కార్యక్రమానికి 8 మంది కాలర్స్ ఫోన్ చేసి ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు సీపీ కాలర్స్ సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని ఆదేశించారు. కాలర్స్ ఇచ్చిన ఫిర్యాధులలో భూ వివాదాలు, భార్యభర్తల గొడవలు, సివిల్ కేసులు, వ్యాపారం కోసం నగదు ఇచ్చి మోసపోయిన వారు, నగర ట్రాఫిక్ సమస్యలు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. డయల్ యువర్ సి.పి కార్యక్రమానికి 0891-2523408 నంబరుకు కాల్ చేసి నేరుగా మీ సమస్యలను నగర పోలీస్ కమిషనర్ డా.సి.ఎం.త్రివిక్రమ వర్మకి తెలియజేయవచ్చు. అదేవిధంగా సిపికి వాట్సాప్ ద్వారా ఫొటోస్, వీడియోస్‌తో కూడిన ఫిర్యాధులు 9493336633 నంబరుకు ఇవ్వవచ్చు, అలాగే ప్రతీ సోమవారం జరిగే స్పందన కార్యక్రమం ద్వారా కూడా ప్రజలు పోలీస్ కమిషనర్‌కి ఫిర్యాదులు ఇవ్వవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్అండ్ఓ డి.సి.పి-1 వి.విద్యాసాగర్ నాయుడు, ఎల్అండ్ఓ డి.సి.పి-2 కె.ఆనంద్ రెడ్డి, క్రైమ్స్ డి.సి.పి జీ.నాగన్న, క్రైమ్స్ ఏడిసిపి డి.గంగాధరం, ఎస్బి ఏడిసిపి ఈ.నాగేంద్రుడు, ట్రాఫిక్ ఏడిసిపి షేక్ అరీఫ్ ఉల్లా పాల్గొన్నారు.

# ఎన్డీపీఎస్ నేరాలపై ప్రత్యేక నిఘా

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

విశాఖ నగరంలో అసాంఘిక, సంఘ విద్రోహ శక్తులపై పోలీసులు కొరడా ఝుళిపించారు.గంజాయి విక్రయాలు, రవాణాపై నిఘా పెట్టి నిందితులను అరెస్ట్ చేశారు. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది మే 31న ఇసుక, మద్యం, ఎన్.డి.పి.ఎస్ కేసులు, పేకాట వంటి గేమింగ్లు, టౌన్ న్యూసెన్స్ కేసులు బహిరంగ మద్యపానం వంటి అసాంఘిక కార్యకలాపాలపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్డీపీఎస్ కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేసి 15 కిలోల గంజాయిని సీజ్ చేశారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మరో ఎన్డీపీఎస్ కేసులో ఒకరిని అరెస్టు చేసి 6.50 కిలోల గంజాయిని సీజ్ చేశారు. పలు ప్రాంతాలలో 40 మందిపై టౌన్ న్యూసెన్స్ కేసులు నమోదు చేశారు. పోలీసులు, సెబ్ అధికారులు గంజాయి, డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన తరగతులు నిర్వహించారు. అనుమానిత ప్రదేశాలను, పార్సెల్ గోడౌన్లను, షాపులను తనిఖీ చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగించిన 66 మందిపై కేసులు నమోదు చేశారు. నగరంలో డ్రింక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 19 కేసులు నమోదు చేశారు. ఎం.వి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 1476 కేసులు నమోదు చేశారు. ఆర్.టి.సి బస్ వయోలెషన్ కేసులు 20, ఆటో వయోలెషన్ కేసులు 177 నమోదు చేశారు. ప్రజలకు దిశా యాప్ పట్ల అవగాహన కల్పిస్తూ 396 మందితో దిశ యాప్ డౌన్లోడ్ చేయించారు. నగర పోలీసులు వాహన తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేశారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి దిశా పెట్రోలింగ్, బీచ్ సాండ్ బందో బస్త నిర్వహిస్తూ ట్రాఫిక్ భద్రత నియమాల పట్ల అవగాహన కల్పించారు. మహిళా పోలీసులు తమ పరిధిలోని సైబర్ క్రైమ్స్, లోన్ యాప్స్, ఓటిపి ఫ్రాడ్స్, తక్కువ వడ్డీకి సులభతరమైన లోన్లు ఇస్తామని చెప్పి జరిగే మోసాలపై అవగాహన కల్పించారు.

# విశాఖలో రౌడీ షీటర్ దారుణ హత్య

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

విశాఖ వాసులకు వరుస హత్యలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎక్కడ ఎలాంటి హత్య కేసులు వినాల్సి వస్తుందోనన్న భయం ప్రజల్లో నెలకొంది. మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు ఉండే ప్రాంతాలే హత్యలు చేసుకోవడానికి వీలైన ప్రదేశాలుగా మార్చుకొంటున్నారు. తాజాగా ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి ఓ రౌడీ షీటర్‌ను అత్యంత దారుణంగా హత్య చేశారు. దీంతో మరో సారి రౌడీ షీటర్ హత్యతో విశాఖ ఉలిక్కి పడింది.ఎంవీపీ, ఆదర్శనగర్‌కు చెందిన వాసుపల్లి లక్ష్మణ్ రావు అలియాస్ క్రాంతి గతంలో జరిగిన ఓ హత్య కేసులో ప్రధాన నిందితుడు. అంతే కాకుండా ఎంవీపీ పీఎస్‌లో క్రాంతపై అనేక కేసులు ఉన్నాయి. గత కొంత కాలంగా రౌడీ కార్యాలపాలకు దూరంగా ఉన్నాడు. తనపై ఉన్న రౌడీ షీట్ కూడా తీయాలంటూ పోలీసులకు పలు మార్లు విన్నవించుకున్నట్టు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి 8.30గం.ల సమయంలో ఉషోదయ జంక్షన్ అనుపమ బార్ సమీపంలో రౌడీ షీటర్ క్రాంతిని గుర్తు తెలియని దుండగులు కత్తులతో హత్య చేసి పరారైయ్యారు. సమాచారం అందుకొన్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మృతుడు క్రాంతి కొడుకు వాసుపల్లి శ్యాం అనిల్ మర్డర్ కేసులో ప్రధాన నిందితుడు. ఆ క్రమంలోనే అనిల్‌కు సంబంధించిన గ్యాంగ్ వాసుపల్లి శ్యాం మీద పగ తీర్చుకోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో శ్యాం తండ్రి వాసుపల్లి క్రాంతి టార్గెట్ గ మారినట్టు అందరూ భావిస్తున్నారు. విశాఖలో వరుస రౌడీ షీటర్ల హత్యల కారణంగా ప్రజలు మాత్రం భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

# విశాఖ పోర్టు రెండు సరికొత్త రికార్డులు

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

గత రికార్డులను తిరగరాస్తు విశాఖపట్నం పోర్టు అథారిటీ మే 2023లో రెండు సరికొత్త రికార్డులను నెలకొల్పింది. కంటైనర్ టెర్మినల్‌లో ఒకే నెలలో అత్యధిక కంటైనర్లను హ్యాండిల్ చేసిన ఘనతను సాధించింది. విశాఖపట్నం పోర్టు అథారిటీ పరిధిలో బీవోటి/ పిపిపి ఆపరేటర్‌గా ఉన్న విశాఖ కంటైనర్ టెర్మినల్‌లో మే నెలలో అత్యధికంగా 61468 టియుఈల కంటైనర్లను హ్యాండిల్ చేసింది. మార్చి 2023లో హ్యాండిల్ చేసిన 56578 టియూఈల కంటైనర్ల హ్యాండ్లింగ్ మాత్రమే ఇప్పటివరకు రికార్డుగా ఉంది.విశాఖ కంటైనర్ టెర్మినల్ పొడవు 390 మీ, వెడల్పు 42మీగా 16 మీ డ్రాఫ్ట్ ను కలిగి ఉంది. మే 2023లో 49 కంటైనర్ నౌకలను హ్యాండిల్ చేయడం ద్వారా విశాఖ కంటైనర్ టెర్మినల్ మరో మైలురాయిని అధిగమించింది. ఒకే నెలలో అత్యధిక కంటైనర్ నౌకలను హ్యాండిల్ చేసిన రికార్డును తిరగరాసింది. ఏప్రిల్ 2023లో విశాఖ కంటైనర్ టెర్మినల్‌లో 42 కంటైనర్ షిప్పులను హ్యాండిల్ చేసింది. ఇప్పటివరకు ఇదే ఒక నెలలో అత్యధిక కంటైనర్ నౌకలను హ్యాండిల్ చేసిన రికార్డుగా ఉంది. విశాఖపట్నం పోర్టు నూతన రికార్డులను సాధించటం పట్ల పోర్టు అథారిటీ ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు పోర్టు సిబ్బందిని, టెర్మినల్ ఆపరేటర్‌ను ప్రశంసించారు. పోర్టు సిబ్బంది కలిసికట్టుగా పనిచేయటం ద్వారా మరిన్ని కొత్త రికార్డులను తిరగ రాయవచ్చని పోర్టు ఛైర్మన్ ఈ సందర్భంగా ఉద్యోగులకు సూచించారు.

# భీమునిపట్నం గంటస్తంభం ... ఎంతో పురాతనం

విశాఖపట్నం, 2 జూన్, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం జిల్లా, మహా విశాఖ నగరపాలక సంస్థకు చెందిన పట్టణ ప్రాంతం. విశాఖపట్నం నగర పాలక సంఘంలో విలీనం కాకముందు భారతదేశంలో ఇది రెండవ పురపాలక సంఘం. ఆంధ్రప్రదేశ్‌లోని మొట్టమొదటి పురపాలక సంఘం(భారత దేశంలో మొట్టమొదటి మునిసిపాలిటీ గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ నగరం). ఇప్పటికీ కూడా పూర్వపు మున్సిపాలిటీ కార్యాలయం పెంకులతో నిర్మించబడి ఉంది. ప్రాంతీయులు ఈ గ్రామాన్ని భీమిలి అని పిలుస్తారు. భీమిలీ విశాఖపట్టణానికి 24 కి.మీ దూరంలో విశాఖ-భీమిలీ బీచ్ రోడ్డుపై చివరన ఉంది. భీముని పట్టణం పశ్చిమం వైపు ఎత్తుగా ఉండి క్రమంగా తూర్పు వైపు సముద్ర తీరానికి వచ్చేటప్పుటికీ పల్లం కావడం వల్ల పశ్చిమం నుండి తూర్పుకు సముద్ర తీరం వైపు చూస్తే కనిపించే ప్రకృతి దృశ్యం అత్యంత రమణీయంగా ఉంటుంది. ఈ పట్టణంలోని లాటిరైటు శిలలపై ప్రాచీనమైన బౌద్ధ క్షేత్రం పావురాళ్ల కొండ ఉంది. ఈ కొండ దిగువన తూర్పునకు నరసింహ స్వామి దేవాలయం ఉంది. ఇంకో విశేషం ఇక్కడ ఇప్పటికీ డచ్ వారి వలన స్థావర అవశేషాలు ఉన్నాయి. భీమిలీ బీచ్ లోతు ఉండదు కాబట్టి ఈత కొట్టడం క్షేమదాయకం.

**చరిత్ర చెప్పే నిజాలు**

బుద్ధుని అవశేషాలలోని ఎనిమిదవ భాగం భీమిలీ సమీపంలోని తిమ్మాపురం బావికొండ బౌద్ధ క్షేత్రంలో లభ్యమైందట. 1641వ సంవత్సరంలో హైదరాబాబు నవాబు మహమ్మద్ కులీకుతుబ్ షా నుండి అనుమతి పొందారు. డచ్ దేశస్తుడు 1754లో జరిగిన మరాఠీ దాడుల్లోనూ, 1781లో ఫ్రాన్స్, బ్రిటన్‌ల మధ్య జరిగిన యుద్ధంలోనూ డచ్ కోట పాక్షికంగా ధ్వంసమైంది. 1825లో భీమిలీ రేవు పట్టణం బ్రిటిష్ వారి వశమైంది. 1854లో రిప్పన్ కంపెనీని ప్రారంభించారు. యాత్రా చరిత్ర, రచయిత మండపాక పార్వతీశ్వర శాస్త్రి తన గ్రంథంలో పుట 6లో భీమునిపట్నం గురించి ఇలా వ్రాసియున్నారు. సముద్ర తీరమందు భీముని పట్టణమున్నది. ఇందులో మునసబు వగైరాల ఖచేరీలున్నవి. దొరలు సైతమున్నారు. రేవుస్థలమైనందున ధనిక వర్తక భూయిష్టమైయున్నది. ఇది కొండదిగువనున్నందు నిమ్నోన్నతముగా నున్నది.

**భీమిలీ ప్రత్యేక ఆకర్షణ ... పావురాళ్ల కొండ...**

పావురాళ్ల కొండ లేదా పావురాళ్ల బోడు భీమునిపట్నం వద్ద నరసింహస్వామి కొండగా ప్రసిద్ధమైన కొండ యొక్క స్థానికనామం. ఈ కొండ సముద్రమట్టానికి 150 మీటర్ల ఎత్తున ఉంది. పావురాళ్ల కొండ. ఆంధ్రప్రదేశ్ బౌద్ధమత క్షేత్రాల్లో ఆవశేషపు ధాతువుల దొరికిన ముఖ్య క్షేత్రం. ఇక్కడ బౌద్ధ విహారం యొక్క శిథిలాలు ఉన్నాయి. ఇక్కడ క్రీ.పూ. మూడవ శతాబ్దం నుండి క్రీ.శ.రెండవ శతాబ్దం వరకు జనావాసాలు ఉండి ఉండవచ్చని అంచనా. ఉత్తర తీరాంధ్రలోని అతిపెద్ద విహార క్షేత్రాల్లో ఇది ఒకటి. ఈ కొండపై నున్న క్షేత్రంలో హీనయాన బౌద్ధం ప్రభవించి ఉండవచ్చు. 1226 శాలివాహన శకంలో ఈ దేవస్థాన పునరుద్ధరణ మింది రామ రమజోగి చేత జరిగింది. ఈ తరువాత ముగుగప్ప శెట్టి, అలగప్ప శెట్టి స్వామి వారికి కాంస్య కవచాన్ని బహూకరించారు. నారాయణుని దశావతారాలలో నర, మృగ మిత్రను రూప అవతారం ఇదొక్కటి మన రాష్ట్రంలో నారసింహ మూలక్షేత్రాలు, 32 క్షేత్రాల పరంపరలో, చివరిదిగా విరాజిల్లుతున్న క్షేత్రం, భీమునిపట్నంలోని ప్రహ్లాద వరద శ్రీకాంత నృసింహస్వామి దివ్యసన్నిధి, లక్ష్మీనారాయణ స్వరూపంగా నృసింహుడు అలరారే ఈ దేవస్థానంతో పాటు, భీమసేన ప్రతిష్టిత భీమేశ్వరాలయం గూడా ఇక్కడే ఉంది. 16-18 శతాబ్దాల మధ్య ఐరోపా ఖండం వారు భారతదేశానికి వర్తకం చేసుకోవడానికి వచ్చిన భాగంగా భీమిలిలో డచ్ వారు దిగారు. 1624 డచ్ వారు ఇక్కడ మొదట వలస వచ్చినప్పుడు ప్రాంతీయులకు డచ్ వారికి మధ్య ఘర్షణలు జరిగాయి. ఆ ఘర్షణలలో 101 మంది డచ్ సైనికులు 200 మంది ప్రాంతీయులు మరణించారు. (విశాఖ శాసనాల వల్ల తెలుస్తోంది.) ఆ తరువాత ప్రాంతీయులకు డచ్ వారికి సంధి కుదిరి వర్తకం చేసుకోవడానికి 1661లో 4 కొమంలతో ఒక కోట, 234శ్రీ400 వైశాల్యంతో నిర్మించుకొన్నారు. ఈ కోట ఇప్పుడు శిథిలమై పోయి అవశేషాలు మిగిలాయి. ఈ కోటలో గడియార స్తంభం, టంకశాల ఉన్నాయి. పట్టణ మధ్యలో ఉన్న ఈ గడియార స్థంభాన్ని ప్రతి పర్యాటకుడు దర్శించి తీరాలి1855-1864 సంవత్సరాల మధ ్య ఈ చర్చే నిర్మాణం రాయి రెవరెండు జాన్ గ్రిఫిన్స్ ద్వారా అప్పటి జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేటు రాబర్ట్ రేడ్ ఆధ్వర్యంలో జరిగింది. తరువాత 17-3-1864న బిషప్ గెల్ చేత ఈ చర్చి తెరువబడింది. ఈ చర్చి నిర్మాణ శైలి, లోపలి వస్తువులు, తూర్పు కిటికీ మీద ఏసుక్రీస్తుని శిలువ వేస్తున్న సంఘటను చిత్రించిన విధానం చాలా విశేషంగా ఉంటుంది. ఈ చర్చిలో ఎంతో కాలం ముందు నిర్మించిన పాలరాతి శిల్పాలు నేత్రానందాన్ని అందిస్తాయి. పట్టణానికి పశ్చిమంగా నిర్మించబడిన ఈ శ్మశాన వాటిక డచ్ వారి ఈ పట్టణంలో నివసించారని చెప్పడానికి, వారి జీవితం ఇక్కడే పూర్తి చేశారని చెప్పడానికి ఋజువు. ఈ శ్మశానంలో వారిని ఖననం చేసిన ప్రదేశంలో వారి మరణానికి కారణాలను తెలుపుతూ రాతి ఫలకాలు ఉన్నాయి. ఈ అతిథి గృహం చిట్టివలస జూట్ కర్మాగారం ఆధీనంలో ఉంది. పూర్వం ఈ అతిథి గృహంలో ఇంపీరియల్ బ్యాంకు ఉండేది. ఆ తరువాత ఈ గృహాన్ని చిట్టి వలస ఝూట్ మిల్లు వారు దత్తత తీసుకొని ఈ గృహం చెక్కు చెదరకుండా కాపాడుతున్నాయి. ఈ పట్టణ వైభవాన్ని చెప్పడానికి ఈ అతిథి గృహం ఒక తార్కాణం. భీమిలీ దర్శించడానికి వచ్చిన ప్రతి సందర్శకుడు ఈ అతిథి గృహాన్ని చూసి తీరవలసిందే.

**మున్సిపాలిటీ సత్రం రెండు రాళ్లపై మద్రాసు పెంకులతో కట్టడింది...**

పురపాలక సంఘం కార్యాలయం, నౌకాశ్రయ రవాణా కార్యాలయం ఒకే సముదాయములో ఉన్న ఈ రెండు భవనాలు ఇక్కడి నౌకాశ్రయం యొక్క ఎగుమతులు, దిగుమతుల పూర్వవైభవాన్ని గుర్తు చేస్తాయి. ఈ విశాఖ భవనాలలో ఎత్తైన పై కప్పుతో ఇక్కడ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. కాకినాడకు శ్రీకాకుళానికి మధ ్య నిర్మించబడిన ఎనిమిది దేవ స్తంభాలలో (లైటు హౌసు) ఇది ఒక్కటి. ఈ దీపస్తంభం 18వ శతాబ్ధపు భీమిలీ నౌకాశ్రయ వైభవాన్ని తెలుపుతోంది. పట్టణ ముఖ్య రహదారిపై ఉన్న దేవాలయ సముదాయంలో ఉన్న ప్రాచీన దేవాలం 1170 శాలివాహన శకంలో ఈ ఆలయ నిర్మాణం జరిగింది.దీనికి అనుబంధంగా చోళేశ్వరాలయం చోళులచే నిర్మించబడింది.


## ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో బంగారు పతకం సాధించిన సత్య కళాశాల విద్యార్థిని కుమారి పల్లవి




మాధవధార, జూన్ 1, ప్రభాతవార్త

ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్-2023 ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్‌లోని నోయిడాలో జరుగుతున్నాయి. సత్య డిగ్రీ కళాశాలకు చెందిన సేనాపతి పల్లవి వెయిట్ లిఫ్టింగ్ 64 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించింది. ఆమె క్లీన్ అండ్ జెర్క్‌లో 84 కేజీలు, స్నాచ్ 108 కేజీలు ఎత్తి బంగారు పతకాన్ని గెలుచుకుంది. కుమారి పల్లవి సత్య డిగ్రీ కళాశాలలో బి.ఎ. మొదటి సంవత్సరం చదువుతుంది. ఆమె ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో ఆంధ్రా యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహించారు. సత్య విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి, డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిదేవమణి, ఇతర సిబ్బంది కుమారి పల్లవి, కోచ్ చల్లా రాములను అభినందించారు. కుమారి పల్లవి, కోచ్ రాము ఫోన్‌లో మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ఆటలకు సన్నద్ధం కావడానికి ఆర్థిక సహాయం అందించినందుకు డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి, సత్య బృందానికి ధన్యవాదాలు తెలిపారు. కుమారి పల్లవి ఇప్పటికే రాబోయే రెండు నెలల్లో జగనున్న ఆసియా గేమ్స్, కామన్ వెల్త్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లకు ఎంపిక అయింది.

## మలేరియా నివారణ మాసోత్సవాలు పురస్కరించుకొని అవగాహన ర్యాలీ



ఎస్.రాయవరం, జూన్ 1, ప్రభాతవార్త

ఎస్.రాయవరం మండలం సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో మలేరియా నివారణ మాసోత్సవాలు పురస్కరించుకొని జిల్లా మలేరియా అధికారి కె.వరహాలు దొర ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీలు, శిబిరాలు నిర్వహించామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.వాసంతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు జ్వరాలు బారిన పడకుండా దోమల వృద్ధి రేటును అరికట్టాలని అలా చేయాలంటే ముందుగా ప్రతి ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, చెత్తాచెదారం లేకుండా పాడుబడిన ప్లాస్టిక్ డబ్బాలు, డ్రమ్ములు, కొబ్బరి బొండాలు, డ్రింక్ సీసాలు వాటిలో నీరు నిల్వలు ఉండకుండా జాగ్రత్త చూసుకోవాలని ప్రతి నీరు నిల్వ ఉన్న పాత్రలపై మూతలు ఉంచాలని తద్వారా ఈ కీటక జనిత వ్యాధులను అరికట్ట వచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా మలేరియా ఇన్‌చార్జ్ నోడల్ ఆఫీసర్ పి.ఎన్.వి.ఎస్.ప్రసాద్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ మలేరియా మాసోత్సవాలు జూన్ 1 నుండి 30వ తేదీ వరకు నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరికీ కీటక జనిత వ్యాధులు వలన మన శరీరానికి కలిగే ప్రాణాపాయం గురించి అవగాహన శిబిరాలు, ర్యాలీ లు ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి బి.సత్యనారాయణ, పి.హెచ్.ఎన్. ఎం.రత్నసఖి, ల్యాబ్ టెక్నీషియన్ కె.హరినాథ్, స్టాఫ్ నర్స్ అరుణ, స్థానిక సచివాలయం హెల్త్ సెక్రెటరీ రాజ్యలక్ష్మి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆశ వర్కర్ల మండల కమిటీ సమావేశం



మోతుగూడెం, జూన్ 1, ప్రభాతవార్త

చింతూరు మండల కేంద్రం యుటిఎఫ్ కార్యాలయంలో ఆశ వర్కర్ల మండల కమిటీ సమావేశంలో ముఖ్య అధితిగా సీఐటీయూ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ చింతూరు డివిజన్ పరిధిలో ఉన్న సబ్ సెంటర్స్‌లో సరైన బెడ్స్ లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని అలానే ఈ నాలుగు మండలంలో ఉన్న ఆశ వర్కర్లకు అస్తవ్యస్థంగా పారితోషకాలు, వేతనాలు చెల్లిస్తున్నారని దాదాపు వాళ్లకి రావలసిన మూడు సంవత్సరాల యూనిఫామ్స్ కూడా ఇంతవరకు ఇవ్వకపోవడం చాలా దుర్మార్గమైన పరిస్థితి నెలకొందని లేనిపక్షంలో ఈ నాలుగు మండలాలలో ఉన్న ఆశ వర్కర్లు అందరిని కూడా తీసుకువచ్చి ఐటిడిఏ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని ప్రభుత్వ అధికారులకు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, ఆశ వర్కర్ల యూనియన్ మండల కమిటీ సభ్యులు రవ్వ వీరమ్మ, బీరబోయిన దారేశ్వరి, దుబి కాంతమ్మ, బంధం దుర్గ పైడితల్లి, జమున తదితరులు పాల్గొన్నారు.

## పాండ్రంగి గ్రామ సమస్యలపై భీమిలి ఎమ్మెల్యేకు వినతిపత్రం



పద్మనాభం, జూన్ 1, ప్రభాతవార్త

విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామపంచాయితీలో జరిగిన జిల్లా రైతు భరోసా కార్యక్రమంలో గ్రామ సమస్యలపై లక్ష్మివారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్‌కు జిల్లా కలెక్టర్ మల్లికార్జునరావుకు పాండ్రంగి గ్రామ ఒకటవ వార్డు సభ్యులు మహంతి అప్పల రమణ వినతిపత్రం ఇచ్చారు. పాండ్రంగి గ్రామ పంచాయితీలో నూతనంగా డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని, పేదలుకు ఇల్లు పట్టాలు ఇచ్చిన వాటిలో అనేక అవక తవకలు పరిశీలించి చర్యలు తీసువాలని, నూతనంగా ఇల్లు స్థలాలకు అర్హత కలిగిన వారికి పట్టాలు పంపిణీ చేయాలని చెరువు, పంట కాలువలలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అప్పలరమణతో పాటు పద్మనాభం మండల బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## నేడు పద్మనాభం జంక్షన్లో భారీ అన్న సంతర్పణ



పద్మనాభం, జూన్ 1, ప్రభాతవార్త

విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పద్మనాభం జంక్షన్లో ఉన్న శ్రీ శిరిడి సాయిబాబా శ్రీ పార్వతమ్మ ఆలయాల వద్ద 19వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం భారీ అన్న సంతర్పణ కార్యక్రమం జరుగుతుందని ఆలయ ధర్మకర్త మోకార అప్పలనాయుడు (అన్నమయ్య) తెలిపారు. కావున భక్తులందరూ విచ్చేసి తీర్థ ప్రసాదాలను స్వీక రించాలని ఈ సందర్భంగా తెలిపారు.

## మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



పద్మనాభం, జూన్ 1, ప్రభాతవార్త

విశాఖపట్నం జిల్లా పద్మనాభ మండలం రెడ్డిపల్లి గ్రామపంచాయితీలో ఉన్న ఎంపీపీ స్కూల్ వద్ద శంకర్ ఫౌండేషన్ సారధ్యంలో పద్మనాభం మాజీ జెడ్పిటిసి కే.దామోదర్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ వైద్య శిబిరానికి 65 మంది కంటి చికిత్స కోసం వచ్చారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి 12 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం శంకర్ ఫౌండేషన్ కంటి వైద్యశాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం మండల మాజీ జడ్పిటిసి కే.దామోదరరావు శంకర్ ఫౌండేషన్ కంటి వైద్యులు పెద్ద సంఖ్యలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో పాల్గొన్నారు.

## ప్రాణం ఉన్నంతవరకు టిడిపితోనే నా ప్రయాణం : టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



భీమునిపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

జీవితం ఉన్నంతవరకు నా ప్రయాణం తెలుగుదేశం పార్టీతోనేనని, నా బలం బలహీనత నా సహచర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలేనని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పెందుర్తి నియోజకవర్గం పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. గంటా నూకరాజు 53వ జన్మదినోత్సవం సందర్భంగా భీమిలి జోన్ 3వ వార్డు ప్రధాన కార్యదర్శి గొలగాని నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గంటా నూకరాజుకి గజమాలలు, శాలువాలతో సత్కరించి కేక్ కట్ చేయించడమైనది. అనంతరం గంటా నూకరాజు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ నాకు రాజకీయంగా ఎంతో భవిష్యత్‌ను ఇచ్చిందని అన్నారు. తెలుగుదేశం పార్టీలో ఉండే ప్రతీ నాయకుడు, కార్యకర్త కూడా నా సొంత కుటుంబ సభ్యులుగా నాతో కలసిపోయి ఉంటారని అన్నారు. నాకు ఇంతవరకు సహాయ సహకారాలు అందించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు అన్నారు. ప్రధాన కార్యదర్శి గొలగాని నరేంద్ర కుమార్ మాట్లాడుతూ భీమిలిలో రాజకీయ శక్తి గంటా నూకరాజు అని అన్నారు. భీమిలిలో తెలుగుదేశం పార్టీ ఇంత పటిష్టంగా ఉందంటే గంటా చరిష్మా అని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పారీ భీమిలి నియో జకవర్గం మహిళా అధ్యక్షురాలు బోయి రమాదేవి, నాయకులు మారోజి సంజీవ కుమార్, పెంటపల్లి యోగీశ్వరరావు, కనకల అప్పలనాయుడు, కారి అప్పారావు, కాసరపు ఎల్లాజీ, వాడమొదలు సత్యారావు, కొక్కిరి అప్పన్న, గండిబోయిన పోలిరాజు, తుపాకుల సంతోష్ రాజ్, కంచెర్ల కామేష్, అప్పికొండ నూకరాజు, పైడిపల్లి ఎల్లయ్యమ్మ, మట్టా దాసు, పిల్లా తాతారావు, వూళ్ల దుర్గారావు, వాడమొదలు రాంబాబు, తెడ్డు సింహాద్రి, తవుడయ్య, కందుల సుందర్ రావు, అధిక సంఖ్యలో కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## మద్ది గ్రామంలో పద్మనాభం ఎంపీపీ కే.రాంబాబు చేతులమీదుగా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం



పద్మనాభం, జూన్ 1, ప్రభాతవార్త

విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం ఎం.పి.పి. కే.రాంబాబు రాంబాబు మద్ది గ్రామంలో శుక్రవారం ఉదయం క్లస్టర్ 22, 24 పెన్షన్ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా పెన్షన్ అందుకున్న లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి పద్మనాభ ఎంపీపీ రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## అనంత పద్మనాభ స్వామిని దర్శించుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు దంపతులు



పద్మనాభం, జూన్ 1, ప్రభాతవార్త

విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పద్మనాభ గ్రామంలో కొలువైయున్న శ్రీ అనంతపద్మనాభ స్వామిని శుక్రవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పెందుర్తి పరిశీలికులు గంటా నూకరాజు గంటా అప్పలకొండమ్మ దంపతులు ఉదయం శ్రీశ్రీశ్రీ అనంత పద్మ నాభ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వాగతం పలికి గోత్రనామాలతో దంపతులకు విశేష పూజలు జరిపిరి అనంతరం తీర్థ ప్రసాదాలను అంద జేయడం జరిగింది. ఈ సందర్భంగా పద్మనాభం ఎంపీటీసీ కంటుబోతు లక్ష్మి నాయుడు దంపతులు గంటా నూకరాజు దంపతులకు దుశ్శాలువాతో సత్కరించి అనంత పద్మనాభ స్వామి వారి చిత్రపటం బహూకరించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కంటుబోతు సుమంత్ నాయుడు, మండల యూత్ సెక్రెటరీ గణేష్, అశోక్, సుందర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలిపిల్లమ్మ విగ్రహ ఆవిష్కరణ మహెూత్సవం





మాడుగుల, జూన్ 1, ప్రభాతవార్త

మాడుగుల నవర వీధిలో వేంచేసి ఉన్న శ్రీ పోలి పిల్లమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు హెూమాధి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు స్థానిక ప్రజలు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సంతర్పణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరై అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కేజే పురం వెంకట జగన్నాథ్ కోలాట బృందం వారిచే కోలాట నృత్య కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీవీ రామధర్మజ, సర్పంచ్ కళావతి, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, సహకార సంఘ అధ్యక్షుడు పి.వెంకట్రావు, మండల సచివాలయ కన్వీనర్ బి.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రెడ్డి సూర్యారావు, మాజీ ఎంపీపీ అప్పలరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల స్వీకరించారు. స్థల దాతలు ఆలయ వ్యవస్థాపక నిర్వాహకులు నల్లబిడ్డ రమణ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## 20న చలో విజయవాడను జయప్రదం చేయండి



మాడుగుల, జూన్ 1, ప్రభాతవార్త

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 20న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ బిల్డింగ్, కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రవణ విజ్ఞప్తి చేశారు. గురువారం మాడుగుల జగ్గన్న చావడి వద్ద జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని క్లెయిమ్స్‌కు వెంటనే నిధులు మంజూరు చేయాలనీ కోరారు. 2007లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి భవన నిర్మాణ కార్మికులను ఆదుకునేందుకు ఏపీ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేశారన్నారు. ఈ సంక్షేమ బోర్డులో దాదాపు 22 లక్షల మంది కార్మికుల పేర్లు నమోదు చేసుకొని సంక్షేమ పథకాలను అనుభవించే వారన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం యజమాని సెస్ రూపంలో వసూలు చేయబడిన నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు వాయిబోయిన శేఖర్, తాపీమేస్త్రి సంఘం అధ్యక్షులు చల్లా నాగేశ్వరరావు, కార్యదర్శి గుమ్మాలు సీతారాం, ఉపాధ్యక్షులు పి.రమేష్, సహాయ కార్యదర్శి వియ్యపు సింహాద్రి, కోశాధికారి పల్ల నూకరాజు, జగన్, తులసి రామ్ పాల్గొన్నారు.

## రైతుబజార్‌ను తనిఖీ చేసిన ఏపి రైతుబజార్ల ముఖ్య కార్యనిర్వాహణ అధికారి



పీఎం పాలెం, జూన్ 1, ప్రభాతవార్త

మధురవాడ రైతు బజార్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు బజార్ల ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ముల్లంగి నందకిషోర్ తనిఖీ చేశారు. బజార్ నందు గల రైతులను, వినియోగదార్లను ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పార్కింగ్ సమస్యకు పరిష్కారం చేస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్ డిఈ కెనడి ఉన్నారు.

## బ్రేక్‌తో కూడిన 12 నెలల రెన్యూవల్ మంజూరు చేయాలని వినతి

### ఏపీ మోడల్ స్కూల్ కాంట్రాక్ట్ పిజిటి, టిజిటిలు



పీఎం పాలెం, జూన్ 1, ప్రభాతవార్త

ఏపీ మోడల్ స్కూల్స్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన 52 మంది పిజిటి, టిజిటిలుగా 3 అక్టోబర్ 2022న విధుల్లోకి చేరామని అగ్రిమెంట్ ఏప్రిల్ నెలతో ముగిసినందున, వేసవి సెలవుల్లో వేతనం లేకపోవడం వలన కుటుంబ పోషణ కష్టమవుతుందని కాబట్టి 1రోజు/10 రోజుల సర్వీస్ బ్రేక్‌తో కూడిన 12 నెలల రెన్యూవల్ ప్రోసిడింగ్స్‌ను మంజూరు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని కాంట్రాక్ట్ పిజిటి, టిజిటిలు కోరారు.

## శ్రీ ఐశ్వర్య లక్ష్మీ అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం



భీమునిపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

స్థానిక శ్రీ ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి పంచమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ ఐశ్వర్య లక్ష్మీ అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం గురువారం ఉదయం 8.08ని.కు శ్రీశ్రీశ్రీ త్రిదండి అహెూబిలం రామానుజ జీయర్‌స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆలయ ధర్మ కర్తలు కలిగొట్ల వారి కుటుంబ సభ్యుల స్వహస్తములతో శ్రీ ఐశ్వర్యలక్ష్మీ వారి సకల యంత్ర సహిత విగ్రహ, శిఖర ప్రతిష్ట, కుంభ ప్రోక్షణ అత్యంత వైభవంగా జరిగినది. 2 జూన్ శుక్రవారం ఉదయం జరుగు లక్ష్మీ హవనం కార్యక్రమం శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చినజీయర్ స్వామివారి చేతుల మీదుగా జరుగునని తెలిపారు. ఈ కార్యక్రమం ఆలయ ట్రస్టీస్ కలిగొట్ల శ్రీరామ చంద్రమూర్తి, కె.ఎస్.ఎన్.మూర్తి, కె.శ్రీనివాసరావు, కె.వి.భానోజీరావు, కె.చంద్రశేఖర్, వి.తాతాజీ, ప్రసాద్ శర్మ, బద్రీ, ఆర్.ఆర్. శ్రీనివాస్, నోవల్ కిషోర్ వారి ఆధ్వర్యంలో జరుగగా, ఆలయ అర్చకులు శేషా చార్యులు, మనోజ్, విష్ణు, ఇతర ఋత్వికుల పర్యవేక్షణలో అతి వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భీమిలి, తగరపువలస ప్రాంతాలకు చెందిన అశేష భక్త జనులు, ఆలయ సభ్యులు పాల్గొన్నారు.

## ముగిసిన నావల్ ఎన్‌సీసీ క్యాడెట్ల వార్షిక శిక్షణ శిబిరం




భీమునిపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

సంగివలస అన్నిట్స్ కళాశాల క్రీడా మైదానంలో గత పది రోజులుగా జరుగుతున్న 3వ ఆంధ్రా నావల్ యూనిట్ క్యాడెట్ల వార్షిక శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ కమొడార్ ఇంగ్లేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ వార్షిక శిక్షణ శిబిరానికి విశాఖ, అనకాపల్లి, అరకు, పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 200 మంది బాలికల సహా 600 మంది క్యాడేట్లు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాల నుంచి హాజరై శిక్షణ పొందారన్నారు. ముగింపులో భాగంగా మాక్‌డ్రిల్, వైపరీత్యాలు, ప్రమాదాలు, యుద్ధాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయక చర్యలు, షిప్ మోడలింగ్, ప్రాక్టికల్స్, నావల్ ఓరియంటేషన్ అంశా లపై అవగాహన కల్పించారు. టగ్ ఆఫ్ వార్, పాటలు, నృత్యాలు, ఇతర సాంస్కృతిక, క్రీడా, టెక్నికల్ అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అండ్ ఇట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ, పీడీ వేణుగోపాల్, నావీ పీఓ బి.అప్పల రెడ్డి, ఇతరులు పాల్గొన్నారు.

## ఘనంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం



భీమునిపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

చిట్టివలస జ్యూట్ మిల్ రామాలయం గురుస్వామి ఆకెళ్ళ నరసింహమూర్తి ఆకస్మికంగా మరణించారు. ఆ సంగతి తెలుసుకొని అందరు బాధ పడిన విషయం తెలిసిందే. ఈ గురువారం నుండి ప్రతి గురువారం సాయిబాబా గుడిలో పూజలు జరిపి యధావిధిగా భక్తులకు అన్నదానం కార్యక్రమం గురుస్వామి భార్య ఆకెళ్ళ భానుమతి, కుమారుడు పంతులు గణేష్, ఏర్పాటు చేసి వైసిపి నాయకులు జీరు వెంకటరెడ్డి చేతులు మీదుగా ప్రారంభించారు. గురుస్వామి ఉన్నప్పుడు గుడిలోపూజ కార్యక్రమాలు ఎలా జరిపించారో అలాగే జరుగుతాయని భక్తులు అందరు వచ్చి భగవంతుణ్ణి దర్శించుకోవాలని కుమారుడు గణేష్ పంతులు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిల్లా రాజేష్, జీరు భరత్ రెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## నిస్వార్థ సేవకుడు గంటా నూకరాజు



భీమునిపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

మంచితనం ఆయనకు మారుపేరు, నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం, నీతైన రాజకీయాలకు ఆదర్శవంతుడు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, భీమిలి శాఖ ఆదర్శ హిందీ ప్రేమిమండలి గౌరవ అధ్యక్షులు గంటా నూకరాజు అని వక్తలు కొనియాడారు. భీమిలి శాఖ ఆదర్శ హిందీ ప్రేమి మండలి వ్యవస్థాపక అధ్యక్షులు కె.ఎస్.ఆర్. కృష్ణారావు మాస్టర్ సమక్షంలో గంటా నూకరాజు 53వ జన్మదినం వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిధిగా 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ హాజరుకాగా విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్, కృష్ణారావు మాస్టర్లు మాట్లాడుతూ డబ్బు సంపాదించాలన్న ఆశ లేదని.. ప్రజాభిమానం పొందడమే ఆయన ధ్యేయమని అన్నారు. పద వులు అనుభవించాలని వ్యామోహం లేదని ప్రజలకు అందుబాటులో ఉండాల్లన్నదే ఆయన వాంఛ అని అన్నారు. సుఖాలను పొందాలని కోరిక లేదని, ప్రజల కష్టాల్లో భాగస్వామ్యం కావాల్లన్నదే ఆయన ఆలోచన అని అన్నారు. అలాంటి నాయకుడు మనకు ఉండటం మన అదృష్టమని అన్నారు. వాడమొదలు సత్యారావు, రాజగిరి రమణ, కొక్కిరి అప్పన్న, చింతపల్లి చరణ్, జలగడుగుల మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎం.కోడూరులో కోటి 90 లక్షలతో అభివృద్ధి పనులు



మాడుగుల, జూన్ 1, ప్రభాతవార్త

మాడుగుల మండలం ఎం.కోడూరు పంచాయితీలో కోటి 92 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు గురువారం భూమిపూజ నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు చొరవతో ఈ మొత్తం నిధులు మంజూరయ్యాయని గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు చెప్పారు. ఇందుకు సంబంధించి గురువారం భూమి పూజ కార్యక్రమాన్ని చేపట్టి మంత్రి ముత్యాల నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. వీటిలో భాగంగా గ్రామంలో ఆడిటోరియం నిర్మాణానికి ఎంపీ గ్రాంట్ నుంచి రూ.36 లక్షలు, జల జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికి కొళాయిలు వేసేందుకు రూ.70 లక్షలు, గ్రామంలో సిమెంట్ రోడ్లు కాలువలు నిర్మాణానికి రూ.20 లక్షలు, అలాగే జాతీయ ఉపాధి పథకం కింద ఇంటర్నల్ రోడ్లు కాలువలు నిర్మాణానికి రూ.20 లక్షలు, గిరిజన ప్రాంతంలో రోడ్లు కాలువలు నిర్మాణానికి రూ.16.50 లక్షలు, అలాగే ఎస్సీ ప్రాంతం, కాలనీలో రోడ్లు కాలువలు నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేష్, మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, స్థానిక నాయకులు చింత వెంకట నారాయణమూర్తి, పడాల అప్పల నరసయ్య, కలిమి గౌసమ్మ, కాంట్రాక్టర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన టైక్వాండో వేసవి శిక్షణ శిబిరం



చోడవరం, జూన్ 1, ప్రభాతవార్త

చోడవరం గవర్నమెంటు హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న టైక్వాండో ఉచిత వేసవి శిక్షణ శిబిరం గురువారం సాయంత్రంతో ముగిసింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన టైక్వాండో సమ్మర్ ఫ్రీ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వారు ధృవీకరించిన సర్టిఫికెట్స్‌ను ఉమ్మడి విశాఖపట్నం జిల్లా తైక్వాండో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, క్యాంప్ ఇన్‌చార్జ్ పల్లం మురళీకృష్ణ అందజేశారు. ఈ టైక్వాండో సమ్మర్ ఫ్రీ కోచింగ్ క్యాంప్‌లో చోడవరం 80, అనకాపల్లి 80, వద్దాదిలో 500 మందికి తైక్వాండో క్రీడాశిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు ఎస్ నోకియా ప్రసాద్, ఎం.సంతోషి లక్ష్మిలు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే అనకాపల్లి జిల్లా స్పోర్ట్స్ అదార్టీ చీఫ్ కోచ్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎన్.సూర్యరావుకి, ఉమ్మడి జిల్లా టైక్వాండో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పల్లం మురళీకృష్ణ, కోచ్‌లు షేక్ ఆలీ, ప్రసాద్‌లు శాలువ కప్పి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.

## వాలంటీర్లకు వందనం కార్యక్రమం



దేవీపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవిపట్నం మండలం ముసినిగుంట హాస్టల్ వద్ద వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొని వాలంటీర్లకు శాలువ కప్పి ప్రశంసా పత్రం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వాలంటరీ వ్యవస్థ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలన్నీ ప్రజల వద్దకే నేరుగా అందుతున్నాయని, ఒకటో తారీకు రాగానే అవ్వ తాతలకు నేరుగా ఇంటివద్దకే వచ్చి పెన్షన్ అందజేస్తున్నారని, వారికిచ్చి రూ.5వేల గౌరవ వేతనంతో పాటు ప్రతి సంవత్సరానికి ఇలాంటి పురస్కారాలు ఏర్పాటు చేసి వారు చేసే సేవకు గుర్తింపు ఇస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం మండల కన్వీనర్, ఎంపీపీ, జడ్పిటిసి, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ ప్రెసిడెంట్, కోఆప్షన్ నెంబర్, వైస్ సర్పంచులు, వార్డ్ మెంబర్లు, సచివాలయం కన్వీనర్లు గృహసారధులు, ఎక్స్ సర్పంచ్లు వివిధ కార్పొరేషన్ చైర్మన్ అండ్ డైరెక్టర్, ఎక్స్ ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అకస్మాత్తుగా కూలిన దుకాణం ముందు ఫోర్టికో... తృటిలో తప్పిన ముప్పు



చింతపల్లి, జూన్ 1 ప్రభాతవార్త

దుకాణం (చెక్కల బడ్డీ) ముందు వేసిన సిమెంట్ రేకుల ఫోర్టికో ఊహించని రీతిలో ఒక్కసారిగా అకస్మాత్తుగా కూలింది. దీంతో ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలు ఏదో ప్రమాదం సంభవించిందని దుకాణం వద్దకు పరుగులు తీశారు. ఆ బడ్డీలో వ్యాపారం నిర్వహించుకునే వ్యాపారులు (పరవాడ వరలక్ష్మి, ఆమె కుమారుడు చిన్న) ఆ సమయంలో అక్కడే ఉన్నారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో టీ, కాఫీ, టిఫిన్ వ్యాపారం నిర్వహించుకునే వారు ఆ సమయంలో అక్కడే ఉన్నారు. వ్యాపారం ప్రారంభించడానికి అన్నీ సిద్ధం చేసుకుంటూ స్టౌ వెలిగించే క్రమంలో ఉండగా సిమెంట్ రేకుల బరువుకు ఒకవైపు రాట విరిగి పోవడంతో ఫోర్టికో అకస్మాత్తుగా ఒక వైపుకు కూలింది. ఊహించని పరిణామంతో వ్యాపారులు పరుగులు తీసి హుటాహుటీన రేకులు, రాటలు తొలగించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి హాని కలగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చు కున్నారు.



సబ్బం హరి 71వ జయంతి సందర్భంగా జ్ఞానాపురం మదర్ తెరిసా హెూమ్ నిర్మల హృదయ భవన్‌లో వృద్ధులకు అల్పాహారం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి సబ్బం హరి తనయుడు సబ్బం వెంకట్, సిరికి రవి, పూజారి ఉదయ్ కుమార్, కె.సత్యనారాయణ, రాజాన ప్రసాద పాల్గొన్నారు. (మాధవధార, ప్రభాతవార్త)

# వేడుకగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు



**సాలూరు, జూన్ 1 ప్రభాతవార్త :**
సాలూరు పట్టణంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర జన్మదిన వేడుకలలో నియోజవర్గ వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియ జేశారు. గురువారం ఉదయం డిప్యూటీ సీఎం క్యాంప్ కార్యాలయం వద్దకు చేరుకున్న పార్టీ నాయకులు కార్యకర్తలు రాజన్న దొరకు బొకేలు అందించి దుస్సాలువాలతో సత్కరించి ఇలాంటి జన్మదిన వేడుకలు ఎన్నో జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలుపుతు ఆకాంక్షించారు. అందులో భాగంగా తిరుపతి నవజీవన్ ట్రస్ట్ ఫౌండర్ కె. శ్రీధర్ ఆచార్య ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్న పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న నవజీవన్ పూర్ చిల్డ్రన్ ట్రస్ట్ ఆర్గనైజర్ చిక్కాల. చిన్నమమ్మలు (శాంతి) డిప్యూటీ సీఎం రాజన్నదొర కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలి యజేసి పూల మొక్కను బహుకరించారు. డిప్యూటీ సీ ఎం ను కలిసి బర్త్డే విషెస్ చెప్పడం ఆనందంగా ఉందని తెలిపారు.

# ప్రాధాన్యత పనుల పూర్తికి నిధులు మంజూరు చేయాలి




**పార్వతీపురం, జూన్ 1 ప్రభాతవార్త :**
ప్రాధాన్యత పనులు పూర్తి చేయటానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్. జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూమి రీసర్వే ప్రక్రియ ఫిబ్రవరి 2024 నాటికి పూర్తిచేయాలన్నారు. రీసర్వే, గ్రామీణ అభివృద్ధి, గృహనిర్మాణం, పంచాయతీరాజ్, స్వచ్ఛ భూహక్కు భూరక్ష, ఉపాధి హామీపథకం, ఆధార్ సీడింగ్, మస్తర్ వెరిఫికేషన్ తదితర అంశాలపై సమీక్ష చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రాధాన్యత భవనాల నిర్మాణ పనులను పూర్తి చేయడానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంనకు సంబంధించి ప్రతి గ్రామంలో పని కల్పించుటకు జాబ్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని, ప్రతి గ్రామంలో ఉపాధి చూపించే విధంగా చర్యలుతీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకట రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి పాల్గొన్నారు.

# మండలంలో త్రాగునీటి సమస్య లేకుండా చేస్తా

**– ఎంపీపీ పద్మావతి**



**కురుపాం, జూన్ 1 ప్రభాతవార్త :**
మండలంలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. గురువారం కురుపాం మేజర్ పంచాయతీలో శోభాలతాదేవి కాలనీలో క్రాస్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఇప్పటికే మండలంలో మారుమూల గిరిజన ప్రాంతాల్లో క్రాస్ ప్రాగ్రామ్ ద్వారా నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గార్ల సుజాత, ఉప సర్పంచ్ షేక్ అదిల్, ఆర్.డబ్ల్యు.ఎస్ ఏఈ వేణు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కార్తిక్, సిబ్బంది పాల్గొన్నారు.

# మరిడమ్మతల్లి దేవాలయ పునః ప్రతిష్ఠా మహోత్సవం

**– పాల్గొన్న వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జ్ అవనాపు విక్రమ్**



**విజయనగరం టౌన్, జూన్ 1 ప్రభాతవార్త :**
విజయనగరం గుత్తివీధిలో కొలువైన శ్రీ శ్రీ శ్రీ మరిడమ్మ తల్లి దేవాలయం పునః ప్రతిష్ట మహోత్సవంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు జిల్లాల వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జ్ అవనాపు విక్రమ్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆలయ సాంప్రదాయానుసారం విక్రమ్ స్వాగతం పలికి వేద పండితులు రామాయణం సత్యనారాయణ శర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా అవనాపు విక్రమ్ మాట్లాడుతూ అమ్మవారు ఆలయాలు, జాతరలు, పండుగలు మన సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేస్తాయని అన్నారు. గుత్తివీధి మరిడమ్మ ఆలయంతో తమ కుటుంబానికి ఏన్నో ఏళ్ల అనుబంధం ఉందనని గుర్తు చేశారు.ఆలయ పునః నిర్మాణం, ప్రతిష్ఠామహోత్సవంలో తాము భాగస్వామి కావడం ఆనందదాయకం అన్నారు. కరోనా కాలంలో అమ్మవారి పూజలు, జాతర జరిపించడానికి ఇబ్బందులు ఎదురైనా, ఆలయాన్ని పునః నిర్మించి పండుగ జరిపించడానికి నిర్వహణ కమిటీ ప్రతినిధులు చేసిన కృషిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గొడ్డు చిన్నరావు, మైచర్ల అప్పారావు, కుప్ప పైడిరాజు,రాగిణి ఆది, రాగిణి గౌరీ, రాగిణి రాము, పి.బాబురావు, గొడ్డు రమణ, గొడ్డు సాయి, స్థానిక యువత, మహిళలు, వైకాపా నాయకులు ఎర్నింటి నరసింగరావు, ముని లక్ష్మణరావు, సంపత్ రాజు, కోసూరు వెంకట్రావు, తాలాడ పైడిరాజు, కనకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


# బొండపల్లి తహశీల్దార్ ఆకస్మిక బదిలీ

**బొండపల్లి జూన్ 1 ప్రభాతవార్త :**
బొండపల్లి తహశీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీనువాస్ మిశ్రా కొత్తవలస మండలానికి ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారుల నుండి గురువారం బదిలీ ఉత్తర్వులు తహశీల్దార్ కార్యాలయానికి చేరాయి. కొత్తవలస మండల తహశీల్దార్ గా పనిచేస్తున్న ప్రసాద్ రావు బొండపల్లి తహశీల్దార్‌గా నియమితులయ్యారు. కాగా తహశీల్దార్ శ్రీనువాస్ మిశ్రా తేది 2021 జూలై నుంచి 23 జూన్ 1 వరకు సుమారు 23 నెలలు తహశీల్దార్‌గా విధులు నిర్వహించారు. శ్రీనువాస్‌మిశ్రా విధి నిర్వహణలో అటు ప్రజలు, ఇటు ప్రజా ప్రతినిధులు నుండి మన్ననలు పొందారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు, భూ రీసర్వే, పేదలకు గృహ పట్టాల మంజూరు చేయడం తదితర రెవెన్యూ సేవలు అందించడంలో తనవంతు పాత్రను పోషించారు. విద్యార్థుల ధ్రువపత్రాలు, రైతులకు కావాల్సిన పట్టాదార్ పాసు పుస్తకాలు మంజూరులో ఆయిన తనదైన ముద్రను వేసుకున్నారు. ఇది ఇలా ఉండగా తహశీల్దార్ శ్రీనువాస్ మిశ్రా ఆకస్మిక బదిలీ పట్ల మండలంలో పలువురు ఆశ్చర్యానికి గురు అయ్యారు. కాగా పరిపాలన సౌలభ్యంలో భాగంగా తహశీల్దార్ మిశ్రాను జిల్లా ఉన్నతాధికారులు బదిలీ జరిగినట్లు విశ్వసనీయ సమాచారం బట్టి తెలుస్తుంది.

# రైతులు విత్తనాలు ఎరువులను వినియోగించుకోవాలి



**రామభద్రపురం, జూన్ 1 ప్రభాతవార్త :**
మండలంలో వివిధ రైతు భరోసా కేంద్రాలలో ముందుస్తుగా యూరియా 150 టన్నులు డిఎపి- 70 టన్నుల ఎరువుల ఉంచటం జరిగింది. అలాగే రైతులకి అవసరం అయ్యే వరి విత్తనాలు.. మండలంకి 750 క్వింటాలు టార్గెట్ ఇవ్వటం జరిగింది. అలాగే పచ్చి రొట్ట విత్తనాలు కూడా 180 క్వింటాల్ రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేయటానికి ప్రణాళికలు సిద్ధం చేయటం జరిగింది. పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై రైతులకి సరఫరా చేయటం జరుగుతుంది. అలాగే వరి విత్తనాలు అయితే ఒక కేజీ కి 10శాతం రాయితీ ఇవ్వటం జరుగుతుంది అని తెలియచేయటం జరిగింది.



# నేడే దుర్గా దేవి వార్షికోత్సవం

**దత్తిరాజేరు, జూన్ 1 ప్రభాతవార్త :**
మండలంలోని పాచలవలస గ్రామంలో శ్రీ దుర్గా దేవి తొమ్మిదవ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త గుషిడి శ్రీనివాసరావు అన్నారు అర్చకులు రవి.గురుస్వామి రాజేష్ స్వామి ఆధ్వర్యంలో భక్తులకు తెల్లవారి 7 గంటల నుండి అభిషేకాలు పాలాభిషేకం జలాభిషేకం కుంకుమ పూజ వంటివి.నిర్వహిస్తారని 12 గంటల నుండి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుంది. కావున గ్రామంలో భక్తులు అందరూ వచ్చి తీర్థ ప్రసాదం స్వీకరిస్తారని కోరుతున్నారు.

# శ్రీకృష్ణాలయ విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న మృణాళిని



**గరివిడి, జూన్ 1 ప్రభాతవార్త :**
మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో 80 లక్షల వ్యయంతో నిర్మించిన శ్రీకృష్ణుని ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ కిమిడి మృణాళిని పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని తిలకించారు. ఎంతో సుందరమైన శ్రీకృష్ణుని విగ్రహాలకు చూసి ఆమె ఆనందపరవశులయ్యారు. ఆలయాలు ఆద్యాత్మిక తమ ప్రజల్లో పెంపొందేందుకు ఉపయుక్తంగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు. ఆలయ నిర్మాతలకు ఆమె ఈ సందర్భంగా ప్రశంసించారు. వేదపండితుల వేదాశీర్వచనాలు స్వీకరించిన ఆమె కృష్ణ పరమాత్ముని దర్శించుకున్నారు. మాజీ మంత్రి మృణాళిని వెంట గరివిడి మండల దేశం నాయకులు సారేపాక సురేష్‌కుమార్, దన్నాన రామచంద్రుడు, మన్నెపురి సూర్యనారాయణ, మహంతి రమణమూర్తి, ఆలయ వ్యవస్థాపకులు పాల్గొన్నారు.

# సబ్సిడీ ద్వారావ్యవసాయ పరికరాలు పంపిణీ



**దత్తిరాజేరు, జూన్ 1 ప్రభాతవార్త :**
ప్రధానమంత్రి కృషిసంచాయి యోజన పథకం ద్వారా మండలంలోని మరడాం గ్రామ సచివాలయంలో రైతులకు. వ్యవసాయ పరికరాలను ఎంపీపీ చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ మాట్లాడుతూ జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా రైతులకు సబ్సిడీ ద్వారా 5 హెచ్ పి ఆయిల్ ఇంజిన్లు తైవాన్స్ స్ప్రేయర్లు రెండు. బ్యాటరీ పంపులు 13 .ట్రార్పన్లు 25 అందజేశారు రైతులకు ఇంత ఎక్కువ.సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు ఏ ప్రభుత్వం ఇవ్వలేదని జగన్మోహన్ రెడ్డి రైతు పక్షపాతని కొనియాడారు రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటూ ముందుకు పోతున్నారని తెలిపారు వైసిపి ప్రభుత్వం లోని రైతులకు మేలు జరిగిందని అన్నారు ఇటువంటి ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తుంచుకొని మళ్లీ జగన్మోహన్ రెడ్డిని సీఎం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమేష్ నాయుడు జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు వైసిపి నాయకులు పోతల శంకరరావు రెడ్డి సింహాచలం సిరిపురం శంకరరావు టెక్నికల్ అసిస్టెంట్ దామోదర్ రైతులు పాల్గొన్నారు.

# గిరిజన రైతును ఆదుకున్న ప్రభుత్వం

**– 50 వేలు సహాయం అందించిన గ్రీన్ ఫీల్డ్**



**పాచిపెంట, జూన్ 1 ప్రభాతవార్త :**
గత 30 ఏళ్లుగా గెడ్డ పోరంబోకు భూమిని సాగు చేస్తున్న గిరిజన రైతుకు ప్రభుత్వం న్యాయం చేసింది.అతడొక నిరుపేద రైతు తాను సాగు చేసుకుంటున్న 157 సర్వే నెంబర్‌లో గల 74 సెంట్లు గెడ్డ పోరంబోకు భూమి ప్రస్తుతం నిర్మాణం చేపడుతున్న గ్రీన్ ఫీల్డ్ రోడ్డులో కలిసి పోయింది.సాగు భూమి పోయిందని, లబోదిబో మంటూ రెవిన్యూ శాఖ అధికారులను కలిశారు. దానికి ఎటువంటి ప్రభుత్వం అనుమతి,ఆధారాలు లేక పోవడంతో సంబంధించిన రైతు మండల తహశీల్దార్ ఎం.రాజశేఖర్‌ను ఆశ్రయించి తన గోడు వినిపించడంతో విషయం క్షుణ్ణంగా పరిశీలించి తన పై అధికారి జిల్లా జాయింట్ కలెక్టర్ కు సమస్య తెలియజేసారు. జాయింట్ కలెక్టర్ సంబంధిత రైతును తన ఆఫీస్ కు రమ్మని అతను పడ్డ ఇబ్బంది తెలుసుకొని వెంటనే గ్రీన్ ఫీల్డ్ యాజమాన్యానికి రిక్వెస్ట్ చేసారు. గిరిజన రైతుకు మానవతా దృక్పథంతో అలోచించి న్యాయం చేయాలని పట్టుబాట్టారు. ఆయన మాటకు యాజమాన్యం తలవొంచింది. ఆ రైతుకు 50000 రూపాయలు సహాయం చేస్తామని జనరల్ మేనేజర్ రాజశేఖర్ అంగీకారం తెలిపారు. వెంటనే 50000 రూపాయలు తన సిబ్బందిని పంపించి స్థానిక తహసీల్దార్ రాజశేఖర్ తో అందజేశారు. సహాయం అందుకున్న గిరిజన రైతు సూర్యనారాయణ గ్రీన్ ఫీల్డ్ యాజమాన్యంకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సహాయం చేసారు. పాచిపెంట గరేళ్ళవలస గిరిజన గ్రామానికి చెందిన గేదల సూర్యనారాయణలు ఉన్నారు.

**ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై**

# ముందస్తు సమాచారం తప్పనిసరి



**పార్వతీపురం, జూన్1 ప్రభాతవార్త :**
గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై ముందస్తు సమాచారం తప్పనిసరి అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. ఈ మేరకు గిరిమిత్ర సమావేశ మందిరంలో హెల్త్ సూపర్ వైజర్స్‌కు ఆరోగ్య కార్యక్రమాలపై నిర్వహించిన సమావేశంలో డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని తద్వారా అందజేస్తున్న వైద్య సేవలు గ్రామాల్లో ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలంటే ముందస్తు సమాచారం తప్పని సరిగా ఇవ్వాలని, ఇదే ప్రణాళికను ఆ పరిధిలో తదితర శాఖలకు కూడా అందజేయడం ద్వారా ఈ కార్యక్రమంపై ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం జరిగి మరింతగా అవగాహన పెంచేందుకు దోహదపడుతుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో అందజేస్తున్న వైద్య సేవలను పోస్టర్ రూపంలో ప్రదర్శించాలన్నారు. గర్భిణీల నమోదు త్వరితగతిన జరగాలని, షెడ్యూల్ ప్రకారం ఆరోగ్య తనిఖీలు కనీసం నాలుగు సార్లు పూర్తి చేసి, వివరాలు ఆన్‌లైన్ నమోదు చేయాలని, హై రిస్క్ గర్భిణీ లను త్వరగా గుర్తించడం ద్వారా సరైన ఆరోగ్య పర్యవేక్షణ చేసి మాతృ,శిశు మరణాలు నివారించవచ్చని అన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ దోమల నివారణ మందు మొదటి విడత స్ప్రేయింగ్ జరుగుచున్నదని సూపర్ వైజర్స్ పర్యవేక్షణ చేసి నివేదిక సమర్పించాలన్నారు. ఎన్‌సిడి సర్వే, హెల్త్ ఐడిలు, అభా ఐడిలు తొంబై శాతం పైగా సాధించుటకు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, డిఐఒ డాక్టర్ టి.జగన్మోహనరావు, డిప్యూటీ డిఎమ్ హెచ్ఒ డాక్టర్ జి.వెంకటరమణ, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ నవీన్ కుమార్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు వరి విత్తనాలు సిద్ధం : ఎంపీపీ



**వంగర,జూన్ 1 ప్రభాతవార్త :**
ఖరీఫ్ వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఎంపీపీ సురేష్ ముఖర్జీ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు వారికున్నటువంటి భూమిలో వరి సాగు చేసేందుకు అవసరమైన విత్తనాలు సరఫరాకు సిద్దంగా ఉన్నాయని ఆయన చెప్పారు. ముందుగా రైతులు వారికి అవసరమైన వరి ఏ రకం విత్తనాలు అవసరమన్నది ఆయా గ్రామాలకు సంబంధించిన రైతుభరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులను కోరారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అనంతరం వారికి కావల్సిన విత్తనాలు సరఫరా చేస్తారన్నారు. ప్రస్తుతం మండలంలో బీపీటి 5204 రకం విత్తనాలు 30 కిలోల బస్తా రేటు రూ 697.50లు, ఎంటీయు 7029 రకం విత్తన బస్తా రూ.843 లు, ఎంటీయు 1064 రకం బేగ్ రూ.843లు, ఎంటీయు 1064 రకం బస్తా రేటు రూ 843 లు, ఎంటీయు 1121 రకం రూ.834 లు రేటుకు విక్రయిస్తారన్నారు. అంతేకాకుండా ఎంటీయు 1318 రకం రూ.843లుగా వివరించారు. అంతే కాకుండా మరికొన్ని రకాలు వరివిత్తనాలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు వెంటనే ఆర్‌బికేలో విత్తనాలు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన రైతులను కోరారు.

# జాకీరు సచివాలయం అకస్మిక తనిఖీ



**వేపాడ, జూన్ 1 ప్రభాతవార్త :**
వేపాడ మండలం లోని జాకేరు గ్రామ సచివాలయాన్ని గురువారం ఎంపీడీవో బి ఎస్ కె ఎన్ పట్నాయక్ ఆకస్మిక తనిఖీ జరిపారు. సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సకాలంలో అందే విధంగా సిబ్బంది పనిచేయాలని సూచించారు. అలాగే పథకాలు సక్రమంగా అందుతున్నది లేనిది ఆరా తీశారు. విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని సూచించారు.

పార్వతీపురం మన్యం విజయనగరం వార్త 25 Glorious years

శుక్రవారం, 02 జూన్ 2023

**జిల్లాలోని 2.58 లక్షల మంది రైతులకు**

# రూ.193.74 కోట్ల సహాయం విడుదల





**బొబ్బిలి, జూన్ 1 ప్రభాతవార్త :**
రైతులు పండించే పంటలకు మద్దతు ధర ప్రకటించడమే కాకుండా మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ రైతులకు ప్రభుత్వం అండగా నిలవడంతో రాష్ట్రంలోని రైతుల్లో ధైర్యం ఏర్పడిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. రాష్ట్రంలో రైతులకు ఏ ఇబ్బంది వచ్చినా అది ప్రభుత్వ బాధ్యతగా భావించి వాటిని పరిష్కరిస్తుందన్నారు. రైతులతో మమేకమై వారి సమస్యలను పరిష్కరిస్తున్నది తమ ప్రభుత్వ హయాంలోనే అన్న విషయాన్ని గుర్తించాలన్నారు. వైఎస్సార్ రైతుభరోసా పి.ఎం.కిసాన్ కింద వరుసగా ఐదో ఏడాది తొలివిడతగా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని బ్యాంకు ఖాతాల్లో జమచేసే జిల్లాస్థాయి కార్యక్రమం గురువారం బొబ్బిలి మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లాలోని 2.58 లక్షల మంది రైతులకు రూ.193.47 కోట్ల సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయిన రైతుకు వెన్నుదన్నుగా నిలవాలనే ఉద్దేశ్యంతో మన ముఖ్యమంత్రి రైతుభరోసా కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. బొబ్బిలి ప్రాంతంలో చెరకు రైతుల సమస్యలను పరిష్కరించి వారికి చక్కెర కర్మాగారం ద్వారా రావలసిన బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకున్న ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. చెరకు రైతుల సమస్యలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను కూడా త్వరగా చెల్లిస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజనులో రైతులకు అవసరమైన పెట్టుబడి సహాయం అందించే లక్ష్యంతో ప్రభుత్వం రైతుభరోసా సహాయం అందిస్తున్నదని చెప్పారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనిలో భాగంగానే డైరీ వంటి రంగాల్లో రైతులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ఇటీవల మొక్కజొన్న మద్దతుధర పొందడంలో సమస్యలు వస్తే ప్రభుత్వం వెంటనే మార్క్‌ఫెడ్ ద్వారా 5 వేల టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసి ఆదుకొందని చెప్పారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టు చివరిలో వున్న ఎకరానికి కూడా సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జిల్లాలో 6.50 లక్షల టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేశామని చెప్పారు. శాసనసభ్యులు ఎస్.వి.చినప్పల నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అర్హతే ప్రాతిపదికగా సంక్షేమ పథకాలను మంజూరు చేస్తోందని, అవినీతి లేని పరిపాలనకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోని ఇతర రాష్ట్రాలకు మన రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో రైతులకు ఖరీఫ్ సీజనుకు విత్తనాల పంపిణీని మంత్రి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న రైతులకు విడుదల చేసిన ఇన్‌పుట్ సబ్సిడీని కూడా మంత్రి చెక్కు రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, మునిసిపల్ చైర్మన్ ఇంటి గోపాలరావు, వ్యవసాయ శాఖ జె.డి. వి.టి.రామారావు, ఆర్.డి.ఓ. శేషశైలజ, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, ఇంటి గోపాలరావు పాల్గొన్నారు.

# వైభవంగా సంతాన వేణు గోపాలస్వామి కళ్యాణం



**లక్కవరపుకోట, జూన్ 1 ప్రభాతవార్త :**
మండలంలోని కళ్లెంపూడి గ్రామంలో బుధవారం ఏకాదశి పర్వదినంను పురస్కరించుకుని గ్రామస్థులు అందరు కలిసి గ్రామంలో గల సంతాన వేణుగోపాలస్వామి కళ్యాణంను వైభవంగా నిర్వహించారు. వేద పండితులు శ్రీను, చంటి, సతీష్‌ల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో కళ్యాణం కనుల పండుగలా నిర్వహించారు. ఈ కళ్యాణం బుధవారం అర్ధరాత్రి వరకు జరిగిందిని ఆలయ ధర్మ కర్త ఏడువాక శ్రీను తెలిపారు. ఈ వేడుకను వీక్షించేందుకు గ్రామంలోని పెద్దలు మహిళలు పిల్లలు పాల్గొనగా గ్రామంలో పండగ వాతావరణం నెలకుంది. ఈ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తతో పాటు సభ్యులు దేముళ్ళు, జోగారావు, జియో రామకృష్ణ, విజయ లక్ష్మి దంపతులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పురోహితులు సంతాన వేణుగోపాల స్వామి అవతార మహత్యం కళ్యాణం జరిపిస్తే కలిగే ఫలాన్ని వివరించారు.

# గంజాయి అక్రమ రవాణాపై గట్టి నిఘా : సీఐ



**శృంగవరపుకోట, జూన్ 1 ప్రభాతవార్త :**
గంజాయి అక్రమ రవాణాను అరికట్టేం దుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎస్.కోట ఎస్ఈబి సీఐ ధర్మారావు తెలిపారు. గురువారం మండలంలోని బొడ్డవరలో వాహనాలు తనిఖీలు నిర్వహిం చారు. ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కూడా తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబి ఎస్ఐ రమ్యశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసీ కాలనీ వాసులకి ఉచిత నీటి సరఫరా



**గుమ్మలక్ష్మీపురం, జూన్ 1 ప్రభాతవార్త :**
గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు గుడ్ల హరి ప్రసాద్ దంపతుల వారి కుమార్తె అయిన స్వర్గీయ నైమిశా జ్ఞాపకార్థంగా సుమారు 2లక్షల వ్యయంతో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి ఆర్టీసీ కాలనీ వాసులకు ఉచిత నీటి సరఫరాను గురువారం ప్రారంభించారు. ఈ నీటి సరఫరా పథకాన్ని గ్రామ సర్పంచ్ బి గౌరీ శంకరరావు చేతుల మీదగా స్విచ్ ఆన్ చేసి ప్రారంభించగా స్థానిక వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్ నీటి కొళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన గుడ్ల హరిప్రసాద్ దంపతులకు అభినందనలను వ్యక్తం చేశారు. అలాగే కాలనీవాసులు కూడా ఎంతోసంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం వర్తక సంఘం అధ్యక్షులు కొత్తకోట విష్ణు ప్రసాద్, వైస్ సర్పంచ్ కిషోర్, మాజీ సర్పంచ్ పాలక ప్రేమా నంద్ కాలనీవాసులు గ్రామస్తులు పాల్గొన్నారు.

**జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో**

# బంగారు పతకం సాధించిన పల్లవి




**నెల్లిమర్ల, జూన్ 1 ప్రభాతవార్త :**
ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నొయిడాలో జరుగుతున్న జాతీయ స్థాయి విశ్వవిద్యాల యాల ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన ఎస్.పల్లవి 64 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించినట్లు కోచ్ చల్లా రాము వెల్లడించారు. నొయిడా నుంచి ఆయన గురువారం ఇక్కడి విలేకర్లకు ఫోన్‌లో మాట్లాడారు. పల్లవి స్నాచ్‌లో 84 కిలోలు బరువు, క్లీన్ అండ్ జర్క్‌లో 108 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సాధించిందని ఆయన వివరించారు. విజయనగరం సత్య డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న పల్లవి ఆంధ్రయూనివర్శిటీ తరపున ఈ పోటీల్లో పాల్గొందని చల్లా రాము వివరించారు. పల్లవిని కోచ్ రాముతో పాటు సంఘం ప్రతినిధులు బిఎస్ఆర్ మూర్తి, లక్ష్మి తదితరులు అభినందించారు.

## టీడీపీతోనే మహిళల భవిష్యత్‌కు భరోసా



**కురుపాం, జూన్ 1 ప్రభాతవార్త :** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీతోనే మహిళల భవిష్యత్‌కు భరోసా ఉందని కురుపాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. గురువారం కురుపాంలో తెలుగుదేశంపార్టీ కార్యాలయం వద్ద కురుపాం నియోజకవర్గం తెలుగ మహిళా విభాగం అధ్యక్షురాలు మాజీ జడ్పీటీసీ సనాపతి పావని ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత నారా చంద్రబాబు పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ నేటి ప్రభుత్వం లో మహిళకు భరోసా లేకుండా పోయిందని అన్నారు. దీనిని గుర్తించి మహానాడులో మా ప్రభుత్వం వస్తే అనేక సంక్షేమ పథకాలు తోపాటు మహిళల భవిష్యత్ కు పూర్తి భరోసా ఇస్తున్నానని చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో ప్రకటించారని అన్నారు. దీనితో మహిళలు టీడీపీపై ఆదరణ చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు డొంకాడ మంగమ్మ, మహిళా ఉపాధ్యక్షురాలు వప్పంగి లావణ్య, లత, దాసరి కిరణ్మయి, మహిళా జనరల్ సెక్రటరీ వెంపటాపు భారతి, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## టీడీపీ మేనిఫెస్టో చూసి వైఎస్ఆర్‌సీపీ వణికిపోతోంది



**పార్వతీపురం, జూన్ 1 ప్రభాతవార్త:** టీడీపీ మేనిఫెస్టో చూసి వైఎస్సార్సీపీ వణికిపోయిందని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. టీడీపీ మేనిఫెస్టో విడుదల సందర్భంగా గురువారం బైక్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా పార్లమెంట్ భవనంలో జగదీష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని గుర్తించి భారత మ్యాప్‌లో అమరావతి రాజధానిగా నిలిచిపోయింది. ఇది చాలు. ఆగస్ట్ లో ముఖ్యమంత్రి వైజాగ్తారని బొత్స సత్తిబాబు చెబుతున్నారని.. అంటే ముఖ్యమంత్రి ఎక్కడికి వెళ్లినా రాజధాని మారిపోతుందని వైసీపీ నేతలను ప్రశ్నించారు. ఇది ప్రజలను అవమానించడమేనని, అయితే మేధావులను ప్రజలు పట్టించుకుంటున్నారని ప్రజలు భావించడం లేదని, తమ వద్దకు వస్తే తగిన సలహాలు ఇస్తారని, వైసీపీ చెప్పే మాటలు ప్రజలు గుడ్డిగా నమ్ముతారని అన్నారు. వైసీపీ మూడు రాజధానులు అన్నారు, నేను ఉత్తర ఆంధ్ర వైసీపీ నాయకులను అడుగుతున్నాను, కార్యనిర్వాహక రాజధాని ఎక్కడ ఉంది, వారు వైజాగ్‌ను పరిపాలన రాజధానిగా ఉంచగలిగారా మరియు అమరావతిని రాజధానిగా ఉంచగలిగారా? భవిష్యత్తులో ఈ విషయంపై వైసీపీ నేతలను ప్రజలు కచ్చితంగా నిలదీస్తారని అన్నారు. తప్పకుండా మళ్లీ క్యాంటీన్లను ప్రారంభిస్తామని చంద్రబాబు నాయుడు అన్నారు. త్వరలో మళ్లీ ఆ మంచి రోజులు వస్తాయని అన్నారు. ఈరోజు మా మేనిఫెస్టోలో అమ్మకు నమస్కారమో, నిరుద్యోగ భృతి, పింఛను ఏది చెప్పినా.. ఇవన్నీ కచ్చితంగా ప్రజల్లోకి వెళుతున్నాయని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ బైక్ రైలును నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు , గర్భాపు ఉదయభాను, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ పొదుపుతోనే పర్యావరణ రక్షణ

### ఈపీడీసీఎల్ ఎస్ఈ నాగేశ్వరరావు




**విజయనగరం రూరల్ జూన్ 1 ప్రభాతవార్త :** విద్యుత్ పొదుపు తోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎపిఈపీడీసీఎల్ ఎస్ఈ పి.నాగేశ్వరరావు అన్నారు. ఈ దిశగా ప్రతీ వినియోగదారుడు ఆలోచన చేసి ఆచరించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం దాసన్నపేట సమీపంలోని సింగ్‌పూర్ సిటీలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ అపార్ట్మెంట్ ల్లో ఉండే వినియోగదారులు విద్యుత్ పొదుపు చేయాలని దీని ద్వారా పర్యావరణ పరిరక్షించవచ్చునని చెప్పారు. నేడు విద్యుత్ అనేది మనిషి నిత్య జీవితంలో బాగమై ఉందన్నారు. విద్యుత్ ను వృధా చేయకుండా పొదుపు పాటించడం ద్వారా ఇంధన ఆదాతో పాటు పర్యావరణ న్ని పరోక్షంగా కాపాడినట్లు అవుతుందన్నారు. దేశంలో రానున్న రోజుల్లో విద్యుత్ అవసరం కోసం 32 లక్షలు కోట్లు కేటాయించాల్సి వస్తుందని మనం పొదుపు పాటించడం,స్టార్ మార్కు ఉన్న వస్తువులను వాడటం ద్వారా ఆ ఖర్చును తగ్గించవచ్చునన్నారు. మన భవిష్యత్ తరాలు వారికి మెరుగైన సమాజాన్ని అందించాలంటే విద్యుత్ పొదుపు పొదుపు చేయాలని సూచించారు. ఈఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు విద్యుత్ తక్కువ వినియోగించే యంత్ర పరికరాలు,స్టార్ గుర్తు ఉన్న వస్తువులు వాడకంపై అవగాహన కల్పించారు. వృధా చేయడం అంటే మన నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు.విద్యుత్ పొదుపుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టెక్నికల్ డిఈ ధర్మ రాజు, ఏడీ ఇ.సత్యనారయణ పాల్గొనగా, సింగ్ పూర్ సిటీ అపార్ట్మెంట్ వాసులతో పొదుపుపై అధికారులు ప్రతిజ్ఞ చేయించారు.

## వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జ్యూస్ పంపిణీ



**విజయనగరం టౌన్, జూన్ 1 ప్రభాతవార్త :** వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడులాంతర్లు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం 50 రోజులు పూర్తయిన సందర్భంగా పాదాచారులకు మ్యాంగోజ్యూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు మండవిల్లి వెంకటరాజు మాట్లాడుతూ వేసవి కాలం వలన ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వడగాల్పులు వీస్తున్నందున మజ్జిగ,మంచినీరు,పండ్ల రసాలు తీసుకోవాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాలి, ఉదయం 10 గంటల నుండి 3 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ఆ సమయంలో ఎవరు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రాజెక్టు ఛైర్మన్ మల్లిఖార్జున రావు, రవ్వ వెంకటేశ్వరరావు, ఏడుకొండలు,కట్టమూరి రత్నారావు, రాంజీ, బొడా నానాజీ, గుంపిన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టీడీపీ నేత గొంప కృష్ణ పుట్టిన రోజు వేడుకలు



**ఎల్.కోట, జూన్1 (ప్రభాత వార్త) :** నియోజక వర్గ టీడీపీ యవనేతగా గత కొంతకాలంగా ప్రచారంలో వున్న గొంప కృష్ణ పుట్టిన రోజు వేడుకలు గురువారం ఎస్.కోట కేంద్రంగా జరిగాయి. ఈయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ నియోజక వర్గం మొత్తంలోని ప్రధాన కూడళ్ల వద్ద రోడ్లకు ఇరువైపులా కటౌట్‌లు వెలిశాయి. ఆయితే ఎల్.కోట మండలంలో ఎక్కడ ఈయన కటౌట్ లేకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటి అనేది తెలియాల్సి వుంది. ఇక్కడ స్థానిక నేత మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని దృష్టిలో పెట్టుకొని గొంప కృష్ణపై అభిమానం వున్నా కొందరు వెనక్కి తగ్గినట్లు సమాచారం. అయినప్పటికీ కొన్ని గ్రామాల నుంచి ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు కొందరు వెళ్లారని తెలిసింది. ఈ వేడుకల సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా నుంచి చంద్రబాబు సూచన మేరకే ఈ నియోజక వర్గంలో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని, పుట్టిన ఊరికి ఈ ప్రాంతం అభివృద్ధికి యువత, మహిళల బాగు కోసం ఏదొటి తనవంతు చేస్తానని రాజకీయల్లో ఉంటే టీడీపీ ప్రభుత్వంతో కలిసి మరింత ఎక్కువ మంచి చేద్దామనే ఆలోచనతో వున్నానని లేదంటే తాను సొంతంగా కొంత సేవ చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. ఇక్కడి ప్రజలకీ ఏదో ఒక మేలు చేసే ఇక్కడి నుంచి వెళతానని అంతవరకు ఎవరు ఏమనుకున్నా తాను ఇక్కడే ఉండి టీడీపీ పార్టీ కోసం ఈ ప్రాంత ప్రజల కోసం పని చేస్తానని తేల్చి చెప్పినట్లు తెలిసింది. దీనితో తాను ఎస్.కోట నియాజక వర్గ రాజకీయాల్లో టీడీపీ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి ఎదురు నిలబడతానని ఇన్ డైరెక్ట్‌గా చెప్పినట్లు తెలుస్తుంది. ఈ పుట్టిన రోజు అందుకే చేసుకున్నట్లు, తాను ఎందుకు, ఎలా, ఎవరి పిలుపు మేరకు రాజకీయాల్లోకి వచ్చింది మీడియా సమక్షంలో ప్రజలకు తెలపడంతో టీడీపీలో రెండు వర్గాలు ఉన్నాయని అందరికి తెలిసి పోయింది. దీనిపై టీడీపీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందో, ఎవరికీ బాసటగా నిలుస్తుందో చూడాలి. ఈ వర్గాల వలన టీడీపీ కంటే వైసీపీకే మేలు జరిగే అవకాశం ఉన్నట్లు రాజకీయా విశ్లేషకులు అంటున్నారు.

## ఘనంగా యువనేత గొంప జన్మదిన వేడుకలు



**శృంగవరపుకోట, జూన్ 1 ప్రభాతవార్త :** ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ పార్టీ యువనేత గొంపక్రిష్ణ జన్మదిన వేడుకలు గురువారం ఎస్.కోటలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో నిర్వహించిన గొంప జన్మదిన వేడుకలలో భారీ కేక్ ను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా యువనేత గొంపక్రిష్ణ కేక్ ను కట్ చేశారు.ఈమేరకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి గొంపక్రిష్ణకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి పుష్పగుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమానికి ముందుగా యువనేత గొంప దేవిబొమ్మ జంక్షన్ వద్ద దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జన్మదిన వేడుకలలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ పేరుపేరునా యువనేత గొంపక్రిష్ణ ధన్యవాదాలు తెలిపారు. ఫంక్షన్ హాల్ వద్ద మధ్యాహ్నం భారీ ఎత్తున భొజనం కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.ఈకార్యక్రమంలో విశాఖ పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్,మండల టీడీపీ పార్టీ కార్యదర్శి జుత్తాడ రామసత్యం, కొత్తవలస మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు గొరిపల్లి రాము, నియోజకవర్గంలో ఉన్న టీడీపీ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ స్వేచ్ఛలో వీధి బాలల గుర్తింపు



**విజయనగరం క్రైం జూన్ 1 ప్రభాత వార్త :** జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది, చైల్డ్ లేబర్ ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ వారితో సంయుక్తంగా ఆపరేషన్ స్వచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ఆయా శాఖల అధికారులు హోటల్స్, జ్యూస్, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు తదితర దుకాణాల్లో ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహించి, వీధి బాలలకు విముక్తి కల్పించారు.దుకాణాల్లో పనిచేసే పిల్లల వారు చదువుకొనే విధంగా చర్యలు చేపట్టి, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి, వారితో పని చేయించే వారిని హెచ్చరించారు.

## ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి : ఎంపీడీఓ



**సీతంపేట, జూన్ 1 ప్రభాతవార్త :** జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని ఎంపీడీఓ సత్యం ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ ఈజిఎస్ ఎపిఓ, టిఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ఉపాధి పనులు చేయించాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

## అధ్యాపకులు భాషా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి



**విజయనగరం, జూన్ 1 ప్రభాతవార్త :** అధ్యాపకులు ఎప్పటికప్పుడు తమ భాషా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. విశ్వవిద్యాలయంలో గురువారం అధ్యాపకులు సాఫ్ట్ స్కిల్స్ పై శిక్షణా కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ రాజు అధ్యాపకులకు ఉండాల్సిన లక్షణాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రతి ఒక్కరు మెదడుకు పదును పెడుతూ బోధనా పద్ధతుల మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పిఎస్‌విరమణరావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, డీన్ ప్రొఫెసర్ కెవిజి కృష్ణమూర్తి,ఎం.లక్ష్మీ నరసింహాచార్యులు, రిటైర్డ్ ప్రొఫెసర్ శాంతమ్మ, మురళీ, ఇన్‌చార్జ్ డీన్ డాక్టర్ సన్నీడియోల్, డాక్టర్ సతీష్, దీపక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వాగ్దేవి పి.జి, డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



**కొత్తవలస, జూన్ 1 ప్రభాతవార్త :** స్థానిక వాగ్దేవి పి.జి, డిగ్రీ కళాశాలలో డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేటు లిమిటెడ్ వారు సౌజన్యంతో క్యాంపెస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌కు సుమారు 70 మంది నిరుద్యోగ యువకులు హాజరయ్యారు. గ్రామీణ ప్రాంత యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పన ధ్యేయంగా ఈ క్యాంపెస్ సెలక్షన్స్ నిర్వహించడం జరిగిందని కళాశాల యాజమాన్యం ప్రిన్సిపాల్ కె.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు కళాశాల యాజమాన్యం తరపున సభ్యులతో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. విచ్చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపెస్ ఎంపిక కమిటీ సభ్యులతో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## రెగ్యులర్ చేయకపోతే గద్దె దింపుతాం

### – సీఎం జగన్‌కు హెచ్చరిక



**బొబ్బిలి, జూన్1 (ప్రభాత వార్త) :** మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులను రెగ్యులర్ చేయకపోతే వైసీపీను గద్దె దించుతామని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు సీఎం జగన్మోహన్ రెడ్డిను హెచ్చరించారు. వివిధ ప్రభుత్వ రంగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ప్రతిపక్ష హోదాలో అసెంబ్లీలో ప్రకటించి, పాదయాత్ర, ఎన్నికల్లో హామీ ఇచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డి ఆచరణలో అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. వైసీపీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ప్రచారం చేసి వైసీపీను ఓడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతిబసు, రాష్ట్ర కార్యదర్శి నూకరాజు, ఎన్.వై. నాయుడు, రాష్ట్ర నాయకులు వరలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, బొబ్బిలి నాయకులు వాసు, వెంకట్, జె.రామారావు, గౌరి, చిన్నికృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

### రెయిన్‌బో చిల్డ్రెన్ హోమ్‌లో

## కుర్చీలు, ఆహార పొట్లాల పంపిణీ



**విజయనగరం టౌన్, జూన్ 1 ప్రభాతవార్త :** డాక్టర్ పివిజి రాజు శత జయంతి ఉత్సవాలలో భాగంగా క్షత్రియ పరిషత్ యూత్ పరిషత్, మహిళా పరిషత్ ఆధ్వర్యంలో 12 నెలలు 12 కార్యక్రమాలు చేపట్టిన సందర్భంగా రెండవ నెల కార్యక్రమంగా స్థానిక రెయిన్‌బో చిల్డ్రెన్ హోమ్‌లో చిన్నారులకి కుర్చీలు, ఆహార పొట్లాల పంపిణి చేయటం జరిగింది. అదేవిధంగా ఒంపిల్లి గ్రామంలో ఉన్న చిల్డ్రన్ హోమ్ నందు ఆహార పదార్థాల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఉపాధ్యక్షులు ఎన్.ఎస్.ఎన్.రాజు, కార్యదర్శి రాంబాబు, శివాజీ రాజు, రామరాజు ఎస్.ఎస్.ఎస్.ఎస్.రాజు యూత్ ప్రెసిడెంట్ శేఖర్ రాజు మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్.ఎస్.ఎస్.ఎస్.రాజు, రామరాజులు మాట్లాడుతూ డాక్టర్ పీ వీ జీ రాజు విజయనగరాన్ని విద్యల నగరంగా మార్చటానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆదర్శ భావాలతో సమాజానికి సేవ చేయాలనే ఉదేశ్యంలో పివిజి శత జయంతి ఉత్సవాలు ఘనం గా నిర్వహిస్తున్నామ అన్నారు. ప్రతీ నెల ఒకటవ తారీఖున ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తామని 2024 మే ఒకటవ తేదీన పీజీవీ జయంతి ఘనంగా జరువుతామని తెలిపారు.

## బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి

### మంత్రి బొత్స సత్యనారాయణకి ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేత



**బొబ్బిలి, జూన్1 (ప్రభాత వార్త) :** నియోజకవర్గంలో రైతు భరోసా నిధులు విడుదల చేయడానికి వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకి స్థానిక ఏఐఎస్ఎఫ్ నాయకులు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవి కుమార్ మాట్లాడుతూ ఎడ్యుకేషన్ హబ్ అయినటువంటి బొబ్బిలిలో ఇప్పటివరకు కూడా ప్రభుత్వ జూనియర్ అండ్ డిగ్రీ కాలేజీ నియమించలేదని తెలియజేశారు. దూరపు ప్రాంతాల నుండి ఎంతోమంది పేద విద్యార్థులు విద్యను అభ్యసించడానికి బొబ్బిలి వస్తున్నారు. అలాంటి పేద విద్యార్థుల సంక్షేమం కోసం ఈ విద్యా సంస్థల ప్రారంభం లోపు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తెలియజేశారు. విద్యను వ్యాపారంగా మారుస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, రాజ్యాంగానికి విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫామ్ పేరుతో అత్యధిక ఫీజు దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి విద్యాసంస్థలు గుర్తింపును రద్దు చేయాలని కోరారు. నూతన విద్యా విధానం విద్యకు ఎంతో హానికారంగా ఉందని, దీన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని కోరారు. అలాగే విజయనగరం జిల్లాలో ఉన్న ఆంధ్రాయూనివర్సిటీ పీజీ సెంటర్ నిలిపివేయడం వలన జిల్లాలో వేలాది మంది విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసుకుని పీజీ జాయిన్ అవుతామనుకున్న కల కలగానే మిగిలిపోతుందన్నారు. జీవో నెంబర్ 77 వలన ఇప్పటికే చాలామంది విద్యార్థులను పీజీ విద్యకి దూరం అవుతున్నారని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం దశలోనే పాఠశాలల సమస్యలు అలాగే మొదటి నెలలోనే అన్ని తరగతుల వారికి పుస్తకాలు సక్రమంగా అందేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు పోలిరాజు, తేజ, సాయి తదితరులు పాల్గొన్నారు. విద్య శాఖామంత్రి బొత్స సత్యనారాయణ బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేస్తామని, అక్రమాలకు పాల్పడుతున్న విద్యాసంస్థల పేర్లు తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## రైతుకు వెన్ను దన్నుగా రైతు భరోసా సాయం



**పార్వతీపురం, జూన్1 (ప్రభాత వార్త) :** ఆరుగాలం శ్రమిస్తున్న రైతుకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని అందిస్తుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మీట నొక్కి ఐదొ ఏడాది తొలి విడత వైఎస్ఆర్ రైతు భరోసా పిఎం కిసాన్ పథకం లబ్ధిదారుల ఖాతాలోని నగదు జమ కార్యక్రమం జరిగింది. పాలకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి వైయస్సార్ రైతు భరోసా, పిఎం కిసాన్ పెట్టుబడి సాయం విడుదల కార్యక్రమానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, స్థానిక శాసన సభ్యురాలు విశ్వరాయి కళావతి, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, సబ్ కలెక్టర్ నూర్ కమల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ దేశంలోని ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు బాసటగా ప్రభుత్వం నిలుస్తుందన్నారు. అటవీ హక్కు పట్టాదారులకు రైతు భరోసా వర్తింపజేస్తుందన్నారు. జిల్లాలోని 306 రైతు భరోసా కేంద్రాలు నిరంతరంగా పనిచేస్తున్నాయన్నారు. ఆర్బికేల ద్వారా రైతులకు తగు సూచనలు, సలహాలు భూ విత్తన పరీక్షలు అందించి వ్యవసాయం లాభసాటికి ప్రత్యేకమైన కృషి చేస్తున్నట్లు తెలిపారు. నూతన జిల్లా ఏర్పాటు అయినా ఏడాదిలోనే 130 రైతు భరోసా కేంద్రాల్లో కష్టం హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి 80పైగా ట్రాక్టర్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అనతి కాలంలోనే పెద్ద ఎత్తున కష్టమహరి సెంటర్లు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. తక్కువ సమయంలో జిల్లాకు నాలుగు సార్లు జాతీయస్థాయిలో గుర్తింపురావడం క్షేత్రస్థాయిలో అధికారులు, ప్రజా సహకారంతో సాధ్యమైందని పేర్కొన్నారు. కష్టంహైరింగ్ సెంటర్‌ల ద్వారా రైతులు తక్కువ డబ్బులు చెల్లించి ఆధునిక యంత్ర పనిముట్లు వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో వరుసగా ఐదవ సంవత్సరం మొదటి విడతగా 1,21,418 రైతులకు పీఎం కిసాన్ కింద రూ.24.28 కోట్లు, వైయస్సార్ రైతు భరోసా కింద 124151 మంది భూ యజమానుల రైతులకు రూ.68.83 కోట్లు, 18779 మంది అటవీ భూమి సాగు చేస్తున్న లబ్ధిదారులకు రూ.14.08 కోట్లు వెరసి మొత్తం 142930 రైతులకు రూ.107.19 కోట్లు లబ్ధిచేకురనున్నట్లు వెల్లడించారు.

## సంక్షేమ పథకాలు అమలులో ఏపీ ముందంజ

### – ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



**నెల్లిమర్ల, జూన్ 1 ప్రభాతవార్త :** సంక్షేమ పథకాల అమలులో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే ముందంజలో ఉందని ఎంఎల్ఎ బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని టెక్కలి, చంద్రంపేట పంచాయితీ పరిధిలోని తుమ్మలపేటలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడ్డుకొండ అప్పలనాయుడుతో పాటు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మమేకమయ్యారు. అలాగే ప్రతి ఇంటికి ప్రభుత్వం నుంచి అందుకున్న సంక్షేమ పథకాలు వివరాలను మరో సారి వివరించి గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడ్డుకొండ మాట్లాడుతూ సంక్షేమ పాలన వైసిపితోనే సాధ్యమని అన్నారు. టిడిపి నాయకుల మాటలను నమ్మవద్దని సూచించారు. ప్రజలను వంచించేందుకు టిడిపి నాయకులు మరో సారి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహనరెడ్డిని మరోసారి ఆశీర్వదించి మళ్లీ సిఎంగా గెలిపిస్తే రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, దక్షిణ మధ్య రైల్వే సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములునాయుడు,జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్లు వెంకటరమణ, వైస్‌ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారికి వైకుంఠంనాయుడు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, తుమ్మలపేట పిఎసిఎస్ ఛైర్మన్ కోట్ల పైడినాయుడు, దంతులూరి జోగిజగన్నాధరాజు (గిరిబాబు), పార్టీ నాయకులు కర్రోతు రాజినాయుడు, నేతేటి అప్పలనాయుడు, మొయిద ఆదినారాయణ, సన్యాసప్పడు, చంద్రంపేట సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, ఎంపీటీసీ వాళ్లే అప్పలనాయుడు, బూరాడపేట సర్పంచ్ బెల్లాన రామారావు, ఎంపీటీసీ సంగంరెడ్డి జగన్నాధం,పెదబూరాడపేట వైస్ ప్రెసిడెంట్ మక్కువ వెంకటరమణ, శ్రీనురాజు, ఎంపీడీఓ జి.గిరిబాల, తహసీల్దార్ కె.వి.రమణరాజు, ఇఓపిఆర్‌డి హెచ్.భానోజిరావు, వివిధ శాఖల అదికారులు పాల్గొన్నారు.

## స్టేట్ స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలు

**పార్వతీపురం జూన్ 1 (ప్రభాత వార్త) :** డా. వై.ఎస్.ఆర్.స్టేట్ స్పోర్ట్స్ స్కూల్, కడపలో 2023-24 విద్యా సంవత్సరానికి నాల్గవ తరగతిలో విద్యార్థుల ప్రవేశానికి ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అధారిటీ ముఖ్యకార్యనిర్వహణాధికారి బి.రామగోపాల్ తెలిపారు. కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో 40 సీట్లు (20 బాలురు+ 20 మంది బాలికలు) మరియు 5వ తరగతిలో 11 సీట్లు (7 అబ్బాయిలు + 4 బాలికలు) నింపడానికి ఎంపికలు నిర్వహించాలని రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు శాప్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరం కోసం సబ్జెక్ట్ స్కూల్‌లో విద్యార్థుల ప్రవేశానికి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఎంపికల నిర్వహి స్తారని, స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుదారుడు పుట్టిన తేదీ ధృవ పత్రం, 1 నుండి 3వ తరగతి వరకు స్టడీ సర్టిఫికేట్, 3 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు జతచేయాల న్నారు. మండల స్థాయిలో ఎం.పి.డి.ఒ. ఛైర్మన్‌గా, తహశీల్దారు, మండల విద్యాశాఖాధికారి, హెడ్‌మాస్టరు సభ్యులుగా 15.06.2023 తేదీ నుండి 20.06.2023 వరకు మండల ప్రధాన కేంద్రంలో ఎంపిక జరుగుతుందని, జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ ఛైర్మన్‌గా జిల్లా చీఫ్ కోచ్, సీనియర్ కోచ్ సభ్యులుగా సిఇఒ, డిఎస్ఎ, కన్వీనర్‌గా 22.06.2023 నుండి 26.06.2023 తేదీవరకు జిల్లా కేంద్రంలోను, రాష్ట్ర స్థాయి ప్రక్రియ 29.06.2023 నుండి 30.06.2023 తేదీ వరకు ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల విద్యాశాఖాధికారులు నాలుగు,5వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి ఎంపిక ట్రయల్స్ నిర్వహించాలని, రాష్ట్ర స్థాయి ఎంపిక ట్రయల్స్‌కు డిప్యూట్ చేయడానికి వీలుగా, జిల్లా స్థాయి ఎంపిక ట్రయల్స్ చేసి ఎంపిక చేసిన క్రీడాకారుల వివరాలను తెలియజేయాలని కోరారు.

## అంబికాబాగ్‌లో శాంతి హోమం

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త



శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంకు దత్తత దేవాలయమగు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయము నందు గురువారం నాడు స్వామి వారికి ప్రాత:కాలమున విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటల కి మహాశాంతి హోమం జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవములలో భాగం గా శుక్రవారం సాయంత్రం వైదికసదస్యం తిరువీధి ఉత్సవము, శనివారం చూరర్ణోత్సవం అవభృత్సవం చక్రస్నానం మధ్యాహ్నం పూర్ణాహుతి సాయంత్రం ధ్వజా ఆవరోహణము ఆదివారం ద్వాదశ ప్రదక్షిణలు శ్రీ పుష్పయాగం పవళింపు సేవా జరుపునున్నారు. ఆలయ ఈఓ కె శిరీష పర్యవేక్షణలో ఈకార్యక్రమాలు జరుగుతున్నాయి.

## 3న మాస్ట్రో ఇళయరాజా చిత్ర గీతాలు

### హాజరుకానున్న సినీ, టీవీ గాయకులు -పోస్టర్ ఆవిష్కరించిన మేయర్

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త



భారతీయ సినీ సంగీత దర్శకులు ఇళయరాజా ఎస్పీబాల సుబ్రహ్మణ్యం 77వ జన్మదినోత్సవాలను పురస్కరించుకోని ఈనెల 13న కళాభారతి ఆడిటోరియంలో మాస్ట్రో ఇళయరాజా స్వరపరచిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు యాక్మీ స్వచ్ఛంద సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు పొలమరశెట్టి ప్రతాప్ కుమార్ తెలిపారు. వీటికి సంబంధించిన వాల్‌పోస్టర్ ను జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి గురువారం ఆమె చాంబర్లో విడుదల చేశారు.ఆజాది కా అమృత్ మహోత్సవం ప్రపంచవం ప్రపంచ పర్యావరణ దినత్సోవల్లో భాగంగా ఈనెల 3వ తేదీన మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం లో నిర్వహిస్తున్న సినీ సంగీత విభావరి లో సినీ నేపధ్య గాయకులు నిత్య సంతోషిని నెల్లూరు రాము నాధప్రియ అధికారి డా.జి లక్ష్మీశా హాజ్రాత్ యాక్మి ప్రతాప్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుటమూరి సతీష్ వైకాపా ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు చెన్నా తిరుమల రావు యాక్మి ప్రతినిధులు పి పర్వేష్, కౌషిక్ తదితరులు పాల్గొన్నారు.

## రాయఘడలో డిఆర్ఎం తనిఖీలు ...
## ప్రయాణీకుల సౌకర్యాలపై ప్రజా ఇంటరాక్షన్ ..

జ్ఞానాపురం, జూన్ 1 , ప్రభాతవార్త



వాల్తేరు డిఆర్ఎం అనూప్ సత్‌పతి రాయఘడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. గురువారం ఆయన రాయఘడ స్టేషన్‌లో చేపడుతున్న అభివృది పనులను ఆయన అదికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సంధర్బంగా ఆయన అక్కడి మీడియాతో మాట్లాడినట్టు రైల్వే ఉన్నతాదికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఎం రైల్వే వాల్తేరు డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్నట్టు డిఆర్ఎం తెలిపారు. ఈ సంధర్బంగా ఆయన రైల్వే ప్రయాణికులతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యలను డిఆర్ఎంకు తెలిపారు. దీనిలో బాగంగానే మాజీ పార్లమెంట్ సభ్యులు బాలబందర మహిజీ కూడా మాట్లాడారు. రైల్వే ప్రజలకు అందుబాటులో ఉండాలని , గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల ప్రయాణికులకు రైళ్ళు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. అలాగే ఈ కార్యక్రమంలో ప్రస్తుత నవరంగపూర్‌కు పార్లమెంట్ సభ్యులు రమేష్ చంద్ర మహాజీ కూడా పాల్గొని రైల్వే ప్రయాణికులకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు. హిరాకుడ్ ఎక్స్ ప్రెస్ రైలును కోరాపుట్‌లో నిలుపుదల చేసేందుకు అవసరమైన అనుమతులు వచ్చినట్టు ఆయన తెలిపారు.. ఈ రైలుకు కోరాపుట్ రోడ్‌లో డిఆర్ఎం సత్‌పతి జెండావూపి ప్రారంబించారు. ఈ సందర్బంగా ఆయన కోరాపుట్ రోడ్డులోని స్టేషన్‌లో ప్రజలతో మాట్లాడారు. రైల్వే ప్రయాణికుల సమస్యలు ఆయన ఓపికగా విన్నారు. ప్రయాణికులు కోరిన పలు అంశాలను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఆయన ప్రయాణికులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైల్వే అదికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 13వ వార్డులో మలేరియా వ్యతిరేక వారోత్సవాలు

ఆరిలోవ, జూన్ 1, ప్రభాతవార్త



జీవీయంసీ 13వ వార్డు పరిధిలోగల ఆరిలోవ లో మలేరియా వ్యతిరేక వారోత్సవాలు వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతసత్య నారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డులో ర్యాలీ నిర్వహించారు. జూ 1 నుండి 30 తారీకు వరకు మలేరియా వారోత్సవాలు జరుగుతాయని, నీటని నిలువ ఉండకుండా చూడాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమలు అభివృద్ధి చెందకుండా చూడాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మలేరియా శానిటరీ ఇన్స్పెక్టర్ మంగరాజు, మలేరియ సిబ్బంది, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సిఎల్ కన్సర్ట్స్, రాప్‌సోడీ మ్యూజిక్ ఫౌండేషన్ కర్నాటక సంగీత కళాన్వేషణను సమర్పిస్తోంది.

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

భారతీయ శ్యాస్త్రీయ సంగీత కళా క్షేత్రములో తర్వాతి తరం ప్రతిభా పాటవాలను గుర్తించడం పోషించడం మద్దలు ఇవ్వడం పట్ల లక్ష్యంగా చేసుకున్న కళావేదిక అయిన హెచ్‌సిఎల్ కన్సర్ట్స్ రాప్‌సోడీ మ్యూజిక్ ఫౌండేషన్ కర్నాటక సంగీత కళాన్వేషణ 18నుంచి 30సంవత్సరాల వయో సమూహములోని సీనియర్ స్థాయి కర్నాటక సంగీత కళాకారులను గుర్తించి వారిని సాధికారపరచడం పట్ల లక్ష్యంగా చేసుకోంది. ఈపోటీల మొదటి రౌండు జూన్ 1వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ నుంచి జూన్ 25వరకూ తెరవబడి ఉంటుంది. రిజిస్టర్ చేసుకోవడానికి పాల్గొనే వ్యక్తులు హెచ్‌టిటిపిఎస్://డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.హెచ్‌సిఎల్ కన్‌సెరట్స్.కమ్/ది-కారనెటిక్-క్యాఈఎస్ట్/ కి లాగాన్ కావచ్చు ఎంతో సునితశితమైన శ్రద్ధతో కర్నాటక కళాన్వేషణ నాలుగు గ్రహ్వాతా రౌండ్లను కలిగి ఉంటుంది. పోటీదారులు తమ ప్రదర్శన వల్ల మరియు బహుమతి అవకాశాల నుంచి ప్రయోజనం పొందడం మాత్రమే కాకుండా నిపుణులైన న్యాయ నిర్ణేతల నుంచి అమూల్యమైన సలహా సూచనలను కూడా అందుకుంటారు. కర్నాటక్ క్వెస్ట్, జూనియర్ ఎడిషన్‌ని వరుసగా 15-30 సంవత్సరాల వయో సమూహం లోని కర్నాటక సంగీత కళాకారుల కొరకు పరిచయం చేశాయి. సంగీత కళాకారుల నుంచి విశేషమైన స్పందన లభించింది. ఈ వేదిక విభిన్న వయో సమూహాల వ్యాప్తంగా భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని ప్రోత్సహిస్తూ పెంపొందిస్తునే కర్నాటక సంగీత ప్రియులను ఆకర్షించే వర్చువల్ సంగీత తీర్థయాత్రగా ఉద్భవింపచేయడానికి రూపకల్పన చేయబడింది.

## నేడు 11కేవీ సీతంపేట ఫీడర్ విద్యుత్ మరమ్మతులు

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయాం తగ్గించే నిమిత్తం శుక్రవారం నాడు ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో 11కేవీ సీతంపేట ఫీడర్ విద్యుత్ మరమ్మతులు చెట్లు కొమ్మలు ట్రిమ్మింగ్ చేసే నిమిత్తం ఈ క్రింద పేర్కొన్న ప్రాంతాలలో ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుంది. సీతంపేట మెయిన్ రోడ్డు విజయహాస్పిటల్ ఏరియా గురుద్వారా ఏరియా, శాంతిపురం, జీవీకే ప్లాజా రామ హాస్పిటల్ ఏరియా రిలయన్స్ పెట్రోల్ బంక్ ఏరియా ఈఈ జోన్-1, వివిఎస్‌పి జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

## బాలల హక్కుల పరిరక్షణలో గ్రామ, వార్డుస్థాయి సచివాలయాల భాగస్వామ్యం కీలకపాత్ర

జగదాంబ,జూన్1, ప్రభాతవార్త



రాష్ట్రంలోని గ్రామ,వార్డు స్థాయి సచివాలయాల సిబ్బంది యావత్తు భాగస్వామ్యమై బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, కమిషన్ సభ్యులు డా.గొండుసీతారాం తెలిపారు. విశాఖ పర్యటనలో ఉన్న వీరు గురువారం నగరంలోని సీతమ్మధారలో గల 14,15 16 వార్డుల సచివాలయాలకు సంబంధించిన సిబ్బందితో సమావేశమై బాలల కోసం అందిస్తున్న సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అప్పారావు, సీతారం మాట్లాడుతూ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, సూచనల మేరకు మేరకు నుండి నెలాఖరువరకు రాష్ట్రా స్థాయిలో బాలకార్మికుల నిర్మూలన లక్ష్యంగా సంబంధిత అన్ని ప్రభుత్వవిభాగాలు, శాఖల అధికారిక యంత్రాంగం, ప్రజా ప్రతినిధుల , స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో కలిసి సమన్వయంతో పనిచేస్తున్న తరుణంలో వార్డుల సచివాలం సిబ్బంది పూర్తిస్థాయిలో సహాయ సహకారాలతో అడుగులు వేయాల్సి ఉందన్నారు. బడి బయట ఉన్న బాలలను గుర్తించి తిరిగి బడిలో చేర్పించాలని, డ్రాప్ అవుట్ కాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు తరచుగా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో గల బాలలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, రక్తమీనత లేకుండా జాగ్రత్తలు పాటించాలని, వైద్యపరీక్షలు దివ్యాంగ బాలలకు పెన్షన్లు జారీచపాఠశాలల్లోచేరిపంచేలా చర్యలకు యుద్ధ ప్రాతిపదికన ఆదేశాలు జారీ చేసారు. సమతుల్య పౌష్టిక ఆహారాన్నిఅందించే ప్రభుత్వ వ్యవస్థల పనితీరుపై డేగకళ్ళతో పర్యవేక్షణ జరపాలనిసూచించారు. రాష్టంలోని వార్డుల సచివాలయాల సిబ్బంది పిల్లల సేవల్లో నిస్తేజం, నిర్లిప్తతో వ్యవహరిస్తే వారిపై శాఖాపరమైన చర్యలకు రాష్ట్రప్రభుత్వంతో పాటు ఆయా జిల్లాల కలెక్టర్లు,ఉన్నతాధికారులకు సిఫారసులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీలత, జిల్లా బాల సంరక్షణ అధికారి ఎం.రమేష్, సచివాలయాల ప్రతినిధులు బి.మహాలక్షిం, కెవి.సాయిశ్రావణి, ఎస్.శిరీష, వి.వెంకటలక్ష్మి, వి.శ్యామల , వైమంగ, బి.సతీష్, లావణ్య హేమలత, సాయిశ్రావణి, ఆదిసోంబాబు,ఎన్.జనార్ధనరావు పాల్గొన్నారు.

## పాకిస్థాన్ నుండి విడుదలైన మత్స్యకారుడిని పరామర్శించిన కోలాగురువులు

జగదాంబ, జూన్1, ప్రభాతవార్త



ఇటీవల పాకిస్తాన్ నుండి విడుదలైన మత్స్యకారుడు మైలపిల్లి భాస్కరరావు స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా, ఎచ్చెర్ల మండలం,జాలారికొయ్యిం గ్రామానికి రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలాగురువులు వెళ్ళి ఆయనను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులు యోగక్షేమాలు అడిగి తెల్సుకుని ప్రభుత్వ నుండి సాయం అందించేలా తన వంతు కృషిచేస్తానని చెప్పారు. గురువులు వెంట మత్స్యకార సంఘం జిల్లాప్రెసిడెంట్ నర్సింగ్‌రావు,కొమరశంకర్‌రావు, మత్స్యకార కార్పొరేషన్ సెంట్రల్ బోర్డు డైరెక్టర్ బర్రి తోటమ్మ, స్థానిక మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో అభివృద్ధి మోదీ ఘనత: విశాఖ జిల్లా అధ్యక్షుడు సంజీవరావు

జగదాంబ, జూన్1, ప్రభాతవార్త



ప్రధాని నరేంద్రమోడీ 9 ఏళ్ళ సుపరిపాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రచారంలో భాగంగా అక్కయ్య పాలెంలో గురువారం నిర్వమించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిధిఇగా బిజెపిఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడూరి సంజీవరావు పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో ఎస్సీమోర్చారాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో కార్యాచరణ ప్రణాళిక రూపొందించారన్నారు. సేవ,సూపరిపాలన పేరిట నెలరోజులపాటుపలు క్యాత్రాలు జరుగుతాయన్నారు. దేశంలో అంతరిక్షం నుంచి వ్యవసాయం వరకు అన్ని రంగాలలో ప్రధానిమోడీ అభివృద్ధి అభివృద్ధి సాధించారని కొనియాడారు. ఆర్టికల్ 370 రద్దు, త్రిబుల్‌తలాక్, రామజ్మభూమి సమస్యపరిష్కారం, సచ్చభారత్, మేకిన్‌ఇండియా,సర్జికల్‌స్ట్రైక్ వంటి ఎన్నో సాహసోపేతమైననిర్ణయాలు తీసుకుని భారతదేశ ఆర్థి వృద్ధి ప్రపంచంలో ఐదో స్థానానికి పెంపొందించి విశ్వనేతగా ప్రధానమోడీ ఎదిగిఎన్నో విజయాలు సాధించారన్నారు.నెలరోజులపాటు బిజెపికేంద్ర ప్రభుత్వసంక్షేమ పథకాలను, ప్రధాని మోడీ సాధించిన విజయాలను ప్రజలకు తెలియచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీమోర్చా నాయకులు మంచానాగ్ మల్లీశ్వరి,విజయలక్ష్మి, కె.మధుసూదనరావు, బి.పోతురాజు, జి.రామచంద్ర, జె.శ్రీనివాస్, ఈశ్వరరావు,కళ్యాని తదితరులు పాల్గొన్నారు.

## ఉర్రూతలూగించిన సినీ సంగీత విభావరి


జగదాంబ, జూన్1, ప్రభాతవార్త



పల్లా వెంకటేష్ మ్యూజిక్ సినీ సాంస్కృతిక సంగీత సంస్థ ఆధ్వర్యంలో నటశేఖర్ డాక్టర్ పద్మభూషణ్ సూపర్ స్టార్ కృష్ణ జయంతిని పురస్కరించుకుని ద్వారకానగర్ పౌరగ్రంధాలయం కాన్ఫరెన్స్ హాల్లో సినీ సంగీత విభావరిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ గాయనీ గాయకులు పల్లా వెంకటేష్‌మాష్టార్, పి.అమ్మాజిరావు, ఎంవిఆర్‌నాగేశ్వరరావు,మహమ్మద్‌ఖాన్ వెంకట్, ఎఐ నాయుడు పల్లాబాబ్జి,గాయనీమణులు పాల్గొని సూపర్‌స్టార్ కృష్ణ నటించిన పలు చిత్రాల్లోని సినీ గీతాలను మధురంగా ఆలపించారు.

## వరుసగా ఐదో ఏడాది మొదటి విడతగా రైతుల ఖాతాల్లోకి వైఎస్సార్ రైతు భరోసా నగదు జమ

జగదాంబ, జూన్1, ప్రభాతవార్త



రైతుకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని అందిస్తుదని జిల్లా కలెక్ట్ రవిపట్టన్ శెట్టి అన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన రెడ్డి మీట నొక్కి ఐదో ఏడాది తొలి విడత వైఎస్సార్ రైతు భరోసా పిఎం కిసాన్ పథకం లబ్దిదారుల ఖాతాలోని నగదు జమచేసి కార్యక్రమం జరిగింది. పట్టణంలోని గుండాల వద్ద గల సచివాలయాల సమావేశ మందిరంలో గురువారం నిర్వహించి జిల్లాస్థాయి వైయస్సార్ రైతు భరోసా, పిఎం కిసాన్ పెట్టుబడిసాయం విడుదల కార్యక్రమానికి అనకాపల్లి ఎంపి డాక్టర్ బివి సత్యవతి, జిల్లాకలెక్టర్ రవిపట్టణ్‌శెట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని ఎక్కడాలేని విధంగా రాష్టంలో రైతు భరోసా కేంద్రాలు ఏరాటుచేసి రైతులకు బాసటగా ప్రభుత్వం నిలుస్తుందన్నారు. ఆర్బికేల ద్వారా రైతులకు తగిన సూచనలు, సలహాలు, భూ విత్తన పరీక్షలు అందించి వ్యవసాయం లాభసాటికి ప్రత్యేకమైన కృషిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో వరుసగా ఐదవ సంవత్సరం మొది విడతగా 2,59,549 రైతులకు రూ.194.66 కోట్లు. ఏ ప్రిల్ మే మాసాలలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన 698 మంది రైతులకు ఇన్పుట్ సబ్సిడి రూ.12.89 లక్షలు విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ పలకా యశోద, వ్యవసాయ శాఖజెడి మోహన్‌రావు, హార్టికల్చర్ డిడి ప్రభాకర్ రావు, ఎంపిపి పెంటకోట జ్యోతి పెంటకోట శ్రీనివాస్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు వివిధ మండలాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అగనంపూడి బరియల్‌గ్రౌండ్ అభివృద్ధి : శంకుస్థాపన చేసిన జివిఎంసి మేయర్

అగనంపూడి, జూన్ 1, ప్రభాతవార్త



అగనంపూడిలో 48.80 లక్షల జివిఎంసి నిధులతో శ్మశానము అభివృద్ధికి గ్రేటర్ విశాఖ మున్సిపల్ మేయర్ గొలగాని హరివెంకటకుమారి పాల్గొని బరియల్‌గ్రౌండ్‌కు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ నగర అభివృద్ధి తన సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, 79వ వార్డు కార్పొరేటర్ రౌతుశ్రీనివాస్, శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ దగ్గర్లో గల విజయ వేకెన్సీఅపార్ట్‌మెంట్ వారు భారీ క్రేసు రోడ్డుపైన పనిచేయడం వలన జనరల్ హాస్పిటల్ రోడ్డుపై వచ్చి పోయే పాదచారులు, వాహనదారులుచాలా ఇబ్బందులకు గురవుతున్నారని, జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు భాధ్యులని దీనిపై వెంటనే చర్య తీసుకోవాలని మేయర్‌కి ఫిర్యాదు చేసారు. ఈ కార్యక్రమంలో ఇఇ ప్రసాద్‌బాబు, ఇఇ వెంకటలక్ష్మి, స్థానిక పెద్దలు పూర్ణానంద శర్మ, బలిరెడ్డిసత్యనారాయణ, మహాలక్ష్మినాయుడు, సింగిడి సింహాచలం, నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా సుబ్రమణ్యస్వామి వారి విగ్రహ ప్రతిష్ట

అనకాపల్లి, జూన్ 1, ప్రభాతవార్త



అనకాపల్లి గవరపాలెంలో కొలువైన శ్రీకామాక్షిదేవి ఆలయంలో గురువారం శ్రీసుబ్రహ్మణ్యస్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గురువారం శ్రీసుబ్రహమణ్యస్వామి విగ్రహదాతలు పొన్నాడ సుందరయ్య (చిట్టి) కుమారులు వెంకటసత్య నర్సింహచారి, బ్రహ్మజీ కుటుంబ సభ్యులు విగ్రహ ప్రతిష్ఠచేసారు. ఉదయం వేదపారాయణను పంగగవ్య ప్రాసన, ప్రతిష్ట సంకల్పం, గర్తన్యాసము, పూర్ణాహుతి, ఆలయ మండపంలో శాంతి కళ్యాణం నిర్వహించారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, పార్లమెంట్ సభ్యురాలు భీశెట్టి వెంకటసత్యవతి విష్ణుమూర్తి దంపతులు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్న సమారాధన ప్రారంభించిన పార్లమెంట్ పార్టీ పరిశీలకులు దాడిరత్నాకర్ ఆలయ కమిటీ సభ్యులు ఆయన ఘనంగా సత్కరించారు.ఈకార్యక్రమంలో కార్పొరేటర్ పీలా లక్ష్మిసౌజన్య రాంబాబు, 8వ వార్డు ఇన్‌చారిజ కొణతాల భాస్కరరావు, పట్టణం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కోటిపల్లి జోజిబాబు, ప్రధానకార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారి పొన్నాడ వెంకటసత్య నరసింహాచారి (పెదబాబు), పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## 398 లీటర్ల నాటుసారా .. 13 లిక్కర్ బాటిళ్ళు నిర్వీర్యం

రాజవొమ్మంగి, జూన్ 1, ప్రభాతవార్త



అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం జెడ్డంగి పోలీస్‌స్టేషన్ లో జెడ్డంగి, గంగవరం, రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్ల పరిధిలో గత రెండేళ్ళలో 35 కేసుల్లో పట్టుకున్న 398 లీటర్ల నాటుసారా, 13 లిక్కర్ బాటిళ్ళనులో మద్యంను నిర్వీర్యం చేయడం జరిగింది. రంపచోడవరం ఎఎస్పీ జగదీష్ అడహళ్ళి ఆద్వర్యంలో తీసిన గోతిలో మద్యంను పారబోసి కప్పి వేసారు. ఈసందర్భంగా సిఐ షేక్ బాజీలాల్ మాట్లాడుతూ నాటుసారాపై సమాచారం తెలియజేయవచ్చునని అన్నారు. చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో సిఐ షేక్ బాజీలాల్, ఎస్ఐలు కె.షరీఫ్, తొర్లపాటి గోపి నరేంద్రప్రసాద్, విఆర్వోలు భారతి, నాగేశ్వరరావు, పోలీసులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్నది
## కులాల మధ్య పోరు కాదు,
## వర్గ పోరాటమే

5వ పేజి తరువాయి

శ్రమకోర్చి సకల జనుల కల్యాణమే పరమార్థంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఐదున్నర కోట్ల జనసంఖ్య ఉన్న రాష్ట్రంలో ఏ కుటుంబమూ ఆర్థిక లేదా ఆరోగ్య సమస్యతో బాధపడకుండా చూడడానికి ప్రభుత్వమూ, పాలకపక్షమూ శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. అవసరమైతే కేంద్ర ప్రభుత్వానికి నచ్చచెప్పి మరీ వేలాది కోట్ల రూపాయలు ఏపీకి మంజూరు చెయించి, బడుగు బలహీనవార్గాల ఆయురారోగ్యాల కోసం అధనాన్ని రాష్ట్ర సర్కారు ఖర్చుచేస్తోంది. నవ్యాంధ్ర ప్రదేశ్ లో ఇంత మంచి శుభకార్యాలు జరగుతుంటే కులాల మధ్య కుమ్ములాటలు ఉన్నట్టు కొందరు చాలా కిలంగా చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారు. దాదాపు మూడున్నర సంవత్సరాలు ఓపిక పట్టిన ప్రియతమ ముఖ్యమంత్రి కిందటేడాది డిసెంబర్ నెలలోనే ఈ విషయంపై సూటిగా అర్థమయ్యే మాటలతో స్పష్టత ఇచ్చారు. 2023 డిసెంబర్ 16న 'గడప గడపకూ మన ప్రభుత్వం' అనే ప్రజా సంపర్క కార్యక్రమం తీరుతెన్నులను సమీక్షించడానికి ఏర్పాటు చేసిన మంత్రులు, పార్టీ శాసనసభ్యుల సమావేశంలో ముఖ్య మంత్రి ఈ విషయం గురించి మాట్లాడారు. రాష్టంలో జరుగుతున్నది కుల పోరాటంలో పేదల పక్షానే నిలబడాలి, అని జగన్ గారు చాలా సూటిగా స్పష్టంగా చెప్పారు. ఇక్కడ ధనికులుకు, పేదలకు మధ్య పోరు అంటే ఈ రెండు వర్గాల మధ్య హింసాత్మక భౌతిక పోరాటంకాదు. తమ సంపద మరింత పెంచుకోవడానికి సంపన్నులు అక్రమమార్గంలో పేదలకు మధ్య పోరు అంటే ఈ రెండు వర్గాలమధ్య హింసాత్మక భౌతిక పోరాటంకాదు. తమ సంపద మరింత పెంచుకోవడానికి సంపనున్నలు అక్రమమార్గంలో పేదలను దోపిడీ చేయడానికి ప్రయత్నించినప్పుడు, బడుగులు వారిని ప్రతిఘటించడం అని గ్రహించాలి. ఈ ప్రతిఘటనలో పేదల పక్షాన పలకపక్షమైన వైఎస్సార్సీపీ ప్రభుత్వం, నాయకులు, కార్యకర్తలు ఉండాలనేది ముఖ్యమంత్రి ఉద్దేశం.

**జనవరిలో కూడా సీఎం ఇదే విషయం చెప్పారు కదా..**

ఈఏడాది జనవరి మొదటి వారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, రాష్టంలో నేడు జరుగుతున్నది పేదలకూ, పెట్టుబడిదారులకు మధ్య వర్గపోరాటం. అంతేగాని కులాల కుమ్ములాట కాదు. పేద ప్రజలను దోచుకోవడానికి సిద్ధమైన వారితో నేను పోరాడుతున్నా. ఈ పోరాటంలో నాకు బలహీనవర్గాలు, దేవుడి తోడ్పాటు అవసరం, అని స్పష్టంచేశారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన ద్వారా పేదలకు మేలు చేయడం ఇష్టంలేని ధనిక వర్గాలతో తమ పార్టీ పోరాడుతోందని కూడా ఆయన తేల్చిచెప్పారు ఈ బహిరంగ సభలో ఇంకా, మే నెల 12 శుక్రవారం నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన ప్రజా సమావేశంలో మాట్లాడుతూ, రాష్టంలో నేను వర్గ పోరాటంలో నిమగ్నమయ్యాను. నాపోరు పేదల సంక్షేమం కోసమే టీడీపీ అధినేత ఎన్ చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ధనిక పెత్తందారీ వర్గాలు నాపై పోరు సలుపుతున్నారు. పేదలకు న్యాయం చేసే ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ - పేదల బ్యాంకు ఖాతాల్లోకి నగదు బదిలీ) పథకాలు, ఇతర సంక్షేయ కార్యక్రమాలను అడ్డుకోవడానికి ఈ వర్గాలు నాతో తలపడుతున్నాయి, అంటూ సీఎం జగన్‌గారు చక్కగా వివరించారు. పేదలకు ఎలాంటి లోపాలు లేకుండా నేరుగా నగదు బదిలీ ద్వారా, ఇతరత్రా మేలు చేసే పథకాలను అడ్డుకునేవారు స్వార్ధపరులైన ధనికులనీ , వారు తమ పోకడల ద్వారా పేదలతో యుద్ధం చేస్తున్నారని అంటూ ఎలాంటి అనుమానాలకు తావులేకుండా చెప్పినాడని కొందరు రాజకీయ ప్రత్యర్థులు ముఖ్యమంత్రి మాటలకు ఇటీవల వక్రభాష్యం చెప్పే ప్రయత్నం చేశరు. ఆరు నెలల కాలంలో మూడు వేర్వేరు సందర్భాల్లో జగన్ గారు వరర్గపోరు అనే మాట వాడడంతో సామాన్య ప్రజానీకానికి మాత్రం దాని భావం చక్కగా బోధపడింది.


CLASSIFIEDS

VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, YEDLAPALLI SANTOSH KUMAR S/o Yadlapalli Bhaskara Rao R/o 21-42-8/1, Chengalarao peta, Vizag, changing my name from Yedlapalli Santosh Kumar to Yadlapalli Santosh Kumar S/o Yadlapalli Bhaskara Rao henceforth being called as YADLAPALLI SANTOSH KUMAR for all purposes.

(Ro.No. 9698)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## తెదేపా మేనిఫెస్టోపై మహిళల హర్షం



హుకుంపేట, జూన్ 1, ప్రభాతవార్త

టిడిపి అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ మహిళలకు వివిధ రకాల పథకాలను అమలు పరుస్తూ అన్ని విధాల లాభం చేకూర్చే విధంగా ఇటీవల జరిగిన మహానాడులో తెలుగు దేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు మేని ఫెస్టోను రూపొందించి ప్రకటించడంపై స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హుకుంపేట మండల కేంద్రంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి సిరిగం సూర్యకాంతం ఆధ్వర్యంలో స్థానిక మహిళలు గురువారం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడునీ పటం కట్టాలని ఆకాంక్షించారు. అరుకు పార్లమెంట్ మహిళ ప్రధాన కార్యదర్శి సాగరీ సత్యవతి, సర్పంచులు కంబిడి సరోజిని కుమారి, సోమల సత్యవతి, మండల నాయకులు ఉమా, అప్పలమ్మ, ఉమామహేశ్వరి, పద్మ, సాయి, మోద పాల్గొన్నారు.

## సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి : సర్పంచ్

హుకుంపేట, జూన్ 1, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మేలు రకమైన సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మట్టు జోరు సర్పంచ్ శ్రీధర్ సాంబ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక రైతు భరోసా కేంద్రంలో 90శాతం సబ్సిడీతో ఆర్జిఎల్ 2537 రకం ధాన్యం విత్తనాలను మట్టు జోరు, తాడేపుట్టు, రంగపెల్లి, దబ్బబంద, పెట్టుగోడలు, కుంతుర్ల, నక్కలపుట్టు గ్రామాలకు చెందిన 56 మంది రైతు లకు సర్పంచ్ చేతులు మీదుగా పంపిణీచేశారు. పంచాయితీ పరిధిలో ఉన్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఏగ్రికల్చర్ అసిస్టెంట్ దీప మోహన్‌రావు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 337 లీటర్ల నాటుసారా పట్టివేత



హుకుంపేట, జూన్ 1, ప్రభాతవార్త

మండలంలో నాటు సారాపై ఉక్కు పాదం మోపుతామని హుకుంపేట ఎస్సై బి సతీష్ గురువారం తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్పీ ధీరజ్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలో గత సంవత్సరం పాటు నాటుసారపై దాడులు నిర్వహించి 337 లీటర్ల నాటుసారాతో పట్టుబడిన 16 కేసుల ముద్దాయిలకు డిమాండ్‌కు తరలించామన్నారు. అదే కాక మండలంలో నాటుసార కలిగిన నాటుసార తయారు చేసిన అటువంటి వారికి ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు. సారాతో పట్టుబడిన సారా తయారుచేసిన మూడు సంవత్సరాల జైలు శిక్ష అనుభవిస్తారనని ఆయన తెలిపారు. గ్రామాలలో నాటు సార నిరోధానికి గ్రామ మహిళ పోలీసులు ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి అటువంటి వారిపై తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. బానిసలై నేటి యువత తన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని సారాను అరికట్టేందుకు గ్రామంలో ప్రతి ఒక్కరు సహకరించాలని నాటు సారా నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిఐ సుధాకర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జెసిఎఫ్ చర్చ్ పాస్టర్ పి.బిషప్ మృతి



హుకుంపేట, జూన్ 1, ప్రభాతవార్త

హుకుంపేట జెసిఎఫ్ చర్చ్ పాస్టర్ పి.బిషప్ మృతి చెందారు. 1959లో హుకుంపేట గ్రామంలో మొట్టమొదటి చర్చిని ప్రారంభించి దైవజనులుగా ఎంతోమందిని ప్రబోధించారు. 94సం.లు నిండిన ఆయన గత కొంతకాలంగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో విశాఖ పట్నంలో గల అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృత్యువాత పడ్డారు. మృత్యువాత పడిన ఆయనను తన సొంత గ్రామమైన హుకుంపేట గ్రామంలో శుక్రవారం దహన సంస్కరణలు నిర్వహిస్తారు.

## ఎఎల్ పురంలో గడపగడపకు మన ప్రభుత్వం



గొలుగొండ, జూన్1, ప్రభాతవార్త

ప్రజా సంక్షేమ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. మండలంలో గల ఎఎల్ పురం గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చారన్నారు. సంక్షేమ పథకాలకు అర్హులైఉండి పొందని వారు ఉంటే తెలుసుకుని పథకాలను అందించడంకోసమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రూపొందించినట్లు తెలిపారు. పార్టీలకతీతంగా ప్రతీ ఒక్క లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు చేరవేసిన ఘనత వైఎస్సార్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ సిహెచ్ భాస్కరనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, ఎంపీపీ జి.మణికుమారి, స్థానిక సర్పంచ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, స్థానిక ఎంపీటీసీ సభ్యులు బుల్లి ప్రసాదు, కృష్ణ, మండల యూత్ అధ్యక్షులు రామకృష్ణ నాయుడు, చోద్యం పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఎఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగనన్న పాలన దేశానికే ఆదర్శం

### గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

పాడేరు, జూన్ 1, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనుసరిస్తున్న పాలన సంస్కరణ విధానాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. జి.మాడుగుల మండలం నుర్మతి పంచాయితీ మద్ది వీధి, ఇసుక గరువు, చేరువీధి, నక్కల మెట్ట, దానుదు కొండ, తోక గరువు, కొత్రబయలు గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై 145 గడపలను సందర్శించారు. గడపగడపకు తిరుగుతూ ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వం ఈ నాలుగేళ్లుగా అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు సంక్షేమ పథకాలు పొందని అర్హులు ఉంటే సచివాలయంలో సంప్రదించి పథకాల పొందాలని సూచించారు. సంక్షేమ పథకాల పొందడంపై సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. గడపగడపకు తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకునే భాగ్యం కల్పించిన జగన్మోహన్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. తాను ఏ గ్రామం వెళ్ళినా ప్రజలు సాదర స్వాగతాలు పలుకుతున్నారని వారు ఎదుర్కొంటున్నటువంటి స్థానిక సమస్యలు తెలియజేస్తున్నారని అన్నారు. ప్రజలు తెలియజేస్తున్న సమస్యలను కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్థికపరమైన విషయాలతో కూడినటువంటి సమస్యల పరిష్కారానికి కలెక్టర్ కు రిప్రజెంటేషన్ రాస్తున్నట్లుగా చెప్పారు. ఎమ్మెల్యేగా గెలిచిన ప్రజాప్రతినిధులు నేరుగా తమకు ఓటు వేసిన ప్రజల దగ్గరికి వెళ్లి సమస్యలు తెలుసుకోవడం అనేది భారతదేశ చరిత్రలోనే ఒక ఆంధ్ర ప్రదేశ్‌లోనే సాధ్యమవుతుందని అన్నారు. జగన్మోహన్ రెడ్డి నిర్ణయాలతో ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని చెప్పారు.

### మద్దివీధి నుంచి 20 కుటుంబాలు వైసీపీలో చేరిక

నుర్మతి పంచాయితీ మద్దివీధి నుంచి 20 కుటుంబాల ఎమ్మెల్యే సమక్షంలో గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన విధానాలకు ఆకర్షితులై ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వైసీపీలో చేరారు. జి.రఘునాథరావు జి.కృష్ణారావు, జి.అర్జున్ జి.చిన్నధనుంజయ, లలిత, లక్ష్మణ్ బలరాం, సురేష్, జి.మోహన్రావు, జి.అర్జున్, జి.అర్జున్ రెడ్డి, జి.ధనుష్, జి.బాబు, జి.ధనలక్ష్మి, జి.ప్రసాద్, జి.చిన్న, లక్ష్మి, జి.బాబురావు, జి.విజయకుమార్, జి.హరి, జి.సింహాచలం, వి.బాలన్న, జి.పుష్ప, జి.సరస్వతి తదితర కుటుంబాలు వైఎస్సార్సీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు నర్మని మచ్చ కొండం నాయుడు, సర్పంచు కిముడు రాంబాబు, పాలమామిడి సర్పంచ్ సురబంగి రామకృష్ణ, గెమిలి సర్పంచ్ ఎస్.కోటి బాబు, సింగర్భ సర్పంచ్ గంగరాజు, మండల కన్వీనర్ కళ్యాణ్, వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా మండల కన్వీనర్ లక్ష్మణ్, పార్టీ మండల నాయకులు నర్మనీ శ్రీనివాస్ నాయుడు, కొర్ర సోంబాబు, మెనుగురి బాలన్న, అంగనాయని బొంజునాయుడు, కోరాబు కాంతమ్మ, కొర్ర భీమరాజు, నిర్మని చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



## అందరికీ అండ, ఎందరికో భరోసా అది సీఎం జగన్‌కే సాధ్యం : డిప్యూటీ సీఎం బూడి



మాడుగుల, జూన్ 1, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రజలందరికీ అండగా ఉంటూ, మరెందరికో నేనున్నానంటూ భరోసా ఇస్తూ.. సాగిస్తున్న పాలన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే చెల్లిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మాడుగుల మండలంలోని వీరవల్లి అగ్రహారం గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న పంచాయితీరాజ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు గడపగడపకు తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ జల్ జీవన్ మిషన్లో గ్రామంలోని ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలు అందజేయడంలో భాగంగా రూ.1.44 కోట్లతో నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు మంత్రి వివరించారు.

### గూడు లేని వారికి నీడ కల్పించాలని ఉద్దేశ్యంతో చేపట్టిన జగనన్న ఇల్లు



గ్రామంలో 188 మంది లబ్ధిదారులకు జగనన్న గృహాలు మంజూరు కాగా అందులో భాగంగా 84 ఇళ్లు నిర్మాణ దశలో ఉండగా 36 ఇళ్ళ నిర్మాణం పూర్తి చేశామని మంత్రి తెలిపారు. గ్రామ సందర్శనలో భాగంగా అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో ముచ్చటించి వారికి అందిస్తున్న పౌష్టిక ఆహారంపై ఆరా తీశారు. అనంతరం గర్భిణులకు ఏర్పాటు చేసిన శ్రీమంతాలలో పాల్గొని వారిని ఆశీర్వదించారు. గడప గడపకు మంత్రికి ఘన స్వాగతం పలికి హారతులు పట్టారు. గ్రామం మొత్తం పర్యటించిన మంత్రి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అవ్వ తాతలను పలకరించి ఒకటో తారీఖు కావడంతో అందుకున్న పింఛనుపై వారి అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఉన్న డ్రైనేజ్ సమస్య పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేశామని, ఆధునీకరణ పనులు త్వరితగతిన చేపట్టాలని గ్రామ ప్రజాప్రతినిధులకు అధికారులకు సూచనలు చేశారు. గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, వైరులను సరైన రీతులో ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు సూచన చేశారు. గ్రామానికి చెందిన పడాల సత్యరావు గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో చికిత్స పొందుకుంటున్నారు. సదరు వైద్య ఖర్చులు (డయాలసిస్) నిమిత్తం దరఖాస్తు చేయగా తనకు మంజూరైన రూ.10వేల నగదును మంత్రి అందజేశారు. ఇంతకుముందు మంత్రి భారత రత్న బి.అర్.అంబేద్కర్, దివంగత నేత రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం గృహాలు సందర్శించి ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాల బుక్లెట్లు అందజేశారు. సమస్యల ఛేదనలో వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది, అధికారులు నిరంతరం స్పృహ కలిగి పనిచేయాలని అదేశించారు. ఎటువంటి తోడు లేని పలువురికి ఆర్థిక సహాయం చేశారు. మండల జడ్పిటిసి కే.రమణమ్మ, ఎంపీపీ బి రామధర్మజ, వైస్ ఎంపీపీ కే శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ బి శ్రీనివాసరావు, సహకార సంఘ అధ్యక్షులు కే చలం నాయుడు, పి వెంకట్రావు, కాళ్ళ రాము, గ్రామ సర్పంచ్, తహశీల్దార్ పీవీ రత్నం, ఎంపిడిఓ, పి.మీనా కుమారి, మండల గ్రామ స్థాయి ప్రజాప్రతినిధుల, అధికారులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాలకు రూ.126 కోట్ల రైతు భరోసా జమ : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



పాడేరు, జూన్ 1, ప్రభాతవార్త

రైతుల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.126.943 కోట్ల రైతు భరోసాను జమ చేసిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లాలో 1లక్ష 69 వేల మంది రైతులకు ప్రయోజనం కూరిందన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ నియోజక వర్గం నుండి రాష్ట్ర ముఖ్యమంతి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఐదవ సంవత్సరం మొదటి విడత రైతు భరోసా–పిఎం కిసాన్, విడుదల ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని గురువారం స్థానిక కాఫీ హౌస్ నుండి పాడేరు, అరుకు శాసన సభ్యులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌కు 4 వేల 500 వందల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీకి సిద్ధం చేయడం జరిగిందన్నారు. 15 వేల ఎకరాల్లో కాఫీ తోటలు విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. మరో 11 వేల ఎకరాల్లో గ్యాప్ ఫిల్లింగ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంతి ఆదేశాల మేరకు 10 వేల ఎకరాల్లో ఉద్యాన వన తోటలు పెంపకానికి చర్యలు చేపట్టామన్నారు. రైతు ఆదాయం పెంచడానికి నిరంతరం కృషి చేస్తున్నావున్నారు. మూడు లక్షల ఎకరాలకు ఇ–క్రాప్ బుకింగ్ చేయడం జరిగిందని చెప్పారు. ఆర్ఓఎఫ్ రైతులందరికి రైతు భరోసా అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. పాడేరు శాసన సభ్యురాలు కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ రంగం అభివృద్ధికి నాలుగేళ్లలో రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. పోడు భూములకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13,500లు రైతు భరోసా అందిస్తోందన్నారు. కౌలు రైతులకు, జిరాయితీ భూములకు రైతు భరోసా జమ చేస్తున్నారని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామాల్లో పర్యటించినపుడు పి.ఎం.కిసాన్ రావడం లేదని ఫిర్యాదు చేస్తున్నారని చెప్పారు. రైతులు ఇకెవైసి చేసుకోవాలని సూచించారు. రైతులు బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లించాలని సూచించారు. అధికారులు బ్యాంకర్లతో మాట్లాడి రైతు భరోసా అందించాలన్నారు. పాడేరు డివిజన్ పరిధిలో వెదురు, రబ్బరు సాగును ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి ప్రోత్సహించాలని చెప్పారు. గిరిజన రైతులకు నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయాలని సూచించారు. అరకు శాసన సభ్యులు చెట్టి ఫాల్గుణ మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులను రాజులను చేస్తోందన్నారు. స్థానికంగా నర్సరీలు పెంచితే ఏజెన్సీ వాతావరణానికి అనుకూలంగా ఉంటాయని, ఇతర ప్రాంతాల నుండి తెచ్చిన మొక్కలు బతకడం లేదని పేర్కొన్నారు. గిరిజన రైతులకు సకాలంలో విత్తనాలు పంపిణీ చేయాలని చెప్పారు. రాయితీపై దుక్కిటెద్దులను అందించాలని అన్నారు. పట్టుగూళ్ల పెంపకం, అల్లం, పసుపు వంటి వాణిజ్య పంటలను ప్రోత్సహించాలని చెప్పారు. అనంతరం అతిథులు చేతుల మీదుగా రైతులకు రూ.126.943 కోట్లు నమూనా చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎంపిపి సోనారి రత్నకుమారి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నంద్, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు సరస్వతి, పలువురు జెడ్పిటిసిలు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎన్‌సియు ఏర్పాట్ల పనులు వేగవంతం : ఐటీడీఏ పీవో వి.అభిషేక్

పాడేరు, జూన్1, ప్రభాతవార్త



ఎస్ఎన్‌సియు ఏర్పాట్ల పనులను వేగంగా పూర్తి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. గురువారం స్థానిక పాత ఆసుపత్రిని పీఓ అభిషేక్ సందర్శించారు. ఆసుపత్రిలో ఎస్ఎన్‌సియు వార్డు ఏర్పాటు చేయు పనులను పరిశీలించి జిల్లా ఆసుపత్రి సుపరింటెండెంట్, కాంట్రాక్టర్కు త్వరగా పని పూర్తి చేయాలని పీఓ ఆదేశించారు. అవసరమైన చోట ఏసిలు, పేషెంట్లు వెయిటింగ్ చెయ్యు ప్రదేశంలో ఫాన్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు ఆసుపత్రి ఉన్న చిన్న పిల్లల వార్డును పరిశీలించి తల్లులతో పీఓ ముచ్చటించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి డా.కే.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో గందరగోళం

నర్సీపట్నం, జూన్1, ప్రభాతవార్త

నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో గురువారం గందరగోళం నెలకొంది. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ జరుగుతున్న నేపథ్యంలో ప్రైవేట్ కాలేజీ ప్రతినిధులు ప్రభుత్వ కాలేజీకి వచ్చి విద్యార్థులను కౌన్సిలింగ్ చేస్తున్నారని ఆరోపణలతో పాలిటెక్నిక్ ఉద్యోగులు వారిని నిలదీశారు. సదర వ్యక్తులు సమాధానం చెప్పకుండా తప్పించుకోవడంతో కొద్ది సేపు వారందరి మధ్య వాగ్వాదం నడిచింది. అధ్యాపకులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.

## నేడు, రేపు అందుబాటులో ఉందని డిప్యూటీ సీఎం

మాడుగుల, జూన్ 1, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు ఈనెల 2, 3 తేదీల్లో తారువా క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉండరు. కాబట్టి అధికార్లు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు, అభిమానులు, క్యాంపు కార్యాలయ సందర్శకులు దయచేసి ఎవరు రావద్దనీ ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలియజేసింది. ప్రతి ఒక్కరు తప్పకుండా గమనించి సహకరించాలేని కోరుచున్నారు.



రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు నక్కపల్లి మీదుగా రాజమండ్రి వైపు మండలంలోని కాగిత జాతీయ రహదారి పక్కనే ఉన్న హెూటల్ వద్ద ఆగగా ఆయనను మర్యాదపూర్వకంగా టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు కల్లేపల్లి బాబ్జి రాజు కలిశారు. ఆయనతోపాటు టిడిపి నాయకులు మీగడ సత్యనారాయణ మూర్తి, కర్రి వెంకట సత్యనారాయణ, అడ్డూరి లోవరాజు, పెద్ద తీనార్ల ఎంపీటీసీ మెరుగు నాగేశ్వరావు ఉన్న దృశ్యం... (పాయకరావుపేట, ప్రభాతవార్త)

## పాండ్రంగిలో ఘనంగా రైతు భరోసా కార్యక్రమం



పద్మనాభం, జూన్ 1, ప్రభాతవార్త

విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామపంచాయితీలో గురువారం రైతు భరోసా కార్యక్రమాన్ని ఏమిలే ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస రావు అధ్యక్షతన ప్రారంభ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా కలెక్టర్ మల్లి కార్జునరావు పాల్గొన్నారు. ముందుగా భీమిలి ఎమ్మెల్యే శ్రీనివాసరావు సభను ఉద్దేశించి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత వరుసగా ఐదోసారి మొదటి విడతగా 7500 రూపాయలు చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 52,30, 939 రైతులకు రూ.3,933 కోట్లు నేడు రైతులు ఖాతాలో జమవుతున్నాయని తెలిపారు. అదేవిధంగా పిఎం కిసాన్ కింద



రావలసిన రూ.2వేలు కూడా ఆ నిధులు విడుదలైన వెంటనే రైతులు ఖాతాల్లో జమవుతాయని తెలుపుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సొంత భూమి సాగు చేసుకుంటున్న అర్హులైన రైతన్నలతో పాటు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ పౌలు రైతులు అటవీ దేవాదాయ భూములు సాగు చేసుకుంటున్న రైతన్నలకు కూడా వైయస్సార్ రైతు భరోసా కింద ప్రతి సంవత్సరము రూ.13,500లను రైతు భరోసా సాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని తెలిపారు. ఏటా మూడు విడతలలో 13,500 ఖరీఫ్ పంట వేసే ముందు మే నెలలో రూ.7500లు అక్టోబర్ నెల ముగిసే లోపు ఖరీఫ్ పంట కోత సమయం రబీ అవసరాల కోసం నాలుగు వేల రూపాయలు ప్రతి ఇంటికి వచ్చే సమయాన జనవరి ఫిబ్రవరి నెలలో రూ.2వేలను చెప్పిన దానికన్నా ముందుగా మాట ఇచ్చిన దానికన్నా మిన్నగా రైతులకు సాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వమని తెలిపారు ఐదో సారి అందిస్తున్న సాయం 3923 కోట్లతో కలిపి ఈ నాలుగేళ్లలో రైతన్నలకు అందించిన మొత్తములో కేవలం వైఎస్ఆర్ రైతు భరోసా ద్వారా 30 వేల 985 కోట్లని తెలిపారు. ఇప్పుడు అందిస్తున్న రూ.7500లు సాయంతో కలిపి ఒక్కొక్క రైతుకు రైతు భరోసా పిఎం కిసాన్ పథకము ద్వారా అందించిన మొత్తం రూ.61,500లని తెలిపారు. అదేవిధంగా గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ఏ సీజన్లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసే లోగానే పరిహారం అందిస్తున్నామని రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలను సరఫరా చేస్తూ విత్తనం నుండి పంట అమ్మకం వరకు రైతన్నలకు అన్ని సేవలు గడప వద్దనే జరుగుతున్నాయని అదేవిధంగా ఉచిత పంట బీమాలు పంట నష్టపరిహారాలు 0 వడ్డీ పంట రుణాలు వ్యవసాయానికి 9గం.ల పాటు నాణ్యమైన విద్యుత్తు సరఫరాలో నాణ్యత పెంచేందుకు ఫీడర్లు సబ్‌స్టేషన్లు ఆధునీకరణ జరుగుతున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఆర్‌బికే సెంటర్లను ఉపయోగించుకోవాలని ఈ క్రాపు తప్పనిసరిగా చేయించుకోవాలని పశువులకు కూడా అంబులెన్స్ సేవలు ఉచిత భీమా మహిళా పాడి రైతు సంఘాల బలోపేతాలను ఏర్పాటు చేయడం జరిగిందని రైతులపై భారం లేకుండా పూర్తి ప్రీమియం బాధ్యతను ప్రభుత్వమే తీసుకుని భీమా రక్షణను కల్పించిందని ఈ క్రాఫ్ట్ డేటా ఆధారంగా లక్ష రూపాయలు లోపు రుణాలు తీసుకొని ఏడాదిలోపు తిరిగి చెల్లించిన రైతులకు పూర్తి వడ్డీ రైతు ఉంటుందని తెలిపారు. ఈ రైతు భరోసా కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా రైతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పద్మనాభ ఎంపీపీ కే.రాంబాబు పద్మనాభం జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు పద్మనాభం మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు కే లక్ష్మణ పాండ్రంగి గ్రామ సర్పంచ్ పల్లి ఝాన్సీ మహేష్ పాండ్రంగి ఎంపీటీసీ పిన్నింటి సన్యాసమ్మ రవణ పద్మనాభం మండలం ఎంపీడీవో ఎం.విజయ కుమార్ పద్మనాభ మండల తహశీల్దార్ తోట శ్రీవల్లి పద్మనాభం మండల వ్యవసాయ అధికారి ఎంబీఎస్ చలం వ్యవసాయ శాఖ అధికారులు ఆర్‌బికే సెంటర్ల సిబ్బంది సచివాలయ ఉద్యోగులు పాండ్రంగి గ్రామ ప్రజలు రైతులు కౌలు రైతులు పాల్గొన్నారు.

## నర్సీపట్నం నూతన చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు రంగం సిద్ధం చేస్తున్న వైసిపి శ్రేణులు

నర్సీపట్నం, జూన్1, ప్రభాతవార్త

నర్సీపట్నంలో మున్సిపల్ ఎన్నికలు అయిన తరువాత ఎమ్మెల్యే ఉమాశంకర్ ఎన్నికలలో గెలిచిన అభ్యర్థులతో ముందుగానే సమావేశం ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలు –ఒకరు, మరో రెండు సంవత్సరాలు మరోకరు ఇలా చెప్పడంతో ముందుగా గుడిబండి ఆదిలక్ష్మికి చైర్మన్ పదవి ఇవ్వడం జరిగింది. అయితే ఆమె పదవి కాలం రెండు. సంవత్సరాలు అవ్వగానే అమె పదవికి రాజీనామా చేశారు. అదే విధంగా వైస్ చైర్మన్‌గా ఉన్న గొలుసు నరసింహమూర్తి రాజీనామా చేశారు. ఈ రెండు పదవులు ఇప్పుడు కొత్తవారికి ఇవ్వడానికి ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ రంగం సిద్ధం చేశారు. గతంలో ఇచ్చిన హామిలో బాగంగా ఛైర్మన్ పదవిని పెద్దబోడ్డేపల్లి 12వ వార్డుకు చెందిన బోడపాటి సుబ్బలక్ష్మికి, వైస్ చైర్మన్ పదవి కొనేటి రామకృష్ణకు ఇవ్వడానికి 8న ఎన్నిక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వైసిపి శ్రేణులు తెలియజేస్తున్నారు. దీని బట్టి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తన నాయకులకు సమన్యాయం చేస్తు, అందరిని కలుపుకొని వెళ్ళడం జరుగుతుంది.అందరికి పదవు ఉండాలనే లక్ష్యంతో పని చేస్తున్నారు ఎమ్మెల్యే గణేష్ ఎమ్మెల్యేగా గెలుపుకు కృషి చేసిన వారందరికీ తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని వైసిపి నాయకులు మాట.

## జనం కోసం జనసేన అనే కార్యక్రమం

నర్సీపట్నం, జూన్1, ప్రభాతవార్త



నాతవరం మండలం గన్నవరం గ్రామంలో జనం కోసం జనసేన అనే కార్యక్రమాన్ని నియో జకవర్గం జనసేన ఇన్‌చార్జ్ సూర్యచంద్ర చేపట్టారు. ప్రజలతో మమేకమై పలు సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా మహిళలు సక్ర మంగా మంచినీటి కుళాయిలు రాలేదని సూర్య చంద్రకి తెలియజేశారు. వెంటనే ఫోన్‌లో ఎం పీడీవో ఎల్.యాదగిరి ఈశ్వరరావు మాట్లాడు తూ తక్షణమే మంచినీటి సమస్యను తీర్చాలని ఆయనకు తెలియజేశారు. అనువు గాని చోట జగనన్న కాలనీకి ఇళ్ల స్థలాలు ఇవ్వడం వల్ల లబ్ధిదారులు కట్టుకోవడానికి విముక్తి చూపుతున్నారు. అని సూర్య చంద్ర అన్నారు. అర్హతనప్పడికి కొంతమందికి ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడంపై ప్రభుత్వంపై సూర్యచంద్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. నాతవరం మండలం యూత్ అధ్యక్షులు బైన మురళి, వేగిశెట్టి శ్రీనివాస్, మాకి రెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ పార్టీ బలోపేతానికి కృషి చెయ్యండి



నర్సీపట్నం, జూన్1, ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ నర్సీపట్నం మండలం, టౌన్ కార్యవర్గ సమావేశం లక్ష్మీపురం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యవర్గ సమావేశం నర్సీపట్నం మండల అధ్యక్షులు బోళెం శివ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి వివిఎన్ వర్మ విచ్చేసి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో బలపడాలంటే బూత్ స్థాయి నుంచి మరియు గ్రామాలలో బలపడాలని ఆ దిశగా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని ప్రతి కార్యకర్త అందరికీ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను వారికి అందేలా చేయాలని సూచించారు. మండల కార్యవర్గ సమావేశ ఇన్‌చార్జి నక్క శివ శంకర్ విచ్చేసి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పరిపాలన సాగిస్తుందని రాష్ట్రంలో అమలు అవుతున్న ప్రతి పథకానికి డబ్బులు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని తెలియజేస్తూ భారత ప్రధాని నరేంద్ర మోడీ తొమ్మిది సంవత్సరాల పరిపాలనలో దేశం ప్రపంచ స్థాయిలో ముందుందని భారతదేశం ప్రపంచ దేశాలకు దీటుగా అభివృద్ధి చెందుతుందని ఈ తొమ్మిది సంవత్సరాల పరిపాలనలో సాధించిన విజయాలు, ప్రవేశ పెట్టిన పథకాలపై ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి రేపటి నుంచి నెల రోజులపాటు జనంలోకి వెళ్తున్నామని ప్రజలకి అవగాహన కల్పిస్తామని తెలియజేశారు. నర్సీపట్నం నియోజవర్గం సీనియర్ నాయకులు కాళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ జనతా పార్టీ బలోపేతానికి నియోజకవర్గంలో ఉన్న అందరు నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని భారతదేశానికి నరేంద్ర మోడీ చేసిన సేవలు, పథకాలే మనకు రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడానికి ఉపయోగ పడుతుందని తెలియజేశారు. కావున ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కోరారు. పట్టణ అధ్యక్షులు వెలగా జగన్నాథ్ మాట్లాడుతూ నర్సీపట్నంలో భారతీయ జనతా పార్టీ వైపు చాలామంది ఆకర్షితులైతున్నారు అని వారందరినీ కలుపుకొని నర్సీపట్నంలో పార్టీని బలపతం చేస్తామని తెలియజేస్తూ నెలరోజులపాటు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన నిధులు పథకాలు గూర్చి ప్రజల్లోకి వెళ్తున్నామని తెలియజేశారు. రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు సోము లక్ష్మి, నర్సీపట్నం నియోజకవర్గం సంయోజిక్ అడిగర్ల సతీష్, చిందాద నూకేశ్వరరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మట్టి తవ్వకాలను నిరోధించండి.. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు

నక్కపల్లి, జూన్ 1, ప్రభాతవార్త



మండలంలోని దేవవరం రెవెన్యూ పరిధిలో వున్న ఆవ (ప్రభుత్వ) భూముల్లో అక్రమంగా ఎక్స్‌ర్వేటర్లతో మట్టిని తవ్వి ట్రిప్పర్ లారీల్లో తరలించేస్తున్నారని వీటిని నిరోధించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి భూర్తి ఏసుబాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు డీటీ అశోక్‌కు ఫిర్యాదు చేశారు. ఆవ భూముల్లో వేలాది క్యూబిక్ మీటర్ల మట్టిని అక్రమంగా తవ్వి, ప్రైవేట్ లే అవుట్ల యజమానులకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. ఇలా ఆవ భూములను తవ్వేయడం వల్ల ఆయకట్టు భూములకు సాగునీరు అందదని, వర్షాలు పడినప్పుడు గోతులు వుండడం వల్ల రైతులు ప్రమాదాలకు గురవుతారని ఆవేదన వెలిబుచ్చారు. యంత్రాలతో తవ్విన గోతులను వెంటనే పూడ్చివేయాలని, మట్టి తవ్వకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇందులో బి.శివ గణేశ్, పి.నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

# రెజ్లర్లకు న్యాయంచేయాలని రాష్ట్రపతిని కలుస్తాం

## సంయుక్తకిసాన్‌మోర్చా సమితి నేత రాకేష్ తికాయత్

**న్యూఢిల్లీ, జూన్ 1:** దేశరాజధానిలో నిరసనలు తెలుపుతున్న రెజ్లర్లకు సంయుక్తకిసాన్‌మోర్చా, ఖాప్ పంచాయిత్ నేతలు సంపూర్ణ మద్దతునుప్రకటించారు. రెజ్లర్లు తమ పతకాలను



గంగలో కలిపి వేసే నిర్ణయానికి పోవద్దని, రాజీలేని పద్దతిలోనే తాము రెజ్లర్లకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు రైతు నాయకుడు రాకేష్ తికాయత్ వెల్లడించారు. అవసరం అయితే తాము భారత రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం అందచేస్తామని, రాష్ట్రపతి జోక్యం కోరతామని చెప్పారు. ఢిల్లీ సరిహద్దుల్లోనిముజఫర్‌నగర్‌లో జరిగిన మెగా సమావేశంలో ఆయన సభికుల నుద్దేశించి ప్రసంగించారు. మరోవక్క ఢిల్లీ పోలీసులు రైతుసంఘాల నేతలు ఢిల్లీలోని రెజ్లర్ల నిరసనల వద్దకు వస్తున్నారన్న సమాచారంతో ఢిల్లీ నలుమూలలా ఉన్న సరిహద్దులవద్ద ఆంక్షలు విధించారు. సమగ్ర తనిఖీలతోనే వాహనాలను పంపిస్తున్నారు. ఇదిలా ఉంటే ఎన్ని అడ్డంకులు ఎదురైనాసరే రెజ్లర్ల న్యాయమైన డిమాండ్ పరిష్కరించేంతవరకూ తాము వారిని వెన్నంటే ఉంటామని పేర్కొన్నారు. గంగలో నిమజ్జనం కంటే వాటిని వేయలం వేయాలని అలాచేస్తే మొత్తంప్రపంచం వేలం లోకి రాకుండా వారిని నిలు వరించి మద్దతిస్తుండని తెలిపారు. మీరు రెజ్లర్లకు ఎందుకు మద్దతి స్తున్నారన్న అంశంపై మాట్లాడుతూ రెజ్లర్లవి న్యాయమైన డిమాండ్లని, బీహార్‌లో లాలూ యాదవ్ కుటుంబాన్ని ముక్కలు చేసారని, ములాయంసింగ్ యాదవ్‌కుటుంబం లోను చిచ్చు రేపారని, ఇపుడు రాజస్థాన్‌లోకూడా కొనసాగిస్తున్నారని రైతు నేతలు వెల్లడించారు. రెజ్లర్ల నిరసనపై ఢిల్లీపోలీసులు ఉక్కుపాదం మోపి అణిచి వేత చర్యలపై రెజ్లర్లు తీవ్ర నిరసన తెలుపుతూ తమ పతకాలను గంగలో కలిపివేస్తామంటూ హరిద్వార్‌కు బయలుదేరారు. తికాయత్ జోక్యంతోనే వారంతా ఆగిపోయారు. జనవరి నుంచి రెజ్లర్లు యుద్ధంతరహాలో ఆందో ళన చేస్తున్నా బ్రిజ్‌భూషణ్‌శరణ్‌సింగ్‌పై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని అన్నారు. ఏడుగురు అథ్లెట్లను లైంగికంగా వేధించారని, వారిలో ఒక మైనర్‌కూడా ఉందని వారు ఆరోపిస్తున్నారు. బిజెపి ఎంపి కూడా అయిన బ్రిజ్‌భూషణ్ తనపై నమోదుచేసిన ఆరోపణలు రుజువైతే ఎలాంటి శిక్షకైనా తాను సిద్ధమేనని పేర్కొంటున్నారు. ఏ ఒక్క ఆరోపణ రుజువు చేసినా నేనే ఉరి వేసుకుంటానని ప్రకటించారు. ఏ ఆధారం ఉన్నా వాటిని కోర్టులోనే అందచేయండని తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. పోలీసు దర్యాప్తు ముగిసేంత వరకూ వేచి ఉండాలని, ఎలాంటి అవాంఛిత చర్యలకు పాల్పడవద్దని కేంద్రం హెచ్చరించింది. కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ ఢిల్లీపోలీసు దర్యాప్తు ముగిసేంత వరకూ వేచి ఉండాలని కోరుతున్నట్లు మంత్రి తెలిపారు. ఢిల్లీపోలీసులు ఇప్పటికే సుప్రీంకోర్టుకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారని, విచారణ పూర్తి అయ్యేంత వరకూ ఎలాంటి అనుచిత చర్యలకులోను కావద్దని, క్రీడలు, క్రీడాకారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని చెప్పారు.



# ఇలాంటివి సాధ్యమని నేను ఊహించలేదు: రాహుల్

**వాషింగ్టన్, జూన్ 1:** రాజకీయాల్లోకి వచ్చిన కొత్తల్లో లోక్‌సభ సభ్యత్వం రద్దును తాను ఊహించలేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత సంతతి వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రధానిపై బుధవారం రాహుల్ విమర్శలు చేసిన విషయం విదితమే. తాజాగా కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్‌లో మాట్లాడుతూ, 'నేను రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సమయంలో వేటిని ఎదుర్కోవాల్సి వస్తుందో అస్సలు ఊహించలేదు. అసలు ఇలా జరుగుతుందని అసలు అనుకోలేదు. కానీ ఆ తర్వాత దీనిని నాకు లభించిన పెద్ద అవకాశంగా భావించా. నాకు లభించిన వాటిల్లో ఇదే పెద్ద అవకాశం. రాజకీయాలంటే అలానే ఉంటాయి' అన్నారు. ఇక భారత్ జోడో యాత్రపై రాహుల్ గాంధీ మాట్లాడుతూ, 'ఈ కథ ఆరు నెలల క్రితం మొదలైంది. అప్పట్లో మేం ఇబ్బందులు పడుతున్నాం. ప్రతిపక్షాలన్నీ చిక్కుల్లో ఉన్నాయి. అధికార పక్ష ఆర్థిక ఆధిపత్యం, సంస్థాగత పెత్తనం నడుస్తున్నాయి. మా దేశంలోనే మేం ప్రజాస్వామ్య పోరాటం చేయడానికి అవస్థలు పడుతున్నాం. ఆ సమయంలో భారత్ జోడో యాత్ర చేయాలని నిర్ణయించుకున్నాం' అని పేర్కొన్నారు.

స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో భారత్ నుంచి వచ్చిన విద్యార్థులతో సత్సంబంధాలు కొనసాగించాలని అనుకుంటున్నట్లు వెల్లడించారు. వారితో తాను ముచ్చటించడానికి ఇది మంచి సమయమని అభిప్రాయపడ్డారు. భారత్-చైనా సంబంధాలు అంత సులువుకాదని, కఠినంగా ఉండబోతున్నాయని రాహుల్ అభిప్రాయపడ్డారు. భారత్‌ను వెనక్కి నెట్టడం చైనాకు సాధ్యం కాదని చెప్పారు. దేవుడి కంటే తమకే ఎక్కువ తెలుసని భారత్‌లో కొంతమంది భావిస్తుంటారని, అలాంటి ఓ ప్రత్యేక మనిషిగా ప్రధాని మోడీ నిలుస్తారని రాహుల్ గాంధీ బుధవారం ఎద్దేవా చేసిన విషయం విదితమే.

# కొండచరియలు విరిగిపడి చిక్కుకుపోయిన 300 మంది యాత్రికులు

**డెహ్రాడూన్, జూన్ 1:** ఉత్తరాఖండ్‌లో పర్యటిస్తోన్న వారికి మరోసారి కొండచరియలు తీవ్ర అంతరాయం కలిగించాయి. భారీగా కొండచరియలు విరిగిపడడంతో 300 మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. వాటి వల్ల రాష్ట్రంలోని పితోరాగఢ్ జిల్లాలోని లఖన్‌పుర్ సమీపంలోని లిపులేఖ-తవఘాట్ రహదారి 100 మీటర్ల మేర కొట్టుకుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ప్రయాణికుల రాకపోకల కోసం రెండు రోజుల తర్వాత ఈ రోడ్డును తెరిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉత్తరాఖండ్‌లోని చార్‌ధామ్ యాత్రకు ఈసారి భారీ సంఖ్యలో భక్తులు పోటెత్తుతున్నారు. మంచుకొండల్లో ప్రయాణానికి అక్కడక్కడా వీరికి కొంత అసౌకర్యం కలుగుతున్నట్లు తెలుస్తోంది. నవంబరు రెండోవారం వరకూ ఈ యాత్ర ఉంటుంది. ఈ సమయంలో కొండచరియలు విరిగిపడడం ఆందోళనకరరగంగా మారింది. ఈ క్రమంలో వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. అల్మోరా, చమోలీ, చంపావత్, దేహ్రాదూన్, హరిద్వార్, గర్వాల్, నైనిటాల్, రుద్రప్రయాగ, తెహ్రీ గర్వాల్, పితోరాగఢ్, ఉద్దమ్ సింగ్ నగర్, ఉత్తరకాశీ జిల్లాల్లో తుఫాన్, ఉరుములతో కూడిన వర్ష సూచనలు ఉన్నాయని పేర్కొంది. అలాగే యాత్రికులంతా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని పోలీసులు అడ్వైజరీ జారీచేశారు. 'అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండండి. సురక్షిత ప్రాంతాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయండి. యమునోత్రి, గంగోత్రి యాత్రకు వచ్చే ప్రయాణికులు వాతావరణ సూచన తర్వాతే తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలి. వెంట రెయిన్ కవర్, గొడుగు, వెచ్చని వస్త్రాలు ఉంచుకోవాలి' అని అందులో పేర్కొన్నారు.

# మణిపూర్ డిజిపి బదలీ కొత్త డిజిపిగా రాజీవ్‌సింగ్

## శాంతిభద్రతలకోసం రెండు కమిటీల ఏర్పాటు

## 'వెంటనే ఆయుధాలు అప్పగించండి': అమిత్ షా వార్నింగ్

**ఇంఫాల్, జూన్ 1:** కొన్ని రోజులుగా మండిపోతున్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు కేంద్రం చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే ఆ రాష్ట్ర పర్యటనలో ఉన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా శాంతిని నెలకొల్పేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మణిపూర్‌లో చెలరేగిన ఘర్షణలను హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలోని కమిటీ విచారణ జరుపుతుందని వెల్లడించారు.ప్రస్తుత డిజిపి పి.డైన్గల్‌ను హోంశాఖకు బదిలీచేసి ఆయన స్థానంలో సిఆర్‌పిఎఫ్ ఐజిగా వ్యవహరించిన త్రిపుర ఐపిఎస్ క్యాడర్‌కు చెందిన రాజీవ్‌సింగ్‌ను కొత్త డిజిపిగా నియమించారు. ఇక్కడ ఉన్న గిరిజన తెగలకు



ఎటువంటి సబంధం లేని తటస్థ వర్గానికి చెందినవారిని డిజిపిగా నియమిస్తే శాంతిభద్రతలను సత్వరమే కట్టడిచేయవచ్చన్న లక్ష్యంతోనే డిజిపిని బదిలీచేసారు. అలాగే ఈ హింసకు సంబంధించిన ఆరు కేసులను కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐ దర్యాప్తు చేస్తుందని చెప్పారు. మరోపక్క మిలిటెంట్లకు తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. 'దాదాపు నెలరోజులుగా మణిపుర్‌లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఘర్షణల్లో తమవారిని కోల్పోయిన కుటుంబాలకు సంతాపం తెలియచేస్తున్నాను. గత మూడు రోజులుగా నేను ఇంఫాల్, మోరె, చురాచాంద్‌పుర్ సహా పలు ప్రాంతాల్లో పర్యటించాను. రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొల్పే దిశగా స్థానిక అధికారులతో మాట్లాడాను. ఈ ఘటనలపై దర్యాప్తు జరిపేందుకు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ఓ కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దానిపై త్వరగా ప్రకటన చేస్తాం. అలాగే మణిపుర్ గవర్నర్ నేతృత్వంలోని పిస్ కమిటీని ఏర్పాటు చేశాం. ఈ ఘటనల వెనక కుట్రలను గుర్తించేందుకు ఉన్నతస్థాయి సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాం. ఈ దర్యాప్తు పూర్తి తటస్థంగా ఉంటుందని హామీ ఇస్తున్నా. అలాగే మృతుల కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.10 లక్షల పరిహారాన్ని అందిస్తాయి. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు హోం శాఖకు చెందిన ఉన్నతస్థాయి అధికారులు రాష్ట్రంలో పర్యటిస్తారు' అని మంత్రి వెల్లడించారు. అలాగే ఎవరి చెంత అయినా ఆయుధాలు ఉన్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని అమిత్ షా హెచ్చరించారు. నకిలీ వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని పౌరులను అభ్యర్థిస్తున్నాను. ఆయుధాలు కలిగి ఉన్నవారు వెంటనే వాటిని పోలీసులకు అప్పగించాలి. నేటి నుంచి కూంబింగ్ ఆపరేషన్ ప్రారంభమవుతుంది. ఈ సమయంలో ఎవరి వద్ద అయినా ఆయుధాలు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన అన్నారు. మణిపుర్ గత కొన్ని రోజులుగా హింసాత్మకంగా మారిన విషయం విదితమే. ఎస్టీ హోదా కోసం మెయిటీలు చేసిన డిమాండ్‌కు మణిపుర్ వ్యాలీ ప్రాంతానికి చెందిన చట్టసభ్యుల నుంచి మద్దతు లభించింది. దీంతో గిరిజన ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇది ఘర్షణకు దారితీసింది. మణిపుర్ జనాభాలో 53శాతం మంది మెయిటీ వర్గానికి చెందిన వారే.

మణిపుర్ వ్యాలీలో వారి ప్రాబల్యం ఎక్కువ. బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి వస్తోన్న అక్రమ వలసదారులతో తాము సమస్యలు ఎదుర్కొంటున్నామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్టీ హోదా విషయంలో మెయిటీలు, గిరిజనులకు మధ్య జరిగిన ఘర్షణల్లో పదుల సంఖ్యలో మరణాలు నమోదయ్యాయి. అలాగే ఆయుధాలతో తిరుగుతున్న పదుల సంఖ్యలో మిలిటెంట్లను భద్రతా బలగాలు కాల్చిచంపినట్లు ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ప్రకటించారు. అలాగే మణిపూర్‌ప్రజల్లో భయాందోళనలను త ఒలగించి శాంతిని నెలకొల్పేందుకు గవర్నర్ అనసూయా ఉయికీ నేతృత్వంలో మరో కమిటీని ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. ఈ కమిటీలో అన్ని రాజకీయ పార్టీలప్రతినిదులు మైతీ, కుకీ వర్గాలప్రతినిధులతోపాటు ప్రజాసంఘాల నాయకులు కూడా ఉంటారని హోంమంత్రి తెలిపారు.

# అత్తాకోడళ్ల మధ్య చిచ్చు పెడుతున్న కర్ణాటక 'గృహలక్ష్మి'



**బెంగళూరు, జూన్ 1:** గృహలక్ష్మి పథకం కింద ప్రతి ఇంటిలోని మహిళా కుటుంబ పెద్దకు నెల నెల రూ.2,000 చొప్పున ఆర్థిక సాయం అందచేసే పథకానికి కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. అయితే ఈ పథకం చాలా ఇళ్లలో అత్తాకోడళ్ల మధ్య చిచ్చురేపుతోంది. ప్రభుత్వం అందచేసే రూ.2,000 ఎవరికి అందుతుందనేది పెద్ద సమస్యగా మారింది. మహిళా కుటుంబ పెద్దకు నెలవారి ఆర్థిక సాయం అందచేస్తామని హామి ఇచ్చిన కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో స్పష్టమైన అర్హత ప్రమాణాలు లేకపోవడం వల్ల కుటుంబాల్లో గందరగోళం మరింత పెరిగింది. ఈ విషయమై మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్‌ను ప్రశ్నించగా ఆర్థిక సాయం ఎవరికి చెందుతుందనేది కుటుంబం తీసుకునే నిర్ణయం అని చెప్పారు. అయితే భారతీయ సంప్రదాయం మహిళా కుటుంబ పెద్దగా అత్తను పరిగణిస్తున్నందున ఆమె అర్హురాలని మంత్రి స్పష్టం చేశారు. ఒకవేళ ఆమె అంగీకరిస్తే కోడలికి ఇవ్వవచ్చిని హెబ్బాల్కర్ అన్నారు. పిడబ్ల్యుడి మంత్రి సతీశ్ జార్ఖిహోళి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. మహిళా, శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ మంత్రి అభిప్రాయంతో ఏకీభవించారు. కుటుంబపెద్ద ఎవరు అనే విషయంలో ఏకాభిప్రాయం లేకపోతే సాయాన్ని అత్త, కోడలు సమానంగా పంచుకోవాలని మహిళా హక్కుల కార్యకర్తలు చెబుతున్నారు. ఇలా చేస్తే కుటుంబంలో సమస్యలు ఉండవని మహిళా హక్కుల కార్యకర్త సి నాగరత్న అన్నారు. ఈ విషయంలో ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం చాలా కష్టమని, అత్త, కోడలు ఇద్దరికీ ప్రభుత్వం సొమ్ము ఇవ్వాలని మరో కార్యకర్త తెలిపారు. మరో వైపు శిశు అభివృద్ధి శాఖ ఇంకా విధివిధానాలపై చర్చించనందున పథకం అమలులో నిబంధనలు షరతుల గురించి మాట్లాడటం చాలా తొందరపాటు అవుతుందని హెబ్బాల్కర్ అన్నారు. కేబినెట్ సమావేశం తర్వాత కొంత స్పష్టత వస్తుందన్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల సమయంలో ప్రకటించిన గ్యారెంటీహామీలపై మేధోమధనం మొదలైంది.

# ప్రపంచదేశాల్లో 68.97కోట్లకుపెరిగిన బాధితులు 68.85 లక్షలకు చేరుకున్న మృతులు

**జెనీవా, జూన్ 1:** ప్రపంచదేశాల్లో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. రోజురోజుకూ కొత్తకేసులు పెరుగుతుండటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తం అఈవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా గురువారం నాటికి 68.97 కోట్లమందికి వైరస్‌సోకి 68.85 లక్షలమంది చనిపోయారు. మరో 38,055 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 66.20 కోట్లకుపైగా నమోదుకాగా మరో 2.07కోట్లమంది ఇప్పటికీ ఆసుపత్రుల్లోనే ఉన్నారు. యూరోప్ దేశాల్లో మొత్తం 24.94 కోట్లమందికికరోనాసోకి వారిలో 20.61 లక్షలమందిచనిపోయారు. మరో 5734 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 24.54 కోట్లకుపైగా నమోదుకాగా మరో 19.40 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తోపోరాటంచేస్తున్నారు. ఉత్తర అమెరికా దేశాల్లో మొత్తం 12.67 కోట్లకుపైగా బాధితులుంటే వారిలో 16.33 లక్షలమంది చనిపోయారు. మరో 6208 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 12.26 కోట్లకుపైగా నమోదుకాగా మరో 24.70 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తోసతమతం అవుతున్నారు. ఆసియా దేశాల్లో మొత్తం 21.76 కోట్లకుపైగా నమోదుకాగా మరో 15.46 లక్షలమందిచనిపోయారు. మరో 15,350 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 20.12కోట్లకుపైగా నమోదుకాగా మరో 1.48 కోట్లమంది ఇప్పటికీ వైరస్‌తోపోరాటం చేస్తున్నారు. దక్షిణ అమెరికా దేశాల్లో మొత్తం 6.87 కోట్లకుపైగా కరోనా బాధితులుంటే 13.56 లక్షలమందిచనిపోయారు. మరో 9.07 లక్షలమంది పరిస్థితి విషమంగా ఉంది. రికవరీలు 6.65 కోట్లకుపైగా నమోదుకాగా మరో 9.07 లక్షలమంది ఇప్పటికీ విషమపరిస్థితుల్లో ఉన్నట్లు ఆదేశాలు పేర్కొంటున్నాయి. ఆఫ్రికా దేశాల్లో మొత్తం 1.28 కోట్లకుపైగా బాధితులుంటే వారిలో 2,58,777 మందిచనిపోయారు. రికవరీలు 1.21 కోట్లకుపైగా నమోదుకాగా మరో 4,79,508 మంది పరిస్థితి ఆందోళనగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక 19 ద్వీపకల్ప దేశాలపరంగా చూస్తే మొత్తం 1.43 కోట్లకుపైగా బాధితులు ఉన్నట్లు తేలింది.

# డెట్‌సీలింగ్ ఎత్తివేతకు షరతులతో ఆమోదం

## రిపబ్లికన్ల మద్దతుతర్వాత సెనేట్‌కు వెళుతున్న బిల్లు

**వాషింగ్టన్, జూన్ 1:** అగ్రరాజ్యం అమెరికా ఎట్టకేలకు చెల్లింపులు బకాయి సంక్షోభం నుంచి బయటపడింది. షరతులతో కూడిన డెట్‌సీలింగ్‌ను ఎత్తివేతకు రిపబ్లికన్లు సభలో ఆమోదం తెలిపారు. ప్రతినిధుల సభ స్పీకర్ కెవిన్ మెక్‌కార్తీ డెమొక్రాట్ల తరపున బైడెన్ ఎంపిలమధ్య కుదిరిన సయోధ్య యత్నాలు, కొన్ని కీలక



అంశాలపై కోతలు ఉండాల్సిందేనన్న రిపబ్లికన్ల షరతులకు బైడెన్ సర్కారు అంగీకారానికి రావడంతో డెట్‌సీలింగ్ సడలింపులకు ఆమోదం తెలుపుతూ సెనేట్ ఆమోదంకోసం పంపించింది. తొలినుంచీ కూడా ప్రతినిధులసభలో రిపబ్లికన్లు పూర్తి అతివాదంతో వ్యవహరిస్తుండటంవల్ల ఈ సంక్షోభం పరిష్కరించకపోతే అమెరికా మొత్తం రుణసంక్షోభం ఎదుర్కొంటుందని ఆర్థికమంత్రి జన్నెట్ ఎల్లెన్ కూడా హెచ్చరించారు. ప్రతినిధులసభలో 314:117 ఓట్లతో ఈ బిల్లు ఇపుడు సెనేట్‌కు ఆమోదంకోసం ఈ వారంతాంలోనే పంపిస్తారు. మెక్‌కార్తీ తన పార్టీప్రతినిదులను అమెరికాకు కొత్త ఆశలు కల్పించాలని ఒత్తిడి తెస్తూ వచ్చారు. బడ్జెట్‌కోతలు ఉండాలని రిపబ్లికన్లు ఎక్కువ డిమాండ్‌చేస్తున్నారు. ప్రతినిధులసభ స్పీకర్ మెక్‌కార్తీ ఈ సంక్షోభం తెరదించేందుకు కృషిచేస్తారని ముందునుంచీ బైడెన్ ఆశతో ఉన్నారు. అందుకోసమే బైడెన్ శ్వేతసౌధంలోని ఉన్నతస్థాయి అధికారులను అమెరికా పార్లమెంట్ యుఎస్ క్యాపిటల్‌కు పంపించారు. మెక్‌కార్తీ కృషికూడా రిపబ్లికన్లను ఎక్కువశాతం ఒప్పించేందుకే శాయశక్తులా ప్రయత్నాలుచేయడంతో వృద్ధులు ఇతరులకు కల్పించే సామాజిక భద్రత పథకాలను కొనసాగించాలని నిర్ణయించారు. వచ్చే సోమవారంనుంచి బిల్లుకు ఆమోదం లభించకపోతే అమెరికా రుణాల చెల్లింపులకుసైతం నగదు కొరత ఎదుర్కొంటుందని ట్రెజరీశాఖ హెచ్చరించింది. 99 పేజీల బిల్లు రెండేళ్లపాటు వ్యయాన్ని నియంత్రిస్తోంది. 2025 జనవరి 25 వరకూ డెట్‌సీలింగ్‌ను తొలగించింది. అయితే కొన్ని విధానాల్లో మార్పులుసూచించింది. అమెరికాలోని వయోవృద్ధులకోసం పరిహారం పెంచాలని, గ్రీన్‌లైటింగ్ అపల్పఆచియాన్ సహజవాయులైన్‌ప్రాజెక్టు వంటి వాటిని డెమొక్రాట్లు వ్యతిరేకిస్తుంటే రిపబ్లికన్లు కొనసాగించాలన ఇపట్టుబట్టారు. ఇప్పటికిప్పుడు అమెరికా రుణపరపతి పరిమితి 31 లక్షలకోట్ల డాలర్లుగా ఉంది. ఇప్పటికే అమెరికా బకాయి ఉన్న చెల్లింపులను షురూచేస్తోంది. ఇదిలా ఉంటేప్రతినిధుల సభలోని డెమొక్రాట్ నేత హాకీమ్ జెఫ్రీస్ మాట్లాడుతూ స్పీకర్ మెక్‌కార్తీ కనీసం 150 రిపబ్లికన్ల ఓట్లను సాధించాల్సి ఉంటుందని, మొత్తం 435 మంది సభ్యులున్న సభలో 218 ఓట్లు ఈ బిల్లు ఆమోదంకోసం అవసరం అవుతాయని పేర్కొన్నారు. అయితే రిపబ్లికన్లు సూచించిన కోతలవల్ల బిడ్జెట్‌లో 1.5 లక్షలకోట్లువరకూ దశాబ్దా కాలంలో ఆదా అవుతాయని, దీనివల్ల లోటుభర్తీకి అవకాశం ఉంటుందని ఆర్థిక రంగ నిపుణులు చెపుతున్నారు. ప్రత్యేకించి వృద్ధులకు ఇచ్చే పరిహారంలోనే మార్పులు చేసి మోడల్ ప్యాకేజిగా తీర్చిదిద్దాలని రిపబ్లికన్‌ప్రతినిధులు చెపుతున్నారు.

# ప్రపంచాన్ని భయపెడుతున్న చైనా సీక్రెట్ పోలీస్‌స్టేషన్లు!



**బీజింగ్, జూన్1:** రహస్య పోలీస్‌స్టేషన్లలను మూసివేయాలని ప్రపంచదేశాలు మళ్లీ చైనాని కోరాయి. యూరప్, ఉత్తర అమెరికాలోని అనేక దేశాల ప్రభుత్వాలు చైనా రహస్య పోలీస్ స్టేషన్లు తమ దేశాల్లో నిర్వహిస్తున్న కార్యకలాపాలపై ఫోకస్ పెట్టాయి. చైనా మాత్రం వాటిని సర్వీస్ స్టేషన్లు అంటోంది. స్కాములు, అక్రమాలు చేసి తమదేశం నుంచి విదేశాలకు పారిపోయే వ్యక్తుల్ని పట్టుకునేందుకు చైనా చాలా దేశాల్లో సీక్రెట్ పోలీస్ స్టేషన్లను నిర్వహిస్తోంది. కానీ వీటిని సర్వీస్ స్టేషన్లు అని మాత్రమే పిలుస్తోంది. ప్రపంచదేశాల ఆలోచన మరోలా ఉంది. విదేశాల్లో ఉన్నవారు చైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడినా, వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్నా, అలాంటి వాళ్లను బ్లాక్‌మెయిల్ చేసేందుకే చైనా ఈ పోలీస్‌స్టేషన్లను కలిగిఉందని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. వీటి ద్వారా చైనా తమ దేశస్తులను బెదిరిస్తోందని, వారి కుటుంబ సభ్యులను బ్లాక్‌మెయిల్ చేస్తోందని ఆరోపిస్తున్నాయి. ఈ రహస్యపోలీస్‌స్టేషన్లను చైనా వెంటనే మూసివేయాలని అమెరికా, కెనడా, జర్మనీ సహా చాలా దేశాలు తాజాగా డిమాండ్ చేశాయి. ఈ స్టేషన్లను అడ్డం పెట్టుకుని డ్రాగన్ దేశం అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘిస్తోందని ప్రపంచదేశాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవల కెనడా, మాంట్రియల్‌లోని రెండు చైనా రహస్య కేంద్రాలపై కెనడా ప్రభుత్వం పరిశోధనలు చేసింది. దాంతో చైనా దేశవ్యాప్తంగా ఇలాంటి రహస్య పోలీస్‌స్టేషన్లను కలిగి ఉండవచ్చని అభ్యంతరం వ్యక్తం చేసింది. మాంట్రియల్‌ఘటనకు నెల ముందు మరొకటి జరిగింది. న్యూయార్క్ మాన్‌హట్టన్‌లోని చైనా టౌన్‌లో ఓ కమర్షియల్ కాంప్లెక్స్ వెనుక రహస్య పోలీస్ స్టేషన్ని నడుపుతున్నారనే ఉద్దేశంతో అమెరికా పోలీసులు ఇద్దరు న్యూయార్క్ వ్యక్తుల్ని అరెస్టు చేశారు. వారికి చైనా మూలాలున్నాయని గుర్తించింది. సర్వీస్ స్టేషన్లు అక్రమాలకు పాల్పడుతున్నాయని వస్తున్న ఆరోపణలను చైనా ఖండించింది. మూసివేసేందుకు ఆసక్తి చేపడం లేదు. ఈ స్టేషన్ల అంశం ఆశ్చర్యం కలిగిస్తోందని కొందరు విశ్లేషకులు అంటున్నారు. మానవహక్కుల సంస్థ సేఫ్‌గార్డ్ డిఫెండర్స్ ఒక రిపోర్టును విడుదల చేసింది.

# కీవ్‌పై రష్యా క్షిపణుల వర్షం - ముగ్గురి మృతి

**మాస్కో, జూన్ 1:** మాస్కోపై డ్రోన్ దాడులు జరిగిన మర్నాడే రష్యా తీవ్రంగా స్పందించింది. కీవ్‌పై గురువారం ఉదయం భారీ ఎత్తున క్షిపణి దాడులను చేసింది. దాదాపు 10కిపైగా క్షిపణులను గురువారం తెల్లవారుజామున ప్రయోగించింది. ఈ దాడుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో తొమ్మిదేళ్ల చిన్నారి కూడా ఉన్నారు. మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. గత నెల కీవ్‌పై రష్యా 17 దాడులు చేసింది. వీటిల్లో చాలావరకు రాత్రి వేళల్లో చోటు చేసుకొన్నవే. తాజా దాడులకు సంబంధించిన చిత్రాలను ఉక్రెయిన్ అధికారులు విడుదల చేశారు. యుద్ధం



మొదలైన తర్వాత ఇటీవల కాలంలో రష్యా ఆత్మాహుతి డ్రోన్లు, క్రూజ్ క్షిపణులను ఎక్కువగా వాడుతోంది. ముఖ్యంగా ఉక్రెయిన్ ఎదురు దాడి చేస్తోందని అంచనా వేయడంతో ఆ దేశ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ దాడులను చేస్తోంది. మరోవైపు బుధవారం ఉక్రెయిన్ జరిపిన షెల్లింగ్ కారణంగా లుహాన్స్క్ ప్రాంతంలో ఓ కోళ్లఫారం వద్ద ఐదుగురు చనిపోగా, 19 మంది గాయపడినట్లు రష్యా పేర్కొంది. ఇక గురువారం తెల్లవారుజామున బెల్గొరోడ్ సమీపంలోని షెబెకినో వద్ద ఉక్రెయిన్ జరిపిన దాడిలో ఇద్దరు గాయపడ్డారని ఆ ప్రాంత గవర్నర్ టెలిగ్రామ్ ఛానెల్‌లో పేర్కొన్నారు. రాత్రి వేళ దాదాపు గంటన్నర పాటు ఉక్రెయిన్ దళాలు షెల్లింగ్ చేసినట్లు పేర్కొన్నారు. అమెరికా నుంచి మరో 300 మిలియన్ డాలర్ల ప్యాకేజీ ఉక్రెయిన్‌కు అందనుండడంపై రష్యా మండిపడింది. తమను వ్యూహాత్మకంగా ఓడించాలనే లక్ష్యంతో ఇలా చేస్తోందని పేర్కొన్నారు. ఇదే సమయంలో వారి మిత్రదేశాలకు ఆయుధాలు సరఫరా చేసి, అనవసరమైన పనులను అమెరికా ప్రోత్సహిస్తోందన్నారు. ఈ మేరకు అమెరికాలోని రష్యా రాయబారి ఆంటోనీ ఆంటనోవ్ వెల్లడించారు. బుధవారం బైడెన్ ప్రకటన వెలువడిన తర్వాత రష్యా ఈ విధంగా స్పందించింది.

# ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఆప్‌కు మద్దతిస్తాం


## తమిళనాడుసిఎం స్టాలిన్‌తో ఆప్ సిఎం కేజ్రీవాల్ భేటీ



**చెన్నై:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా బలాన్ని కూడగట్టేపనిలో ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ విస్తృత పర్యటనలు చేసి వివిద పార్టీల అదినేతలను కలుస్తున్నారు. ఈక్రమంలోనే తమిళనాడు సిఎం స్టాలిన్‌ను కలిసి మద్దతు కోరగా ఆయన అందుకు సానుకూలంగా స్పందించారు. ఢిల్లీలో ఆధిపత్యంకోసం ప్రయత్నించిన కేంద్రానికి సుప్రీంకోర్టులో చుక్కెదురవడంతో ఈ తీర్పునకు వ్యతిరేకంగా ఆర్డినెన్స్‌ను తెచ్చింది. ఈ బిల్లును ఉభయసభల్లోప్రవేశపెట్టి ఆమోదం పొందాలనిచూస్తున్న కేంద్రానికి లోక్‌సభలో బిల్లు ఆమోదింపచేయడం పెద్దకష్టం కాదు. కానీ రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదించాలంటేమాత్రం 93గా ఉన్న వారి బలం సరిపోదు. ప్రతిపక్షాలమద్దతుకూడా కావాలి. కానీ ఢిల్లీసిఎం అరవింద్‌కేజ్రీవాల్ ఎలాగైనాసరే కేంద్రానికి అడ్డుకట్ట వేయాలని కృతనిశ్చయంతో ఉన్నారు. ఇప్పటికే బీహార్‌సిఎం నితీష్, డిప్యూటిసిఎం తేజస్వియాదవ్, శివసేన అధినేత ఉద్ధవ్‌ఠాక్రే, బెంగాల్‌సిఎం మమతా బెనర్జీల మద్దతును కూడగట్టిన కేజ్రీవాల్ పంజాబ్‌సిఎం భగవంత్‌మాన్‌తోకలిసి తమిళనాడు సిఎం స్టాలిన్‌తో భేటీ అయ్యారు. అందుకు స్టాలిన్‌సైతం సుముఖంగా స్పందించడంతో కేజ్రీవాల్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తర్వాత ప్రయత్నంలో ఢిల్లీ సిఎం జార్ఖండ్ సిఎం హేమంత్‌సోరెన్‌ను కూడా కలిసి మద్దతు కోరనున్నారు.

# అమెరికా అధ్యక్ష రేసులోకి మైక్‌పెన్స్ ట్రంప్‌కు పోటీగా మాజీ ఉపాధ్యక్షుడు

**వాషింగ్టన్,జూన్ 1:** రిపబ్లికన్‌పార్టీనాయకుడు డొనాల్డ్‌ట్రంప్ హయాంలో ఉపాధ్యక్షుడుగా పనిచేసిన మైక్‌పెన్స్ అధ్యక్ష పదవి పోటీలోకి వచ్చారు. అంతేకాకుండా రిపబ్లికిన్ నామినేషన్‌కోసం తన ప్రచారాన్ని వచ్చేవారం లోవానుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఫ్లోరిడా గవర్నర్ పోటీలోకి రాగా మూడో వ్యక్తిగా మాజీ ఉపాధ్యక్షుడు



రంగంలోకి రావడంతో మాజీ అధ్యక్షుడుడొనాల్డ్‌ట్రంప్‌కు పోటీ పెరుగుతోంది. గ్రాండ్ ఓల్డ్‌పార్టీ(.జిఒపి)లో ట్రంప్‌కు పోటీ అభ్యర్థులు మరింతగాపెరుగుతున్నారు. ఈనెల ఏడవ తేదీ తన 64వ పుట్టినరోజు సందర్భంగా మైక్‌పెన్స్ తన ప్రచారాన్ని డెస్ మోయినెస్‌నుంచి ప్రారంభించనున్నారు. ప్రచారం ప్రారంభం సందర్భంగా ఆయన ఒక విడియో సందేశం విడుదలచేస్తారని తేలింది. ఇప్పటికే రాన్‌డిసాంటిస్, న్యూజెర్సి మాజీ గవర్నర్ క్రిస్ క్రిస్టీకూడా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలోకి వస్తున్నారు. ఇక నిక్కీ హేలి కూడా 2024లో అధ్యక్ష పదవికి పోటీచేసే లక్ష్యంతో ఉన్నారు. ఇపుడు మాజీ ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ తన స్వరాష్ట్రం ఇండియానాకు బదులుగా లోవా ప్రాంతంలోప్రచారం ప్రారంబించడానికి కారణం అక్కడ ఆయనకు అభిమానులు, మద్దతు దారులు ఎక్కువ ఉండటమేనని తెలుస్తోంది. ఈప్రాంతంలో ఉన్న ఇవాంజలికల్ క్రిస్టియన్ ఓటర్లు మెజార్టీ ఓటుబ్యాంకుగా మారవచ్చన్న ధీమాతోనే పెన్స్ ఇక్కడనుంచే ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు వినికిడి. ఈ ఓటర్లే రిపబ్లికన్ ఓటర్ల జాబితాలో మెజార్టీ భాగం ఉన్నట్లుఆపార్టీనేతలు ఇప్పటికీ విశ్వసిస్తారు. ప్రచారం ఎక్కువగా టౌన్‌హాల్స్, రిటైల్‌షాప్స్‌లవద్ద జరుగుతాయని చెపుతున్నారు. లోవాలో ఉన్న పిజ్జారాంచ్‌చైన్ వంటి షాపింగ్ మాల్స్‌కూడా సందర్శిస్తూ ఓటర్లను కలుస్తారని అంచనా. రిపబ్లికన్ ఓటర్లకు పెన్స్ కొత్తేమీ కాదు. ట్రంప్‌కు రెండవ కమాండర్‌గా వ్యవహరించినపెన్స్ రిపబ్లికన్ కాంగ్రెస్‌లో దశాబ్దాకాలానికిపైగా పనిచేసారు. 2020 ఎన్నికలపరంగా ట్రంప్‌తో వచ్చిన విభేదాలతో ఆయన స్వతంత్ర్య వ్యక్తిత్వంతో ముందుకు సాగారు. రెండున్నరేళ్లపాటు ట్రంప్ నిర్ణయాలకు ఆయన దూరంగానే ఉన్నారు. ఇపుడు రిపబ్లికన్ల అభ్యర్థిగా మెజార్టీ ఓట్లు సాధించుకుంటే పెన్స్ అభ్యర్థిత్వానికే రిపబ్లికన్లు ఓటువేయక తప్పదన్న నమ్మకంతో ఆయన అధ్యక్షపదవి రేసులోకి వచ్చారు.

# కార్పెట్ రోడ్డును చేతితో ఎత్తిచూపించిన గ్రామస్తులు

## కాంట్రాక్టర్ నిర్వాకంపై అధికారులకు ఫిర్యాదులు



**జల్నా,(మహారాష్ట్ర), జూన్ 1:** రాష్ట్రంలోని జల్నాల జిల్లా అంబాద్ తాలూకాలోని కర్జాత్ హస్త పోఖరీలో నిర్మించిన రోడ్డును గ్రామస్తులు ఉత్తచేతులతో కార్పెట్‌లాగా అమాంతం లేపేసి రోడ్డు నాణ్యత ఏపాటితో కళ్లకు కట్టినట్లు అందరికీ చూపించారు. ప్రధానమంత్రి గ్రామ్‌సడక్ యోజన కింద ఈరోడ్డునునిర్మించారు. స్థానిక కాంట్రాక్టర్ రాణా ఠాకూర్ ఈరోడ్డును వేసారు. రోడ్డు నిర్మాణానికి జర్మన్ సాంకేతికతను ఉపయోగించినటున లకాంట్రాక్టర్ రాణా ఠాకూర్ పేర్కొన్నారు. అయితే రోడ్డును ఒంటిచేత్తో అమాంతం లేపేసిన గ్రామస్తులు ఈనాసిరకం రోడ్డుకు ఆమోదం తెలిపిన ఇంజనీర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేసారు. రోడ్డువేసి నాలుగురోజులే అవుతున్నదని, ఈ విధంగా లేచిపోయే రోడ్లను గతంలో ఎప్పుడూ చూడలేదంటున్నారు. రాత్రికి రాత్రి ఇలాంటిరోడ్లువేసి చేతులు దులుపుకుంటున్నానరని విమర్శలు గుప్పించారు.

దీనిని ఆమోదించిన ఇంజనీర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేసారు. జర్మన్ టెక్నాలజీని ఉపయోగించామని, రోడ్డుపై కార్పెట్‌వేసి దానిపై తారురోడ్డు నిర్మాణంచేసినట్లు వెల్లడించాడు. మొత్తానికిఈరోడ్డు విడియో నెట్టింట వైరల్ అయింది. 63.32 లక్షల కిలోమీటర్ల రోడ్డు నెట్‌వర్క్‌తో భారత్‌ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్‌నెట్‌వర్క్ ఉన్న దేశంగా నిలిచింది. అయినా ఇప్పటికీ కూడా గ్రామాల్లో సరైన రోడ్లు లేకపోవడం గమనార్హం.

# వంటలో ఈ తప్పులు చేయొద్దు !



ఉద్యోగాలతో ఉదయాన్నే పరుగులు తీస్తేనే కానీ గడవని జీవితాలు మరి ఇంట్లో రకరకాలు వంటలు వండుకునే తీరికెక్కడది. అందుకే, హోటళ్ల పార్సిళ్లు లేదా ఓ సారి వండిన ఆహారాన్నే మళ్లీ మళ్లీ వేడి చేసుకుని తినడాలూ, ఇవేకాదు, పసిపిల్లాడికి పట్టించే పాల సీసా నుంచి నిల్వ పచ్చళ్ల వరకూ..ప్రతి దానికీ ప్లాస్టిక్ కవర్లూ, డబ్బాలే ఇవన్నీ వాడితే సౌకర్యం సరే! మరి ఆరోగ్యమో? అల్సర్ నుంచి క్యాన్సర్ వరకూ అన్నింటికీ ఈ అలవాట్లే కారణమంటున్నారు వైద్యులు. వీటి గురించి మరింత లోతుగా తెలుసుకుంటే...

**అల్యూమినియం ఫాయిల్‌తో...** మధ్యాహ్నం చపాతీనో, పరాఠానో తినాలనిపిస్తుంది. అందుకోసం కాస్త ఖాళీ దొరికినప్పుడే వాటిని చేసి అల్యూమినియం ఫాయిల్‌లో చుట్టి పెట్టేస్తాం. ఇలా అయితే ఎక్కువ సేపు తేమగా, మృదువుగా ఉంటాయి. కానీ ఈ కాగితంలో చుట్టిన వేడి వేడి పదార్థాలను తిన్నా, దాంతోనే వేడి చేసి తీసుకన్నా మూత్ర పిండాల వ్యాధులు, ఎముక సంబంధిత సమస్యలూ ముంచుకొస్తాయట అలానే, వీటిల్లో ఆమ్ల స్వభావం ఉన్నవి అంటే..



వెనిగర్ , టొమాటో, చింతపండూ వంటివాటితో చేసిన వంటకాలను అస్సలు ప్యాక్ చేయకూడదు. చేస్తే అల్యూమినియం కరిగి ఆపదార్థాల్లో కలిసిపోయే ప్రమాదం ఉంది.
ఏం చేయాలి? ఆహారాన్ని డబుల్ బాయిలింగ్ పద్ధతిలో వేడి చేయొచ్చు. చెక్క బాక్సుల్లో మస్లిన్ వస్త్రం పరిచి భద్రపరచుకోవడం వల్ల చపాతీలు తేమను కోల్పోకుండా ఉంటాయి.

**మరిగే నూనెల్లో..** కరకరలాడే ఫ్రైలూ, వేడివేడి మిర్చిబజ్జీల వంటివి నచ్చనది ఎవరికి? వీటి తయారీకి నూనె అవసరం కాస్త ఎక్కువే. ఇలా మిగిలిన నూనెని పడేయలేక తిరిగి కూరల్లో వాడేస్తుంటారు చాలామంది కానీ, వంటనూనెని ఒసారి ఉపయోగిస్తే.. అందులోని పోషకాలన్నీ మనం వాడుకున్నట్లే. దాన్ని తిరిగి వేడిచేస్తే చెడు కొలెస్ట్రాల్‌గా మారుతుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాదు. ఉదరకోశ, అన్నవాహిక క్యాన్సర్లకూ కారణమవుతుంది.

**ఏం చేయాలి:** కోల్డ్‌ప్రెస్డ్ నూనెల్ని వాడుకోవాలి. మరీ ఎక్కువగా మరగబెట్టడం, వాడిన నూనెల్ని మళ్లీ వాడటం మానేయాలి.

**ప్లాస్టిక్ భూతాన్ని వదిలేద్దాం...** రకరకాల రంగులూ, ఆకృతులూ, గాలి చొరని మూతలూ, తేలిగ్గా శుభ్రం చేసుకోగలిగే వీలు వంటివన్నీ వంటింట్లో ప్లాస్టిక్ డబ్బాల వాడకాన్ని పెంచేశాయి. దాంతో ఇల్లంతా ప్లాస్టిక్ మయమైపోయింది. ఇక, ప్యాకేజింగ్, ప్లాస్టిక్ ర్యాప్‌ల్లోని థాలేట్‌లు వ్యాధి కారకాలుగా మారుతున్నాయి. అలానే మైక్రోవేవ్, డిష్‌వాషర్ సేఫ్ ప్లాస్టిక్.. అని ఎంత గొప్పగా చెప్పినా ఆ వస్తువుల నుంచీ పెద్ద ఎత్తున రసాయనాలు వెలువడుతాయన్నది నమ్మి తీరాల్సిన నిజం. ముఖ్యంగా వీటిల్లో అధిక ఉష్ణోగ్రతల వద్ద వేడి చేసినప్పుడు పాలిథిలీన్, పాలీప్రొపైలిన్ వంటివి రసాయనిక చర్య పొందుతాయి. మైక్రో ప్లాస్టిక్‌ని ఆహారం. పానీయాల్లోకి పంపుతాయి. అంతే కాదు, ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లేట్లు, గిన్నెలు కాలం గడిచేకొద్దీ సూక్ష్మ పరిమాణంలో ప్లాస్టిక్ అణువులను విడిచిపెడుతూ ఉంటాయి. కంటికి కూడా కనిపించని వాటిని మనం తెలియకుండానే తినేస్తున్నాం. ఇందుకు తాజా ఉదాహరణ అమ్మపాలల్లో ప్లాస్టిక్ జాడ కనిపించడమే. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్, వాషింగ్టన్ స్టేట్ యూనివర్సిటీల అధ్యయనం ప్రకారం ప్లాస్టిక్‌లోని బైస్ఫినోల్ ఎ 'బిపిఎని గర్భిణులు మోతాదుకిమించి తీసుకుంటే గర్భస్థ శిశువు ఎదుగుదల దెబ్బతింటుంది.

**ఏం చేయాలి..** బయట ఆహారం ప్యాక్ చేసిన డబ్బాలు పునిర్వనియాగానికి పనికిరావు. గీతలూ, రంగు మారిన వాటి జోలికి పోవొద్దు. అలానే ప్లాస్టిక్‌డబ్బాల్లో నూనె, కొవ్వు పదార్థాలను నిల్వ ఉంచొద్దు. ఇక సింగిల్ యూజ్ వాటర్ బాటిళ్లే కాదు.. ప్లాస్టిక్ నీళ్ల సీసాల వినియోగానికి దూరంగా ఉండండి. స్టీల్, గాజు, పింగాణీ చెక్క సామగ్రిని వాడుకోవచ్చు.

**వేడి చేసి తింటున్నారా?** ఆహారాన్ని వృథా చేయకూడదని కొందరు పదే పదే వేడి చేసి తింటుంటారు. ఈ అలవాటు అనేక అనారోగ్య సమస్యలకు కారణమని హెచ్చరిస్తున్నారు వైద్యులు. ముఖ్యంగా ఆకుకూరల్ని మళ్లీ మళ్లీ వేడి చేయకూడదు. చేస్తే.. వీటిల్లోని ఖనిజాలు ఆక్సిడైజ్ అవుతాయి. ఐరన్ ఆక్సీకరణ చాలా వ్యాధులు ప్రమాదాన్ని పెంచుతుంది.

**క్యారెట్‌ని మళ్లీ మళ్లీ ఉడికిస్తే..** కార్సినోజెనిక్ ప్రొర్టీలు విడుదలవుతాయి. అలానే మిగిలిన అన్నాన్ని మళ్లీ వేడి చేసి తినడం వల్ల పోషకాలు నశించడమే కాదు.. ఇందులోని బ్యాక్టీరియా దాన్ని విషతుల్యంగా మారుస్తుంది. ఉడికించిన గుడ్లను రీహీట్ చేస్తే నైట్రోజన్ క్యాన్సర్ కారక ఫ్రీరాడికల్స్ విడుదల అవుతాయి. చికెన్‌ను పదే పదే వేడి చేయడం వల్ల ప్రొటీన్లు విచ్ఛిన్నమై జీర్ణ ప్రక్రియ దెబ్బతింటుంది.
అందువల్ల మళ్లీ మళ్లీ వేడిచేయడాన్ని మానేయండి. ❑

# జాతీయ స్థాయిలో 'మాస్టర్ క్రాఫ్ట్స్ కళాకారిణి'గా..

**వివిధ రాష్ట్రాల కళలను ఒకే కాన్వాస్‌పై కలిపి చిత్రీకరించారీమె. స్థానికతకు రకరకాల సంప్రదాయాలను అద్ది.. గృహాలంకరణకు కొత్త అర్థం చెప్పారు. ఈ సృజనాత్మకతనే వ్యాపారమార్గంగా మార్చుకొని దేశవిదేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నారు. ఉచిత శిక్షణతో వేలాదిమంది మహిళలకు ఉపాధి కల్పిస్తూ.. జాతీయ స్థాయిలో 'మాస్టర్ క్రాఫ్ట్స్ కళాకారిణి'గా గౌరవాన్ని అందుకొన్న సుమన్ సంతాలియా మనోగతమిది..**



మాది మధ్యతరగతి కుటుంబం. బిహార్‌లోని సహిబాబాద్ గ్రామం. నాన్న ఉద్యోగి. అమ్మ గృహిణి. చదువు, ఆటలు సహా కుట్టుపని నేర్చుకొనేదాన్ని. అమ్మ చేనేత పనిచేస్తే తోడుగా ఉండి నేనూ చేసేదాన్ని బొమ్మలు వేసేదాన్ని. గృహాలంకరణపై ఆసక్తితో ఇంటిని అందంగా తీర్చిదిద్దేఆన్ని. పెళ్లైన తర్వాత మావారితో కలిసి ఢిల్లీ వచ్చేశా.

**జత చేసి చూశా..** ఓసారి క్రాఫ్ట్ మ్యూజియానికి వెళ్లినప్పుడు వర్లి ఆర్ట్ పెయింటింగ్‌ను చూశా. దాన్ని చూస్తే అలా నేనూ వేయగలను అనిపించింది. ప్రయత్నిస్తే అచ్చుగుద్దినట్లు వచ్చింది. కుటుంబ మిత్రుడొకరు చూసి అటువంటివి మరిన్ని తయారు చేయగలవా అన్నారు. అలా వర్లి చిత్ర లేఖనాలు వేయడం మొదలుపెట్టా. ఓసారి ప్రయోగం చేయాలనిపించింది. ఒక కళకు మరొక ప్రాంతీయ కళను జత కలిపి కొత్తదనాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేశా. విజయవంతమైంది. ఇలా నేను వేసే పెయింటింగ్స్‌ను తెలిసినవాళ్లు కొనేవారు. దీన్నే వ్యాపార ఆలోచనగా మార్చుకోవాలనిపించింది. అలా 1998లో మా లివింగ్‌రూంనే ఆఫీస్‌గా మార్చి ఆరుగురు మహిళలతో 'ఆకృతి క్రియేషన్స్' ప్రారంభించా. మహారాష్ట్ర-మందాన, ఛత్తీస్‌గ్-గోండ్ కళలన్నింటినీ ఒకే కాన్వాస్‌పై వేసేదాన్ని. ఇవి చాలామందిని ఆకట్టుకునేవి. ఏడాది తిరిగే సరికి వీటికి డిమాండ్ పెరిగింది. ఒకరిద్వారా మరొకరికి వీటి గురించి తెలుస్తూ. ఓసారి ప్రభుత్వ కార్యాలయం నుంచి పిలుపొచ్చింది. అలా నా పెయింటింగ్ ఒకటి జనపథ్‌లోని సెంట్రల్ కాటేజ్ ఎంపోరియంలో ఉందిప్పుడు.

**ఆలోచన మార్చా...** కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా. అయిదారేళ్లకు పెయింటింగ్స్‌కు ఆర్డర్లు తగ్గాయి. నేనేమీ నిరుత్సాహపడలేదు. గృహాలంకరణ కోసం పూల కూజాలు, ట్రేలు, జార్స్ సహా భోజన బల్లలు, అలమరలు, సోఫాలు, అద్దాలు, ల్యాంపుషేడ్స్, సెరామిక్స్ వంటి ఫర్నిచర్ తయారీ ప్రారంభించాం. వీటిని కళాత్మకంగా తీర్చిదిద్దడం మా ప్రత్యేకం ఇప్పుడు నా దగ్గర ఉన్న 150 మందిలో 100మందికిపైగా మహిళలే. పెపర్‌ఫ్రై, ఇటోక్రీ, సెంకరటల్ కాటేజ్ ఎంపోరియం, ఫాబ్ ఇండియా, షాపర్స్ స్టాప్ వంటి సంస్థలు మా క్లైంట్స్,



అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు వేదికగా, సొంత వెబ్‌సైట్ ద్వారా వినియోగదారుల సంఖ్య వేలకు పెరిగింది.

**రూ. 3 కోట్లు....** ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ్‌బంగాలకు చెందిన కళాకారులు మా వద్ద పనిచేస్తున్నారు. రాష్ట్రేతర ప్రాంతాల్లోనూ వర్క్‌షాపులు నిర్వహించి వేలమంది మహిళలకు శిక్షణనిస్తున్నా. మలేసియా, సౌదీ అరేబియా, దుబాయి, లండన్ వంటి ప్రాంతాలకు మా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. గతేడాది మా సంస్థ వార్షికాదాయం రూ.3కోట్లు. ఇప్పుడు ఆభరణాలు కూడా డిజైన్ చేస్తున్నాం. వీటికి ఇటలీ, లండన్ నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఉండే కళలను కలిపి, ఫర్నిచర్, గృహాలంకరణలకు ఉపయోగిస్తూ ఇంటిని మరింత అందంగా మార్చాలన్నదే నా లక్ష్యం. 'మాస్టర్ క్రాఫ్ట్స్ కళాకారిణి'గా 2011లో రాష్ట్రపతి చేతులమీదుగా తీసుకున్న జాతీయ పురస్కారాన్ని మరవలేను. ❑

# తలలో దురద తగ్గాలంటే..



కొంత మంది అమ్మాయిలు ఎంత హుందాగా తయారై ఆఫీసుకు వెళ్లినా.. సాయంత్రం ఇంటికి తిరిగొచ్చేసరికి మాత్రం జుట్టు చిందరవందరగా అయిపోతుంది. కారణం తలలో దురద. దీంతో ఆమె ఆఫీసు పని పైన శ్రద్ధ పెట్టలేకపోతోంది. ఇలాంటి సమస్య చాలామందే ఎదుర్కొంటుంటారు. ఎక్కువ రోజులు నూనె రాసుకోకపోవడం వల్ల మాడు పొడిబారిపోవడం, చుండ్రు, పేలు.. ఇలా పలు కారణాల వల్ల తలలో విపరీతమైన దురద పుడుతుంది. దీనివల్ల ఎప్పుడు చూసినా చేతులు తలలోకే వెళ్తుంటాయి. ఈ సమస్య తీవ్రమైతే జుట్టు పటుత్వం కోల్పోయి రాలిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి మొదట్లోనే సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టాలి. దీనికీ కొన్ని సహజసిద్ధమైన మార్గాలున్నాయి. అవేంటో చూద్దాం రండి..



**నూనె రాస్తున్నారా?..** కొంతమంది సమయం లేకనో లేదంటే జిడ్డుగా కనిపించకూడదనే ఉద్దేశంతోనో.. తలకు నూనె రాయరు. దీంతో కుదుల్లు పొడిబారిపోయి దురదకు దారి తీస్తుంది. అలాగే జుట్టు కూడా నిర్జీవమైపోతుంది. ఫలితంగా కుదుళ్లు, జుట్టు రెండూ ఆరోగ్యాన్ని కల్పోతాయి. అందుకే కొబ్బరి, బాదం, ఆలివ్.. వంటి సహజసిద్ధంగా లభించే నూనెలను తగిన మొత్తంలో కనీసం వారానికోసారైన రాసుకోవాలి. దీనివల్ల దురద తగ్గే అవకాశం ఉంటుంది. అంతేకాదు జుట్టు కూడా పట్టులా మెరుస్తుంది.

**మసాజ్ చేయాలి..** కుదుళ్లకు సరైన రక్తప్రసరణ లేకపోవడం వల్ల కూడా మాడు ఆరోగ్యం దెబ్బతింటుంది కాబట్టి నూనె రాసుకునే ముందు దాన్ని కాస్త గోరువెచ్చగా చేసుకుని దాంతో మాడుపై కాసేపు మసాజ్ చేయాలి. దీంతో కుదుళ్లను రక్తప్రసరణ బాగా జరిగి దురద క్రమంగా తగ్గుముఖం పడుతుంది. నూనె రాసిన తర్వాత జిడ్డుగా ఉంది అనిపిస్తే.. గాఢత తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేసే తతేడా మీకే తెలుస్తుంది.

**తడిగా వద్దు...** చాలామంది తలస్నానం చేసి తర్వాత జుట్టు పూర్తిగా అరకముందే గట్టిగా జడ వేసుకోవడం లేదంటే రబ్బర్ బ్యాండ్ పెట్టుకోవడం లాంటివి చేస్తుంటారు. దీనివల్ల జుట్టు మొదట్లో పూర్తిగా అరదు. దీంతో ఆ ప్రదేశంలో ఫంగస్ చేరే అవకాశాలు ఎక్కువ ఇలాంటి సందర్భాల్లో కూడా దురద వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి జుట్టు పూర్తిగా ఆరిపోకముందే గట్టిగా కట్టుకోవడం కాకుండా వదులుకోవడం లేదా చిన్న క్లిప్ పెట్టుకోవడం మంచిది.

**ఆహారం కూడా ముఖ్యమే .....** తల్లో దురద తగ్గించడంలో ఆహారానిది కూడా కీలక పాత్రే. ఈ క్రమంలో మైక్రోన్యూట్రియంట్లు అధికంగా లభించే పండ్లు, కూరగాయలు, నట్స్.. వంటివి రోజూ ఆహారంలో భాగం చేసుకోవాలి. దీనివల్ల కుదుళ్లు ఆరోగ్యంగా తయారై జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. దురద కూడా తగ్గుతుంది. ❑

# పిల్లలకు తినేటప్పుడు ఫోను ఇవ్వరాదు!



**తినే సమయంలో పిల్లలు చేసే మారం అంతా ఇంతా కాదు. కాస్తంత తినడానికి ఇల్లంతా ఉరుకులు, పరుగులు పెట్టిస్తారు. దాన్ని భరించలేక ఫోన్లు, ట్యాబ్‌లు ఇచ్చి తినిపిస్తున్నారు. దీనివల్ల వారు గ్యాడ్జెట్స్‌కు చిన్నప్పటి నుంచి బానిసలుగా మారుతున్నారు. ఈ పద్ధతి మారాలంటున్నారు నిపుణులు.**

ఫోన్లను చూస్తూ అవసరానికి మించి తినేస్తుంటారు. దీనివల్ల చిన్నవయసులోనే ఉబకాయం బారిన పడుతున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు వెనుకాడుతున్నారు. దీనివల్ల పిల్లల్లో ప్రసంగ, భాషా, సామాజిక భావోద్వేగాల అభివృద్ధిలో సమస్యలు ఎదురవుతున్నాయి.

**తగ్గించండిలా...** ఒకేసారి వాళ్ల నుంచి ఫోన్లు లాక్కున్నా, టివిలు చూడొద్దన్నా తినకుండా గోల చేస్తారు. నెమ్మదిగా గ్యాడ్జెట్స్‌ను దూరం చేయాలి.

- అందరూ ఒకేసారి కూర్చుని తినే అలవాటు చేయాలి. అలా తింటోన్న సమయంలో పిల్లలకు పెద్దవాళ్లకు చర్చ జరిగేలా ప్రోత్సహించాలి. కుటుంబ సభ్యులూ తింటున్న సమయంలో ఫోన్లు, టివి, ల్యాప్‌టాప్‌లు చూడకుండా ఉంటే మంచిది. మిమ్మల్ని గమనించే పిల్లలూ నేర్చుకుంటారు.
- అసలు స్క్రీన్ సమయం లేకుండా ఆహారం తినడం లేదని వాళ్లమీద కోప్పడితే లాభం లేదు. తినేటప్పుడు ముందు 5, 10 నిమిషాలు ఇచ్చి తరువాత తీసేసుకోండి. దీన్ని నెమ్మదిగా తగ్గించండి.
- వాళ్ల ఆకలి అవసరాలను అర్థం చేసుకోండి. కడుపు నిండినట్లు అనిపిస్తే తినమని బలవంతం చేయద్దు. గ్యాడ్జెట్స్ చూడొచ్చన్న వంకతో ఇష్టమున్నా లేకపోయినా, అవసరమున్నా లేకున్నా తింటుంటారు. అదీ మానుకోండి.
- పిల్లలు ఏం తింటున్నారో వారికి చెప్పండి తినే దానిపై అవగాహన కల్పించండి. రుచి ఎలా ఉన్నదీ అడగండి, రివ్యూ చెప్పడానికి అయినా ఆహారంపై ఆసక్తి చూపిస్తారు. ❑

# కరివేపాకు పచ్చడి



**కావలసినవి :** కరివేపాకు కట్టలు-ఐదు (చిన్నవి), ఎండుమిర్చి-పది, చింతపండు-నిమ్మకాయంత, పసుపు- అర టీస్పూన్, ధనియాలు అర టీస్పూన్, నువ్వులు-ఒక టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత, ఇంగువ - రెండు చిటికెడులు, నూనె-రెండు టీస్పూన్లు, శనగపప్పు - అర స్పూన్, మినపప్పు-అర స్పూన్, ఆవాలు-అర స్పూన్, జీలకర్ర-అరస్పూన్.

**తయారీ విధానం :** ముందుగా కరివేపాకును శుభ్రంగా కడిగి తడిలేకుండా ఆరబెట్టుకోవాలి. నువ్వుపప్పు దోరగా వేగించాలి. స్టవ్‌పై బాణలి పెట్టి నూనె వేసి కాస్త వేడి అయ్యాక శెనగపప్పు, మినపప్పు, ధనియాలు, జీలకర్ర ఆవాలు, ఇంగువ వేసి పోపు పెట్టుకోవాలి. ఆ పోపును ఒక ప్లేట్‌లోకి తీసుకుని పక్కన పెట్టుకోవాలి. అదే బాణలిలో ఎండుమిర్చి వేసి వేగించాలి. కాసేపయ్యారక కరివేపాకు వేయాలి. చింతపండు వేసి స్టవ్‌పై నుంచి దింపాలి. చల్లారాక అన్నీ కలిపి గ్రైండ్ చేసుకోవాలి. తగినంత ఉప్పు వేసుకోవాలి. కొద్ది నీళ్ల కలిపి పచ్చడి తయారీ చేసుకోవాలి.❑

# అజ్వా ఖర్జూరంలో పోషకాలు ఎన్నో..



తీయని ఖర్జూరాలంటే ఇష్టపడనిదెవ్వరు? అయితే ఖర్జూరాల్లో చాలా రకాలు ఉంటాయి. వాటిల్లో అజ్వా రకం చాలా ప్రత్యేకం. అరుదుగా దొరికే ఈ పండు పోషకాల పరంగానూ ప్రత్యేకమే. . అజ్వా ఖర్జూరాలు సౌదీ అరేబియాలోని మదీనాలో మాత్రమే పండుతాయి. స్వయంగా భగవంతుడే ఈ చెట్లని నాటాడని స్థానికులు నమ్ముతారు. తేనెలో ముంచినట్టు తీయగా ఉండే పండ్ల పోషకాలకు పెట్టింది పేరు. అధిక మొత్తంలో పీచుని అందిస్తూ రక్తహీనతని నివారిస్తాయీ పండ్లు. మహిళల్లో సంతాన సాఫల్యతని పెంచడంతోపాటు.. అందమైన చర్మాన్ని అందిస్తాయి. చర్మవ్యాధులనుంచి ఉపశమనం పొందొచ్చు. ఆందోళన దూరం చేసి.. మనసుని ప్రశాంతంగా ఉంచుతాయి. కడుపులో నులిపురుగులని దూరం చేస్తాయి. పీచు పుష్కలంగా ఉండటం వల్ల మలబద్ధకం రాకుండా చేస్తాయి. ❑

# దృఢదీక్ష



విద్యావంతుడైన ఒక యువకుడు తనకి ఉద్యోగం దొరకలేదని తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. 'ఎలా బతకాలి, ఎవరికోసం బతకాలి, ఎందుకోసం బతకాలి అని బాధపడుతూ సముద్రం ఒడ్డుకు చేరాడు. అక్కడ సముద్రాన్ని చూస్తూ ఓ జ్ఞాని ఇసుకలో కూర్చుని ఉన్నాడు. నిరాశ వదనంతో ఉన్న ఆ యువకుడిని జ్ఞాని పలకరించి అతడి నుంచి అన్ని విషయాలూ రాబట్టాడు. తనకన్నా తక్కువ అర్హతలున్న వారు సైతం మంచి పదవులు అలంకరించారని ఆ యువకుడు వాపోయాడు. వ్యవస్థ తనకి అన్యాయం చేసిందని, చివరికి దేవుడు సైతం శీతకన్ను వేశాడని విలపించాడు. జ్ఞాని చిన్న నవ్వు నవ్వు నీకు తెలుసో తెలియదో.. దేవుడు సహాయం చేయడానికి ఆలస్యం అవుతుందేమో కానీ పూర్తి అన్యాయం మాత్రం జరగదు. ప్రయత్నాలు విస్తృతంగా చేయ్, ఖచ్చితంగా ఫలితం వస్తుంది. అని ధైర్యం చెప్పాడు. సముద్రం నీళ్ళల్లో అస్తమిస్తున్న సూర్యుడినే చూస్తూ ఆ యువకుడు మీలాంటి జ్ఞానులు కంటి తుడుపుగా నాలుగు మంచి మాటలు చెబుతారు కానీ.. అది జరిగేదేనా? మోడువారిపోతున్న ఈ జీవితంలోకి కొత్త చిగురు తొంగి చూసేనా? అని బాధపడ్డాడు. అందుకు ఆ జ్ఞాని నువ్వు నిజంగా నీ జీవితాన్ని ప్రేమించేట్లయితే అది జరిగి తీరుతుంది. అందుకు మరింత కృషి తప్పనిసరి. ఎలాంటి పరిస్థితుల్లోనూ వ్యతిరేక ఆలోచనలను నీమదిలోకి రానివ్వొద్దు నీకొక విషయం చెప్పనా ఆకాశంలో కనిపించే సూర్యుడిని కొన్ని వేల సంవత్సరాలుగా భూమి ప్రేమిస్తోందట. అయినా ఇప్పటివరకు అది సూర్యుడిని చేరుకోలేదు. అందుకని అది నిరాశ చెందలేదు. తన ప్రయత్నము మానలేదు. అది జరగదేమో అన్న అనుమానమే లేకుండా క్షణ క్షణం.. నిరంతరం అది శ్రమిస్తూనే ఉంది. ప్రస్తుతం నీకు ఉండాల్సింది భూమికున్నంత దృఢదీక్ష. మరికొంత కాలం ప్రయత్నించు. నీవనుకున్నది జరిగి తీరుతుంది. అని చెప్పి భుజం తట్టాడు. ఇంతలో ఓ సముద్రపు అల అతడి కాళ్లను తాకింది. దాన్ని చూస్తూ అతడు నిజమే.. సముద్రపు అలలు ఎడతెరపి లేకుండా వస్తూనే ఉంటాయి. ఒడ్డు మాత్రం వాటిని చూసి వణకదు, బెణకదు. ఏమి జరిగితే అది జరగనీ అన్నట్లు అది సాక్షీభూతంగా మాత్రమే ఉంటుంది. మనుషులమైన మనకి కష్టాలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. మనం వాటికి భయపడకూడదు. అని తనకు తానే ధైర్యం చెప్పుకుని ఉద్యోగాన్వేషణకోసం అక్కడి నుంచి బయలుదేరాడు. ఆరునెలల తర్వాత ఆ యువకుడు చిరునవ్వు నవ్వుతూ జ్ఞాని వద్దకు వచ్చాడు. మంచి కొలువు దొరికిందని చెప్పి ఫలపుష్పాదులతోపాటు స్వచ్ఛమైన తేనెను అందించి ఆశీర్వాదం తీసుకున్నాడు.

-ఆర్.సి.కృష్ణస్వామిరాజు

ఆధ్యాత్మికం

# జాబ్ కుటుంబం కోసమే..

**దేశంలో 67శాతం మంది మహిళలు తమ కుటుంబా లకు ఆర్థికంగా దన్నుగా ఉండటం కోసమే ఉద్యోగాలు చేస్తున్నట్లు తేలింది. ఆర్థిక విషయాలపై ఉద్యోగినుల అవగాహనను గుర్తించడానికి చేపట్టిన ఈ అధ్యయనం ఇంకా ఏం చెప్పిందంటే..**



మన దేశంలో టైర్ 1, టైర్ 2 మెట్రో నగరాల నుంచి సేకరించిన డేటా ప్రకారం ఉద్యోగినులు తమ సంపాదనను ఇంటి బడ్జెట్‌కు ఎక్కువ శాతం కేటాయిస్తున్నారు. కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచడం కోసంమే 67 శాతం మంది మహిళలు ఉద్యోగాలు చేస్తున్నారు. మొత్తం 10వేల మంది ఉద్యోగినుల నుంచి సమాచారాన్ని సేకరించారు. ఢిల్లీలో 70 శాతం మంది ఉద్యోగినులు ఆదాయాన్ని కుటుంబాలకే అందిస్తున్నట్లు చెప్పారు. మిగతా వాళ్లు సగం కుటుంబ ఖర్చులకిచ్చి మిగతాది పొదుపు చేస్తున్నట్లు తెలిసింది. వీరంతా కుటుంబ ఖర్చులు, ఆర్థిక సంబంధిత విషయాల్లోనూ ఎక్కువగా పాలు పంచు కుంటా మని చెప్పారు. ఆర్థిక విషయాల్లో అవగాహన పెంచుకుంటు న్నారు. 21-65 వయసులోపు గృహిణులు, వ్యాపార వేత్తలపైనా అధ్యయనం చేశారు. వీరిలో మూడోవంతు కనీసం ఇంటి ఆర్థిక వ్యవహారాల్లో పాల్గొనడానికి కూడా వెనుకాడుతున్నారు. వ్యాపారవేత్తలు తమ వ్యక్తిగత ఆర్థిక భద్రతపై అవగాహనను పెంపొందించు కోవడానికి సదస్సులకు హాజరు కావడం, నిపుణుల సలహాల కోసం ముందడుగు వేస్తున్నట్లు తెలిసింది. అమెరికాలో ఇదే విషయంపై చేపట్టిన సర్వే ఫలితాలు కూడా దాదాపు మన దేశంలో వచ్చిన ఫలితాలకు దగ్గరగా ఉన్నాయి. గతంలో కూతురి సంపాదనను తీసుకోవడానికి వెనుకడుగు వేసేవారు. ఉద్యోగమంటే పురుషుడి బాధ్యత అనేవారు. ఆ పరిస్థితి మారింది. ఉద్యోగానికి లింగ భేదం లేదు. స్త్రీ పురుషులిద్దరూ అన్ని రంగాల్లోనూ సమానంగా అడుగుపెట్టి కుటుంబ ఆర్థిక బాధ్యతలనూ పంచుకోవడం ప్రత్యేకంగా కనిపిస్తోంది. ❑

## సినిమా షూటింగ్ సందడి



ఇచ్ఛాపురం, జూన్ 1, ప్రభాతవార్త

ఇచ్ఛాపురంలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. స్టార్‌లైన్ మూవీస్ లింగ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా ఆ సినిమా పేరేంటి అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకుసంబంధించిన షూటింగ్ గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మ వారి ఆలయంలో ప్రారంభమైంది. బెల్లుపడకు చెందిన అనపాన లక్ష్మీనారాయణ అనే యువకుడు హైదరాబాద్‌లో సినిమా రంగంలో స్థిరపడి స్థానికంగా ఉన్న ఊరిపై మమకారంతో 14 ఏళ్లు దాటిన యువత ఎలా ప్రభావితమవుతున్నారు అనేసామాజిక అంశం నేపథ్యంలో సినిమాను దర్శకత్వం వహిస్తున్నారు. షూటింగ్ పూజను మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్‌చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్యలు కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. సినిమా మొదటి క్లాప్‌ను అమ్మవారి ఆలయంలో లోపల టౌన్ ఎస్సై గోవిందరావు క్లాప్ కొట్టగా మొదటి సీన్‌కు కెమెరా స్విచ్ ఆన్ చేసి పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్రయాదవ్ యాక్షన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రమేష్, జ్ఞానభారతి సెక్రటరీ జోహార్ ఖాన్, నర్తు భానోజీరావు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ భూములకు డ్రోన్‌తో రీ సర్వే

ఇచ్ఛాపురం, జూన్ 1, ప్రభాతవార్త



మున్సిపాలిటీ పరిధిలో భూముల రీసర్వేకు డ్రోన్‌లను వినియోగించారు. మున్సిపాలిటీ హద్దులు గుర్తించేందుకు 3వ వార్డు ఎఎస్ పేటలో డ్రోన్ సాయంతో ఫోటోలు తీశారు. 5 రోజుల్లో రీసర్వే పూర్తవుతుందని కమిషనర్ ఎన్.రమేష్ చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి రీసర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, కోఆప్షన్ మెంబర్ సాలిన ఢిల్లీ, ప్రకాశరావుపట్నాయక్, పురుషోత్తపురం సచివాలయం సిబ్బంది, డ్రోన్ ఏజెన్సీ పాల్గొన్నారు.

## 16వ వార్డులో వాలంటీర్లకు వందనం



ఇచ్ఛాపురం, జూన్ 1, ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధి 16వ వార్డులో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గల 16, 17 సచివాలయం పరిధిలో వలంటీర్లను వైస్‌చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రమేష్, 17వ వార్డు ప్రతినిధి టెంక లోకేష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఈదుపురం గ్రామంలో రామాలయం నిర్మాణానికి భూమిపూజ



ఇచ్ఛాపురం, జూన్ 1, ప్రభాతవార్త

ఈదుపురం గ్రామంలో పురాతనమైన రామాలయాన్ని జీర్ణోద్ధరణ చేసి పునఃప్రతిష్టించే కార్యక్రమంలో భాగంగా నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటిసి ఉప్పాడ నారాయణమ్మ, పిఎసిఎస్ చైర్మన్ నర్తు నరేంద్రయాదవ్, నర్తు భానోజీ, ఉప్పాడ రాజారెడ్డి, బొనమాలి బెహరా, నీలాద్రిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల పట్టాల సమస్య పరిష్కరించండి



ఇచ్ఛాపురం, జూన్ 1, ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల పట్టాల సమస్య పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి తహశీల్దార్ గురుప్రసాద్‌ను కోరారు. నవరత్నాలు, పేదలందరికీఇళ్లు కార్యక్రమంలో భాగంగా పట్టాలు అందడం లేదని చెప్పారు. రేషన్ వాహనాల ద్వారా సరుకులు అందకపోవడం వల్ల కార్డులు ఇన్‌యాక్టివ్ అవుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో 1, 8, 10, 11 వార్డుల పట్టాల సమస్యపై చర్చించారు. సమావేశంలో కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, పల్లంటి మధుమూర్తి, పొన్నపువ్వుల తేజేశ్వరరావు, తాడి ఆదిరెడ్డి, సాలిన ఢిల్లీ, ప్రకాశరావు పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం చక్కని వేదిక


### ఆంధ్రప్రదేశ్ శాసనపసభాపతి తమ్మినేని సీతారం

ఆముదాలవలస, జూన్ 1, ప్రభాతవార్త



అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. మున్సిపాలిటీలో 21వ వార్డు కుద్దిరాంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంబంధిత అధికారులు, సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు విన్నవించిన సమస్యలను అక్కడే ఉన్న అధికారులు ద్వారా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధి కలిగిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని పాలించడం ప్రజల అదృష్టమన్నారు. అటువంటి నాయకుని వద్ద పనిచేయడం వల్ల ఎలాంటి సమస్య అయినా పరిష్కరించగలమన్న ధీమా ఉందన్నారు. అందువల్లే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న నవరత్న పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. ప్రతి సచివాలయానికి ముఖ్యమంత్రి రూ.20లక్షల నిధులు మంజూరు చేశారని ఆయా సమస్యలను పరిష్కరించాలనే సిఎం చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. ఏ ఇంటికెళ్లినా సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజలంతా ఆనందోత్సాహాలతో స్వాగతం పలుకుతున్నారన్నారు. రోడ్లు, డ్రైన్లు వంటి సమస్యలు విషయంలో పరిష్కారానికి తగిన చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆలోచనలతో దళారులకు అవకాశాలు లేకుండా నేరుగా సంక్షేమ పథకాలు అర్హత గల లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. సచివాలయ, వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు చేరేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పారదర్శక పాలనను ప్రవేశపెట్టారన్నారు. రైతులకు రైతుభరోసా కేంద్రాల ద్వారా విస్తృత సేవలు అందిస్తున్నారన్నారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో సర్కారీ పాఠశాలలకు మౌళిక వసతులు కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వ వైద్యసేవలను ప్రజలకు మరింత దగ్గర చేయాలనే ఉద్దేశ్యంతో ప్రతి గ్రామంలోనూ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తద్వారా పేద ప్రజలందరికీ నాణ్యమైన సత్వర వైద్యం అందించాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉద్దేశ్యం అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రం అభివృద్ధి మార్గంలో పయనించాలంటే జగన్మోహన్‌రెడ్డి పాలన ద్వారా మాత్రమే సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డేపల్లి రమేష్‌కుమార్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, బోర చిన్నంనాయుడు, పొడుగు శ్రీనివాసరావు, మామిడి ప్రభాకరరావు, మామిడిరమేష్‌కుమార్, కుప్పిలి సత్యన్నారాయణ, తదితర వైఎస్సార్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు,సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## బాలకార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తే కఠిన చర్యలు



నరసన్నపేట, జూన్ 1, ప్రభాతవార్త

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 18 సంవత్సరాలలోపు బాలలతో పని చేయించే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని నరసన్నపేట కార్మికశాఖ అధికారి విభూది జయశంకరరావు తెలిపారు. గురువారం నరసన్నపేట పట్టణంలో బస్టాండ్ మార్కెట్ వివిధ ప్రాంతాల్లో దుఖాణాలలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభం నాటికి బాలకార్మికులను గుర్తించి బడిలో చేర్పించాలని అన్నారు. బాలకార్మికులను వ్యవస్థను నిర్మూలించేందుకు ఏర్పాటు చేసిన చట్టాలను సమర్థవంతంగా అమలుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పోలీస్, మహిళా శిశు సంక్షేమం, రెవెన్యూ,చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో కమిటీగా ఏర్పడి బాలకార్మికులను తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. బాలకార్మికులుగా గుర్తించిన బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. బాల కార్మికులకు, బడిబయట ఉన్న బాలలను, ఆపదలో ఉన్నబాలలను గమనిస్తే వెంటనే 100 ద్వారా సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా 101కుగాని 181కు, చైల్డ్‌లైన్ 1098 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందిస్తే తక్షణమే స్పందించి బాల కార్మికులకు విముక్తి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎహెచ్‌టియు సబ్ ఇన్‌స్పెక్టర్ కేశవరావు, హెడ్ కానిస్టేబుల్ గోవిందరావు, మండల విద్యాశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరేళ్ల మైనర్ బాలికపై అత్యాచారం

ఇచ్ఛాపురం, జూన్ 1, ప్రభాతవార్త

పట్టణ పోలీస్‌స్టేషన్‌పరిధిలో ఆరేళ్ల మైనర్ బాలికపై 65ఏళ్ల వ్యక్తి అత్యాచారంకు పాల్పడినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 24న ఇంటి పక్కనున్న వ్యక్తి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ఆలస్యంగా తెలిసింది. దీంతో గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫోక్సో చట్టం కింద టౌన్ ఎస్సై కె.గోవిందరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక మూగ, చెవుడు, అంధురాలిగా తెలిసింది.

## 8975 మంది రైతులకు రూ.6.73 కోట్లు విడుదల



సోంపేట, జూన్ 1, ప్రభాతవార్త

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వరుసగా ఐదో ఏడాది మండలానికిచెందిన 8975 రైతులకు 6.73 కోట్లు గురువారం రైతుభరోసా, పిఎం కిసాన్ రైతులకు 7500 విడుదల చేసిన అనంతరం కేక్ కట్ చేసిన ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు. ఈ కార్యక్రమంలో ఎఓ నరసింహరావు, ఎంపీడీఓ బెందాళం వెంకటరమణ, మేజర్ పంచాయతీ సర్పంచ్ నగిరి ప్రభావతి, రైతు సంఘ అధ్యక్షులు కర్రి కామేశ్వరరావు,వైస్ ఎంపీపీ రేగు ప్రేమ, ఎంపీటీసీ సభ్యులు పొడుగు కామేష్,వైస్ సర్పంచ్ మల్లా వెంకటరమణ, పొందర లోకనాథం, తంగుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న పేరాడ తిలక్, నేతలు



నందిగాం, జూన్ 1, ప్రభాతవార్త

నందిగాం మండలం మద్దిలవానిపేట గ్రామంలో కొంకి సోమేశ్వరరావు కుమారుడు వివాహ వేడుకల్లో రాష్ట్ర కళింగ కార్పోరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, కవిత అగ్రహారం సర్పంచ్ బొమ్మాళి గున్నయ్యలు పాల్గొన్నారు. అలాగే బైరిబొడ్డపాడు గ్రామంలో జరిగిన గ్రామదేవత ఉత్సవాల్లో రాష్ట్ర కళింగ కార్పోరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, సర్పంచ్‌లు బొమ్మాళి గున్నయ్య, తమిరి రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు తమిరి బలగాం, లోళ్ల వైకుంఠరావు, నడిమింటి రామ్మూర్తి వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.



## విమలమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ఆముదాలవలస, జూన్ 1, ప్రభాతవార్త



ఎం.విమలమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం ఆముదాలవలస గేటు చిట్టెమ్మ క్వార్టర్స్‌లో మెండ విమలమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో క్రీస్తు రక్షణ సువార్త ఉజ్జీవ సభలు సందర్భంగా రాగోలు జెమ్స్ వైద్యులు డాక్టర్‌పి.ఎల్. ఎన్.రాజు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో రాగోలు వైద్యులు గుండె, ఇతర రోగాలకు పరీక్షలు నిర్వహించారు.డాక్టర్ పి.ఎల్.ఎన్.రాజు ఉచిత నేత్ర శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శామ్యూల్ మెండ శ్రీనివాసరావు, ఫాస్టర్స్ రాడా విజయ్‌కుమార్, ఆశిర్‌కుమార్, జార్జ్ మల్లార్, టీడీపీ నాయకులు ఎం.రమేష్‌తో పాటు ఫాస్టర్స్ సంఘ కాపరులు పాల్గొన్నారు.

## ఘనజీవామృతం వాడకంపై రైతులకు అవగాహన

కొత్తూరు, జూన్ 1, ప్రభాతవార్త



కొత్తూరు మండలం శోభనాపురం గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం (ఎన్‌పిఎం షాపు) వద్ద మాస్టర్ శిక్షకులు ఎస్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం 600 కేజీల ఘన జీవామృతం తయారు చేసినట్లు ఎంటి సూర్యనారాయణ స్థానిక విలేకర్లకు వెల్లడించారు. ప్రస్తుతం ఖరీఫ్‌కి ఎద పద్ధతిలో వరి వేసుకునే ముందుగా నవధాన్యాలు వేసుకోవడానికి ముందుగా ఘన జీవామృతం వేసుకోవడం ఆనవాయితీగా ఉండాలన్నారు. రైతులందరూ భూమిలో పోషక విలువలు పెంపొందించేందుకు, ప్రధాన పంటలకు దిగుబడి పెంచేందుకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన రైతులకు సలహాలు, సూచనలు అందించారు. అలాగే (పిఎండిఎస్) నవధాన్యాల కిడ్స్ రైతులందరికీ అందుబాటులో ఈ షాపు ద్వారా 10 కేజీలు కిట్ 800 రూపాయలు చొప్పున అమ్మకాలు చేస్తున్నట్లు రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎం.టి సూర్యనారాయణ, ఐసిఆర్ పి.చిన్నమ్మి, మహిళా సంఘ సభ్యులు, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

## నీలకంఠాపురంలో గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు, జూన్ 1, ప్రభాతవార్త



కొత్తూరు మండలం నేరడి గ్రామ సచివాలయం పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం 152వ రోజు కార్యక్రమంలో పాతపట్నం శాసన సభ్యురాలు రెడ్డి శాంతి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి మూడేళ్ల సంక్షేమ పాలనలో లబ్ధిదారులకు చేకూరిన లబ్ధిని ప్రజలకు, లబ్ధిదారులకు వివరించారు.ఇందులో భాగంగా గ్రామంలోని ప్రతి లబ్ధిదారునికి ఇంటికి సంబంధిత గ్రామ వలంటీర్ సాయంతో వెళ్లి జగనన్న పాలనలో అందిన లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో గల సమస్యలను పలువురిని అడిగి తెలుసుకున్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతికి గ్రామస్తులు బ్రహ్మరథం పట్టడం విశేషం. కార్యక్రమంలో మండల వైకాపా అధ్యక్షులు సారిపల్లి ప్రసాదరావు, కొత్తూరు పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, కొత్తూరు ఎంపీటీసీ ప్రతినిధి మండల వైకాపా ఉపాధ్యక్షులు గండివలస ఆనందరావు, జిల్లా వైకాపా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, కొత్తూరు జెడ్పీటిసి కామక భాగ్యవతి, కామక త్రినాధరావు, పారాపురం ఎంపీటీసీ వనుము లక్ష్మీనారాయణ, మండల వైకాపా నేతలు కార్యకర్తలతో సహా మండల పరిషత్ ఈఓపిఆర్‌డి కృష్ణారావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న పేరాడ తిలక్

నందిగాం, జూన్ 1, ప్రభాతవార్త



టెక్కలి పంచాయతీ ఉపసర్పంచ్ గండి అప్పలరెడ్డి కుమార్తె వివాహ వేడుక సందర్భంగా రాష్ట్ర కళింగ కార్పోరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పాల్గొన్నారు. అలాగే దేవలభద్ర గ్రామానికి చెందిన చమళ్ల అప్పల నాయుడు వివాహ వేడుకల్లో రాష్ట్ర కళింగ కార్పోరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. నందిగాం గ్రామానికి చెందిన సాహుకారి కృష్ణారావు కుమారుడు సాయికుమార్ వివాహ వేడుకల్లో కూడా పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో ఈయనతో పాటు నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు దుక్కరామకృష్ణ, బగాది హరి, జద్యాడ జయరాం, పీత రమణబాబు, షేక్‌రాజు, టొంప రామారావు, సర్లాన బైరాగి, ఎంపీటీసీ అంబోడి విష్ణు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీకాకుళం వార్త



## ఏళ్ల నాటి కల నెరవేరనుంది

కోటబొమ్మాళి, జూన్ 1, ప్రభాతవార్త



జాతీయ పార్టీ, ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చి పరిపాలన అందించినప్పటికి మేజర్ పంచాయతీ కోటబొమ్మాళిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సామాజిక భవనం లేకపోవడం విచారదాయకం. దళిత సోదరులే కాదు దళితయేతరులు కూడా మండల కేంద్రానికి వివిధపనులపై వచ్చి కాసేపు సేద తీర్చుకోవడానికి ఎటువంటి భవనం అందుబాటులో లేదు. ఏళ్లగా స్థల సేకరణకు, భవన నిర్మాణానికి దళిత సోదరులు ప్రయత్నం చేస్తున్నప్పటికి ప్రయత్నాలు ఫలించలేదు. ప్రస్తుతం దళిత నాయకులు బోకర జడ్డన్న, దువ్వారపు సింహాచలం, సర్పంచ్ కాళ్ల సంజీవరావు, కూన మల్లయ్య, దేవాది కృష్ణారావు, అక్కురాడ సురేష్, కరజాడ భాస్కరరావు, సామ సంజీవరావు, తదితర దళిత నాయకుల ఆధ్వర్యంలో ఒక అడుగు ముందుకు వేసి భవన నిర్మాణపు స్థలాన్ని కేటాయింపులు జరగడం ఎంతో సంతోషకర విషయం. అదే స్ఫూర్తితో ముందుకు పోతూ భవన నిర్మాణానికి నిధులు సేకరించి త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని దళిత సోదరులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి



కోటబొమ్మాళి, జూన్ 1, ప్రభాతవార్త

ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని చీపుర్లు పాడు ఎంపీటీసీ మరియు మండల విప్ బొడ్డు అప్పన్న కోరారు. గురువారం చీపుర్లుపాడు గ్రామంలో జెమ్స్ ఆసుపత్రి వారి సౌజన్యంతో గ్రామంలో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు జెమ్స్ ఆసుపత్రి వారు ఉచిత వైద్యసేవలను అందించడం అభినందనీయమన్నారు. వైద్యసిబ్బందికి ఆయన అభినందించారు. వైద్యులు పలువురికి వైద్యపరీక్ష నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రావ్య, పిఆర్‌ఓ రవి, ఎఎన్ఎం నారాయణమ్మ, ఆశా వర్కర్ మణి,తదితరులు ఉన్నారు.

## బట్ట కాల్చి జనంపై వేయడం టీడీపీకి సరికాదు

### అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా...! -వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు చిరంజీవి నాగ్



ఆముదాలవలస, జూన్ 1, ప్రభాతవార్త

ప్రజల్లో తెలుగుదేశం పార్టీకి ఆదరణ లేకపోవడంతో బట్ట కాల్చి జనంపై వేసే చర్యలకు ప్రతిపక్ష నాయకులు తలపడుతున్నారని అది సబబు కాదని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ చేస్తున్నవి దిగజారుడు రాజకీయాలని ఎద్దేవా చేశారు. దమ్ముంటే వారి హయాంలో చేసిన అభివృద్ధి ఈ నాలుగేళ్లలో చేసిన అభివృద్ధిపై బహిరంగ వేదిక వద్ద చర్చిద్దాం అని సవాల్ విసిరారు. మహానాడులో తెలుగుదేశం పార్టీ చేసిన మేనిఫెస్టోను చూసి వైసీపీలో వణుకు పుట్టిందని టీడీపీ నాయకులు కూన రవికుమార్ బట్ట కాల్చి జనంపై వేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని తెలిపారు. కర్ణాటకలోని కాంగ్రెస్ మేనిఫెస్టోను రాష్ట్రంలోని వైసీపీ అమలు చేస్తున్న పథకాలను కాపీ కొట్టి ఒక మేనిఫెస్టోగా చెప్పుకుంటున్న వారు జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇటువంటి దుష్ప్రచారం చేస్తున్నారని తిప్పికొట్టారు. బీసీలకు వైసీపీలోనే మీరు జరిగిందని అసెంబ్లీలో ఉన్న బీసీలను చూసి బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. రాజకీయాల్లో మార్పుల్లో భాగంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి చెందుతుందని తెలిపారు. జెడ్‌ప్లస్ కేటగిరి చంద్రబాబుకు ప్రస్తుత పరిస్థితుల్లో అవసరం లేదన్న ఉద్దేశ్యంతోనే స్పీకర్‌గా తన తండ్రి తమ్మినేని సీతారాం కేంద్రానికి సిఫార్సు చేశారని అందులో రాజకీయ దురుద్దేశం లేదన్నారు. మహానాడులో ప్రకటించిన అంశాలన్నీ ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రస్తుతం అమలులో ఉన్నాయని ఈ విషయం తెలుగుదేశం జిల్లా పార్టీ అధ్యక్షులు రవికుమార్ తెలుసుకోవాలని గుర్తు చేశారు. ఇప్పటికైనా కాపీ పేస్ట్ రాజకీయాలు విడనాడి ప్రజలకు మంచి చేసే పనిలో మాతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. నాలుగేళ్ల అభివృద్ధిపై త్వరలోనే గ్రామస్థాయిలో గడపగడపకు ప్రభుత్వం ద్వారా ఇస్తున్నామని తెలిపారు. ఏమైనప్పటికీ వైసీపీ ప్రభుత్వాన్ని ఎదుర్కొనే దమ్ము లేక ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని తిప్పికొట్టారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు సన్యాసిరావు, బెవర మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## భవనం లేని పిహెచ్‌సి డాక్టర్లు నియామకం

### ఎక్కడ పనిచేయాలో తెలియని స్థితి

కొత్తూరు, జూన్ 1, ప్రభాతవార్త

కొత్తూరు మండలంలో మెట్టూరులో నూతనంగా మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు డాక్టర్లను నియమిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు డాక్టర్లలో ఒకరు డాక్టర్ యస్.తేజశ్వని హిరమండలం పిహెచ్‌సిలో రిపోర్టు చేయాలని, మరో సీనియర్ డాక్టర్ కె.రాంబాబుని కురిగాం పిహెచ్‌సిలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. సుమారు రెండు సంవత్సరాల క్రిందట మెట్టూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేశారు. ఐతే ఇంతవరకు పిహెచ్‌సికి భవనం ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. బుధవారం ఇఓ అక్కినేని కృష్ణమూర్తి నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.ఈయన ఎక్కడ జాయిన్ అవ్వాలో తెలియక తికమక పడ్డారు. చివరికి కురిగాం పిహెచ్‌సిలో చేరిన డాక్టర్ రాంబాబు వద్ద విధుల్లో చేరారు. మెట్టూరు పిహెచ్‌సి ఏఏ సచివాలయాలు ఏఏ మండలాల నుంచి కేటాయించాలో తెలియడం లేదు. ఇంత వరకు అద్దె భవనం కూడా ఆసుపత్రికి తీసుకోలేదు. వైద్యాధికారులు, సిబ్బంది తమ విధులు ఎక్కడ నిర్వహించాలో తెలియని పరిస్థితి నెలకొంది.

## యురేషియన్ ఎకనామిక్ ఫోరం ప్రణాళికలు

ఎల్.ఎన్.పేట, జూన్ 1, ప్రభాతవార్త

మే 24 నుంచి రెండు రోజుల పాటు మాస్కోలో జరిగిన రెండవ యురేషియన్ ఎకనామిక్ ఫోరంలో పలు కిరాక్ కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ఫోరం ప్రతినిధులు వెల్లడించారు. యురేషియన్ ఎకనామిక్ యూనియన్ యొక్క సభ్య పరిశీలక దేశాల భాగస్వామ్యంతో సుప్రీం యురేషియన్ ఎకనామిక్ కౌన్సిల్ సమావేశంలో కలిసి వచ్చిందన్నారు. రష్యన్ ఫెడరేషన్‌కు చెందిన యురేషియన్ ఎకనామిక్ యూనియన్ బాడీస్ అధ్యక్ష పదవిలోభాగంగా 2023లో ఈ కార్యక్రమాలు జరిగాయన్నారు. బహుళ ధృవ ప్రపంచంలో యురేషియన్ ఇంటిగ్రేషన్ అనేది ఫోరమ్ థీమ్‌గా నిర్ణయించామన్నారు.

# పాక్ లేకుండానే ఆసియాకప్2023?




**న్యూఢిల్లీ:** ఆసియాకప్ 2023 ఆతిథ్యంపై ఇంకా స్పష్టత రాలేదు. టోర్నీ ఆతిథ్య హక్కులు పాకిస్థాన్‌వద్దే ఉన్నాయి. కానీ పాక్ గడ్డపైకి భారత్‌జట్టును పంపించేందుకు బిసిసిఐ అంగీకరించడంలేదు. అంతేకాకుండా తటస్థ వేదికగా టోర్నీని నిర్వహించాలని బిసిసిఐ డిమాండ్‌చేసింది. హైబ్రిడ్‌మోడల్‌ని తెరపైకి తెచ్చిన పాకిస్థాన్‌క్రికెట్‌బోర్డు భారత్ ఆడే మ్యాచ్‌లను యుఎఇ వేదికగా నిర్వహిస్తామని చెప్పింది. మిగిలిన మ్యాచ్‌లు పాక్ గడ్డపైనే జరగాలని కోరింది. కానీ బిసిసిఐ అందుకు అంగీకరించడంలేదు. సెప్టెంబరులో యుఎఇలో ఎండలు ఎక్కువగా ఉంటాయని ప్లేయర్లు ఇబ్బందులు పడతారని బిసిసిఐ చెపుతోంది. ఓవరాల్‌గా ఆసియాలోని మిగిలిన క్రికెట్‌దేశాల మద్దతునుకూడా సంపాదించిన బిసిసిఐ టోర్నీని శ్రీలంకలోనిర్వహించేలా పావులు కదుపుతోంది. ఆసియాకప్ 2023 టోర్నీని శ్రీలంకలో నిర్వహిస్తే అది పాకిస్థాన్‌కు గట్టి దెబ్బ తగులుతుంది. 2009లో శ్రీలంక క్రికెటర్లపై లాహోర్‌లో దాడి తర్వాత అక్కడ ఇప్పటివరకూ ఎలాంటి టోర్నీ జరగలేదు. కనీసం ఆసియాకప్‌రూపంలో ఓ పెద్ద టోర్నీనినిర్వహించి మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలని పాక్‌బోర్డు ఆశించింది. కానీ ఇపుడు శ్రీలంకకి తరలిపోయేలా కనిపిస్తుండటంతో పాక్‌బోర్డు దిక్కుతోచనిస్థితిలో పడిపోయింది. అలాగే శ్రీలంకకి తమ జట్టును ఆసియాకప్‌కోసం పంపేదిలేదని కూడా పాక్‌బోర్డు ప్రకటించింది. ఈ ఏడాదిచివరిలో భారత్ వేదికగానే మొదటి వన్డేప్రపంచకప్ జరగనుంది. భారత్ గడ్డపైకి కూడా పాక్‌జట్టును పంపించబోమని పాక్‌బోర్డు చెపుతోంది. ఈ రెండు టోర్నీలకు జట్టుని పంపే విషయంపై తుదినిర్ణయం పాక్‌ప్రభుత్వానిదేనని తేల్చిచెప్పింది. బిసిసిఐకూడా పాక్‌గడ్డపైకి జట్టునుపంపే విషయంలో భారత ప్రభుత్వానిదే తుదినిర్ణయమని తేల్చింది. పాక్‌బోర్డు బెదిరింపులుచూస్తే ఆసియాకప్‌కు జట్టును పంపే ఛాన్స్ లేనట్లుగా ఉంది. ఒకవేళ పాక్‌రాకపోయినా ఆసియాకప్ 2023 జరిగి తీరుతుందని ఆసియా క్రికెట్‌కౌన్సిల్ పెద్దలు చెపుతున్నారు. ఆసియాకప్, వన్డేప్రపంచకప్‌లో ఆడకపోతే పాక్‌కే ఆర్థికంగా పెద్దమొత్తంలో నష్టం వస్తుంది. అలా కాకుండా ఒప్పుకుంటే రెండు టోర్నీల్లోనూ ఆ జట్టు ఆడాల్సి వస్తుంది. దాంతో ఇపుడు ఎటూ తేల్చుకోలేకపాక్‌బోర్డు ఇపుడు ఇరుకునపడుతోంది.




# లండన్‌లో టీమిండియా ప్రాక్టీస్ షురూ!

**లండన్:** ఐపిఎల్ 2023 ముగిసిన వెంటనే టీమిండియా మొత్తం జట్టు లండన్‌లో ప్రాక్టీస్ సెషన్‌ముమ్మరంచేసింది. ఈనెల 7 నుంచి 11వ తేదీవరకూ లండన్‌లోని ఓవల్‌మైదానంలో జరిగే ప్రపంచ టెస్టుఛాంపియన్‌షిప్‌ఫైనల్ గెలిచే పట్టుదలతో ఉంది. భారత కాలమానం ప్రకారం ఈమ్యాచ్ ఏడోతేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభం అవుతుంది. ఓవల్ పిచ్ బ్యాటింగ్‌కి అనుకూలమని వార్తలు వస్తుంటే మ్యాచ్ జరిగే కొద్దీ స్పిన్‌కి సహకరించే సూచనలు ఉన్నాయి. ఇక ఓవల్‌లో తొలి నాలుగురోజులు వర్షం పడే అవకాశాలు లేవని వాతావరణశాఖ తెలిపింది. కానీ చివరిరోజుమాత్రం 56శాతం వర్షం కురిసే సూచనలున్నాయని తెలిపింది. దాంతో రిజర్వ్ డేని కేటాయించారు. ఒకవేళ రిజర్వుడేలో కూడా ఆట సాధ్యంకాకపోతే మ్యాచ్‌డ్రా లేదా రద్దుగా ముగుస్తుంది. అదే జరిగితే అప్పుడు భారత్, ఆస్ట్రేలియా జట్లని సంయుక్త విజేతలుగాప్రకటిస్తారు. డబ్ల్యుటిసి ఫైనల్‌కి భారత్ జట్టు రోహిత్‌శర్మ, శుభమన్‌గిల్, ఛతేశ్వర్ పుజారా, విరాట్‌కోహ్లీ, అజింక్యరహానే, కెఎస్‌భరత్, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్రజడేజా, అక్షర్‌పటేల్, శార్దూల్‌ఠాకూర్, మహ్మద్‌షమీ, మహ్మద్‌సిరాజ్, ఉమేష్‌యాదవ్, జయదేవ్ ఉనద్కత్, ఇషాన్‌కిషన్‌లు ఉంటారు. స్టాండ్‌బై ప్లేయర్లుగా యశస్విజైస్వాల్, ముకేశ్‌కుమార్, సూర్యకుమార్‌యాదవ్‌లు నిలుస్తారు.





# ఓవల్‌లో ఫైనల్ టీమిండియాదే!

**న్యూఢిల్లీ:** భారత్ ఆస్ట్రేలియాలమధ్య జరగనున్న ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2021:23 ఫైనల్‌మ్యాచ్‌లో భారత్‌కే ఎక్కువ ఛాన్స్‌లున్నాయన్న అంచనాలు పెరిగిపోతున్నాయి. బ్యాటింగ్ బౌలింగ్ విబాగాలతోపాటు ఇతర రికార్డులపరంగా రెండుజట్లు సమతూకంగా ఉన్నాయి. అయితే ఇంగ్లండ్‌లోని మొత్తం వేదికల్లో ఓవల్ మైదానంలోనే ఆస్ట్రేలియాకు అతితక్కువ సక్సెస్‌రేట్ ఉంది. 1880లో జరిగిన ఇనాగరల్ టెస్ట్‌మ్యాచ్‌నుంచి ఈ వేదికపై ఆసీస్ ఆడిన 38 మ్యాచ్‌ల్లోకేవలం ఏడింటమాత్రమే విజయం సాధించింది. ఇక విన్నింగ్ రేషియోకూడా 18:42గా ఉంది. గత 50 ఏళ్లలో ఓవల్ గ్రౌండ్‌లో ఆస్ట్రేలియా కేవలం రెండుసార్లుమాత్రమే విజయం సాధించింది. ఆసీస్‌కు ఇంగ్లండ్‌లో అత్యధికంగా లార్డ్స్‌లో అత్యధిక సక్సెస్‌రేట్ 39.72గా ఉంది. అలాగే టీమిండియాకు కూడా ఓవల్‌లో మెరుగైన రికార్డు ఏమీలేదు. భారత జట్టు ఇక్కడ ఆడిన 14 మ్యాచ్‌ల్లోకేవలం రెండింట్లోమాత్రమే గెలిచింది. భారత్ చివరిసారిగా ఇక్కడ 2021లో గెలిచింది. నాటి మ్యాచ్ లో భారత్ 157పరుగుల భారీతేడాతో ఇంగ్లండ్‌ను మట్టికరిపించింది. రికార్డులవిషయం చూస్తేప్రతిష్టాత్మక డబ్ల్యుటిసి ఫైనల్‌మ్యాచ్ ఆడేందుకు భారత్ ఆస్ట్రేలియాకు చెందిన ఆటగాళ్లు ఇప్పటికే లండన్‌కు చేరారు. రెండు జట్లు గెలుపుపై ధీమాగా ఉన్నా ఆసీస్‌తోపోలిస్తే టీమిండియాకే విజయావకాశాలు ఎక్కువ ఉన్నాయి. గిల్, కోహ్లీ, షమీ సూపర్‌ఫామ్‌లో ఉండటం టీమిండియాకు కలిసొచ్చే అంశంగా క్రికెట్ ఫ్యాన్స్ చెపుతున్నారు.

# డబ్ల్యుటిసికి జెర్సీ స్పాన్సర్ కరవు!

**న్యూఢిల్లీ:** ప్రపంచంలోకెల్లా సంపన్నమైన క్రికెట్‌బోర్డుగా బిసిసిఐకి పేరున్నా లండన్ ఓవల్‌లో జరిగే డబ్ల్యుటిసి ఫైనల్‌కు జెర్సీ స్పాన్సర్‌ను రాబట్టలేకపోయింది. ఇప్పటివరకూ టీమిండియాకు జెర్సీ స్పాన్సర్‌గా వ్యవహరించే బైజూస్ తన కాంట్రాక్టునుంచి తప్పుకుంది. అప్పటినుంచి మరో కొత్త స్పాన్సర్‌ను అన్వేషిస్తున్నా ఇప్పటికీ సాధ్యంకాలేదు. అందువల్లనే ఇపుడు లండన్ ఓవల్ టెస్టుకు సాదాసీదా జెర్సీతోనే మ్యాచ్‌కు వస్తుందని చెపుతున్నారు. ఈ జెర్సీపై కేవలం బిసిసిఐ, ఆడిడాస్ లోగోలు మాత్రమే ఉంటాయి. బిసిసిఐ ఇటీవలే భారత్ టూల్‌కిట్ స్పాన్సర్‌గా అడిడాస్‌తో డీల్‌చేసుకుంది. అయితే కొత్త స్పాన్సర్‌ను ఇప్పటికీ రాబట్టుకోలేకపోవడం ప్రపంచ క్రికెట్‌పరంగా భారత్‌కు అవమానకరం. ఇప్పటికయినా కీలకమైన మ్యాచ్‌లు, ఫైనల్స్ వంటివాటికి టీమిండియా జెర్సీ స్పాన్సర్‌ఉ దొరకబట్టుకోవాలని ఫ్యాన్స్ మండిపడుతున్నారు.

# ఫియాన్సీని క్రికెట్‌ప్రపంచానికి చూపిన గైక్వాడ్!



**ముంబయి:** చెన్నై ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ తన ఫియాన్సీని క్రికెట్ ప్రపంచానికి పరిచయం చేసాడు. ఫైనల్‌లో సిఎస్కె గెలిచిన తర్వాత ఐపిఎల్‌ట్రోఫీ చేతబట్టి తన ఫియాన్సీతో కలిసి సందడిచేసాడు. దీనితో ఒక్కసారిగా నెట్టింట ఈఫోటో వైరల్ అయిపోయింది. మరో రెండురోజుల్లో రుతురాజ్ గైక్వాడ్ వివాహం కానున్నది. ఆతనికాబోయే భార్యపేరు ఉత్కర్ష పవార్. 24 ఏళ్ల ఈ యువతి మహారాష్ట్ర తరపున దేశవాళీ క్రికెట్‌కూడా ఆడటం విశేషం. రుతురాజ్‌మాదిరిగా కేవలం బ్యాటింగ్ మాత్రమే కాకుండా బౌలింగ్‌కూడా చేయగల ఆల్‌రౌండర్. చలయితే గత 18 నెలలనుంచి ఆమెక్రికెట్‌కు దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం పూణెలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌న్యూట్రీషియన్, ఫిట్‌నెస్ సైన్స్‌లో చదువుకుంటోంది. రుతురాజ్ ఉత్కర్షల వివాహం జూన్3వ తేదీ జరుగుతుంది. అందువల్లనే డబ్ల్యుటిసి మ్యాచ్‌కు స్టాండ్‌బైగా ఉన్న రుతురాజ్ అందుబాటులో ఉండలేనని బిసిసిఐకి సమాచారం ఇచ్చాడు. దీనితో యశస్విజైస్వాల్‌ను ఎంపికచేసారు.

# చికిత్సకు ముందు భగవద్గీతతో సిఎస్కేధోనీ



**ముంబయి:** టీమిండియా మాజీ కెప్టెన్, సిఎస్కెసారథి మహేంద్రసింగ్‌ధోనీ ముంబయికి చేరాడు. ఐపిఎల్ సీజన్‌లో పాల్గొన్న ధోనీని మోకాలి గాయం వేధించింది. దాంతో టోర్నీ ముగియగానే ముంబయికి చేరిన ధోనీ అక్కడ కోకిలాబెన్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. చికిత్సకుముందు ధోనీ భగవద్గీతని చదువుతున్న ఫోటో ఒకటి బయటకు వచ్చింది. మనశ్శాంతి కోసమే ధోనీ భగవద్గీత పారాయణంచేస్తున్నాడని తెలుస్తోంది. ఐపిఎల్ 2023 సీజన్‌లో 16 మ్యాచ్‌లు ఆడిన ధోనీ 185.71 స్ట్రైక్‌రేట్‌తో 104 పరుగులుచేసాడు. మోకాలి గాయం కారణంగా కేవలం స్లాగ్ ఓవర్లలో బ్యాటింగ్‌కి వచ్చిన ధోనీ ఈ ఏడాది ఎదుర్కొన్న బంతులు కూడా చాలా తక్కువే. దాంతో ఐపిఎల్ సీజన్‌ముగియగానే ఆతడు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని అంతా ఊహించారు. వచ్చే ఏడాది ఐపిఎల్‌లో ఆడతానని స్పష్టంచేసిన ధోనీ మరో ఆరునెలల్లో ఒకనిర్ణయం తీసుకుంటానని చెప్పాడు.

సర్జరీ తర్వాత ఫిట్‌నెస్ ఆధారంగా రిటైర్మెంట్‌పై ధోనీ నిర్ణయం తీసుకుంటాడని ఫ్యాన్స్ అంచనాలువేస్తున్నారు. అయితే మోకాలి గాయం కారణంగా ధోనీ కనీసం వికెట్లమధ్యకూడా సౌకర్యంగా పరుగులు తీయలేకపోయాడు. గాయం తీవ్రతనిపరిశీలించిన వైద్యులు సర్జరీ చేయించుకోవాలనిసూచించినట్లు తెలుస్తోంది. అందువల్లనే దోనీ ఇపుడు ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో చేరాడు.

# కార్వీ రిజిస్ట్రేషన్ రద్దు చేసిన సెబి..

**ముంబై, జూన్ 1:** మార్కెట్లో ట్రేడ్ చేసే వారు తమ సంపదను ఆయా కంపెనీల్లో పెట్టుబడి పెడుతూ, మంచి రాబడిని సంపాదించడానికి చూస్తుంటారు. ఈ క్రమంలో ఇన్వెస్టర్లకు, ఎక్ఛేంజీలకు మధ్య స్టాక్ బ్రోకర్లు వారధిగా ఉంటారు. కానీ వారే అక్రమాలకు పాల్పడితే మార్కెట్‌పైనే పెట్టుబడిదారులు నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉంది. కార్వీ స్టాక్ బ్రేకింగ్ సంస్థ విషయంలో ఇదే జరిగింది. ఖాతాదారుల నిధుల ను వారి సమ్మతి లేకుండా ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగించిన కార్వీ స్టాక్ బ్రోకింగ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను కేపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ రద్దు చేసింది. ఖాతాదారులకు తెలియకుండా వారి డీమ్యాట్ ఖాతాల్లో ఉన్న సెక్యూరిటీలను తాకట్టు పెట్టినందుకు నెల క్రితం మార్కెట్ నుంచి ఆ సంస్థను నివేదించింది. తమకు అప్పగిం చిన పవర్ ఆఫ్ అటార్నీని దుర్వినియోగం చేసినందుకు 21 కోట్ల జరిమానా కూడా విధించింది. రిజిస్ట్రేషన్ రద్దు చేస్తున్న పుటికీ స్టాక్ బ్రోకర్‌గా పూర్తి చేయాల్సిన బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందని మార్కెట్ రెగ్యులేటర్ కార్వీకి తెలిపింది. ఫీజులు, ఇతర బకాయిలు కూడా చెల్లించాల్సిందేనని వెల్లడించింది. డీమ్యాట్ ఖాతాల ద్వారా మోసానికి పాల్పడినట్లు గుర్తించిన సంవత్సరాల తర్వాత కార్వీని డిఫాల్టర్‌గా గుర్తించి భారతీయ స్టాక్ ఎక్ఛేంజీలు బహిష్కరించాయి. కార్వీ తన ఖాతాదారుల నిధులను చట్టవిరుద్ధంగా తాకట్టు పెట్టడమే కాకుండా, తద్వారా సేకరించిన డబ్బును తన రియల్ ఎస్టేట్ విభాగంలోకి మళ్లించింది. ఈ స్టాక్ బ్రోకింగ్ సంస్థ కార్వీ కేపిటల్ వైపు మళ్లించిన 1,400 కోట్లకుపైగా డబ్బును తిరిగి చెల్లించాలని కూడా




# ప్రపంచ బిలియనీర్‌గా మళ్లీ ఎలాన్ మస్క్

**వాషింగ్టన్, జూన్ 1:** ప్రపంచ కుబేరుల జాబితాలో మరోసారి నంబర్ వన్‌గా నిలిచారు టెస్లా, ట్విట్టర్ సిఇఒ ఎలాన్ మస్క్. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం టెస్లా సిఇఒ యొక్క నికర విలువ ఇప్పుడు దాదాపు 192 బిలియన్ డాలర్లు. ఈ సంపదతో ప్రపంచంలో నంబర్ వన్‌గా ఎలాన్ మస్క్ నిలిచారు. గతంలో నంబర్ వన్ స్థానంలో ఉన్న లగ్జరీ వ్యాపారవేత్త, ఫ్రెంచ్ లగ్జరీ బ్రాండ్ అయిన లూయిస్




విట్టన్ యొక్క సిఇఒ బెర్నార్డ్ ఆర్నాల్డ్‌ను వెనక్కి నెట్టి ఎలాన్ మస్క్ తన స్థానాన్ని తిరిగి దక్కించుకున్నారు. ప్రస్తుతం బెర్నార్డ్ ఆర్నాల్డ్ యొక్క నికర విలువ 187 బిలియన్ డాలర్లు. బుధవారం ఎల్వీఎంహెచ్ షేర్లు 2.6శాతం క్షీణించడంతో బెర్నార్డ్ ఆర్నాల్డ్ ఆస్తుల నికర విలువ 186.6 బిలియన్ డాలర్లకు పడిపోయింది. గత డిసెంబర్‌లో బెర్నార్డ్ ఆర్నాల్డ్ ఎలాన్ మస్క్‌ను అధిగమించి ప్రపంచంలోనే అత్యంతసంపన్నుడిగా మొదటి స్థానంలో నిలిచారు. విలాసవంతమైన వస్తువుల అమ్మకాల్లో గణనీయమైన పురోగతి కారణంగా ఆర్నాల్డ్ సంపద పెరిగింది. దీంతో ఎల్వీఎంహెచ్ స్టాక్ ధర భారీగా పెరిగింది. దీంతో ఆయన మొదటి స్థానానికి రాగా, అప్పుడు మస్క్ రెండో స్థానానికి పడిపోయారు. ఇక తాజాగా బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం ప్రపం చంలోనే అత్యంత సంపన్నమైన వ్యక్తిగా తన స్థానాన్ని తిరిగి దక్కించుకున్నారు మస్క్. బ్లూమ్ బెర్గ్ నివేదిక ప్రకారం బుధవారం నాటికి మార్కెట్లు ముగిసే సమయానికి ఎలాన్ మస్క్ నికర ఆస్తుల విలువ సుమారు 192 బిలియన్ డాలర్లుగా ఉందని వెల్లడించారు. ఇది బెర్నార్డ్ ఆర్నాల్డ్ యొక్క సంపదను అధిగమించింది.

# స్టాక్ సూచీలకు తప్పని నష్టాలు

**ముంబై, జూన్ 1:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిసాయి. దీంతో వరుసగా రెండోరోజూ నష్టాలు నమోదయ్యాయి. ఉదయం ఫ్లాట్‌గా ట్రేడింగ్ ప్రారంభించిన సూచీలు మధ్యాహ్నం వరకు స్వల్ప లాభాలతో ట్రేడయ్యాయి. చివరి గంటన్నరలో పూర్తిగా నష్టాల్లోకి జారుకొని ఇంట్రాడే కనిష్టాల వద్ద నష్టాల్లో ముగిసాయి. చివరికి సెన్సెక్స్ 193.70 పాయింట్లు క్షీణించి 62,428.54 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 46.65 పాయింట్లు క్షీణించి 18,487.75 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.82.42 వద్ద నిలిచింది. టాటా మోటార్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఏసియన్ పెయింట్స్, సన్‌ఫార్మా, నెస్లే ఇండియా, టిసిఎస్, యాక్సిస్‌బ్యాంకు, విప్రో, బజాజ్‌ఫైనాన్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. భారతీఎయిర్‌టెల్, కోటాక్ మహీంద్రా బ్యాంకు, ఐటిసి, ఐసిఐసిఐ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, అల్ట్రాటెక్ సిమెంట్స్, హెచ్‌సిఎల్ టెక్నాలజీ, మారుతి సుజుకి, ఇన్ఫోసిస్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి.




# 10% పెరిగిన ఇంధన అమ్మకాలు!

**న్యూఢిల్లీ, జూన్ 1:** దేశవ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడం, వేసవిలో ప్రయాణాలు పెరగడంతో ఈయేడాది మే నెలలో పెట్రోల్, డీజిల్, విమాన ఇంధన అమ్మకాలు 9-10 శాతం పెరిగాయి. ప్రభుత్వరంగ చమురు కంపెనీల నుంచి లభించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, గతేడాది ఇదే నెలలో పెట్రోల్ అమ్మకాలు 10.4శాతం పెరిగాయి. పెట్రోల్ వినియోగం గత నెలలో 2019 నాటితో పోలిస్తే దాదాపు పావు వంతు ఎక్కువగా విక్రయించబడింది. సెలవుల్లో ప్రయాణాలు పెరగడంతో పాటు కార్లు, మోటార్‌సైకిళ్ల అమ్మకాలు పెరగడం, ఆర్థిక కార్యకలాపాల మద్దతు అమ్మకాల వృద్ధికి దోహదపడ్డాయి. అలాగే పారిశ్రామిక, మైనింగ్ కార్యకలాపాల పెరగడంతో రిటైల్ డిమాండ్ పెరిగి డీజిల్ వినియోగం 9.3శాతం వృద్ధి నమోదైంది. కర్ణాటకలో ఎన్నికలు కూడా డీజిల్ డిమాండ్ పెరిగేందుకు దోహదపడ్డాయి. 2019 నాటితో పోలిస్తే గత నెల డీజిల్ అమ్మకాలు 7శాతం పెరిగాయి. ఇక విమాన ప్రయాణాలు పెరగడంతో జెట్ ఇంధన అమ్మకాలు కూడా గతేడాది కంటే 8.7శాతం పెరిగాయి. దేశీయ విమానయాన ప్రయాణం రికార్డుస్థాయిలో పెరిగినప్పటికీ, అంతర్జాతీయ ప్రయాణాలు కరోనా ముందు స్థాయి నుంచి ఇంకా కోలుకోలేదు. 2019 మే నెల కంటే జెట్ ఇంధన అమ్మకాలు 5.3శాతం తక్కువగా ఉన్నాయి. వంట గ్యాస్ అమ్మకాలు గతేడాది కంటే 9.8శాతం పెరగ్గా, 2019 కంటే 20శాతం వృద్ధి చెందాయి.



# వన్‌ప్లస్ ఇండియాకు సిఇఒ నవనీత్ నక్రా గుడ్‌బై

**ముంబై, జూన్ 1:** ప్రముఖ స్మార్ట్ ఫోన్ తయారీ కంపెనీ వన్‌ప్లస్ ఇండియాకు ఆ కంపెనీ సిఇఒ నవనీత్ నక్రా రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో వైదొలుగుతున్నట్లు తెలిపారు. ఆయన రాజీనామాను వన్‌ప్లస్ ధ్రువీకరించింది. తన అభిరుచులకు అనుగుణంగా నడుచుకోవాలని అనుకుంటున్నానని, కుటుంబ సభ్యులతో ఆనందకరమైన జీవితం గడపాలనుకుంటున్నట్లు తెలిపారు. 2020లో నవనీత్ నక్రా వన్‌ప్లస్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా, చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్‌గా తన ప్రయాణం ప్రారంభించారు. 2021లో వన్‌ప్లస్ ఇండియా సిఇఒగా నియమితుల య్యారు. వన్‌ప్లస్‌లో చేరకముందు ఆపిల్ కంపెనీలో పనిచేశారు. ఈ మూడేళ్ల ప్రయాణంలో వన్‌ప్లస్ ఇండియా అభివృద్ధికి నక్రా ఎంతో కృషి చేశారని వన్‌ప్లస్ ఓ ప్రకటనలో తెలిపింది. ఆయన భవిష్యత్ ఆకాంక్షలు నెరవేరాలని ఆకాక్షించింది. భారత రీజియన్ పై మునుపటి ఫోకస్ కొనసాగుతుందని వన్‌ప్లస్ పేర్కొంది. నక్రా హయాంలోనే నార్డ్ సిరీస్‌లో మిడ్ సెగ్మెంట్ స్మార్ట్‌ఫోన్లతో పాటు, ఇతర స్మార్ట్ డివైజులు భారత మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి.



# 31 నెలల గరిష్టానికి తయారీ రంగం!

**న్యూఢిల్లీ, జూన్ 1:** ఈ యేడాది మే నెలలో తయారీ రంగ కార్యకలాపాలు 31 నెలల గరిష్టానికి చేరాయి. అధిక డిమాండ్, ఉత్పత్తే దానికి కారణమని ఎస్అండ్‌పి గ్లోబల్ ఇండియా నెలవారీ నివేదికలో పేర్కొంది. కొత్త ఆర్డర్‌లు గణనీయంగా పెరగడం కూడా తయారీ పిఎంఐ పుంజుకునేందుకు కారణమని పేర్కొంది. తయారీ కార్యకలాపాలను సూచించే పిఎంఐ సూచి గత నెలలో 58.7 పాయింట్లుగా నమోదైంది. అంతకుముందు ఏప్రిల్‌లో ఇది 57.2 పాయింట్లుగా ఉంది. దాంతో వరుసగా 23వ నెలలోనూ తయారీ పిఎంఐ 50 పాయింట్ల ఎగువన నమోదైనట్లు ఎస్అండ్‌పి గ్లోబల్ ఇండియా వెల్లడించింది. సాధారణంగా పిఎంఐ సూచి 50 కంటే ఎక్కువ ఉంటే వృద్ధిగానూ, అంతకంటే తక్కువగా నమోదైతే క్షీణతగానూ పరిగణిస్తారు. గత ఆరు నెలల్లో కంపెనీలు అంతర్జాతీయ అమ్మకాల్లో వృద్ధిని చూడడంతో మే నెలలో పుంజుకున్న ఆర్డర్‌లలో ఎగుమతులు కీలక పాత్ర పోషించాయి. మెరుగైన సరఫరా, అనుకూల మార్కెట్ పరిస్థితుల కారణంగా దేశీయ తయారీ సంస్థలు ఉత్పత్తిని పెంచాయి. తయారీ రంగ కార్యకలాపాలు పెరగడం దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో భారత ఉత్పత్తులకు ఉన్న గిరాకీని సూచిస్తోందని ఎస్అండ్‌పి గ్లోబల్‌మార్కెట్ ఇంటిలిజెన్స్ ఎకనమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పొలియానా డి లిమా అన్నారు. దేశీయ ఆర్డర్ల పెరుగుదల ఆర్థికవ్యవస్థ వృద్ధికి దోహదపడుతుంది. అలాగే అంతర్జాతీయ వ్యాపారం గ్లోబల్ మార్కెట్లలో భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుందని, తద్వారా భారత్ సామర్థ్యాన్ని మరింత పెంచుతుందని పొలియానా పేర్కొన్నారు.



## వాణిజ్యం

# ఐటిరిటర్నుల దాఖలు గడువు పెంపు

**న్యూఢిల్లీ, జూన్ 1:** అధికంగా ఆదాయం ఆర్జిస్తున్న వ్యక్తులు ప్రతి యేటా ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయాల్సిన విషయం విదితమే. అదేవిధంగా తమ క్లయింట్లు జరిపే ఎక్కువ విలువ కలిగిన లావాదేవీలను ఆయా ఆర్థిక సంస్థలు ఐటి శాఖకు నివేదించాల్సి ఉంటుంది. ఆర్థిక లావాదేవీల స్టేట్ మెంట్ (ఎస్ఎఫ్‌టి) ద్వారా వీటి వివరాలను ఆదాయపు పన్ను విభాగానికి అందిస్తూ ఉంటాయి. ఇందుకు సంబంధించి మరికొంత సమయాన్ని పెంచుతున్నట్లు ఐటి శాఖ ప్రకటించింది. 2022-23లో




ఎస్ఎఫ్‌టి రిటర్న్‌లను దాఖలు చేయడానికి తుది గడువును మరో రెండు రోజులు పొడిగిస్తున్నట్లు ఐటి డిపార్ట్‌మెంట్ తెలిపింది. తద్వారా తమ క్లయింట్లు చేసిన అధిక-విలువ కలిగిన లావాదేవీలను నివేదించడానికి బ్యాంకులు, విదేశీ మారకపు, ఇతర రిపోర్టింగ్ ఎంటిటిలకు అదనపు సమయం లభించినట్లయింది. వాస్తవానికి 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఎస్ఎఫ్‌టి ఫైల్ చేయడానికి చివరి తేదీ మే 31. అయితే రిపోర్టింగ్ పోర్టల్‌లో అధిక ట్రాఫిక్ కారణంగా కొందరు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ఐటి విభాగం దృష్టికి వెళ్లింది. దీంతో రిటర్నులను సజావుగా ఫైల్ చేయడం కోసం మరో రెండు రోజుల పాటు పోర్టల్ తెరిచే ఉంటుందని ఆదాయపు పన్ను శాఖ ట్వీట్ చేసింది. ఎస్ఎఫ్‌టి రిటర్న్‌ల దాఖలులో జాప్యం జరిగితే, డిఫాల్ట్ అయిన ప్రతి రోజుకు వెయ్యి వరకు జరిమానా విధించవచ్చు. నాన్-ఫైలింగ్ లేదా సరికాని స్టేట్‌మెంట్‌లను ఫైల్ చేయడం వల్ల కూడా పెనాల్టీ పడే అవకాశం ఉంది. ఒక వ్యక్తి చేసిన అధిక విలువ లావాదేవీలను ఈ ఎస్ఎఫ్‌టి ద్వారానే ఆదాయపు పన్ను శాఖ ట్రాక్ చేస్తుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14 Air Surcharge: Delhi : 40 Ps.